ఈనాడు

కరీంనగర్ 22-2-2018 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 193

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రమిద ఆకృతిలో
స్మృతివనం

ఆకట్టుకునే రీతిలో స్తూపం శిఖరాన తెలంగాణ తల్లి



- హుస్సేన్ సాగర్ తీరంలో 12 ఎకరాల్లో నిర్మాణం
- సీఎం కేసీఆర్ నిర్ణయం.. త్వరలో శంకుస్థాపన

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు ఘన నివాళిగా సచివాలయం ఎదురుగా హుస్సేన్‌సాగర్ తీరంలోని 12 ఎకరాల సలంలో నిర్మించనున్న స్మృతివనం, అత్యంత ఎత్తయిన స్తూపం ఆకృతుల నమూనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఖరారు చేశారు. మంత్రి కేటీఆర్ ఉన్నతాధికారులు, పార్టీ నేతలతో చర్చించాక వీటికి ఆమోదం తెలిపారు. కేటీఆర్ వాటి నమూనా చిత్రాలను ట్విట్టర్‌లో పెట్టారు. స్మృతి వనం నమూనా వెలుగుతున్న దీపపు ప్రమిద ఆకారంలో ఉండగా, స్థూపం సైతం స్ఫూర్తిదాయక రీతిలో ఉంది. శిఖరం అంచున తెలంగాణ తల్లి బొమ్మ ఉండేలా, వెనకభాగంలో వెలుగులీనేలా చిత్రాన్ని రూపొందించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, అమరవీరుల త్యాగనిరతిని భవిష్యత్తు తరాలు తలచుకునేలా స్మృతివనం, స్థూపం నిర్మాణం చేపట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. వీటికి ప్రముఖ సంస్థల నుంచి ఆకృతులను తయారు చేయించారు. వచ్చిన వాటన్నింటిని పరిశీలించి తుది ఎంపిక జరిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని నిర్మించాలని ఆయన అధికారులకు నిర్దేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి సమాచారంతో స్మృతివనాన్ని సాహిత్య, సాంస్కృతిక (మిగతా 2లో)

భవిష్యనిధిపై వడ్డీ రేటు తగ్గింపు

- ఇక 8.55 శాతం
- ఈపీఎఫ్‌ఓ సమావేశంలో నిర్ణయం

దిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధిపై వడ్డీరేటును 2017-18 సంవత్సరానికి గాను 8.55 శాతానికి తగ్గిస్తూ ఈపీఎఫ్‌ఓ నిర్ణయించింది. 2016-17లో ఇది 8.65 శాతం ఉన్న సంగతి తెలిసిందే. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) అత్యున్నత నిర్ణయాత్మక వ్యవస్థ అయిన కేంద్ర ధర్మకర్తల బోర్డు (సీబీటీ) బుధవారం సమావేశమైంది. అనంతరం కేంద్ర కార్మిక శాఖ (మిగతా 2లో)

టీఆర్‌టీ పరీక్షలు యథాతథం

- అభ్యర్థులు వదంతుల్ని నమ్మొద్దు
- హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి
- దుష్ప్రచారం చేసేవారిని సహించేది లేదు
- టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి

6లో

భావి పౌరులకు.. ఆరోగ్య కానుక

- జులై నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు
- ఆపై ఆరోగ్య కార్డుల పంపిణీ
- 8 లక్షల మంది బాలికలకు ఆరోగ్య-పరిశుభ్రత కిట్లు ఇస్తాం
- మంత్రులు కడియం, లక్ష్మారెడ్డి వెల్లడి

6లో

భిన్న రంగస్థలం



కుంగుబాటు.. వద్దు తడబాటు

- దేశాన్ని పట్టిపీడించనున్న అంటువ్యాధి ఇది
- ప్రతి ముగ్గురిలో ఒకరికి ఈ అనుభవం
- సాంకేతికతతో అవగాహన కల్పించవచ్చు
- నెమ్మదిగా సాధారణ జీవితంలోకి రావచ్చు
- సినీనటి దీపికా పదుకొణె

14లో

పిల్లలు తల్లిదండ్రులతో అన్ని విషయాలు చెప్పేలా వాతావరణం ఉండాలి. కొందరు లోపాలను వైద్యుల వద్ద అంగీకరించరు. ఇతరుల సహాయాన్ని కళంకంగా భావిస్తారు. అలాంటి వ్యక్తులను దగ్గరకు తీసుకుని సహాయం చేయాలి. నేను వైద్యుడి వద్దకు వెళ్లినపుడు నాలోని అంతర్గత యుద్ధాన్ని సగం గెలిచినట్లు అనిపించింది.

విజయమనేది సమాజంలో చాలా మార్పు తీసుకువస్తుంది. పరీక్షల సమయంలో ఎదురయ్యే కుంగుబాటును ఎదుర్కొనేలా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలి. సాంకేతిక పరిజ్ఞానం, యాప్‌లు అవగాహన కల్పిస్తాయి కానీ మనిషిని ఆరోగ్యంగా చేయలేవు. మానవ స్పర్శ, ఒకరికి ఒకరు సహాయం, వైద్యులతోనే సాధ్యమవుతుంది.

రాష్ట్రంలో విప్రో పరిశ్రమ

- సౌందర్య సాధనాలు, సబ్బుల తయారీ
- రూ. 220 కోట్లతో 40 ఎకరాల్లో ఏర్పాటు

ఈనాడు - హైదరాబాద్

ప్రసిద్ధ పారిశ్రామిక సంస్థ విప్రో తెలంగాణలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ. 220 కోట్లతో మహేశ్వరం మండలంలోని 40 ఎకరాల్లో సబ్బులు, సౌందర్య సాధనాల తయారీ పరిశ్రమను స్థాపిస్తామని, 500 మందికి ఉపాధి కల్పిస్తామని ఆ సంస్థకు కాబోయే ఛైర్మన్, ప్రస్తుత పాలకమండలి సభ్యుడు, ముఖ్య వ్యూహ అధికారి రిషద్ ప్రేమ్‌జీ ప్రకటించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు హాజరైన ఆయనతో బుధవారం పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమై తెలంగాణలో పెట్టుబడుల గురించి చర్చించారు. ఆయన వినతిపై స్పందించిన రిషద్ తమ కొత్త పరిశ్రమ గురించి ప్రకటించారు. తెలంగాణ పారిశ్రామిక విధానం, కొత్త పరిశ్రమల స్థాపనకు చిత్తశుద్ధితో చేస్తున్న కృషి తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రకటించారు. తెలంగాణతో విప్రోకు గొప్ప అనుబంధం ఉందని చెప్పారు. కొత్త పరిశ్రమ ద్వారా మరింత చేరువవుతామని వెల్లడించారు. మంత్రి కేటీఆర్ ఆయన నిర్ణయాన్ని స్వాగతించారు. ఆ సంస్థకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు. దీంతోపాటు ఐటీ ఇతర రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం తాము చేపడుతున్న వీహబ్‌లో భాగస్వామిగా చేరాలని, వరంగల్‌లో విప్రో కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే వరంగల్‌లో సైయెంట్ తమ కార్యకలాపాలను నిర్వహిస్తోందని, తాజాగా టెక్ మహీంద్ర ప్రాంగణం ఏర్పాటు కానుందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ పరిశ్రమలను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నామని, ఐటీ సౌధాల నిర్మాణాలు, టాస్క్ ప్రాంతీయ కేంద్రాలను ప్రారంభిస్తున్నాం' అని వెల్లడించారు. తెలంగాణ పారిశ్రామిక (మిగతా 2లో)



విప్రో పాలకమండలి సభ్యుడు, ముఖ్యవ్యూహ అధికారి రిషద్ ప్రేమ్‌జీతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్వీయచిత్రం

శభాష్ తెలంగాణ

- మీ ఆతిథ్యం అద్భుతం
- నాస్కామ్‌కు అభినందనలు
- ప్రపంచ ఐటీ కాంగ్రెస్ ముగింపు వేడుకల్లో విట్సా అభినందనలు
- మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు
- వచ్చే సదస్సు ఆర్మేనియాలో

2లో

సాంకేతికతతో అద్భుతాలు

- ప్రజలకు, సమాజానికి ఉపకరించాలి
- డిసెంబరు నాటికి తెలంగాణలో ఇంటింటికీ అంతర్జాల సేవలు
- ఐటీ కాంగ్రెస్‌లో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: సాంకేతికత ప్రపంచంలో అద్భుతాలను సృష్టిస్తోందని, మానవాళికి సాధ్యం కానిదేదీ లేదని నిరూపిస్తోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. సామాన్యులు మొదలుకొని ప్రజలందరికీ ఈ ఫలితాలు సంపూర్ణంగా చేరాలని పేర్కొన్నారు. ప్రపంచం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా గుర్తించాలన్నారు. తెలంగాణ సాంకేతికతకు పట్టం కడుతోందని, ఈ ఏడాది చివరినాటికి ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్‌తో అంతర్జాల సేవలందించే తొలిరాష్ట్రంగా ఎదుగనుందని అన్నారు. బుధవారం ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సులో నాస్కాం, ఎంఫసిస్‌ల ఆధ్వర్యంలో (మిగతా 2లో)

చచ్చి బతికా!



బిడ్డకు జన్మనివ్వటమంటే.. తల్లికి పునర్జన్మే అంటుంటారు! ఇదేదో వైద్య సదుపాయాలు సరిగా లేని పూర్వకాలం మాట, ఇప్పుడు పరిస్థితి చాలా మారిపోయింది అనుకుంటున్నారా? ఆ మాట కొంత నిజమేగానీ.. ఇప్పటికీ కాన్పు అంటే తల్లికి పెద్ద గండమే. ఈ మాట అంటున్నది ఎవరో కాదు.. సాక్షాత్తూ ప్రపంచ టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్!

5లో

ఇదీ సంగతి!



కేసుల మూలంగా సారు జీతాలు ఇవ్వలేరట... అంతా వెళ్లి బ్యాంకు అప్పులు తీసుకుని సొంత వ్యాపారాలు పెట్టుకోమన్నాడు.

దూసుకొచ్చిన మృత్యువు

- అదుపుతప్పి..మరో వాహనాన్ని ఢీకొన్న కారు
- రెండు వాహనాల్లోని తొమ్మిది మంది మృతి
- మృతులు కర్నూలు, అనంతపురం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల వాసులు
- మృతుల్లో నలుగురు ఒకే కుటుంబ సభ్యులు
- అతివేగమే ప్రమాదానికి కారణం

కొత్తకోట - న్యూస్‌టుడే

బంధువుల పెళ్లికి హాజరవ్వాలన్న సంబరంతో వెళ్తున్న వాళ్లు ఒక వైపు.. కుమారుడి పెళ్లి ఘనంగా నిర్వహించి..ఆ తీపి గుర్తులను మూటగట్టుకుని వస్తున్న కుటుంబం ఇంకోవైపు.. అతివేగంతో దూసుకొచ్చిన కారు.. అందరి ఆనందాన్ని చిటికెలో తుడిచిపెట్టేసింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే కొన్ని కుటుంబాల్లో శాశ్వత చీకట్లు నింపింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో బుధవారం ఉదయం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ



వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు

ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన..ప్రస్తుతం హైదరాబాద్ మల్లాపూర్ ప్రాంతంలో నివసిస్తున్న వివిధ కుటుంబాల్లోని 25 మంది ఎనిమిది కార్లలో వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం (మిగతా 2లో)



కమల్ పార్టీ...
'మక్కల్ నీది మయ్యమ్'

- మదురైలో ప్రారంభించిన కమల్‌హాసన్, కేజ్రీవాల్
- వేదికపై సోమనాథ భారతి, పీఆర్ పాండియన్‌లకు స్థానం
- కమల్ నిజ జీవితంలో కూడా హీరోయే: కేజ్రీవాల్

16లో

TG

శభాష్ తెలంగాణ

ఈనాడు - హైదరాబాద్

"ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సులు ఇప్పటి వరకు 20 జరిగాయి. గతంలో ఎన్నడూ లేనంత అద్భుతంగా, అత్యుత్తమంగా (బెస్ట్ ఆఫ్‌ది బెస్ట్) హైదరాబాద్ సదస్సు జరిగింది. పెద్దఎత్తున ప్రజాదరణ లభించింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, నాస్కామ్‌ను మా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాం. మీ ఏర్పాట్లు భేషుగ్గా ఉన్నాయి. ఆతిథ్యం, సౌకర్యాలు, సమాచారం అన్నీ ఎంతో గొప్పగా ఉన్నాయి. మేం ఎప్పటికీ మరిచిపోలేం" అని ప్రపంచ ఐటీ, సేవల కూటమి (విట్సా) గౌరవ ఛైర్మన్ శాంటియాగో గుటిరెజ్ అన్నారు. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు బుధవారం రాత్రి ఘనంగా ముగిసింది. 40 దేశాలకు చెందిన మూడువేలమంది ప్రతినిధులు హాజరయ్యారు. హెచ్ఐసీసీలో బుధవారం జరిగిన ముగింపు వేడుకల్లో శాంటియాగోతో పాటు ఛైర్‌పర్సన్ యెవోన్ చియు, నాస్కామ్ ఛైర్మన్, రమణ్ రాయ్, అధ్యక్షుడు చంద్రశేఖర్, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌లు పాల్గొన్నారు. సదస్సు విజయవంతంగా జరిగిందని ఈ సందర్భంగా శాంటియాగో ప్రకటించారు. భారత్‌లో తొలిసారిగా నిర్వహించిన సదస్సుకు అపూర్వ స్పందన లభించడం ఆనందంగా ఉందని చెప్పారు. దీని నిర్వహణకు పూనుకున్న నాస్కామ్‌ను, తెలంగాణ ప్రభుత్వాన్ని, మంత్రి కేటీఆర్‌ను అభినందించారు. మళ్లీ, మళ్లీ తెలంగాణకు రావాలని ఉందన్నారు. నాస్కామ్ ప్రతినిధులు మాట్లాడుతూ, తమకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన సహకారం మరవలేనిదని చెప్పారు. మీ ఆతిథ్యం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. సదస్సు గురించి పేర్కొంటూ అద్భుతం, అచ్చెరువు, మధురానుభూతిని కలిగించింది ఈ ప్రయాణం అని తెలిపారు. వచ్చే ఏడాది మళ్లీ తెలంగాణలో కలుస్తామని చెప్పారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, ఐటీ సదస్సుకు వేదికగా హైదరాబాద్‌ను ఎంపిక చేయడం తమ అదృష్టమని చెప్పారు. ప్రస్తుతం దేశంలో తెలంగాణ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న రాష్ట్రమని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్మేనియా ప్రతినిధులను పిలిచి సదస్సు నిర్వహణ బ్యాటన్ అందించారు. 2019లో ఈ సదస్సు నిర్వహణ వేదికగా ఆర్మేనియా దేశాన్ని ప్రకటించారు. అక్టోబరు 6 నుంచి 9వరకు దీనిని నిర్వహిస్తామని ప్రకటించారు.

మరిన్ని ఆతిథ్యాలకు సిద్ధం: మంత్రి కేటీఆర్

సదస్సు ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నాస్కామ్, విట్సాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సు తెలంగాణకు గొప్ప మేలు చేసింది. ప్రపంచ ఐటీ దిగ్గజాల మదిలో హైదరాబాద్ సుస్థిరస్థానం పొందింది. విఖ్యాత సంస్థ అడోబ్ ఇక్కడ తమ కేంద్రం ఏర్పాటు చేయనుంది. విప్రో సబ్బులు, సౌందర్య సాధనాల పరిశ్రమ స్థాపనకు నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు మరో రెండు ఒప్పందాలు చేసుకున్నాం. నాస్కాంతో సంయుక్తంగా ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నాం. ఇవికాక టీహబ్ రెండో దశకు సన్నద్ధమవుతున్నారు. టీవర్క్స్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నాం. వీటి ద్వారా తెలంగాణ ఐటీ, పారిశ్రామిక రంగాల్లో కొత్త పుంతలు తొక్కనుంది. ఐటీ ద్వితీయ శ్రేణి నగరాలకు చేరనుంది. ఈ నెలలో ఇప్పటికే నాలుగు ప్రపంచ స్థాయి సదస్సులు జరిపాం. గురువారం నుంచి బయో ఆసియా సదస్సు ప్రారంభం కానుంది. వింగ్స్ ఇండియా పేరిట మార్చి 8 నుంచి 11 వరకు వైమానిక సదస్సును నిర్వహించనున్నాం. మార్చి 8న వీహబ్‌ను ప్రారంభిస్తున్నాం' అని చెప్పారు.

దీపికకు చేనేత కండువా బహూకరణ: ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు హాజరైన దీపికా పదుకొణెకు మంత్రి కేటీఆర్ పోచంపల్లి చేనేత కండువాను బహూకరించారు.



బుధవారం హైదరాబాద్‌లో హెచ్ఐసీసీలో జరిగిన ప్రపంచ ఐటీ కాంగ్రెస్ ముగింపు సదస్సులో.. సోషల్ ఇన్నోవేషన్ పురస్కార గ్రహీతలతో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్





ప్రపంచ ఐటీ కాంగ్రెస్ ముగింపు సదస్సులో నాస్కామ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, విస్టా ఛైర్మన్ యెవన్నె చియులతో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ★ వివిధ సంస్థల ప్రతినిధుల ఉత్సాహం

రాష్ట్రంలో విప్రో పరిశ్రమ

(మొదటి పేజీ తరువాయి)

విధానం, టీఎస్ఐపాస్ ప్రగతిని కేటీఆర్ దృశ్యరూపక ప్రదర్శనద్వారా రిషద్ ప్రేమ్‌జీకి వివరించారు.

తవోయుయాన్ నగరంతో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం

తైవాన్‌లోని తవోయుయాన్ నగరంతో తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం హెచ్ఐసీసీలో ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు వేదికపై మంత్రి కేటీఆర్, నాస్కామ్ ప్రతినిధుల సమక్షంలో ఒప్పందంపై ఆ నగరం పాలకమండలి సంచాలకుడు రాబర్ట్ హుయాంగ్, తెలంగాణ ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్‌లు సంతకాలు చేశారు. పరిశ్రమలు, ఐటీ ఆధారిత సేవలు, నూతన ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి దీనిని ఉద్దేశించారు. తెలంగాణ, తవోయుయాన్‌లలో ఆర్థిక అభివృద్ధి, పెట్టుబడుల సమీకరణ, పరిశ్రమలు, ఆర్థిక సంస్థల స్థాపన, ఐటీ ఉత్పత్తులు, యాప్‌ల తయారీ, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం, ఇరు దేశాల మధ్య విద్యార్థుల మార్పిడి, పరిశోధన, అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు కలిసి పనిచేస్తాయి. తవోయుయాన్, తెలంగాణలు సంయుక్తంగా సదస్సులు, పరిశ్రమలను స్థాపిస్తాయి. ఈ సందర్భంగా మంత్రి తయోయాన్ ప్రతినిధులను అభినందించారు. ఈ ఒప్పందం ద్వారా తైవాన్‌కు, తెలంగాణకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

సాంకేతికతతో అద్భుతాలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సామాజిక ఆవిష్కరణల వేదిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'సాంకేతికత ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం సహా అన్ని రంగాల్లో సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉపకరిస్తోంది. ఫిన్‌ల్యాండ్‌లో విద్యుత్‌తో పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఆహారకొరత ప్రపంచాన్ని వేధిస్తోంది. కొత్త సాంకేతికతతో దానిని ఎదుర్కోవచ్చు. కృత్రిమ మేధస్సుతో వ్యవసాయంలో భారీ మార్పులు వచ్చాయి. ఏఐ, ఎంఐని ఉపయోగిస్తూ రైతులు తమ స్మార్ట్‌ఫోన్ నుంచి పంట చిత్రాన్ని పంపితే అధికారులు చీడలను గుర్తించి పరిష్కారం చూపుతారు. తెలంగాణలో ఈ తరహా పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేనున్నాం. టీఫైబర్ ద్వారా ఇళ్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలను అనుసంధానం చేస్తాం. ప్రతీ ఇంటికి 15 ఎంబీపీఎస్ సామర్థ్యంతో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ ఇస్తాం. గ్రామాల్లోని పాఠశాలలు, సంస్థలకు కూడా 1 జీబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తాం. బ్రాడ్‌బ్యాండ్ వల్ల విప్లవాత్మక మార్పులు వస్తాయి. ఇప్పటికే పాఠశాలలను డిజిటలీకరించాం. ఈ-పరిజ్ఞానంతో విద్యను అందిస్తున్నాం. మైక్రోసాఫ్ట్‌తో కలిసి ప్రతీ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తాం. ఆరోగ్యరంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. టెలిమెడిసిన్, ఐవోటీ ఆధారిత సేవలను అందిస్తున్నాం. రాష్ట్రంలో నిపుణులైన వైద్యులు ఉన్నారు. ప్రతీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలున్నాయి. గ్రామాల్లోనూ నాణ్యమైన వైద్యం అందుతోంది. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అంకుర పరిశ్రమ కేంద్ర స్థానంగా ఎదుగుతోంది. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు, సామాజిక సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలను నిర్వహించాలి. సాంకేతికతను సరైన రీతిలో ఉపయోగించుకొని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే, అవకాశాలు, సదుపాయాలను కల్పిస్తే సమస్యలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది." అని కేటీఆర్ అన్నారు. సైయెంట్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, నాస్కాం ఫౌండేషన్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, ఎంఫసిస్ సీహెచ్ఆర్‌వో శ్రీకాంత్ కర్రా తదితరులు మాట్లాడారు.

పురస్కారాల ప్రదానం: ఈ సందర్భంగా ఎన్ఎస్ఐఎఫ్ ఐటీ సంస్థలకు విద్య, వైద్యం, పర్యావరణ, సామాజిక సేవ, ఆర్థిక సంస్కరణలు, నిర్వహణ విభాగాల్లో ప్రకటించిన పురస్కారాలను మంత్రి కేటీఆర్, మోహన్‌రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్‌లు అందించారు. పీహై జాం ఫౌండేషన్, సాజా, బ్లాంక్ సొల్యూషన్స్, థింక్‌బెల్ ల్యాబ్స్, ఎంపతి డిజైన్ ల్యాబ్స్, ఎపోకేర్ ప్రైవేటు లిమిటెడ్, దానా మోజో, డొనేట్ కార్ట్, స్ట్రాటా ఎన్విరో ప్రైవేటు లిమిటెడ్, స్కిమోపీడియోల ప్రతినిధులు ఈ పురస్కారాలను పొందారు. ఒక్కో సంస్థకు పది లక్షల రూపాయల చొప్పున ప్రోత్సాహక నిధులను నిర్వాహకులు ప్రకటించారు. విజేతలను కేటీఆర్ అభినందించారు.

భవిష్యనిధిపై వడ్డీ రేటు తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి సంతోష్ గాంగ్వార్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో భవిష్యత్తును అంచనా వేయడం కష్టమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం వడ్డీరేటుకు అనుగుణంగా రూ. 695 కోట్లు మిగలగా.. ఈసారి రూ. 586 కోట్లు మాత్రమే మిగులుతుందని వెల్లడించారు. కాగా సీబీటీ నిర్ణయాన్ని అనంతరం ఆర్థికశాఖ ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వడ్డీని ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తారు. ఈమేరకు తమ నిర్ణయాన్ని ఆర్థికశాఖ ఆమోదిస్తుందని.. కార్మిక సంఘాలు కూడా అంగీకరిస్తాయన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. బాండ్లలో పెట్టుబడుల ద్వారా ఈపీఎఫ్ఓ 8 శాతం రాబడి మాత్రమే పొందుతున్నట్లు వివరించారు. అయితే 8.55 శాతం వడ్డీ ఇవ్వడానికి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల(ఈటీఎఫ్)లోని కొన్ని పెట్టుబడులను విక్రయించినట్లు వివరించారు. అలాగే జీపీఎఫ్, పీపీఎఫ్ ఖాతాదారులకు అందిస్తున్న వడ్డీరేటు(7.6%) కంటే కూడా ఇది ఎక్కువని తెలిపారు. ఇంత వరకు 20మంది, ఆపైన ఉద్యోగులున్న చోట ఈపీఎఫ్ వర్తింపజేస్తుండగా.. ఆ పరిమితిని 10 మందికి తగ్గిస్తూ సీబీటీ సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈపీఎఫ్ఓలో ప్రస్తుతం 6 కోట్ల మంది ఖాతాదారులుండగా.. దీనిద్వారా ఆ సంఖ్య 9 కోట్లకు పెరుగుతుందన్నారు. ఇందుకు అవసరమైన చట్ట సవరణ జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గతంలోనూ సీబీటీ ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ చట్ట సవరణ కాకపోవడంతో అమలు కాలేదు. కాగా ఈ సందర్భంగా ఈపీఎఫ్ఓ యాప్ వినియోగిస్తున్న వారు ఆధార్‌ను అనుసంధానం చేసుకునే సౌకర్యాన్ని మంత్రి ప్రారంభించారు.



ప్రమిద ఆకృతిలో స్మృతివనం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంగా, తెలంగాణ గౌరవం ఉట్టిపడేలా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. తెలంగాణ కోసం జీవితకాలం పోరాడిన ఆచార్య జయశంకర్ వంటి ప్రముఖుల చరిత్రను ఇందులో పొందుపరచాలని ఆయన ఆదేశించారు. శాశ్వత మ్యూజియం, దృశ్య శ్రవణ మందిరం, సమావేశ మందిరం, భోజనశాల వంటివి ఇందులో ఉంటాయి.

త్వరలో శంకుస్థాపన: అమరవీరుల స్మృతివనం, స్థూపాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. వీటి ఆకృతులు అద్భుతంగా ఉన్నాయని కేటీఆర్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

నేటి నుంచి బయో ఆసియా సదస్సు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మరో ప్రతిష్ఠాత్మక సదస్సు బయో ఆసియా-2018 గురువారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. 3రోజులపాటు జరిగే ఈ సదస్సును సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. 60దేశాల నుంచి 2,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇదే సరైన సమయం అనేనినాదంతో జీవశాస్త్రాలు, ఆరోగ్య రంగాల్లో పెట్టుబడులసమీకరణ లక్ష్యంగా ప్రభుత్వం దీనిని నిర్వహిస్తోంది.

అశ్రునయనాలతో సోదరికి కేసీఆర్ వీడ్కోలు

అల్వాల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో సోదరి పి.విమలాబాయి (82) బుధవారం ఉదయం సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. అల్వాల్‌లోని సాయిబాబానగర్‌లో విమలాబాయి కుటుంబం నివసిస్తోంది. ఆమెకు భర్త, ఐదుగురు పిల్లలున్నారు. సోదరి మరణ వార్త తెలుసుకొన్న సీఎం కేసీఆర్ అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకొని భార్యతో కలిసి అక్క భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అక్క పార్థివదేహాన్ని చూడగానే ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలు ముగిసే వరకూ ఉన్నారు. అంతకుముందు మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత మేనత్తకు నివాళులర్పించారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంతరావు విమలాబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయంత్రం 4 గంటలకు తిరుమలగిరిలోని స్వర్గ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న తదితరులు హాజరయ్యారు.





తన సోదరి విమలాబాయి పార్థివదేహం వద్ద నివాళులర్పించిన అనంతరం కంటతడిపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ★ విమలాబాయి పార్థివదేహం

గ్రహం అనుగ్రహం

22-2-2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
సప్తమి: రా. 11-58 తదుపరి అష్టమి
భరణి నక్షత్రం: ఉ. 11-37 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: ఉ. 6-57 నుంచి 8-30 వరకు
వర్జ్యం: రా. 11-04 నుంచి 12-36 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-17 నుంచి 11-04 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-41 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-28; సూర్యాస్తమయం: సా.6-00

దూసుకొచ్చిన మృత్యువు

(మొదటి పేజీ తరువాయి)

మూలమల్లలో జరిగే పెళ్లికి హాజరయ్యేందుకు బుధవారం వేకువజామున కారులో బయల్దేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట వద్ద అందులో ఒక కారు అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి అనంతరం అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. కర్నూలులో మంగళవారం జరిగిన కుమారుడి పెళ్లి పనులు ముగించుకుని హైదరాబాద్ వస్తున్న కుటుంబం ప్రయాణిస్తున్న మరో కారును ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాలు నుజ్జయ్యాయి. రెండు కార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా..కర్నూలు వైపు నుంచి వచ్చే వాహనంలో ఉన్న కర్నూలు పట్టణం కల్లూరు ఎస్టేట్‌కు చెందిన ప్రసూన(70), ఆమె మేనకోడలు..అనంతపురం జిల్లా మేకల చెరువుకు చెందిన రాజేశ్వరి (60), ఆమె అల్లుడు..హైదరాబాద్ (సరూర్‌నగర్) బరంపేట ప్రాంతానికి చెందిన సూరిబాబు(50) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. రాజేశ్వరి కుమార్తె, సూరిబాబు భార్య సునీత(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ప్రసూన చిన్న మేనకోడలు కల్పన తీవ్రంగా గాయపడి మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అలాగే హైదరాబాదు నుంచి వస్తున్న వాహనంలో ఉన్న ఆత్మకూర్ మండలం మస్తీపూర్‌కు చెందిన మల్లేష్ (30), మూలమల్లకు చెందిన ఆంజనేయులు (32), గోపన్‌పేటకు చెందిన బీరయ్య (24), కొత్తకోట మండలం అజ్జకొల్లుకు చెందిన రాజు (34) ఘటనా స్థలంలోనే మరణించగా.. నందిమల్లకు చెందిన నరేష్ (30) ఆస్పత్రిలో కన్నుమూశాడు.

కుమారుడి పెళ్లి జరిగిన గంటల వ్యవధిలోనే విషాదం

మంగళవారం కర్నూలులో ప్రసూన కుమారుడి వివాహం జరిగింది. వివాహ వేడుకలు ముగించుకున్న ఆమె..బంధువులతో కలిసి హైదరాబాద్ తిరిగి వస్తుండగా ఈ ప్రమాదంజరిగింది. ఈ ఘటనలో ఆమెతో పాటు.. ఆ కుటుంబానికి చెందిన మరోముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం అలముకుంది.



ఓ కుటుంబానికి చెందిన మృతులు ప్రసూన ★ రాజేశ్వరి ★ సూరిబాబు ★ సునీత



మృతులు అజుకొల్లి రాజు ★ మల్లేష్ ★ నరేష్ ★ బీరయ్య ★ ఆంజనేయులు

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
గుంటూరు	16.0	33.2
ఆదిలాబాద్	16.5	33.8
తిరుపతి	16.6	32.9
మెదక్	17.0	37.2
కరీంనగర్	18.0	34.0
విశాఖపట్నం	18.4	32.4
హన్మకొండ	19.5	34.0
హైదరాబాద్	19.9	32.3
నిజామాబాద్	20.0	34.0
మహబూబ్‌నగర్	20.0	35.4
రామగుండం	21.0	34.6
ఖమ్మం	22.0	36.0
సూర్యాపేట	23.0	34.5

ప్రాంతీయ భాషల్లో శాస్త్రసాంకేతిక, వైద్య సమాచారం

● యూపీ ప్రభుత్వంతో పల్సస్ గ్రూప్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: వైద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రచురించే పరిశోధన వ్యాసాలను ప్రాంతీయ భాషల్లో అనువదించేందుకు తోడ్పాటు అందిస్తున్న పల్సస్ సంస్థ తోడ్పాటు తాజాగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఇటీవల నోయిడాలో జరిగిన యూపీ పెట్టుబడిదారుల సదస్సులో గ్లోబల్ సైంటిఫిక్ లిటరేచర్ లాంగ్వేజ్ ట్రాన్సఫర్మేషన్ సెంటర్ (నోయిడా) ఏర్పాటుతో 1000 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా శాస్త్రీయ పరిజ్ఞానానికి భారత్ కేంద్రం కావాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు వివరించారు. పరిశోధనలు, అధ్యయనాలను హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, గుజరాతీ, బెంగాలీ తదితర స్థానిక భాషల్లో అనువదించేందుకు సహకరిస్తున్నామన్నారు. హైదరాబాద్, చెన్నైల్లో ఉన్న పల్సస్ సంస్థ ప్రాంతీయ కార్యాలయాలను గుడ్‌గావ్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సారస్.. వాయు విహారం దిగ్విజయం

ఈనాడు, బెంగళూరు: జాతీయ వైమానిక ప్రయోగశాల (సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్) స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన చిరు విమానం సారస్-పీటీ1ఎన్ బుధవారం బెంగళూరు నగరంలో రెండోసారి విజయవంతంగా వాయు విహారాన్ని ముగించింది. కేంద్ర విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ సమక్షంలో హెచ్ఏఎల్ విమానాశ్రయంలో సారస్‌ను 20నిమిషాల పాటు భారత వాయుసేన పైలెట్లు నడిపారు. గత నెల 24న తొలిసారి ఈ విమానాన్ని పరీక్షించారు. వచ్చే రెండు మూడేళ్లలో సారస్ ఎంకే2 సిద్ధమవుతుందని ఈ సందర్భంగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరీశ్ సైని తెలిపారు. ఇందుకోసం రూ.600 కోట్లు వ్యయం చేస్తామన్నారు. సారస్‌ను వాయుసేన సేవలకు ఉపయోగిస్తామని ఎయిర్ వైస్ మార్షల్ సందీప్ సింగ్ పేర్కొన్నారు. ప్రాథమిక దశలో 15 విమానాల్ని తీసుకుంటామని వివరించారు.



నేలకు దిగిన సారస్‌లో కేంద్ర మంత్రి హర్షవర్ధన్



ఆశ చితికిన టమాటా రైతు

టమాటాలను చెరువులో పారబోస్తున్న ఈ దృశ్యం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం హిమాంనగర్‌లోనిది. వెనిగండ్ల శ్రీహరి అనే రైతు తనకున్న మూడున్నర ఎకరాల్లో సాగు చేసిన సుమారు 60 క్వింటాళ్ల టమాటాలను బుధవారం ఏన్కూరు చెరువులో పారపోశారు. కాకినాడకు లోడు చేయాలని వైరాకు చెందిన ఓ దళారీ వారం కిందట శ్రీహరికి 200 డబ్బా(ట్రే)లు ఇచ్చి వెళ్లాడు. 3 రోజుల క్రితం కాయలు కోసి వాటిలో నింపగా కాకినాడకు చెందిన వ్యాపారి రాలేదు. టమాటాలను తీసుకోవడానికి స్థానిక వ్యాపారులు ముఖం చాటేశారు. మార్కెట్‌కు తరలించినా రవాణాఛార్జీలు సైతం రావు. ఇటు చూస్తే టమాటాలు కుళ్లి నీరుగారుతున్నాయి. దీంతో దిక్కుతోచనిస్థితిలో బాధిత రైతు కన్నీళ్లు దిగమింగుతూ ఇలా చెరువులో పంటను పారబోశారు. పెట్టుబడులతోపాటు కోత కూలి కూడా భారమైందని వాపోయారు. – న్యూస్‌టుడే, ఏన్కూరు

గ్రూప్‌-1లో 'రమణీ'యం

- రైతుబిడ్డకు రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు



ఆకుల వెంకటరమణ

ఈనాడు డిజిటల్, ఒంగోలు: గ్రూప్‌-1 పరీక్షలో ప్రకాశం జిల్లా మార్కాపురం యువకుడు మెరిశాడు. బుధవారం వెల్లడైన 2011 ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 తుది ఫలితాల్లో ఆకుల వెంకటరమణకు రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకు దక్కింది. రాతపరీక్షలో 426 మార్కులు, ముఖాముఖిలో 63.5 మార్కులు సాధించి మొత్తం 489.5 మార్కులతో ఈ యువకుడు తొలిస్థానంలో నిలిచాడు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, చిన్నతనం నుంచి ప్రభుత్వ బడిలో చదివిన వెంకటరమణ తొలిప్రయత్నంలోనే ఈ ఘనత సాధించడం విశేషం. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ కుటుంబ నేపథ్యం పూర్తిగా వ్యవసాయమే. తల్లిదండ్రులు ఆకుల శ్రీరాములు, లక్ష్మీనరసమ్మలు మార్కాపురం పట్టణ సమీపాన రెండెకరాల్లో సాగు చేసుకుంటూ నలుగురు కుమారులను చదివించారు. కొన్నేళ్ల కిందట తల్లిదండ్రులిద్దరూ మరణించినా హైదరాబాద్‌లో పెద్ద అన్నయ్య వెంకటనరసింహారావు వద్ద ఉంటూ ఉద్యోగం చేస్తూనే గ్రూప్‌-1లో సత్తా చాటాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని స్వచ్ఛంద సంస్థ సుస్థిర వ్యవసాయ కేంద్రంలోని సహజ ఆహారం విభాగంలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా సేవలందిస్తున్నారు.

తెలంగాణ మిగులు 21.082 టీఎంసీలు

- ఏపీ మిగులు నీరు 6.393 టీఎంసీలు మాత్రమే
- స్పష్టం చేసిన కృష్ణా నదీయాజమాన్య బోర్డు

ఈనాడు – హైదరాబాద్

శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి ఆమోదించిన నీటి విడుదలలో ఆంధ్రప్రదేశ్‌కు 6.393 టీఎంసీల మిగులు మాత్రమే ఉందని కృష్ణా నదీయాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. తెలంగాణకు 21.082 టీఎంసీలు ఉందని తెలిపింది. శ్రీశైలం, సాగర్‌లలో నీటి నిల్వలు తగ్గి కనీస నీటిమట్టాలకు చేరుతున్న తరుణంలో ఇప్పటివరకు జరిగిన నీటి వినియోగం, రెండు రాష్ట్రాలకు మిగిలిన కేటాయింపుల గురించి బోర్డు బుధవారం ఏపీ, తెలంగాణకు లేఖ రాసింది. జనవరి పదో తేదీన జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకొన్న నిర్ణయం, ఇప్పటి వరకు అమలు జరిగిన తీరు గురించి కూడా ఇందులో వివరించింది. ఈ నెల 19 వరకు ఆంధ్రప్రదేశ్ 227.752 టీఎంసీలు, తెలంగాణ 81.959 టీఎంసీలు కలిపి మొత్తం 309.711 టీఎంసీల నీటిని వాడాయని పేర్కొంది. శ్రీశైలం కనీస నీటి మట్టం 834 అడుగులు కాగా,ఈ మట్టం వరకు 19వ తేదీ నాటికి 25.609 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. సాగర్‌లో 510 అడుగుల వరకు 24.251 టీఎంసీల నీరు ఉంది. నాటి త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏపీ 60 టీఎంసీలు, తెలంగాణ 50 టీఎంసీలు వినియోగించుకొనేలా నిర్ణయించగా, ఇందులో ఏపీ 6.393 టీఎంసీలు, తెలంగాణకు 21.082 టీఎంసీల మిగులు ఉందని బోర్డు తెలిపింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 26 టీఎంసీలు విడుదల చేయాలని ఈ నెల ఎనిమిదన ఆదేశాలు జారీ చేయగా, 7.993 టీఎంసీల విడుదల జరిగిందని, కుడి విద్యుత్తు కేంద్రం నుంచి ఎక్కువ నీరు విడుదల చేశారని, అయితే ఈ కేంద్రం నుంచి తమ ఆదేశాల ప్రకారం నీటి విడుదల జరగలేదని బోర్డు పేర్కొంది. విద్యుత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకొని శ్రీశైలంలోని రెండు విద్యుత్తు కేంద్రాల ద్వారా నీటి విడుదల జరగాలని, జెన్‌కో నుంచి డిమాండ్ లేకపోతే గేట్ల ద్వారా విడుదల చేయాలని వివరించింది. 2018 ఆగస్టు వరకు తాగు, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటిని వినియోగించాలని రెండు రాష్ట్రాలకు బోర్డు సూచించింది.

మాంసం ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ

దుబాయి పర్యటనలో మంత్రి తలసాని వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాంసం దిగుమతి చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్రం.. రాబోయే రోజుల్లో మాంసం ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. దుబాయిలో జరుగుతున్న గల్‌ఫుడ్‌-2018 వాణిజ్య ప్రదర్శనలో తెలంగాణ తరఫున అధికారుల బృందంతో కలిసి తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండో రోజు వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన చర్చించారు. ఏక గవాక్ష విధానంలో పరిశ్రమలకు అనుమతులు, 24 గంటల విద్యుత్తు సరఫరా, నీటి లభ్యత, మానవ వనరులు పుష్కలంగా ఉండటంతో తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. మాంసం ఉత్పత్తి రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటించాలని ఆ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించగా వచ్చే నెలలో వచ్చేందుకు వారు అంగీకారం తెలిపారన్నారు. దుబాయి పర్యటనలో మంత్రి వెంట పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీ నిర్మల, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డా. వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఎండీ డా. లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

పరిధి గుర్తింపునకే మొగ్గు!

- కృష్ణా, గోదావరి బోర్డుల విషయంలో నిర్ణయం తీసుకోనున్న కేంద్రం
- అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాక ముందుకు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని గుర్తించడానికే కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. తెలంగాణ వ్యతిరేకిస్తున్నప్పటికీ పరిధి లేకుండా బోర్డులు పనిచేయడం కష్టమని, కొన్ని పరిమితులతో అయినా గుర్తించాలన్న అభిప్రాయాన్ని కేంద్రజలవనరుల శాఖ అధికారులు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించిన తర్వాత దీనిపై ముందుకెళ్లే అవకాశం ఉందని సమాచారం. మంగళవారం దక్షిణాది రాష్ట్రాల అధికారులతో సమావేశానికి ముందుగా కేంద్రజల వనరుల శాఖ సహాయమంత్రి తమ పరిధిలోని జలవనరుల మంత్రిత్వశాఖ, జలసంఘం, జాతీయ జల అభివృద్ధి సంస్థ, కృష్ణా, గోదావరి నదీ యాజమాన్యబోర్డు అధికారులతో చర్చించారు. బోర్డుల పనివిధానం, కేంద్రం తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బోర్డు పరిధిని గుర్తించాల్సిన అవసరాన్ని అధికారులందరూ ప్రత్యేకంగా పేర్కొన్నట్లు తెలిసింది. బోర్డు పరిధితోపాటు బజాజ్ కమిటీ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం గురించి మాట్లాడినట్లు సమాచారం. కృష్ణాజల వివాద ట్రైబ్యునల్‌-2 తీర్పు ఎప్పుడు వస్తుందో తెలియదు, అప్పటి వరకు ఎదురుచూడకుండా పార్లమెంటులో చేసిన చట్టం ప్రకారం చేయాల్సిన అవసరం ఉందని, ట్రైబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాత దానికి తగ్గట్లుగా మార్పులు చేసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమైనట్లు తెలిసింది. ఎక్కువ కాలం జాప్యం చేసే కొద్దీ సమస్యలు వస్తాయని, వీలైనంత త్వరగా అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టి పరిధి గుర్తించడానికి చర్యలు తీసుకొంటామని కేంద్ర మంత్రి అన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకించనుంది. ఈ నెల 15న దిల్లీలో జరిగిన కార్యదర్శుల స్థాయి సమావేశంలో బోర్డు పరిధి తప్పనిసరని, అయితే భాక్రానంగల్ లాగానా లేక నర్మదా బోర్డులాగానా అన్నది పరిశీలిస్తున్నామని కేంద్రజలవనరుల శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాత చేయండి లేదా బేసిన్ పరిధిలోని నాలుగు రాష్ట్రాలకు కలిపి చేయండని తెలంగాణ సీఎస్ జోషి ఈ సమావేశంలో స్పష్టం చేసిన విషయం విదితమే. నీటి కేటాయింపులు లేకుండా బోర్డు పరిధిని గుర్తించి ఏం చేస్తారని తెలంగాణ ప్రశ్నిస్తోంది.

పీఈటీ ప్రశ్నాపత్రం రెండు భాషల్లో ఇవ్వండి

టీఆర్‌టీ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) విషయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టుల భర్తీ ప్రశ్నాపత్రాన్ని తెలుగుతో పాటు ఆంగ్ల భాషలో ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెఎస్ రామచంద్రరావు బుధవారం ఈ ఆదేశాలు జారీచేశారు. త్వరలో జరగనున్న టీఆర్‌టీలో పీఈటీ తెలుగు మాధ్యమాన్ని ఎంచుకున్న అభ్యర్థులకు తెలుగుతో పాటు ఆంగ్లభాషలో ప్రశ్నాపత్రం ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ నల్గొండ జిల్లాకు చెందిన కె.వెంకటరమణ మరో ముగ్గురు హైకోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ తరఫు న్యాయవాది రమేష్ వాదనలు వినిపిస్తూ.. పీఈటీ సిలబస్ ఆంగ్ల భాషలో ఉందని, ప్రశ్నలను కేవలం తెలుగు భాషలో ఇస్తే అభ్యర్థులు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పీఈటీ ప్రశ్నాపత్రం తెలుగు, ఆంగ్లభాషల్లో ఉండేలా చూడాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించారు.

ముంచుకొస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువు!

- కొన్నిచోట్ల నోటీసుల ప్రక్రియే పూర్తి కాలేదు
- డీడీలు తీసుకునేందుకూ తలోరీతిన వ్యవహరిస్తున్న పట్టణ స్థానిక సంస్థలు
- దరఖాస్తుదారుల్లో గందరగోళం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)లో వచ్చిన దరఖాస్తుల క్రమబద్ధీకరణ గడువు మరో వారం రోజుల్లో ముగియనుంది. ఈ సమయంలో పట్టణ స్థానిక సంస్థలు తలోరీతిన వ్యవహరిస్తుండటంతో దరఖాస్తుదారుల్లో గందరగోళం నెలకొంది. క్రమబద్ధీకరణ అవకాశం చేజారిపోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దరఖాస్తులను పరిశీలించి నోటీసులు ఇవ్వడానికి ఈ నెల ఐదు ఆఖరు తేదీ కాగా ఖమ్మం సహా పలు స్థానిక సంస్థల్లో ఇప్పటికీ నోటీసుల ప్రక్రియే పూర్తికాలేదు. వేల దరఖాస్తులు.. తక్కువ సిబ్బంది నేపథ్యంలో చాలా మందికి నోటీసులు ఇవ్వలేదు. దరఖాస్తులను తమ వద్ద నుంచి ఏదో రూపంలో వదిలించుకోవడం లక్ష్యంగా చాలా చోట్ల వ్యవహరించారు. దీంతో సరైన సమాచారం లేక దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. అర్హత కలిగిన వారి నుంచి డీడీలు తీసుకోవడంలోనూ పట్టణాభివృద్ధి సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు తలోరీతిన వ్యవహరిస్తుండటం మరింత గందరగోళానికి గురిచేస్తోంది.

క్రమబద్ధీకరణకు అర్హత కలిగిన వాటి చెల్లింపులకు ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి 15 రోజులుపాటు ప్రభుత్వం గడువు ఇచ్చింది. హుడా, జీహెచ్‌ఎంసీ, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లు సహా వివిధ పురపాలక సంఘాలు ఈ నెల 28 వరకూ డీడీలను తీసుకుంటామని ప్రకటించాయి. ఖమ్మం, నిజామాబాద్ కార్పొరేషన్లు సహా వివిధ చోట్ల 20వ తేదీనుంచి డీడీలు తీసుకోవడంలేదు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఇంకా ఆరువేల మంది దరఖాస్తుదారులకు నోటీసులే ఇవ్వలేదు. రాష్ట్ర పురపాలక శాఖ గత నెల ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నెల 28 నాటికి ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాల్సిఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్‌కు 3.5 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో 1.75 లక్షల దరఖాస్తులు రాగా సుమారు 70 వేల దరఖాస్తులను తిరస్కరించారు.

ఈటీవీ ప్రతినిధులకు 'మిషన్ కాకతీయ' అవార్డులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ కాకతీయ' పథకం మీడియా అవార్డులకు ఈటీవీ ప్రతినిధులు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో కె.శ్రీశైలం (ఈటీవీ) మొదటి బహుమతి, డి.సూర్యనారాయణ (ఈటీవీ వీడియో జర్నలిస్టు) స్పెషల్ జ్యూరీ అవార్డును పొందారు. మిషన్ కాకతీయ పథకం మూడో దశ (2017)పై వివిధ కేటగిరీల కింద మీడియా అవార్డుల కోసం అందిన ప్రతిపాదనలను పరిశీలించిన న్యాయ నిర్ణేతల కమిటీ బుధవారం అవార్డులను ప్రకటించింది. అవార్డులు పొందిన వారి పూర్తి వివరాలు www.eenadu.net లో

మెదడులో కణతులను తొలగించే 3టీ ఎమ్మారై

- యశోద ఆసుపత్రిలో అందుబాటులోకి
- విజయవంతంగా వంద శస్త్ర చికిత్సలు



3టీ ఎమ్మారై పని తీరును వివరిస్తున్న యశోద ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు

ఈనాడు, హైదరాబాద్: మెదడులో ఏర్పడే కణతులను శస్త్రచికిత్స చేసే సమయంలో స్కానింగ్ చేసి చూస్తూ పూర్తిగా తొలగించేందుకు సహాయ పడే అత్యాధునిక 3టీ ఎమ్మారై యంత్రం సికింద్రాబాద్‌లోని యశోదఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే 100మంది రోగులకు ఈ యంత్రం ద్వారా విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేసినట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ ఆనంద్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ బి.జె.రాజేష్, డాక్టర్ సవిత్ర్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ శ్రీనివాస్ బొట్ల తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. దాదాపు రూ.15 కోట్ల విలువైన ఈ 3టీ ఎమ్మారై దేశంలో తొలిసారిగా యశోద ఆసుపత్రిలో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మెదడు కణజాలానికి నష్టం లేకుండా శస్త్ర చికిత్స చేసేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందన్నారు.'మెదడులోని కణతులను తొలగించేముందు ఎమ్మారై పరీక్ష చేస్తారు. ఈ చిత్రాల ఆధారంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. రెండో రోజు రోగిని మళ్లీ ఎమ్మారై గదికి తరలించి మరోసారి పరీక్ష చేసి కణితి తొలగిపోయిందా? ఎక్కడైనా వాటి భాగాలు మిగిలిపోయాయా? అనేది గుర్తిస్తారు. ఒకవేళ కణితి మిగిలిపోయిఉంటే మళ్లీ చికిత్స తప్పనిసరి. ఇలాచేయడం సంక్లిష్టతతోపాటు ఖర్చుతో కూడిన వ్యవహారం. 3టీ ఎమ్మారై ద్వారా ఇలాంటి ఇబ్బందులు ఉండవని డాక్టర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. శస్త్రచికిత్స చేస్తూనే రోగిని పక్కనే ఉన్న ఈ యంత్రం ద్వారా మరోసారి స్కాన్ చేస్తామన్నారు. కణితి పూర్తిగా పోయిందా? లేదా? అనేది అక్కడికక్కడే చూసి కణితి భాగం ఇంకా మిగిలి ఉంటే దాన్ని అప్పుడే తొలగిస్తామని డా.బాలసుబ్రమణ్యం వివరించారు. మెదడు కణతులే కాకుండా పిట్యూటరీ గ్రంథి, పార్కిన్సన్, ఎపిలెప్సీ, పిడియాట్రిక్ బ్రెయిన్ కణతులను తొలగించేందుకు ఈ యంత్రం పనిచేస్తుందన్నారు.

హక్కులకు దిక్కేదీ.. అవినీతిని ప్రశ్నించే వీలేదీ?

- రెండేళ్లుగా 'కమిషన్' పోస్టులు ఖాళీ
- లోకాయుక్త, ఉపలోకాయుక్త నియామకాలూ లేవు
- భర్తీని పట్టించుకోని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు
- విభజనను విస్మరించిన కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర విభజన నేపథ్యంలో మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తల గురించి రెండు రాష్ట్రాలూ పట్టించుకోకపోవడంతో ఈ రెండు వ్యవస్థలూ నామమాత్రమయ్యాయి. హక్కుల కమిషన్ ఛైర్మన్, సభ్యులు పదవీ విరమణ చేసి రెండేళ్లు దాటుతున్నా రెండు ప్రభుత్వాలూ నియామకానికి చర్యలు తీసుకోవడంలేదు. లోకాయుక్త జస్టిస్ బి.సుభాషణ్‌రెడ్డి గత ఏడాది అక్టోబరులో పదవీ విరమణ చేయగా, డిసెంబరులో ఉపలోకాయుక్త ఆకస్మికంగా మృతి చెందారు. రెండు సంస్థలకూ పెద్దదిక్కులేకపోవడంతో హక్కులపై, అధికారుల అవినీతి, వైఫల్యాలపై ఎవరూ ప్రశ్నించే అవకాశం లేకుండాపోయింది. ఈ రెండు సంస్థలూ ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 10వ షెడ్యూలులో ఉన్నాయి. నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యోగుల విభజనపై కేంద్రం చర్యలు తీసుకోవాల్సి ఉంది. హక్కుల కమిషన్‌లో 6 వేలకు పైగా కేసులున్నాయి. కమిషన్‌కు ఛైర్మన్‌తో సహా ఇద్దరు సభ్యులుండాలి. సభ్యులిద్దరూ 2015 ఆగస్టులో పదవీ విరమణ చేయగా, ఛైర్మన్‌గా ఉన్న జస్టిస్ నిసార్ అహ్మద్ కక్రూ 2016 డిసెంబరు 21న పదవీ విరమణ చేశారు. అంతకుముందే హక్కుల కమిషన్ జ్యుడిషియల్ విధుల నిర్వహణ బాధ్యతనూ కమిషన్ కార్యదర్శికి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషన్ చట్టప్రకారం కార్యదర్శి పరిపాలనా వ్యవహారాలకే పరిమితం కావాలి. ప్రస్తుతం ఆయనే జ్యుడిషియల్ విధులనూ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా హక్కుల కమిషన్‌లో నియమాకాలు జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. ప్రస్తుతం అక్కడ ఉన్నత పదవుల్లో ఉన్నవారి కుటుంబ సభ్యులతోపాటు కొంత మంది కావాల్సినవారి నియామకాలు జరిగాయని, వీటివల్ల అక్కడే పనిచేస్తున్న తమకు పదోన్నతులు రావడంలేదని, ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. 'కొనసాగింపు'లో ఉన్న కొంతమంది ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా కన్సాలిడేటెడ్ కింద కాకుండా ఇంక్రిమెంట్లతో సహా వేతనాలు పొందుతున్నారని సమాచారం. ఎలాంటి టెండర్లూ లేకుండానే కొనుగోళ్లూ జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

లోకాయుక్తను భర్తీ చేయాలి

లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టులు ఖాళీగా ఉండటంతో అక్కడ కేసుల విచారణ స్తంభించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసులు విచారణకు వస్తే నెల, రెండు నెలలు వాయిదా వేస్తున్నారు. ఏడాదికి సగటున 4 వేలకు పైగా కేసులు దాఖలవుతుంటాయి. 2017 ప్రారంభంనాటికి 3,400 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 1,200 కేసులు దాఖలయ్యాయి. లోకాయుక్తకు అందే ఫిర్యాదులను రిజిస్ట్రీ స్వీకరించి ఫిర్యాదు నెంబర్లను కేటాయించడం తప్ప విచారణ కొనసాగించడంలేదు. కేసు దాఖలు చేసేందుకు వచ్చే వారు నిరాశతో వెనక్కి మళ్లుతున్నారు. లోకాయుక్త నియామకం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించింది. ఈ పదవిని విశ్రాంత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేపట్టాల్సి ఉంది, రెండోసారి చేపట్టడానికి వీల్లేదనే నిబంధనను తొలగించడంతోపాటు ఉపలోకాయుక్త పదవికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, మాజీ జిల్లా జడ్జిలను అర్హులుగా పేర్కొంటూ సవరణ తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని నోటిఫై చేసి నియామక ప్రక్రియ చేపట్టాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

108 సిబ్బందిని ఒప్పంద ఉద్యోగులుగా గుర్తించాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: 108 సిబ్బందిని ఒప్పంద లేక పొరుగు సేవల ఉద్యోగులుగా గుర్తించాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ 108సిబ్బంది మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 108 సిబ్బందికి పదేళ్లుగా రూ.12వేల వేతనం చెల్లిస్తున్నారని వాపోయారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటల పని అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికశాఖ అధికారులు అవినీతికి పాల్పడడం వల్లే కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాటమే సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో 108ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, జి.అంజయ్య, నరసింహారావు, సుజీత్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

నల్ల బంగారానికి నగిషీ!

ఇంధన రంగంలో స్వావలంబన దిశగా మోదీ ప్రభుత్వం ఎన్నదగిన ముందడుగు వేసింది. దేశీయంగా బొగ్గు క్షేత్రాల జాతీయీకరణ జరిగిన నాలుగున్నర దశాబ్దాల తరవాత- లైసెన్స్ పర్మిట్ రాజ్ శృంఖలాల్ని బద్దలు కొడుతూ పూర్తిస్థాయి పారదర్శకతతో ప్రైవేటీకరణకు బాటలు పరుస్తున్న తాజా నిర్ణయం జాతి విశాల హితానికి భరోసా ఇస్తోంది. 1973లో బొగ్గుగనుల జాతీయీకరణ దరిమిలా రెండేళ్లకు సంబంధిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కోల్ ఇండియా అవతరించడం తెలిసిందే. విద్యుత్తు, ఉక్కు, సిమెంటు, అల్యూమినియం వంటి భారీ పరిశ్రమాగారాలకు అతి ముఖ్య ముడిసరకైన బొగ్గు అందుబాటులో ఉండేలా చూడటంలో నాలుగున్నర దశాబ్దాలుగా కోల్ ఇండియాది గుత్తాధిపత్యమే! అత్యధిక బొగ్గు నిల్వలున్న దేశాల జాబితాలో ఇండియా ఐదో స్థానంలో ఉన్నా నల్లబంగారం దిగుమతిలో భారత్ రెండోస్థానంలో నిలవాల్సి రావడం- గిరాకీ సరఫరాల అగాధాన్ని కళ్లకు కడుతోంది. ఇతోధిక పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పరవళ్లెత్తితేగాని బొగ్గు రంగంలో పరాధీనత తొలగిపోదన్న విశ్లేషణ మేరకు ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర మంత్రివర్గ సంఘం చరిత్రాత్మక చొరవ చూపింది. ప్రస్తుతం ప్రైవేటు సంస్థలు- తమ సొంత సిమెంటు, ఉక్కు, అల్యూమినియం కర్మాగారాల ముడిసరకు అవసరాలకు మాత్రమే బొగ్గు నిక్షేపాల్ని తవ్వుకోవడానికి అనుమతిస్తున్నారు. అవసరానికి మించి తవ్వుకొన్న బొగ్గును తిరిగి కోల్ ఇండియాకు విక్రయించడం తప్ప వాటికి మార్గాంతరం లేదు. ఈ నేపథ్యంలో- దేశ విదేశీ ప్రైవేటు సంస్థలు వాణిజ్య ప్రాతిపదికన బొగ్గు క్షేత్రాల్ని వేలంలో పాడుకొని, అవసరార్థులకు స్వేచ్ఛగా విక్రయించుకొనే విధానానికి మోదీ ప్రభుత్వం తలుపు తెరిచింది. సమస్త బొగ్గు గనుల్ని వేలం వెయ్యనున్నట్లు ప్రకటించిన కేంద్రం- తద్వారా భారీ కర్మాగారాలకు ఇంధన భద్రతతో పాటు, లక్షల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి సృష్టి సాధ్యపడుతుందని ఆశిస్తోంది. నల్ల బంగారానికి సంస్కరణల నగిషీ ఇది!

'కాదేదీ కుంభకోణానికి అనర్హం' అన్నట్లుగా యూపీఏ జమానాలో బొగ్గు క్షేత్రాల బాగోతం ఎకాయెకి లక్షా 86 వేలకోట్ల రూపాయల మహా అక్రమంగా పైకి తేలి- 2జి స్కామ్‌నే చిన్నగీతగా మార్చేయడం తెలిసిందే. 1993 నుంచి చేసిన బొగ్గు కేటాయింపులన్నీ చట్ట విరుద్ధమైనవన్న సుప్రీంకోర్టు, 214 బొగ్గు క్షేత్రాల కేటాయింపుల్ని ఒక్క కలం పోటుతో రద్దుచేసి సరికొత్త విధాన రచనకు 2014 ద్వితీయార్ధంలో బాటలు పరచింది. ఆ వెంటనే బొగ్గు క్షేత్రాలను ప్రైవేటు సంస్థల కోసం ఈ-వేలం వేసేందుకు, ప్రభుత్వ రంగ సంస్థలకైతే నేరుగా కేటాయించేందుకు వీలుకల్పిస్తూ మోదీ ప్రభుత్వం 2014 అక్టోబరులో అత్యవసరాదేశం జారీ చేసింది. పిమ్మట 2015లో తెచ్చిన బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనల) చట్టం ద్వారా పారదర్శకంగా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ బొగ్గు దిగుమతుల్ని క్రమేణా తగ్గించాలని కేంద్రం లక్షించింది. జాతీయీకరణ సమయంలో ఏడు కోట్ల టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పాదన 2015-16 నాటికి దాదాపు 64 కోట్ల టన్నులకు పెరిగిందన్న మాటేగాని, 2005 నాటికి 4.12 కోట్ల టన్నులుగా ఉన్న దిగుమతులు నేడు 18 కోట్ల టన్నులకు ఎగబాకి కరెంటు ఖాతాలోటును భీతావహంగా పెంచేశాయి. కోల్‌ఇండియా గుత్తాధిపత్యం కోరలు పీకేస్తే రియో టింటో, బీహెచ్‌పీ, వేదాంత, ఆంగ్లో అమెరికన్, గ్లెన్‌కోర్, అదానీ గ్రూప్ వంటి బహుళజాతి సంస్థల రాకతో బొగ్గు క్షేత్రాలు బహుళార్థ సాధకాలు అవుతాయన్న ఆకాంక్షలు పురివిప్పుతున్నాయి. 2022 కల్లా నూరు కోట్ల టన్నుల బొగ్గు ఉత్పాదన లక్ష్య సాధనకూ ఈ చొరవ ఊతమిస్తుందని, తద్వారా దిగుమతుల బిల్లులో ఆదాతోపాటు, థర్మల్ విద్యుత్ కేంద్రాల ముడిసరకు కొరతా తీరిపోతుందని అంచనాలు మిన్నంటుతున్నాయి. నిర్దిష్ట కాలావధుల్లో లక్షిత ప్రయోజనాల్ని ధీమాగా ఒడిసిపట్టేలా విధానరచన, కార్యాచరణ చెట్టపట్టాలు కట్టి సాగాలి!

నిరుడు నీతి ఆయోగ్ వెలువరించిన జాతీయ ఇంధన విధానం ముసాయిదా నాలుగు ప్రధాన లక్ష్యాల్ని నిర్దేశించింది. అందరికీ అందుబాటు ధరల్లో ఇంధనం, బొగ్గు- సహజవాయువు వంటివాటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా ఆర్థికాభివృద్ధి, సుస్థిర ఆర్థిక ప్రగతి లక్ష్యాలుగా ముందడుగేయాలంటున్న నీతి ఆయోగ్, 2012నాటితో పోలిస్తే 2040 నాటికి విద్యుత్ గిరాకీ ఏకంగా నాలుగున్నర రెట్లు పెరుగుతుందని పేర్కొంది. నిరుడు జూన్ నాటికి 195 గిగావాట్లుగా ఉన్న థర్మల్ విద్యుదుత్పాదన సామర్థ్యం 2040నాటికి 330-440 గిగావాట్లకు చేరగలదని అంచనా వేస్తోంది. పునరుత్పాదక శుద్ధ ఇంధనం వాటా అప్పటికి మరో పదిశాతం పెరగగలదంటున్న అంచనాల్ని బట్టి- దేశార్థిక ప్రగతి రథానికి నల్లబంగారమే ఇకముందూ మౌలిక ఇంధనంగా అక్కరకు రానుందన్నది సుస్పష్టం. ప్రస్తుతం దేశంలో థర్మల్ విద్యుత్ సగటు వార్షిక ఉత్పత్తి (పీఎల్ఎఫ్) 60 శాతం ఉండగా, నిరంతర బొగ్గు సరఫరాలతో అది మరో పాతిక శాతం పెరిగితే, సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యయం కంటే చౌకగానే విద్యుల్లతలు విరబూస్తాయన్నది వాస్తవం! ప్యారిస్ ఒప్పందం లక్ష్మణరేఖలు మీరకుండానే చౌకగా ఇండియా తన ఇల్లు చక్కదిద్దుకొనేందుకు తాజా ప్రైవేటీకరణ విధానం గొప్ప అవకాశంగా మారనుంది. టన్ను బొగ్గుకు ఎవరెక్కువ చెల్లిస్తే వారికే గనులు కేటాయించే విధానంలో ఆయా క్షేత్రాలున్న రాష్ట్రాలకే ఆ మొత్తం దక్కుతుందన్న కేంద్రం ప్రకటన పలు రాష్ట్రాలకు వరదాయని కానుంది. బొగ్గు విపణిలో పోటీ అంతిమంగా వినియోగదారులకు మేలే చేస్తుందన్న అంచనాలు ఉత్తుత్తి ఆశాభావంలా తెల్లారిపోరాదంటే, ఎక్కడా అక్రమాల చొరబాటుకు తావులేకుండా, జవాబుదారీతనంతో కూడిన పారదర్శక వాణిజ్య చట్రాన్ని కేంద్రం సిద్ధం చెయ్యాలి!

అహేతుక ప్రాతిపదికలతో అన్యాయం



డాక్టర్ కల్లూరు శివారెడ్డి

ఇటీవల 15వ ఆర్థిక సంఘం సభ్యులు దక్షిణాది రాష్ట్రాల అధికారులతో హైదరాబాదులో సమావేశమయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పంచే పన్నుల వాటాలను నిర్ణయించడానికి గత ఆర్థిక సంఘాలు 1971 జనాభాను ప్రాతిపదికగా చేసుకున్నాయి. 15వ ఆర్థిక సంఘం 2011 జనాభాను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రప్రభుత్వం సూచించింది. దీనివల్ల అధిక జనాభాగల ఉత్తరాది రాష్ట్రాలకు అధిక లబ్ధి ఒనగూడుతుంది. కుటుంబ నియంత్రణ విధానాలను పాటించి, తక్కువ జనాభా వృద్ధిరేటును నమోదు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు ఈ విధానం గొడ్డలిపెట్టవుతుంది. ఆర్థికాభివృద్ధి సాధనలో మెరుగైన పనితీరు కనబరచిన రాష్ట్రాలకు తాజా విధానం శరాఘాతమవుతుంది. జనాభా పెరుగుదలను తగ్గించినందుకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా, తక్కువ కేటాయింపుల రూపంలో జరిమానా వేయడం సముచితం కాదని దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక సంఘ సభ్యులకు స్పష్టీకరించారు. రాష్ట్రవిభజన ఫలితంగా ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్‌కు ఇది గోరుచుట్టుపై రోకటిపోటు. ప్రతి చిన్న అవసరానికి సహాయం కోసం కేంద్రం వైపు చేయి చాచాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికే విరుద్ధం!

వాటాల్లో అసమానతలు

స్వాతంత్ర్య కాలంలో తిరుగుబాట్ల అణచివేత కోసం అధికార కేంద్రీకరణ ద్వారా బలమైన కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరవాతా చెప్పుకోదగిన మార్పు రాలేదు. ఇప్పటికీ కేంద్రంపై రాష్ట్రాలు ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్రాల ఆదాయ వనరులు తక్కువగా ఉండటం అందుకు కారణం. ఆదాయ వనరులు కేంద్ర ప్రభుత్వం చేతికి, ఖర్చు అంశాలు రాష్ట్రాలకు పంచారు. కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయాల్లో ఎంతశాతం రాష్ట్రాలకు పంచాలన్న అంశాన్ని 280వ అధికరణ వివరిస్తుంది. దీని ప్రకారం ప్రతి అయిదేళ్లకు ఒకసారి రాష్ట్రపతి ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటా పంచుతారు. ఈ కేటాయింపులు రెండు రకాలు. కేంద్ర, రాష్ట్రాల వాటాల నిర్ధారణ(వర్టికల్) అందులో మొదటిది. రాష్ట్రాల వాటాను వాటి మధ్య పంచడం (హారిజాంటల్) రెండోది. మొదటి పంపకం ఆర్థిక ఫెడరలిజంపై కేంద్ర ప్రభుత్వ దృక్పథానికి ప్రతీక. రెండోది రాష్ట్రాలపట్ల కేంద్రం అనుసరిస్తున్న సమదృష్టిని, సమానత్వాన్ని తెలుపుతుంది. మొదటి ఆర్థిక సంఘం పదిశాతం మాత్రమే రాష్ట్రాలకు పంచాలని సిఫార్సు చేసింది. 14వ ఆర్థిక సంఘం సమయానికి ఇది 42 శాతానికి పెరిగింది. అయితే, రాష్ట్రాలకు కేంద్రం అందించే మిగతా సహాయాల్లో కోత విధించారు. దీంతో క్షేత్రస్థాయిలో రాష్ట్రాలకు లభ్యమయ్యే నిధుల్లో అంతిమంగా పెద్ద మార్పు లేకుండాపోయింది. పైకి మాత్రం 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయింపు జరిపిందన్న అంశం విస్తృతంగా ప్రచారమైంది. డెబ్భై ఏళ్ల స్వతంత్ర భారతంలో ఒక్క వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) మండలి ఏర్పాటు విషయంలోనే కేంద్రం నిజమైన సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టింది. కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మండలి నిర్ణయాలను పార్లమెంటు గాని, రాష్ట్రాల చట్టసభలుగాని మార్చలేవు. దీన్నిబట్టి ఈ అంశంలో సమాఖ్య వ్యవస్థ ఎంత బలంగా పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. సహకార ఫెడరలిజంలో ఇదొక మైలురాయిగా పరిగణించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను విదేశీ మదుపరులు కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వడమూ ఈ కోవకే చెందుతుంది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు తమ పనితీరును మెరుగుపరచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఆర్థిక రంగంలో పబ్లిక్ కన్నా ప్రైవేటు పెట్టుబడులే ప్రధాన పాత్ర పోషిస్తున్న తరుణమిది. ఆ పెట్టుబడులు సరైన దిశగా మళ్లించడానికి కావలసిన నియంత్రణల అజమాయిషీని కేంద్రం, రాష్ట్రాల మధ్య సమానంగా పంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి ఇటువంటి విధానాలు చాలా అవసరం.

ఆర్థిక సంఘాలు వివిధ అంశాల ప్రాతిపదికగా రాష్ట్రాల మధ్య వాటాల లెక్కలను తేల్చేటప్పుడు రెండు రకాల వాదనలు ప్రధానంగా చర్చకు వస్తాయి. కొందరు సమానత్వం (ఈక్విటీ)ని, మరికొందరు సామర్థ్యాన్ని ప్రామాణికంగా తీసుకోవాలంటారు. మొదటిదానికి సమతుల ప్రాంతీయాభివృద్ధి ప్రామాణికంగా ఉంటుంది. ఇందులో పేద రాష్ట్రాలకు ఎక్కువ కేటాయింపులు జరుగుతాయి. కేంద్ర ప్రాజెక్టులు వెనకబడిన ప్రాంతాల్లో నెలకొల్పుతారు. ఇక సామర్థ్యాన్ని ప్రామాణికంగా తీసుకోవాలన్న రెండో వాదన ప్రకారం, ఏ రాష్ట్రంలో ఉత్పత్తి కారకాలు ఎక్కువ లభ్యమవుతాయో; ఏ రాష్ట్రం పేదరికాన్ని తగ్గించడంలో, మానవాభివృద్ధి సూచీలను పెంచడంలో, నిధులను సమర్థంగా ఖర్చు చేయడంలో చొరవ తీసుకుని విజయం సాధిస్తుందో వాటికి ఎక్కువ నిధులు అందుతాయి. ఇందులో స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలలో రాజీపడరు. ఇప్పటివరకు అన్ని ఆర్థిక సంఘాల సిఫార్సులు సమానత్వ విధానానికే అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. అయితే అది రాష్ట్ర జనాభాకు అనుసంధానం చేశారు. దీనివల్ల అధిక జనాభా, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు అధిక కేటాయింపులు దక్కాయి. బాలికల అక్షరాస్యత పెంచి, జనాభా నియంత్రణ చర్యలు చేపట్టిన రాష్ట్రాలకు తక్కువ కేటాయింపులు జరిగాయి. ఈ క్రమంలో దక్షిణాది రాష్ట్రాలకు కేటాయింపులు కోసుకుపోయాయి. రాష్ట్రాల జనాభా, జీఎస్‌టీని సమర్థంగా అమలు చేయడానికి తీసుకున్న చర్యలు, విద్యుత్ నష్టాలు తగ్గించడానికి తీసుకున్న చొరవ, పారిశుద్ధ్యంలో పురోగతి తదితర అంశాలను నిర్దేశిత ప్రాతిపదికలుగా 15వ ఆర్థిక సంఘం పనిచేస్తుంది.



15వ సంఘం బృందంతో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (పాతచిత్రం)

దక్షిణాదికి ఆర్థిక సంఘాల కేటాయింపుల తీరు

కేంద్రప్రభుత్వ పన్నుల్లో రాష్ట్రాలకు ఆర్థిక సంఘాలు కేటాయించిన వాటా (శాతం)

రాష్ట్రం	11వ సంఘం	12వ సంఘం	13వ సంఘం	14వ సంఘం
ఆంధ్రప్రదేశ్	7.701	7.356	6.937	4.305
తెలంగాణ	-	-	-	2.437
కర్ణాటక	4.930	4.459	4.328	4.714
తమిళనాడు	5.385	5.309	4.969	4.023
కేరళ	3.057	2.665	2.341	2.500
ఉత్తర్ ప్రదేశ్	19.798	19.264	19.677	17.959
బిహార్	14.597	11.028	10.917	9.665
రాజస్థాన్	5.473	5.609	5.853	5.495
మధ్యప్రదేశ్	8.838	6.711	7.120	7.548
పశ్చిమ్ బంగ	8.16	7.057	7.264	7.324
మహారాష్ట్ర	4.632	4.997	5.199	5.521

ఆధారం: వివిధ ఆర్థిక సంఘాల నివేదికలు

దశాబ్దాలవారీగా జనాభా పెరుగుదల రేటు (శాతం)

రాష్ట్రం	1971–1981	1981–1991	1991–2001	2001–2011
ఆంధ్రప్రదేశ్	23.10	24.20	14.59	10.98
కర్ణాటక	26.75	21.12	17.51	15.60
తమిళనాడు	17.50	15.39	11.72	15.61
కేరళ	19.24	14.32	9.43	4.91
పశ్చిమ్ బంగ	23.17	24.73	17.77	13.84
మహారాష్ట్ర	24.54	25.73	22.73	15.99
ఉత్తర్ ప్రదేశ్	25.39	25.61	25.85	20.23
బిహార్	24.16	23.38	28.62	25.04
రాజస్థాన్	32.97	28.44	28.41	21.31
మధ్యప్రదేశ్	27.16	27.24	24.26	20.35
ఝార్ఖండ్	23.79	24.03	23.36	22.42
ఛత్తీస్‌గఢ్	20.39	25.73	18.27	22.61
మొత్తం దేశంలో	24.66	23.87	21.54	17.70

ఆధారం: రిజర్వ్‌బ్యాంక్ గణాంకాలు

తెలుగు రాష్ట్రాలకూ చుక్కెదురు

గత నాలుగు దశాబ్దాల్లో జనాభా పెరుగుదల రేటు తగ్గించడంలో దక్షిణాది రాష్ట్రాలు సఫలీకృతమయ్యాయి. విద్య, పరిశుభ్రత, వైద్య రంగాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యం ఇచ్చింది. మహిళా అక్షరాస్యతకు పెద్దపీట వేసింది. ఫలితంగా జనన మరణాల రేట్లు తగ్గాయి. 1971 నుంచి 2011 మధ్య నాలుగు దశాబ్దాల కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా పెరుగుదలను జాతీయ సగటు కన్నా తక్కువకు పరిమితం చేయగలిగింది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలూ ఇదే బాటలో నడిచాయి. దీనివల్ల కేంద్రం అధిక కేటాయింపులతో తమను ప్రోత్సహిస్తుందని దక్షిణాది రాష్ట్రాలు విశ్వసించాయి. అందుకు భిన్నంగా జనాభా పెరుగుదలను రాజేసిన ఉత్తర్ ప్రదేశ్, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు ఆర్థిక సంఘాల నుంచి అధిక కేటాయింపులు దక్కించుకున్నాయి.

14వ ఆర్థికసంఘం 2011 జనాభా లెక్కలకు 10 శాతం, 1971 జనాభా లెక్కలకు 17.5 శాతం ప్రాముఖ్యత (వెయిటేజ్) ఇచ్చారు. ఫలితంగా కేంద్ర పన్నుల్లో (జమ్ముకశ్మీర్ మినహాయించి) ఆంధ్రప్రదేశ్‌కు 4.398 శాతం, తెలంగాణకు 2.499 శాతం (రెండు రాష్ట్రాలకు కలిపి 6.897 శాతం), తమిళనాడుకు 4.104, కర్ణాటకకు 4.822, కేరళకు 2.526 శాతం వాటా దక్కింది. అదేకాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు 18.205 శాతం, బిహార్‌కు 9.787 శాతం కేటాయింపులు జరిగాయి. ఒక్క యూపీకి కేటాయించినది మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు కేటాయించినదానికి దాదాపు సమానంగా ఉండటం గమనార్హం. దీన్నిబట్టి దక్షిణాది రాష్ట్రాలపట్ల కేంద్రప్రభుత్వ దృక్పథం ఏమిటో స్పష్టమవుతోంది. అంతకుముందు ఆర్థికసంఘాలూ ఇదే బాటలో నడిచాయి. జనాభా ఎంత ఎక్కువగా ఉంటే అంతగా నిధులిస్తామన్న కేంద్ర వైఖరిని ఎలా అర్థం చేసుకోవాలి? ఇక 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటే తెలుగు రాష్ట్రాలు మరింతగా నష్టపోతాయి. విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ఆర్థికపరిస్థితి దారుణంగా ఉంది. కేంద్రం నుంచి వచ్చే నిధుల బదిలీలు, మూలధన ఆదాయాలపైనే రాష్ట్రం ఆధారపడి ఉంది. వీటిల్లోనూ అప్పుల రూపంలో వచ్చేవే అధికం. తెలంగాణతో పోలిస్తే ఏపీకి రెవిన్యూ వ్యయం, రుణచెల్లింపు భారం ఎక్కువగా ఉంది. ఆర్థిక సంఘం సిఫార్సుల్లో రాష్ట్రాల అప్పులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే ఏపీ పరిస్థితి మరింత దిగజారుతుంది. 2016-17 నాటికే రాష్ట్ర అప్పులు స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో 23 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తున్నాయి. 2016-17లో కేంద్రానికి తెలంగాణ నుంచి దాదాపు రూ.50,000 కోట్లు వెళ్తే, తిరిగివచ్చింది అందులో సగమే! సమాఖ్య స్ఫూర్తి దేశంలో పరిఢవిల్లాలంటే ఈ పెడధోరణికి అడ్డుకట్ట పడాలి. రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం గౌరవించాలి. 'సమతుల్యతతో కూడిన సమానత్వం' ప్రాతిపదికగా రాష్ట్రాలతో కలిసి పనిచేయాలి. 15వ ఆర్థికసంఘం ఆ దిశగా అడుగులు వేయాలి!

(రచయిత- ఆర్థికరంగ నిపుణులు)

మహిళలకేదీ సమాన వాటా?

సామాజిక వికాసానికి మహిళా సాధికారత దగ్గరి దారి! అందుకే ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మహిళాభ్యుదయాన్ని కీలకంగా ప్రస్తావించారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాకారం చేయాలంటే స్త్రీ అభ్యుదయానికి అమిత ప్రాధాన్యం ఇచ్చితీరాలని 'సమితి- మహిళా విభాగం' స్పష్టం చేస్తోంది. ఆ క్రమంలో మహిళా భాగస్వామ్యం పెంచడం, వారిమీద జరుగుతున్న హింసకు చరమగీతం పాడటం, శాంతి భద్రతల స్థాపనలో వారి పాత్రను విస్తరించడం, స్త్రీల ఆర్థిక సాధికారతకు బాటలు పరవడం; జాతీయాభివృద్ధి ప్రణాళికలు, బడ్జెట్ల రూపకల్పనలో 'ఆకాశంలో సగాని'కి సముచిత ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలను చురుగ్గా అమలు చేయాలని ఆ విభాగం వివరించింది.

స్త్రీ, పురుష సమానతా సాధన దిశగా భారత్ ప్రస్థానం ఏమాత్రం ఆశావహంగా లేదు. సిసలైన జవాబుదారీ ప్రజాస్వామ్యంలో స్త్రీ, పురుషులకు సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. దురదృష్టవశాత్తూ భారత రాజకీయ యవనికపై మహిళలకు ఎప్పుడూ అట్టడుగు స్థానమే దక్కుతోంది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం మహిళలకు రాజకీయ భాగస్వామ్యం కల్పించడంలో మనం ఏ స్థాయిలో వెనకబడి ఉన్నామో రుజువు చేశాయి. ఈ రాష్ట్రాల్లో శాసనసభ్యులుగా ఎన్నికైనవారిలో మహిళల సంఖ్య అత్యంత నాసిగా ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వేదిక వెలువరించిన ప్రపంచ స్త్రీ పురుష సమానతా నివేదిక-2017లో 144 దేశాల జాబితాలో భారత్ 108వ స్థానంలో మగ్గుతోంది. ఆర్థిక, విద్య, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తున్న తీరుతెన్నులను ప్రాతిపదికగా తీసుకొని ఈ జాబితాను రూపొందిస్తారు. రాజకీయ భాగస్వామ్యపరంగా గడచిన కొన్ని దశాబ్దాలుగా భారత్‌లో మహిళల పరిస్థితి తీసికట్టుగా ఉంది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలు అత్యంత చురుకైన పాత్ర పోషించారు. కానీ, క్రమంగా వారి భాగస్వామ్యం క్రమంగా కోసుకుపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

దేశ నిర్ణయాధికార స్థానాల్లో మహిళలు ఏ స్థాయిలో నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారో పార్లమెంటులో వారి ప్రాతినిధ్యాన్ని గమనిస్తే వెల్లడవుతుంది. రాజ్యసభలోని మొత్తం సభ్యుల్లో మహిళల ప్రాతినిధ్యం సుమారు 12శాతం వద్దే నిలిచిపోవడం ప్రస్తుత దుస్థితికి అద్దం పడుతోంది. లోక్‌సభలోనూ ఇదే తీరు! మొత్తం 543 మంది సభ్యుల్లో మహిళల ప్రాతినిధ్యం 12.2శాతం దగ్గరే నిలిచిపోవడమూ సమస్య తీవ్రతను వెల్లడిస్తోంది. 1993నాటి 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. ఆ మేరకు స్థానిక సంస్థల్లో మహిళలు అధికార స్థానాలు అలంకరిస్తున్నప్పటికీ నిజమైన నిర్ణయాధికారం మాత్రం కొరవడుతోంది. మహిళలను ముందు పెట్టి మొత్తం అధికారం మగవాళ్లే చెలాయిస్తున్న దురవస్థ నేడు మన కళ్లముందు ఉంది. పార్లమెంటులోనూ, రాష్ట్రాల చట్టసభల్లోనూ మహిళలకు మూడోవంతు ప్రాతినిధ్యం కల్పించాలన్న బిల్లు వెలుగులోకి వచ్చి నేటికి 22 ఏళ్లు గడచింది. దశాబ్దాలు గడచినా ఆ బిల్లు చట్టరూపంలోకి రావడం లేదు. దేశంలోని పురుషస్వామ్య భావజాలం ఎప్పటికప్పుడు మోకాలడ్డుతూ ఆ బిల్లును అణగదొక్కుతోంది.



చట్టసభల్లో కొడిగడుతున్న ప్రాతినిధ్యం

హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యం గణాంకాలు గమనిస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఆ రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 337 మంది అభ్యర్థులు బరిలోకి దిగితే అందులో మహిళల సంఖ్య 19 మాత్రమే! అంటే మొత్తం అభ్యర్థుల్లో మహిళలు 5.6శాతం మాత్రమేనన్నమాట! అందులో నలుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించగా- ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. హిమాచల్‌లోని మొత్తం 68 సీట్లకుగాను భాజపా తరఫున ముగ్గురు మహిళా అభ్యర్థులు గెలవగా, కాంగ్రెస్‌నుంచి ఒక్కరు మాత్రమే విజయం సాధించగలిగారు. ఏ పార్టీ కూడా మహిళలకు ఎన్నికల్లో సమధిక ప్రాధాన్యం ఇవ్వకపోవడం నిర్వేదం కలిగించే పరిణామం. జాతి నరనరాన పేరుకుపోయిన పురుషాహంకార భావజాలానికి ఈ ఎన్నికలు ప్రతీకగా నిలుస్తాయి. హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కొనసాగుతోంది. ఆ రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థల్లో సగానికి సగం మహిళల ఏలుబడిలోనే ఉన్నప్పటికీ- శాసనసభ, పార్లమెంటు ఎన్నికల విషయానికి వచ్చేసరికి వారికి అత్తెసరు ప్రాతినిధ్యం కూడా దక్కడం లేదు. హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 50.2 లక్షలు. అందులో 25.6 లక్షల పురుష, 24.5 లక్షల మహిళా ఓటర్లు నమోదై ఉన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పురుషుల(71.53శాతం)తో పోలిస్తే మహిళ(77.76శాతం)లే అత్యధికంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనడం విశేషం. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లోనూ మహిళల ప్రాతినిధ్యం క్షీణ ముఖం పట్టిన దురవస్థ కళ్లకు కడుతోంది. 2012లో గుజరాత్ అసెంబ్లీలో 16మంది మహిళా శాసనసభ్యులు ఉంటే- 2017 చివర్లో జరిగిన ఎన్నికల్లో ఆ సంఖ్య 13కు కుదించుకుపోయింది. అంటే గుజరాత్ అసెంబ్లీ స్థానాల్లో మహిళల వాటా అటు ఇటుగా ఏడుశాతం మాత్రమేనన్నమాట. నిరుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన అయిదు రాష్ట్రాల్లో (ఉత్తర్ ప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్) మొత్తంగా 2,979 అభ్యర్థులు బరిలో నిలబడగా, అందులో మహిళల సంఖ్య కేవలం 234. వారిలో 53 మంది మాత్రమే విజయం సాధించారు. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరుగుతోందనేందుకు, అధికార స్థానాల్లో చోటు సంపాదించి తమ సామర్థ్యం నిరూపించుకొనేందుకు వారు ఉత్సాహంగా ఉన్నారనేందుకు సర్వత్రా ఇనుమడిస్తున్న ఓటింగ్ శాతమే నిదర్శనం. అవకాశం ఇస్తే అద్భుతాలు సాధ్యం చేయగల మహిళాలోకానికి వట్టి వాగ్దానాలతో ఒరిగేదేమీ లేదు. రాజకీయ నిర్ణయాధికార స్థానాల్లో వారికి సమధిక ప్రాతినిధ్యం కట్టబెట్టే నిబద్ధత అన్ని పార్టీలూ కనబరచాలి. అప్పుడే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.

– అర్చన కటోచ్

ఈనాడు లేఖలు

ఫ్లోరైడ్‌పై చూపు సారించాలి

తెలంగాణలోని వివిధ ప్రాంతాల్ని ఫ్లోరైడ్ సమస్య ఇప్పటికీ పట్టిపీడిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు దయనీయంగా మారాయి. వాటిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు సానుకూల ఫలితాలు సాధించగలిగారు. సూర్యాపేట జిల్లాలోని పలు మండలాల్లో వివిధ పరీక్షలు, ప్రయోగాలు నిర్వహించారు. ఇంకుడుగుంతల సమీపాల్లో బోర్లువేసి వాటిలోకి వాననీరు ఇంకేలా చేయడం ద్వారా ఆశించిన ప్రయోజనాలు నెరవేరాయి. అదే స్ఫూర్తిని ఇతర చోట్లా విస్తరింపజేస్తే, నీటి పరిమాణంలోని ఫ్లోరైడ్ శాతాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యపడుతుంది. సంబంధిత విభాగాల అధికారులు కాలయాపన లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి. అన్ని బాధిత ప్రాంతాలపైనా దృష్టి కేంద్రీకరించడం ప్రధానం.

- ఎం.భాస్కర్, దేశాయిపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

దుస్థితిలో గ్రంథాలయాలు

రాష్ట్రంలో పలు గ్రంథాలయాల స్థితిగతులు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. అద్దె గదుల్లోనే కొనసాగించాల్సి వస్తోంది. మరికొన్ని లైబ్రరీలు శిథిలావస్థకు చేరాయి. పుస్తకాలు ఉంచేందుకు బీరువాలతో పాటు పాఠకుల కోసం బల్లలు, కుర్చీలు ఏర్పాటుచేయడంలోనూ నెలల తరబడి జాప్యం జరుగుతోంది. మంచినీటి వసతి సరేసరి. పుస్తకాలు తెప్పించడంలో, వచ్చినవాటిని భద్రపరచడంలో ఉదాసీన వైఖరి కనిపిస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర చదువరులు అవస్థలపాలవుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టడంలో ఏమాత్రం వెనకాడకూడదు. గ్రంథాలయాలకు పూర్వవైభవం కలిగించాల్సిన బాధ్యత వారిపైనే ఉంది.

- ముంత శ్రీను, శ్రీరంగాపూర్, వనపర్తి జిల్లా

మంత్రాలయ యతీంద్రులు

'ప్రహ్లాదుడు' అనే మాటకు ఆనంద స్వరూపుడు అని అర్థం. ఆనందంతో ఉండేవాడు, దాన్ని పంచేవాడు ప్రహ్లాదుడు. మంత్రాలయ రాఘవేంద్ర యతీంద్రులను ప్రహ్లాదుడి అవతారంగా భావించడంలో రహస్యం అదే!

భాగవతంలో 'కలడు కలడు అనెడివాడు కలడో లేడో' అని కలవరపడిన సంశయాత్ముడు- గజేంద్రుడు. 'ఎందెందు వెతికి చూసిన అందందే గలడు' అంటూ సంబరపడిన నిశ్చయాత్ముడు- ప్రహ్లాదుడు. నిరంతరం ఆనందమయ స్థితిలో ఉంటూ, దైవం పట్ల నిశ్చయ జ్ఞానం కలిగిన సద్గురువు రాఘవేంద్రస్వామి. సాత్విక జీవన మార్గంలో భగవంతుణ్ని చేరుకొనే విస్పష్టమైన మార్గాన్ని బోధించి, ఆయన గుర్తింపు పొందారు.

రుగ్వేద భాష్యంలోని మొదటి 40 సూక్తులకు తొలిసారిగా ద్వైత సంప్రదాయంలో చేసిన వ్యాఖ్యానం ఆయనకు విశేష కీర్తిని అందించింది. ద్వైత సిద్ధాంతానికి, వైష్ణవ సంప్రదాయానికి విశ్వఖ్యాతిని చేకూర్చిన గొప్ప ఆచార్యుడిగా, దార్శనికుడిగా ప్రసిద్ధికెక్కారు. ఆయన రూపొందించిన మహిమాన్విత బృందావనం భక్తుల పాలిట కల్పవృక్షంగా, కామధేనువుగా ఇప్పటికీ మన్నన అందుకుంటోంది.

తిమ్మనభట్టు, గోపికాంబకు తిరుమలదేవుడి అనుగ్రహంతో జన్మించిన కారణంగా 'వేంకటనాథుడు' అని పేరు పెట్టారు. జాతక చక్రాన్ని పరిశీలించిన కుంభకోణ పీఠాధిపతులు సుధీంద్రతీర్థులు- ఆ బాలుడి ఆత్మతత్వాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కనిపెట్టారు. తన తదుపరి పీఠాధిపతి బాధ్యతను ఆయనకు అప్పగించాలని ఆదేశించారు. వేంకట నాథుడి ఏకాగ్రత, ఉపాసనా పటిమ గొప్పవి. ఒకసారి గంధం తీసే సమయంలో అగ్నిసూక్తం పఠించడం వల్ల, ఆ చల్లని చందనాన్ని ఒంటికి పూసుకొన్నవారికి కాలి మంటలు పుట్టాయట. వరుణ సూక్తం పఠిస్తూ తీసిన గంధంతో, ఆ శరీర తాపం చల్లారిందని చరిత్ర చెబుతోంది. మహత్వపూర్ణమైన అటువంటి విశేషాలు ఆయన అనంతర కాలంలోనూ వెలువడ్డాయి.

థామస్ మన్రో కలెక్టరుగా ఉన్న రోజులవి. అప్పట్లో పీఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయి. వాటిని రైతులకు పట్టాలుగా ఇచ్చేందుకు ఆయన వెళ్లారు. రాఘవేంద్రస్వామి దర్శనం లభించింది. తమ భూమి అసలు దస్తావేజులు ఎక్కడున్నాయో స్వామి తెలియజేశారట. వాటిని మన్రో వెతికి తీయించి, భూముల్ని తిరిగి పీఠానికి అప్పగించినట్లుగా 'బళ్లారి గజెట్'లో ఆయన పేరిట ప్రచురితమైన లేఖ వెల్లడించింది.



అంతర్యామి

రాఘవేంద్రస్వామి మధ్వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి, దేశమంతటా పర్యటించారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించారు. చంద్రిక, న్యాయ సుధ, తంత్ర దీపిక, న్యాయ ముక్తావళి వేదాంత గ్రంథాల్ని రచించారు.

పరివ్రాజకులుగా రాఘవేంద్రుల పాత్ర ఎంతో విశిష్టమైనది. మంత్రాలయంలో తాను ఏర్పాటుచేసిన బృందావనంలో అనంతమైన శక్తిని నిక్షేపించారంటారు. తంత్రశాస్త్ర ప్రక్రియలో నిర్మించారని, 713 లక్ష్మీనారాయణ సాలగ్రామాలను మంత్రసహితంగా పీఠంలో స్థాపించారని చెబుతారు. ఆయన 1671లో 'బృందావనంలో ప్రవేశిస్తున్నాను. మరో ఏడు శతాబ్దాల కాలం నా చైతన్యం భక్తుల్ని అనుగ్రహిస్తూనే ఉంటుంది' అని ప్రకటించారు. ఆ మహిమాలయాన్ని సందర్శించిన ప్రతిసారీ అనిర్వచనీయ అనుభూతి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

దివ్యమందిరంలో ఏటా ఫాల్గుణ మాసంలో వారంపాటు జయంతి వేడుకలు, శ్రావణమాసంలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు. భక్తులపాలిట కొంగుబంగారం రాఘవేంద్రస్వామి. 'మంచిచెడుల నిర్ణయానికి శాస్త్రం ఒక్కటే ప్రమాణం' అనే ఆయన హితబోధ సర్వదా అనుసరణీయం!

– ఎర్రాప్రగడ రామకృష్ణ



జన్మనిస్తూ మృత్యువును చూశా!

● అదృష్టవంతురాల్ని, బయటపడ్డా
● మరి అదృష్టం అందరికీ వద్దా?

మనసు పంచుకున్న సెరెనా విలియమ్స్

నా బంగారు కూతురు ఒలింపియాకు జన్మనిచ్చిన తర్వాత నేను దాదాపుగా మృత్యువు ఒడిలోకి వెళ్లిపోయా! కానీ నేను ఎంతో అదృష్టవంతురాలిని. అందుకే బయటపడ్డా... అంటూ విఖ్యాత టెన్నిస్ తార సెరెనా విలియమ్స్ గత సెప్టెంబరులో తాను కాన్పు సమయంలో ఎదుర్కొన్న పరిస్థితులను తాజాగా సీఎన్ఎన్‌కు ప్రత్యేక లేఖ రూపంలో వివరించారు. అందులోని ఆసక్తికర విషయాలు...

“గర్భం దాల్చిన తర్వాత రోజులన్నీ ఎంతో ఆహ్లాదంగా గడిచిపోయాయి. అనుకున్నట్లే నొప్పులు మొదలయ్యాయి. కానీ బిడ్డ గుండె కొట్టుకునే వేగం బాగా తగ్గిపోతుంటే వైద్యులు అత్యవసరంగా సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ఆ సర్జరీ సమయంలో కూడా ఎలాంటి ఇబ్బంది లేదు. నాకు తెలివి వచ్చే సరికే ఒలింపియా నా చేతుల్లో ఉంది. నా జీవితంలో మరువలేని అద్భుత అనుభూతి అది. కానీ పాప పుట్టిన 24 గంటల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అక్కడి నుంచి దాదాపు 6 రోజుల పాటు నేను ఏమవుతానో తెలియని పరిస్థితి!” అంటూ ఆమె హఠాత్తుగా తలెత్తిన సమస్యలను వివరించారు.

“నేను బతికి ఉండటమే అదృష్టం. ఉన్నట్టుండి తీవ్రమైన దగ్గు మొదలైంది. దాని ధాటికి కుట్లు పిగిలిపోయి, ఆపరేషన్ చేసిన చోట గాయం తెరుచుకుపోయింది. దగ్గు మొదలవుతూనే నాకు అనుమానం వచ్చింది... ఆపరేషన్ కారణంగా గాయం దగ్గర రక్తం గడ్డకట్టి, అది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయిందేమోనని! దాన్ని ‘పల్మనరీ ఎంబోలిజం’ అంటారు. నాకే అనుమానం వచ్చినట్లే క్షణం కూడా ఆలస్యం చేయకుండా నర్సుల దృష్టికి తీసుకెళ్లా. వైద్యులు పరీక్షించి చూస్తే పొట్టలో రక్తం గడ్డకట్టి పెద్ద ముద్దలా ఏర్పడింది తేలింది. నన్ను మళ్లీ ఆపరేషన్ థియేటర్లోకి తీసుకువెళ్లారు. ఆ రక్తం గడ్డ ఊపిరితిత్తుల్లోకి పోకుండా అడ్డుకునేందుకు పెద్ద చికిత్సే చేశారు. తర్వాత కూడా రోజుల తరబడి ఎంతో ఆయాసపడ్డా. చివరికి ఎప్పుడో ఇంటికి చేరాను. ఇలా మాతృత్వపు మధురిమలను ఆస్వాదించాల్సిన మొదటి ఆరు వారాలూ ఆసుపత్రుల్లోనూ, బెడ్ మీదే కరిగిపోయాయి” అంటూ ఆమె ప్రాణం కోసం పోరాడిన ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. ఇంత జరిగినా తాను ఎంతో అదృష్టవంతురాలినని చెప్పుకోక తప్పదంటూ.. “అత్యాధునికమైన సదుపాయాలు, సమర్థ సిబ్బంది అందుబాటులో ఉండటం నేను చేసుకున్న అదృష్టం. అది లేపోతే నేనలా మిగిలేదాన్ని కాదు.” అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నల్లజాతి మహిళలు ఎంతోమంది కాన్పు సమయంలో ఎదుర్కొంటున్న విపత్కర పరిణామాలను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. “ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా పేద దేశాల్లోని వేలాది మంది మహిళల దుస్థితి ఇదే. నాకు వచ్చిన లాంటి సమస్యలే వాళ్లకు ఎదురైతే వాళ్లను రక్షించే వైద్యులుగానీ, సదుపాయాలుగానీ.. ఏవీ ఉండటం లేదు. నొప్పులు పడుతూనే వాళ్లు మైళ్లకు మైళ్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ ప్రపంచంలోకి ఓ కొత్త జీవాన్ని తేవాలనుకున్న తల్లి అద్భుతం ముగిసిపోతోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మలావిలో మేరీ జేమ్స్ అనే మహిళకు ఎదురైన అనుభవాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. “మేరీ జేమ్స్ నొప్పులు పడుతూనే దగ్గరలో ఆసుపత్రి చేరేందుకు గంటల తరబడి నడిచి నడిచి అలిసిపోయింది. అక్కడ బిడ్డకు జన్మనిచ్చింది, కానీ ఆ బిడ్డ మరు పొద్దు చూడలేదు. బిడ్డకు ఆమె ఎంతో ముచ్చటగా పేరు పెట్టుకుందామనుకుంది. కానీ బిడ్డ కన్ను తెరవలేదు. ఆ పేరును ఆమె మనసులోనే కుక్కుకుంది. ఏడ్వని రోజు లేదు. ఒక్క మేరీ బిడ్డే కాదు.. ఇలా పేరు లేకుండా పోతున్న బిడ్డలు ఎంతోమంది! ఏటా దాదాపు 26 లక్షల మంది బిడ్డలకు జీవితం ఆరంభించక ముందే ముగిసిపోతోంది. వీటిలో 80% మరణాలను మనం నివారించగలం! రక్షించే వైద్యులు, నర్సులు లేకే మేరీ బిడ్డ దక్కలేదు. పేద దేశాలన్నింటా ఇదే పరిస్థితి. మంచి శిక్షణ పొందిన నర్సులు, వైద్యులు అందుబాటులో ఉంటే మహిళలకి దన్నుగా ఉండచ్చు కదా. ప్రతి మహిళకూ అటువంటి సురక్షిత ప్రసవాన్ని సృష్టించిపెట్టటమే మన స్వప్నం కావాలి” అంటూ ఆమె ఈ విషయంలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేశారు. “మీ బిడ్డ బతుకుతుందా? లేదా? అన్నది ఎక్కడ పుట్టిందన్నదాని మీద ఆధారపడి ఉండకూడదు. ఎలాగంటారా? ఈ విలువైన ప్రాణాలు కాపాడాలన్నదే సందేశం. మీరు ప్రభుత్వాల మీద, వైద్య సంస్థల మీద ఒత్తిడి పెంచండి. తల్లీపిల్లల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్న సంస్థలకు విరాళాలివ్వండి. మనందరం కలిస్తే దీన్ని కచ్చితంగా సాధించగలం!” అంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అభిమానులకే కాదు.. ప్రతి ఒక్కరినీ ఆమె ప్రత్యేకంగా అభ్యర్థించారు.

“సమర్థ వైద్యం అందుబాటులో ఉండబట్టే నేను బతికి బట్టకట్టా. మరి దానికి నోచుకోని సామాన్యులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరికీ లేదా!” - సెరెనా విలియమ్స్

బుందేల్‌ఖండ్‌కు భారీ నజరానా!

- అక్కడ రక్షణ రంగ పరిశ్రమల నడవాను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రధాని
- రూ.20 వేల కోట్ల పెట్టుబడి...
- 2.5 లక్షల మందికి ఉపాధికి బాటలు
- యూపీ పెట్టుబడుల సదస్సును ప్రారంభించిన మోదీ
- రాష్ట్రాన్ని ప్రగతిపథాన నడిపిస్తున్నారని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ప్రశంసలు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అత్యంత వెనుకబడిన ప్రాంతం బుందేల్‌ఖండ్ పంట పండింది! అక్కడ రూ.20 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో రక్షణ రంగ పారిశ్రామిక నడవా (డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్)ను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. తద్వారా 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం... ప్రతికూలతలతో కునారిల్లిన ఉత్తర్‌ప్రదేశ్‌ను ప్రగతిపథాన నడిపిస్తోందంటూ ప్రశంసలు కురిపించారు. బుధవారమిక్కడ రెండు రోజుల ‘ఉత్తర్‌ప్రదేశ్ పెట్టుబడుల సదస్సు-2018’ను ప్రధానమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- “రెండు రక్షణరంగ పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో చెప్పాం. అందులో ఒకదాన్ని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం. రూ.20 వేల కోట్ల పెట్టుబడులొస్తాయి. 2.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. బుందేల్‌ఖండ్‌ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో... ఈ కారిడార్‌ను ఆగ్రా, అలహాబాద్, లఖ్‌నవూ, కాన్పూర్, ఝాన్సీ, చిత్రకూట్‌కు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది” అని అన్నారు.

కేంద్ర, రాష్ట్రాలనే రెండు చోదకశక్తులతోనే దేశాభివృద్ధి సాకారమవుతుందని గత ఎన్నికల సందర్భంగా తాను చెప్పిన అభిప్రాయాలను ప్రధాని ఉటంకించారు. ఈ దిశగా తమ ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించిందనీ... ముఖ్యంగా ‘ముద్ర యోజన’తో లక్ష్యం చేరుకోవచ్చన్నారు.

“భిన్న వనరుల లభ్యత, సాధ్యత అమోఘంగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ దేశాభివృద్ధికి చోదకశక్తి కాగలదు. సాధ్యత, విధానాలు, పటిష్ఠ ప్రణాళిక, సమర్థ ఆచరణ- ఈ నాలుగూ ప్రగతికి దోహదపడతాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రజలు తమ వంతు ‘సూపర్ హిట్’ ప్రతిభను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నారు. పారిశ్రామికవేత్తలతో పెట్టుబడుల సదస్సును నిర్వహించడం భారీ మార్పునకు సంకేతం. మునుపు రాష్ట్రంలో నెలకొన్న భీతావహ, అభద్రతా వాతావరణం పెట్టుబడులను రాకుండా నిలువరించింది. యోగీ సర్కారు ఈ ప్రతికూలతలన్నింటినీ అధిగమించి... సానుకూల మార్పులతో ప్రజలకు ఆశాకిరణం చూపుతోంది” అని ప్రధాని చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధితో ఉపాధి అవకాశాలకు లంకె

సదస్సులో భాగంగా ఏకగవాక్ష పరిష్కార యాప్‌ను ప్రధాని ఆవిష్కరించారు. “పారిశ్రామికాభివృద్ధి-ఉపాధి అవకాశాలను అనుసంధానించే విధానాలు రూపొందుతున్నాయి. అలవిమాలిన జాప్యాన్ని చవిచూసిన పారిశ్రామికవేత్తలు ఇక ఎర్ర తివాచీ స్వాగతం అందుకుంటారు” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



బుధవారం లఖ్‌నవూలో జరిగిన ‘యూపీ ఇన్వెస్టర్స్’ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

హవాయ్ చెప్పులు వేసుకునేవారు... విమానాల్లో తిరగాలి...

“హవాయ్ చెప్పులు వేసుకుని తిరిగేవారి విమానయాత్రను చూడాలన్నదే నా కల. రైతులకు సులభతర మార్కెట్ వసతి కల్పించడానికీ; అన్నదాతలు-పరిశ్రమల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి మనం మార్గాలను కనుగోవాల్సి ఉంది. ప్రపంచ స్థాయి ఉత్పత్తులను మనం ఉత్పత్తిచేయగలిగితే... అందుకు తగ్గ ప్రోత్సాహక, మార్కెటింగ్ వ్యవస్థలనూ ఏర్పాటు చేసుకోవాలి” అని మోదీ తన ఆకాంక్షను వెలిబుచ్చారు.

అతి మద్యపానంతో భారీగా డిమెన్షియా ముప్పు



టొరంటో: మద్యపానం ఎక్కువైతే అన్నిరకాల డిమెన్షియా ముప్పులూ గణనీయంగా పెరుగుతాయని తాజా అధ్యయనంలో తేలింది. మద్యంతో చుట్టుముట్టే ప్రవర్తన, మానసిక, ఇతర అనారోగ్య సమస్యలపై దీనిలో పరిశోధకులు దృష్టించారు. ఇవి నాడీ వ్యాధులపై చూపే ప్రభావాన్ని అంచనా వేశారు. దీంతో నియంత్రించగలిగే నాడీ వ్యాధుల ముప్పుల్లో.. మద్యపాన రుగ్మతలే ప్రధానమైనవని తేల్చారు. పది లక్షల మందికిపైగా డిమెన్షియా బాధితులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వీరిలో 57,000 మందిని 65 ఏళ్లకు ముందే డిమెన్షియా చుట్టుముట్టింది. దీనికి అతి మద్యపానమే కారణమని పరిశోధకులు తేల్చారు. ఇప్పటివరకూ డిమెన్షియాపై చేపట్టిన అధ్యయనాల్లో ఇదే అతిపెద్దదని కెనడాలోని మానసిక ఆరోగ్యం, మత్తు మందుల వ్యసనాలపై పరిశోధన కేంద్రం (సీఏఎంహెచ్) నిపుణులు ముర్గెన్ రెహ్మ్ తెలిపారు. ‘మద్యంతో మెదడుపై పడే దుష్ప్రభావం, డిమెన్షియాలను మనం సరైన చర్యలు తీసుకుంటే అడ్డుకోవచ్చు. ముఖ్యంగా డిమెన్షియా అకాల మరణాలను నియంత్రించొచ్చు. సగటున 20ఏళ్ల జీవిత కాలాన్ని మద్యపానం హరిస్తోంది. డిమెన్షియా సంబంధిత మరణాలు దీనిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి’అని ఆయన వివరించారు. డిమెన్షియా బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు ఉంటుండగా.. ముందస్తు డిమెన్షియా బాధితుల్లో మూడింట రెండొంతుల మంది పురుషులేనని తేలిందని ఆయన పేర్కొన్నారు.

నవజాత శిశువులకు జపాన్ సురక్షితం

నివేదిక విడుదల చేసిన యూనిసెఫ్

వాషింగ్టన్: భూమ్మీద పడిన నెల రోజుల్లోపే శిశువులు ప్రాణాలు కోల్పోతున్న దాఖలాలు పాకిస్థాన్‌లో అత్యధికం కాగా, జపాన్‌లో అత్యల్పం. ఈ విషయంలో జపాన్ అత్యంత మెరుగైన స్థానంలో ఉంది. పాకిస్థాన్‌లో జన్మిస్తున్న ప్రతీ 22 మంది శిశువుల్లో ఒకరు నెలరోజుల్లోపే కన్నుమూస్తుండగా, జపాన్‌లో ప్రతీ 1111 మందిలో ఒకరు చనిపోతున్నారు. ఏయే దేశాలు ఏయే స్థానాల్లో ఉన్నాయో తెలిపే జాబితాను యూనిసెఫ్ విడుదల చేసింది. 1990 నుంచి 2016 వరకు చోటు చేసుకున్న మరణాలను ప్రాతిపదికగా చేసుకుని దీనిని రూపొందించారు. ప్రపంచం మొత్తంమీద ఏటా 26 లక్షల మంది పుట్టిన నెలలోపే చనిపోతున్నారు. వీరిలో పుట్టిన క్షణాల్లోనే మరణిస్తున్నవారు 10 లక్షల మంది.

2016లో అత్యధిక నవజాత శిశు మరణాలు చోటుచేసుకున్న దేశాలు: 1) పాకిస్థాన్ 2) మధ్య ఆఫ్రికా రిపబ్లిక్ 3) అఫ్గానిస్థాన్ 4) సోమాలియా 5) లెసోథో 6) గినియా-బిసావ్ 7) దక్షిణ సూడాన్ 8) ఐవరీ కోస్ట్ 9) మాలి 10) ఛాద్.

భారత్‌ది 12వ స్థానం: ఎక్కువగా శిశు మరణాలు చోటు చేసుకుంటున్న 52 అల్ప-మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో భారత్ 12వ స్థానంలో నిలిచింది. భారత్‌లో 2016లో పుట్టిన నెలలోపే మరణించిన శిశువులు ఆరు లక్షల మంది.

జ్యుడిషియల్ కస్టడీకి ఆప్ శాసనసభ్యులు

- పోలీసు కస్టడీలో విచారణకు కోర్టు నిరాకరణ

దిల్లీ: ప్రధాన కార్యదర్శి అన్షుప్రకాశ్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శాసనసభ్యులు దాడి చేశారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో పోలీసులకు ఎదురుదెబ్బ తగిలింది. శాసనసభ్యులు అమానతుల్లాఖాన్, ప్రకాశ్ జర్వాల్‌ను కస్టడీలో తీసుకుని రెండు రోజుల పాటు ప్రశ్నించడానికి అనుమతించాలన్న వారి విజ్ఞప్తిని దిల్లీ కోర్టు బుధవారం కొట్టివేసింది. ఇద్దరు శాసనసభ్యులు పోలీసులతో సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ షెఫాలి బర్నాలా టాండన్ చెబుతూ పోలీసుల విజ్ఞప్తికి నిరాకరించారు. వారిద్దరినీ తీహార్ జైలుకు గురువారం వరకు జ్యుడిషియల్ కస్టడీ నిమిత్తం పంపించారు. ఆ రోజు వారి బెయిలు విజ్ఞప్తులను కోర్టు విచారిస్తుంది. జర్వాల్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేయగా ఖాన్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కోర్టు నిర్ణయం ఐఏఎస్, దిల్లీ-అండమాన్, నికోబార్ దీవుల సివిల్‌సర్వీసు అధికారులకు ఊహించని పరిణామం. మంగళవారం ఈ అధికారులు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌ను కలుసుకుని దాడి సంఘటనను వివరించారు. మరోవైపు ఈ సంఘటనపై కేంద్ర హోం మంత్రిత్వశాఖకు దిల్లీ ఎల్జీ అనిల్ బైజల్ నుంచి నివేదిక అందింది. ఐఏఎస్, డానిక్స్ అధికారులు దిల్లీ ప్రధాన కార్యదర్శిపై దాడికి సంబంధించి చర్యలను కోరుతూ రాష్ట్రపతి కోవింద్ అపాయింట్‌మెంట్ కోరారు. దిల్లీ సీఎం కేజ్రీవాల్ నివాసానికి తనను పిలిపించి, అక్కడ కొంత మంది ఆమ్‌ఆద్మీ పార్టీ శాసనసభ్యులు తనపై దాడి చేశారని అన్షుప్రకాశ్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆరోపణలు అవాస్తవమని ఆప్ ఖండించింది. దిల్లీ ప్రధాన కార్యదర్శి భాజపా తరఫున పని చేస్తున్నారని, ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికే ఈ సంఘటనను తెరపైకి తెచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖాన్ ఆరోపించారు.



కోర్టుకు హాజరైన ఆప్ ఎమ్మెల్యేలు అమానుతుల్లా ఖాన్, ప్రకాశ్

మలేరియా పరాన్నజీవిని మట్టుబెట్టే దిశగా తాజా అవిష్కరణ!!

లండన్: మందులకు తిరగబడి మరీ మనగలుగుతున్న మలేరియాను సమర్థంగా మట్టుబెట్టే దిశగా సరికొత్త ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు నాందీ పలికారు. మలేరియా పరాన్నజీవి బారినుంచి ఎర్రరక్తకణాలు తప్పించుకునే దిశగా ఓ మందును కనుగొనేందుకు వారు ఔషధ తయారీ సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. అంటే..., మలేరియా పరాన్నజీవి ...మనిషిలోని ఎర్రరక్తకణాలను ప్రభావితం చేయకుండా నిరోధించే ప్రక్రియ రూపకల్పన దిశగా పరిశోధనలు చేస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన ప్రొఫెసర్ మైక్ బ్లాక్‌మ్యాన్ తెలిపారు. ఎర్రరక్తకణాలపై దాడి చేసే మలేరియా పరాన్నజీవులు అందులోనే ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఒక్కసారిగా కణాన్ని ఛేదించుకుని వెలువడి ఇతర కణజాలాన్ని దెబ్బతీస్తాయి. ఇందుకు వాటికి ఉపకరిస్తున్న ‘సెరా ఎ-6’, ‘సబ్-1’ అనే ప్రొటీన్‌లను కనుక కట్టడి చేయగలిగితే...మలేరియా వ్యాప్తిని ఇట్టే అరికట్టేయవచ్చన్నది శాస్త్రవేత్తల ఉద్దేశంగా ఉంది.

నీటి కుంటలు.. మృత్యుపాశాలు..!

- ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు చిన్నారుల మునక
- వరంగల్ రూరల్ జిల్లాలో ముగ్గురు యువకులు మృతి



వరంగల్ రూరల్ జిల్లా తహరాపూర్ గొగుకుంటలో పడి మృతిచెందిన సునీల్ వద్ద రోదిస్తున్న అమ్మమ్మ

సిరికొండ, శాయంపేట-న్యూస్‌టుడే: నీటి కుంటలు మృత్యుపాశాలయ్యాయి. రెండు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం ముత్యంపేట్‌కి చెందిన కినక పరమేశ్వరి(04), కినక పుష్ప(05)లు వారి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం గ్రామానికి కొంత దూరంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా సాయంత్రం ఇంటికొచ్చే క్రమంలో పరమేశ్వరి, పుష్ప బహిర్భూమికని గ్రామానికి అతి సమీపంలో ఉన్న వాటర్‌షెడ్ నీటిగుంత వద్దకు వెళ్లారు. నీరు ఎక్కువగా ఉండడంతో అదుపుతప్పి అందులో పడిపోయి మృతిచెందారు. మృతిచెందిన ఇద్దరు అన్నదమ్ముల కుమార్తెలు కావడంతో రెండిళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుంటలో మునిగి ముగ్గురు మృత్యువాత పడిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం తహరాపూర్ గ్రామశివారులో జరిగింది. వరంగల్‌లోని కొత్తవాడకు చెందిన అలేటి సునీల్(20) తన స్నేహితులు రంగు సాయికృష్ణ(19), దేవులపల్లి వంశీ(18)తో కలిసి తహరాపూర్‌లో ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. సాయికృష్ణ, వంశీ గ్రామ శివారులో గొగుకుంటలో ఈతకు వెళ్లారు. మొదటగా వంశీ కుంటలోకి దిగి మునిగిపోతుండటంతో కాపాడేందుకు వెళ్లిన సాయికృష్ణ కూడా మునిగిపోయాడు. ఆ తర్వాత అందులోకి దిగిన సునీల్ కూడా మునిగి మృతిచెందాడు. తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ముగ్గురు ఒకే పాఠశాలలో చదువుకున్నారు.

హిందూయేతరులను తొలగించవద్దు!

తితిదే ఈవోకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తితిదేతో పాటు దాని పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న హిందూయేతర ఉద్యోగులను తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు తొలగించవద్దని తితిదే ఈవోను హైకోర్టు ఆదేశించింది. ఈవో జారీ చేసిన సంజాయిషీ నోటీసులకు మాత్రం వివరణ ఇవ్వాలని హిందూయేతర ఉద్యోగులకు స్పష్టంచేసింది. వాటి చట్టబద్ధతను తర్వాత పరిశీలిస్తామని పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులను ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా తితిదే తరఫు న్యాయవాది బాలాజీ వడేరా వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఉద్యోగంలో చేరే సందర్భంలో హిందూయేతర మతాల ప్రచారానికి పాల్పడమంటూ హామీ ఇచ్చారని.. దానికి కట్టుబడి ఉండేలా వారిని ఆదేశించాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ‘మేమెందుకు ఆదేశాలివ్వాలి, హామీ ఇచ్చింది మీకు కాబట్టి ఉల్లంఘిస్తే మీరే చర్యలు తీసుకోండి. పిటిషనర్ల తల్లిదండ్రులూ తితిదేలో సేవలందించారని చెబుతున్నారు.. పిటిషనర్లపై దయచూపాలేరా’ అని ప్రశ్నించింది. ప్రాథమికంగా తితిదే నోటీసు సమర్థించేదిగా లేదంది.

వేర్పాటువాద ఉద్యమాల్ని అనుమతించం

- భారత వ్యతిరేక చర్యల్ని సమర్థించం
- కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడి

అమృత్‌సర్: తమ భూభాగంపై విదేశాలకు వ్యతిరేకంగా చేపట్టే వేర్పాటు ఉద్యమాలను అనుమతించబోమని, భారత వ్యతిరేక చర్యల్ని సమర్థించబోమని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పష్టం చేశారు. భారత పర్యటనలో భాగంగా ఆయన తన భార్య, పిల్లలతో బుధవారం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని సందర్శించారు. పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమరిందర్ సింగ్ . ...కెనడాలో భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న 9 సిక్కు ఉగ్రవాద సంస్థల జాబితాను ట్రూడోకు అందజేశారు. ఈ సంస్థలు ఖలిస్థాన్ పేరుతో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, పంజాబ్‌లో హింసను ప్రేరేపిస్తున్నాయని, విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని తెలిపారు. ఆ సంస్థలు, వాటి సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రూడో వెంట కెనడా రక్షణ మంత్రి హర్జిత్ సజ్జన్ కూడా ఉన్నారు. సిక్కు జాతీయుడైన సజ్జన్.. ఖలిస్థాన్ సానుభూతిపరుడనే భావనతో గతంలో ఆయన పంజాబ్‌కు వచ్చినప్పుడు కలుసుకునేందుకు అమరిందర్ సింగ్ తిరస్కరించారు. అయితే, ప్రస్తుత పర్యటనలో వీరిద్దరూ కరచాలనం చేసుకోవటం గమనార్హం. ఉగ్రవాద నిర్మూలన, మాదక ద్రవ్యాలు, నేరగాళ్ల కట్టడి వంటి అంశాల్లో కెనడా,భారత్‌లో పరస్పరం సహకరించుకోవాలని అమరిందర్‌సింగ్ పిలుపునిచ్చారు. అనంతరం ట్రూడో, అతని కుటుంబ సభ్యులు, మంత్రులు, ఎంపీలతో కలసి 1947 భారత విభజన స్మృతిగా నిర్మించిన మ్యూజియంను సందర్శించారు. విభజనపై విచారం వ్యక్తం చేస్తూ తన సందేశాన్ని ట్రూడో రాశారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, రాష్ట్ర మంత్రి నవ్‌జోత్‌సింగ్ సిద్ధూ తదితరులు వారి వెంట ఉన్నారు.



స్వర్ణదేవాలయంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న కెనడా ప్రధాని ట్రూడో, ఆయన సతీమణి, పిల్లలు



బుధవారం షిల్లాంగ్‌లో నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

ప్రజాస్వామ్యాన్నే మాయం చేయగల ఇంద్రజాలికుడు మోదీ

రాహుల్ వ్యంగ్య బాణాలు

షిల్లాంగ్: భారత ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప ‘ఇంద్రజాలికుడ’ని.. ప్రజాస్వామ్యాన్ని సైతం ఆయన ‘మాయం’ చేయగలరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పీఎన్‌బీలో కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోదీ, బ్యాంకులకు రుణాలు ఎగవేసిన విజయ్ మాల్యా తదితర నేరగాళ్లు ఇలానే మాయమై.. విదేశాల్లో ప్రత్యక్షమయ్యారని చురకలు అంటించారు. బుధవారం మేఘాలయలోని జవాయ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అవినీతిని నిర్మూలించడంలో విఫలమవ్వడమే కాకుండా.. అందులో క్రియాశీల పాత్ర పోషిస్తోందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలను, రైతులకు మద్దతుధరలను కేంద్రం కల్పించలేకపోయిందని రాహుల్ విమర్శించారు. మేఘాలయలో తిరిగి కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని.. భాజపా ఎంత డబ్బు వెదజల్లినా ప్రయోజనముండదని అన్నారు. ఈ నెల 27న మేఘాలయలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

త్వరలో 13 అంకెల మొబైల్ నంబర్లు!

- అవి ఎం2ఎం వినియోగదారులకే..

దిల్లీ: దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న 10 అంకెల మొబైల్ నంబర్ల మాదిరిగా 13 అంకెల మొబైల్ నంబర్లూ అందుబాటులోకి రానున్నాయి. అయితే, ఇవి యంత్రం-యంత్రం(మిషన్ టు మిషన్/ఎం2ఎం) వినియోగానికే. ఈ కొత్త సిమ్‌ల జారీకి సంబంధించి టెలికాం ఆపరేటర్లకు ఇప్పటికే టెలికాం శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే, 13 అంకెల సిమ్ కార్డుల వల్ల సాధారణ వినియోగదారులు (ఫోన్‌కాల్స్, డేటా)పై ఎలాంటి ప్రభావం ఉండదు. ప్రస్తుత సిమ్ కార్డులు(పది అంకెలవి) యధాతథంగా పనిచేస్తాయని టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి ఎం2ఎం వినియోగదారులకు 13 అంకెల సిమ్ కార్డులు మాత్రమే జారీ అవుతాయి. ఇప్పటికే 10 అంకెల సిమ్ కార్డులున్న ఎం2ఎం వినియోగదారులు అక్టోబరు 1వ తేదీ నుంచి 13 అంకెల సిమ్ కార్డులకు మారాలి. ఈ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరు 31కల్లా పూర్తి చేయాలని టెలికాం శాఖ స్పష్టం చేసింది.

ఎం2ఎం సిమ్ అంటే... సెన్సర్లు, యంత్ర పరికరాలు, అంతర్జాల ఆధారిత ఉపకరణాల నుంచి ఆటోమేషన్ విధానంలో సమాచార అనుసంధానం/ మార్పిడికి ఉపయోగించేవాటిని ఎం2ఎం సిమ్‌లు అంటారు. మానవ ప్రమేయం అవసరం లేకుండానే వీటి నుంచి సమాచారం వెళ్తుంది. వీటిని మొబైల్ ఫోన్లలోనూ వాడవచ్చు. స్మార్ట్ గ్రిడ్‌లు, ఇ-హెల్త్‌కేర్, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్, గృహోపకరణాల (స్మార్ట్ అప్లయన్సెస్)నిర్వహణ, సెల్‌ఫోన్ ఆధారిత రిమోట్‌లకు వీటిని వినియోగిస్తారు.

రామాలయం నమూనాలో అయోధ్య రైల్వే స్టేషన్

దిల్లీ: దేశంలోని చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను చాటేలా ఆయా ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లను నిర్మించాలని యోచిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. శ్రీరాముని జన్మస్థలమైన అయోధ్యలోని రైల్వే స్టేషన్‌ను రామ మందిరం నమూనాలో నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఆ నిర్మాణ ఆకృతి వీహెచ్‌పీ సూచించినదైనా అభ్యంతరం చెప్పాల్సిందేమీ లేదన్నారు. కర్ణాటకలోని బెలగావి స్టేషన్‌ను సబర్మతి ఆశ్రమం ఆకృతిలో, మథురలో బృందావనం ఆలయం ఆకృతిలో, ఆగ్రాలో తాజ్‌మహల్ నమూనాలో, అజ్మీర్‌లో దర్గా లేదా మసీదు నమూనాలో రైల్వే స్టేషన్లను నిర్మించుకోవటం ద్వారా ఆయా ప్రాంతాల చారిత్రక ప్రాధాన్యాన్ని వెల్లడించవచ్చని అభిప్రాయపడ్డారు. మంగళవారం రైల్వేశాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా అయోధ్యలో మాట్లాడుతూ...ఇక్కడి రైల్వే స్టేషన్‌ను రామమందిరం ఆకృతిలో నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని బుధవారం దిల్లీలో విలేకరులు ప్రస్తావించినప్పుడు గోయల్ సమర్థించుకున్నారు.

13 మంది సరోగసీ చిన్నారులు తండ్రి చెంతకు

థాయిలాండ్ కోర్టులో కేసు గెలిచిన జపాన్ కుబేరుడు

బ్యాంకాక్: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 13 మంది చిన్నారుల్ని కోర్టుకెక్కి ఓ తండ్రి దక్కించుకున్నారు. పిల్లలపై సర్వహక్కులనూ గెలుచుకున్నారు. ఇది జపాన్ కుబేరుడు మిత్సుతోకి షిగేట కథ. 28ఏళ్ల ఈయన దిగ్గజ వ్యాపారవేత్తకు వారసుడు. 2014లో ఒక్కసారిగా ఈయన పేరు వార్తల్లో మార్మోగింది. వ్యాపారాల్లో లాభాల పంట దీనికి కారణం అనుకుంటే పొరపాటే. సరోగసీ విధానంలో ఈయనకు జన్మించిన 13 మంది పిల్లలు థాయిలాండ్‌లో వెలుగుచూడటమే దీనికి కారణం. ఆయాలతో సహా బ్యాంకాక్‌లోని ఓ భవనంలో వీరు పోలీసుల కంటపడ్డారు. అయితే అనంతర విచారణలో మొత్తంగా ఈయనకు 19 మంది పిల్లలున్నట్లు తేలింది. వీరిలో 13 మంది పిల్లలకు థాయిలాండ్‌లోని మహిళలు అద్దెగర్భం ద్వారా జన్మనిచ్చారు. మిగతా ఆరుగురు చిన్నారులు జపాన్, కాంబోడియాల్లో ఉన్నారు. వీరిలో నలుగురు థాయిలాండ్‌లో తల్లులకే జన్మించారు. దేశ సరోగసీ నిబంధనలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నడుమ మిత్సుతోకి థాయిలాండ్ వదిలి వెళ్లిపోయారు. మరోవైపు విదేశీయులెవరూ సరోగసీ విధానంలో పిల్లల్ని పొందకుండా థాయిలాండ్ సైతం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. 13 మంది పిల్లల్నీ తమ సంరక్షణలోనే ఉంచుకుంది. అయితే ఈ పిల్లల బాధ్యతను తనకు అప్పగించాలని మిత్సుతోకి కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనకు ఎలాంటి చెడు అలవాట్లులేవనీ, 13 మంది పిల్లలకూ ఆయన మంచి జీవితాన్ని ఇవ్వగలరని చెబుతూ.. ఆయనకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. పిల్లలపై న్యాయపరమైన హక్కులన్నీ ఆయన ఒక్కరికే చెందుతాయని స్పష్టంచేసింది. అంతేకాదు సరోగసీ తల్లులకు ఎలాంటి హక్కులు ఉండవనీ తేల్చిచెప్పింది. ఈ మేరకు వారు గర్భానికి ముందే అంగీకరించినట్లు వెల్లడించింది. వీరు ఒక్కొక్కరికీ రూ.6 లక్షల నుంచి రూ. 8లక్షల మధ్య మిత్సుతోకి చెల్లించినట్లు పోలీసులూ తెలిపారు. విదేశీయుల వల్ల సరోగసీ విధానాలు కోర్టులకెక్కడం థాయిలాండ్‌లో ఇదేమీ తొలిసారికాదు. ఇదివరకు ఓ స్వలింగ సంపర్క జంట సైతం కోర్టులో గెలిచి తమ చిన్నారిని తీసుకెళ్లింది. మరోవైపు పిల్లలపై లైంగిక చర్యలకు పాల్పడే ఓ ఆస్ట్రేలియావాసి దగ్గర్నుంచి సైతం ఓ సరోగసీ తల్లి శిశువును వెనక్కు రప్పించలేకపోయారు.

నియంత్రణ రేఖ సమీపంలోకి పాక్ హెలికాప్టర్

దిల్లీ: పాకిస్థాన్ సైనిక హెలికాప్టర్ ఒకటి బుధవారం ఉదయం జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ సమీపంలోకి వచ్చింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ గగనతలంలోనే అది ఉన్నప్పటికీ నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ)కి దాదాపు 300 మీటర్ల సమీపంలోకి వచ్చి ఆ వెంటనే వెనక్కు మళ్లింది. నిబంధనల ప్రకారం... తిరిగే రెక్కలు ఉన్న హెలికాప్టర్లు ఎల్‌ఓసీకి ఒక కిలోమీటరు ఆవలే ఉండాలి. స్థిర రెక్కలు (ఫిక్స్‌డ్ వింగ్స్) ఉన్న లోహవిహంగాలు అయితే 10కిలోమీటర్లకు ఆవలే ఉండాలి.



వటపత్రశయనుడి అలంకరణలో నరసింహుడు

యాదాద్రిలో ఉత్సవ సేవలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపుణ్యక్షేత్రంలో బుధవారం మధ్యాహ్నం వటపత్రశయనుడి అలంకరణ, రాత్రి వేళ పొన్నవాహనోత్సవ పర్వాలు కొనసాగాయి. ఐదోరోజుకు చేరిన ఉత్సవాల్లో భాగంగా సేవోత్సవాలను వైభవంగా నిర్వహించారు. యాగశాలలో హోమాది పూజలు, రుత్వికుల పారాయణం జరిగింది. గురువారంనుంచి మొదలయ్యే ధార్మిక సాంస్కృతికోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లుచేపట్టారు.

టీఆర్‌టీ పరీక్షలు యథాతథం

- **టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి**

ఈనాడు–హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లు వాయిదా పడవని, ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని, ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఛైర్మన్ ఘంటా చక్రపాణి స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆందోళన చెందొద్దని, అపోహలకు గురికావద్దని సూచించారు. టీఎస్‌పీఎస్సీ రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ సంస్థని, కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, హద్దు దాటితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరతామని హెచ్చరించారు. కమిషన్ కార్యదర్శి, సభ్యులతో కలిసి చక్రపాణి కమిషన్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే టీఆర్‌టీ పరీక్షల విషయంలో కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ, వీటిని వరూ నమ్మవద్దన్నారు. మతాలు, కులాల వారిగా పరీక్ష కేంద్రాలు కేటాయించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. దరఖాస్తుల ప్రకారమే కేంద్రాల కేటాయింపు జరిగిందని స్పష్టం చేశారు. "హాల్‌టికెట్ల జారీలో కొద్దిసేపు సాంకేతిక సమస్య రావడంతో వెంటనే నిలిపివేశాం. బుధవారం ఉదయం 11 గంటల నుంచి తిరిగి పేపర్-1, 2 హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ మొదలైంది. భాషాపండితులు 17,500 మంది అభ్యర్థుల్లో 9,500 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. టీఆర్‌టీ పరీక్షల్లో 48 విడతల పరీక్షలుంటాయి. గతంలో డీఎస్సీ నిర్వహించినపుడు ఒకే జిల్లాలోనే పరీక్ష రాసే పరిస్థితి ఉండేది. ఇపుడు పది జిల్లాల్లో రాసే అవకాశం కల్పించాం. పారదర్శకంగా పరీక్షల నిర్వహణ, వేగంగా ఫలితాల కోసం రెండు మినహా అన్ని పరీక్షల్ని కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష (సీబీఆర్‌టీ) పద్ధతిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నాం. పరీక్ష కేంద్రాలు దూరంగా వేశారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. సాంకేతిక కారణాల దృష్ట్యా హైదరాబాద్‌కు చుట్టుపక్కల జిల్లాల వారికి హెచ్ఎండీఏ పరిధిలో పరీక్ష కేంద్రాలు ఉంటాయని నోటిఫికేషన్‌లోనే పేర్కొన్నాం. గతంలో మాదిరే పరీక్ష కేంద్రాలు కేటాయించాం.

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల వారికి సాంకేతిక కారణాలతో మరో జిల్లాలో పరీక్ష కేంద్రం పడిందని విద్యార్థులొచ్చారు. సుపరిపాలన కేంద్రం(సీజీజీ)తో మాట్లాడాం." అని పేర్కొన్నారు. "సాంకేతికంగా కొన్ని ఇబ్బందులు వచ్చాయి. ముందే గుర్తించి పరిష్కరించాం. సీజీజీ నుంచి సమాచారం తెప్పించుకుని చూశాం. మేం చెప్పిన విధానాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు అన్పించలేదు. ఒక ప్రాంతం వారికి మరో ప్రాంతంలో పరీక్ష కేంద్రం పడింది. మూడు, నాలుగు పరీక్ష కేంద్రాల విషయం కూడా మానస్సాదంగా అనిపించింది. వీటిని సరిదిద్దే చర్యలు తీసుకున్నాం. అది సాంకేతిక సమస్య. సీజీజీని తప్పుపట్టడం లేదు" అని చక్రపాణి వ్యాఖ్యానించారు. వరస సమస్యలు వస్తున్నాయి.. సీజీజీని వదులుకుంటారా? అని విలేకరులు ప్రశ్నించగా.. "సీజీజీ మంచి సంస్థ.. 89 పరీక్షల్లో మూడుసార్లే సాంకేతిక సమస్యలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు. "పరీక్షల నిర్వహణకు సొంతంగా సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసుకోవడంలో స్థలం సమస్య ఉంది. టీఎస్‌పీఎస్సీ భవనంలో మూడు అంతస్తులు ఖాళీగా ఉన్నాయి. వాటికోసం తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు లేఖ రాశాం. "ప్రభుత్వం అనుమతించిన 30,618 పోస్టుల్లో 3,599 పోస్టులు మినహా అన్నింటికి నోటిఫికేషన్లు విడుదల చేశాం. 3,500 పోస్టులకు సంబంధించి రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల నుంచి కొన్ని వివరాలు రావల్సి ఉందని" పేర్కొన్నారు. కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ఒకే కేంద్రంలో ఉదయం, సాయంత్రం పరీక్షలకు హాజరుకావడం వంటి అంశాలతో ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించామన్నారు. ఇంకా సందేహాలుంటే టీఎస్‌పీఎస్సీ సహాయక కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. కమిషన్ సభ్యుడు విఠల్ మాట్లాడుతూ.. కొందరు టీఎస్‌పీఎస్సీపై విషప్రచారం చేస్తున్నారనీ, అది చట్టరీత్యా నేరమనీ, అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. వాయిదాపడిన గురుకులాల పరీక్షల్ని టీఆర్‌టీ తర్వాత నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది.

'రాంగోపాల్ వర్మను అరెస్టు చేయండి'

మహిళా సంఘాల 48 గంటల దీక్ష ప్రారంభం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: యువతను పెడదారి పట్టించేలా జీఎస్‌టీ లఘు చిత్రాన్ని రూపొందించారనీ.. దర్శకుడు రాంగోపాల్ వర్మను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, పీవోడబ్ల్యూ తదితర మహిళా సంఘాల ఆధ్వర్యంలో 48 గంటల దీక్ష ప్రారంభమైంది. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళననుద్దేశించి తెలంగాణ సామాజిక కార్యకర్త దేవి మాట్లాడుతూ.. స్త్రీలంటే దేవతలుగా కొలిచే భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను మంటలో కలిపే విధంగా చిత్రాన్ని తెరకెక్కించి, యువత ఆకర్షితులయ్యేలా ప్రచారం చేసుకుంటున్న వర్మను విచారణ చేసి, పోలీసులు విడిచిపెట్టారని, తక్షణమే ఆయన్ను అరెస్టు చేయాలన్నారు. లఘు చిత్రంపై స్పందించిన మహిళా సంఘాల నాయకులపైనా ఇష్టానుసారంగా మాట్లాడటం దారుణమన్నారు. కనీస గౌరవం లేకుండా వ్యాఖ్యలు చేసిన వర్మ తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. లక్ష్మీ, సుజాత మాట్లాడుతూ..వర్మపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు పద్మ, మణి, విమల తదితరులు పాల్గొన్నారు.

వర్మపై విశాఖలో కేసు నమోదు

సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై విశాఖ మూడో పట్టణ పోలీసుస్టేషన్లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. హోంమంత్రి చినరాజప్ప ఆదేశాల నేపథ్యంలో.. నగర పోలీసు కమిషనర్ యోగానంద్ సూచనల మేరకు ఎంవీపీ పోలీసుస్టేషన్‌లో వర్మపై కేసు నమోదు చేశారు. సెక్షన్ 504, 509ల కింద ఈ కేసు పెట్టినట్లు సీఐ మహేశ్ 'ఈనాడు'కు వెల్లడించారు. రామ్‌గోపాల్‌వర్మను పిలిపించి విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.

బైపీసీ చదివి.. ఇంజినీరింగ్‌కు సై

- ఎంబీబీఎస్ సీట్లు రాక బీటెక్ వైపు చూపు
- మళ్లీ గణితం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు
- ఇంటర్ బైపీసీతో ప్రతిష్ఠాత్మక సీట్లు తక్కువ

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్ బైపీసీ పూర్తిచేసి ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకోవాలనుకున్న విద్యార్థులు మళ్లీ ఇంజినీరింగ్ వైపు చూస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్, పశువైద్య, వ్యవసాయ విద్యల్లో తక్కువ సీట్లు ఉండటం.. ఇతర బీఎస్సీ కోర్సుల్లో చేరితే స్థిరపడేందుకు ఎక్కువకాలం పడుతుందని భావిస్తున్నవారు బీటెక్ వైపు మళ్లుతున్నారు. తక్కువ సీట్లు.. అధిక పోటీ ఉండటంతో ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడం కష్టంగా మారుతోంది. ఇక దీంతో త్వరగా స్థిరపడాలంటే ఇంజినీరింగ్ విద్యే మంచిదన్న నిర్ణయానికి వస్తున్నారు. ఎంసెట్ ఇంజినీరింగ్ రాయాలంటే ఇంటర్‌లో గణితం ఉత్తీర్ణులై ఉండాలి. అందుకే ఇప్పుడు మళ్లీ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న పలువురు విద్యార్థులు ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ఎంపీసీలోని గణితం (ప్రథమ, ద్వితీయ సంవత్సరం) పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. కనీస మార్కులతో పాసైనా బీటెక్ ఏదో ఒక కోర్సులో చేరవచ్చనేది వారి ఉద్దేశం.

ఎందుకీ పరిస్థితి?

బైపీసీ విద్యార్థులు నీట్, ఎంసెట్ (అగ్రికల్చర్) ద్వారా ఎంబీబీఎస్, ఆయుష్ కోర్సులు, బీడీఎస్, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ బీఎస్సీ, డెయిరీ టెక్నాలజీ కోర్సుల్లో చేరతారు. అవన్నీ కలిపి సుమారు 5 వేల సీట్లే ఉండగా.. పోటీ పడేవారు 1.10 లక్షలమంది ఉంటున్నారు.

- ఆ సీట్లు కాదనుకుంటే బీటెక్ బయోటెక్నాలజీలో చేరవచ్చు. అయితే గణితం బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన వారే అర్హులు.
- బీఫార్మసీలో చేరే బైపీసీ విద్యార్థులు తక్కువమందే ఉంటున్నారు. ఆరేళ్ల కోర్సు అయిన ఫార్మా-డికి ప్రస్తుతం మన దేశంలో అవకాశాలు స్వల్పంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.
- బీఎస్సీలో బయో ఇన్ఫర్మాటిక్స్, మైక్రో బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయోకెమిస్ట్రీ లాంటి ఎన్నో గ్రూపులున్నా మంచి వేతనంతో కూడిన ఉద్యోగం కావాలంటే మళ్లీ పీజీ చేయాలి.
- 'ఇంజినీరింగ్ పూర్తిచేస్తే సగటు విద్యార్థి కూడా ఐటీ శిక్షణ పొంది ఉద్యోగం సంపాదించవచ్చన్న దాంట్లో కొంతవరకు నిజం లేకపోలేదు. అయితే భవిష్యత్తులో అదీ కష్టమే' అని సాంకేతిక విద్యాశాఖాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

దొంగ ఓటుపై సరికొత్త అస్త్రం

- 0.1శాతం 'టెండర్డు' ఓట్లు పడితే..తిరిగి పోలింగ్
- తెలంగాణ ఎన్నికల సంఘం తాజా నిర్ణయం
- ఒక్క ఫిర్యాదునూ తిరస్కరించే వీల్లేదు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో రానున్న పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో దొంగ ఓట్లను ప్రోత్సహిస్తే ఏకంగా ఎన్నికల ప్రక్రియే నిలిచిపోనుంది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లే సరికి అప్పటికే వారి ఓట్లను ఎవరో వేసేసి ఉంటే.. అప్పుడు సదరు ఓటరు వినియోగించుకొనే 'టెండర్డు' ఓట్లు.. ఇక 0.1 శాతానికి మించి ఉంటే, అక్కడ ఓట్ల లెక్కింపు ఉండబోదు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో తిరిగి పోలింగ్ చేపడతారు. పోలింగ్ వ్యవధి ముగిసే సమయానికి టెండర్డు ఓట్లు 0.1 శాతానికి (వెయ్యి ఓట్లకు ఒక ఓటు) మించి ఉంటే.. సంబంధిత అధికారులు ఓట్ల లెక్కింపును చేపట్టకుండా నివేదికను టీఎస్ ఈసీకి పంపాలి. ఎన్నికల సంఘం మరింత సమాచారాన్ని క్రోడీకరించుకొని అక్కడ తిరిగి పోలింగ్‌నకు ఆదేశాలు ఇస్తుంది. ఓటర్లు తమకు టెండర్డు ఓటును ఇవ్వాలని ఎన్నికల అధికారిపై వత్తిడి తేవటం ఈ తాజా నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా అధికార వర్గాలు తెలిపాయి. ఇలాంటి ప్రక్రియ ద్వారానే దొంగ ఓట్ల నిర్మూలన సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

ఫిర్యాదుపై మూడు రోజుల్లోగా నివేదిక

మరోవైపు.. పంచాయతీ ఎన్నికల సందర్భంగా వచ్చే ఏ ఒక్క ఫిర్యాదును అధికారులు ఇక తిరస్కరించకూడదు. పంచాయతీ ఎన్నికల్లో వివిధ వర్గాల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ సంబంధిత అధికారులు రశీదును ఇచ్చి విచారణ చేపట్టాలి. అనంతరం ఫిర్యాదుదారుకు సమాధానాన్ని పంపాలి. తన వద్దకు వచ్చే ఫిర్యాదులపై వివరణ అడిగినపుడు ఆయా అధికారులు మూడు రోజుల్లో నివేదికను పంపాలి. ఎన్నికల్లో అక్రమాల నిర్మూలనే ధ్యేయంగా ఎక్కువ సంఖ్యలో వీడియోగ్రాఫర్లను నియమించాలనీ ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నిబంధనలను రానున్న పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా నిర్ణయించింది.

భావి పౌరులకు.. ఆరోగ్య కానుక

ఈనాడు, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడించారు. జులైలో ఆరోగ్య పరీక్షల క్రతువు ఆరంభించి..ఆరు నెలల్లో పూర్తిచేసి కార్డులు పంపిణీ చేయాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. సచివాలయంలో బుధవారం రెండు శాఖల అధికారులతో వారు సమావేశమయ్యారు. 'రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఆరోగ్య పరీక్షల నిర్వహణకుగానూ ఆయా జిల్లాలోని పాఠశాలలకు ముందే తేదీలను నిర్ణయిస్తాం. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ), ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాలలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖ గురుకుల విద్యాలయాల్లోని మొత్తం 8 లక్షల మంది బాలికలకు ఆరోగ్య, పరిశుభ్రత కిట్లు అందిస్తాం. ప్రభుత్వ విద్యాలయాల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదివే బాలికలకు..యుక్త వయసులో వచ్చే ఆరోగ్య సమస్యలు, సంరక్షణపై అవగాహన తరగతులు నిర్వహిస్తాం. అందుకు మహిళా ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పిస్తాం. బాలికల్లో రక్తహీనత సమస్యను దూరం చేసేలా గురుకుల, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల్లో పోషకాహారాలందిస్తున్నట్టే.. మిగిలిన బడుల్లోని విద్యార్థినుల్లో ఈ సమస్యను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తే అమలు చేస్తాం.' అని వెల్లడించారు. రెండు కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని రెండు శాఖల అధికారులను ఆదేశించారు. దేశంలో ఈ పథకాలు అమలు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్, నిమ్స్ సంచాలకుడు మనోహర్, ఎన్‌హెచ్ఎం ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఆదర్శ పాఠశాలల సంచాలకుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కడియం, లక్ష్మారెడ్డి

విభజన చట్టం అమలుపై హోంశాఖ సమీక్ష వాయిదా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలు స్థితిగతులపై సమీక్షించడానికి హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో శుక్రవారం జరగాల్సిన తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల స్థాయి సమావేశం వాయిదాపడింది. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు హోంశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వాస్తవంగా ఈ సమావేశం బుధవారం జరగాల్సింది. ఆ రోజు తెలంగాణకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వస్తున్నందున అక్కడి ప్రభుత్వ కోరిక మేరకు 23కి వాయిదావేశారు. మళ్లీ ఇప్పుడు వారి విజ్ఞప్తి మేరకే శుక్రవారం నాటి సమావేశాన్ని రద్దు చేశారు. తదుపరి సమావేశం తేదీని మళ్లీ తెలియజేస్తామంటూ హోంశాఖ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు వర్తమానం పంపింది.

అనారోగ్యంతో అమిత్‌షా కర్ణాటక పర్యటన రద్దు

ఈనాడు, బెంగళూరు: అనారోగ్య కారణాలతో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కర్ణాటక పర్యటన బుధవారం అర్ధాంతరంగా రద్దయ్యింది. మంగళవారం దక్షిణ కన్నడ జిల్లాలో పర్యటించిన అమిత్‌షా.. బుధవారం ఉత్తర కన్నడ జిల్లాలో పర్యటించాల్సి ఉంది. జ్వరం, దగ్గుతో బాధపడుతున్న ఆయన వైద్యులసలహాతో బుధవారం పర్యటనను రద్దుచేసుకున్నారు. మధ్యాహ్నం ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర నుంచి హుబ్బళి చేరుకుని.. అక్కడి నుంచి దిల్లీ బయలు దేరి వెళ్లారు.

బెంగళూరులో కడపవాసి హత్య

- కిక్కిరిసిన బస్సులో ఘటన.. పరుగులు పెట్టిన ప్రయాణికులు
- తాపీగా నడిచి వెళ్లిపోయిన అగంతకులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బస్సు కదిలేవేళ..ఓ వ్యక్తి పరుగున వచ్చి లోనికి ప్రవేశించాడు. ఆ వెనుకాలే మరో ముగ్గురు ఎక్కారు. తొలుత లోనికి వచ్చిన వ్యక్తిని మిగతా ముగ్గురూ ఒక్కసారిగా చుట్టుముట్టి విచక్షణారహితంగా నరికి కడతేర్చారు. ఆపై.. బస్సు దిగి తాపీగా తప్పించుకుపోయారు. నిశ్చేష్టులైన ప్రయాణికులు వాహనం దిగి తలోదిక్కుకూ పరుగుపెట్టారు. అచ్చం సినిమా తరహాలో చోటు చేసుకున్న ఈ సంఘటన బుధవారం బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. హతుడిని ఆంధ్రప్రదేశ్‌లోని కడప నివాసి సీతారాం అలియాస్ రాం సురేష్(32)గా గుర్తించారు. కడప నుంచి సీతారాం బస్సులో నగర శివారులోని హొసకోటకు చేరుకున్నాడు. ప్రత్యర్థులు తనను వెంబడిస్తున్నట్లు గుర్తించి.. అక్కడి నుంచి వేరొక వాహనంలో ఉదయం తొమ్మిది గంటలకు కోనప్పన అగ్రహారానికి చేరుకున్నాడు. అక్కడికీ వచ్చిన దుండగుల నుంచి తప్పించుకునేందుకు అత్తిబెలె- కె.ఆర్.మార్కెట్ మార్గంలో పయనిస్తున్న సిటీ సర్వీసు బస్సులోకి వేగంగా చేరుకోగలిగాడు. ఆయన ఎక్కాక.. మరి కొందరు ప్రయాణికులు వస్తున్నారని బస్సు కాసేపు ఆగడంతో ముగ్గురు ఆగంతుకులు లోనికి ప్రవేశించారు. వాహనం కదలగానే.. ఆ ముగ్గురూ ఆయుధాలు బయటకు తీశారు. దీంతో 60 మంది ప్రయాణికులతో కదులుతున్న బస్సులో కలకలం మొదలైంది. సీతారాంపై కత్తులతో దాడిచేసి విచక్షణారహితంగా నరికారు. ప్రయాణికులు కేకలు పెట్టడంతో డ్రైవర్ బస్సు నిలిపి తలుపులు తెరిచాడు. 'కాపాడండి... కాపాడండి..' అని సీతారాం కేకలు పెట్టాడని..మేమతన్ని రక్షించలేకపోయామని కండక్టర్ విచారం వ్యక్తం చేశాడు. హతుడి జేబులో ఉన్న చరవాణి ఆధారంగా పోలీసులు పేరు, ఊరును గుర్తించారు. దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

పోలీసుల అదుపులో 55 మంది ఆఫ్రికన్లు

- **నకిలీ పాసుపోర్టులు, వీసాలు స్వాధీనం**

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలో డ్రగ్స్, ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ఆఫ్రికన్ దేశస్థులను గుర్తించేందుకు పోలీసులు బుధవారం విస్తృత సోదాలు చేశారు. పశ్చిమ మండలం పరిధిలోని ఆసిఫ్‌నగర్, హుమాయున్‌నగర్, గోల్కొండ, లంగర్‌హౌస్, బంజారాహిల్స్ ఠాణాల పరిధిలో 543 మంది ఆఫ్రికన్ దేశస్థుల వివరాలు రాబట్టాలని ఫారన్ రీజినల్ రిజిస్ట్రేషన్(ఎఫ్ఆర్ఆర్‌వో) అధికారులు పోలీసులకు జాబితా సమర్పించారు. దీంతో బుధవారం ఉదయం స్థానిక పోలీసులతో పాటు ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. ఎఫ్ఆర్ఆర్‌ఓ అధికారులతో కలిసి పాసుపోర్టు, వీసా ఇతర పత్రాలను తనిఖీ చేశారు. నైజీరియా, సోమాలియా, సూడాన్, ఘనా ఇతర ఆఫ్రికన్ దేశాలకు చెందిన 55మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 44 మంది సరైన పత్రాలను సమర్పించలేకపోయారు. మరో 11 మంది వీసా గడువు తీరిపోయినా నగరంలో ఉంటునట్లు గుర్తించారు. మరో ఇద్దరు నైజీరియన్‌లు నకిలీ పాసుపోర్టు, వీసాలతో దేశంలోకి ప్రవేశించినట్లు తేలింది. వీరిని స్వదేశానికి పంపించే ఏర్పాటు చేస్తున్నారు.

రిజర్వేషన్లను సాధిస్తాం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్ల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి లేదా ఒత్తిడి తెచ్చి వాటిని సాధిస్తామన్నారు. కేంద్రం అడ్డంకులు కల్పిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారిక సమాచారం లేదన్నారు. తమిళనాడు తరహాలోనే తెలంగాణ రిజర్వేషన్ల పెంపుదలకు అన్ని అవకాశాలున్నాయని చెప్పారు.

ప్రముఖ నిర్మాతపై జీఎస్టీ కేసు

- రూ.7 కోట్లు పన్ను వసూలు చేసి జమ చేయనందుకు..
- రూ. రెండు కోట్లు చెల్లించిన నిర్మాత
- మిగిలిన రూ.5 కోట్ల చెల్లింపునకు వారం గడువు
- సినీ నిర్మాత కార్యాలయాలపై సీజీఎస్టీ అధికారుల దాడులు

ఈనాడు, హైదరాబాద్: సినిమాల నిర్మాణ సమయంలో వివిధ విభాగాల నుంచి రూ.ఏడు కోట్లు జీఎస్టీ వసూలు చేసి ప్రభుత్వానికి జమచేయనందుకు ప్రముఖ తెలుగునిర్మాతపై హైదరాబాద్ జీఎస్టీ కమిషనర్ కార్యాలయ అధికారులు కేసు నమోదు చేశారు. బుధవారం ఆ నిర్మాత కార్యాలయాలపై కేంద్ర జీఎస్టీ అధికారులు దాడులు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూ.ఏడు కోట్లు జీఎస్టీ వసూలు చేసి జమచేయనట్లు గుర్తించారు. పన్ను బకాయిల్లో నిర్మాత బుధవారమే రూ.రెండు కోట్లు చెల్లించగా మిగిలిన రూ.ఐదుకోట్ల చెల్లింపునకు వారం రోజుల గడువు కోరారు. వారం రోజుల్లో చెల్లించకుంటే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ సహా తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని జీఎస్టీ హైదరాబాద్ అధికారులు హెచ్చరించారు.

సినీరంగంలో కలకలం

తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పటి వరకు ఐటీ దాడులనే చూశాం. ఇప్పుడు జీఎస్టీ వసూలు చేసి పన్ను జమచేయని నిర్మాతలపై సీజీఎస్టీ అధికారులు దాడులు చేయడం సినీ రంగంలో కలకలం రేపింది. దక్షిణభారతదేశంలో ఈ తరహాలో నమోదైన మొదటి కేసు ఇదని సీజీఎస్టీ అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన జులై నుంచి నిర్మాత తీసిన సినిమాలకు సంబంధించి వివిధ విభాగాల నుంచి చెల్లింపుల సమయంలో జీఎస్టీ మినహాయించుకున్నారు. వారం రోజులుగా దీనిపై దృష్టిసారించిన అధికారులు పన్ను వసూలు చేసి జమచేయకపోవడాన్ని ఆధారాలతో సహా గుర్తించి దాడులు చేశారు. ఈ నిర్మాత జీఎస్టీకి సంబంధించి దాఖలు చేసిన రిటర్న్‌లు, పన్ను చెల్లింపు వివరాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు సీజీఎస్టీ అధికారులు వివరించారు. సినీ రంగం సహా వివిధ రంగాల్లో భారీ మొత్తంలో పన్ను ఎగవేతదారులపై జీఎస్టీ అధికారులు దృష్టిసారించారు. నిర్మాతలు సినీ నిర్మాణానికి సంబంధించి నటీనటులు, టెక్నీషియన్స్ ,స్టూడియో, ల్యాబ్‌ల నుంచి చెల్లింపుల సమయంలో 12 శాతం పన్ను మినహాయించుకుంటారు. ఈ పన్నును జమచేయాల్సిన బాధ్యత నిర్మాతదే.

వసూలు చేసి జమ చేయకుంటే చర్యలు కఠినం

వసూలు చేసిన పన్నును చెల్లించకపోవడం జీఎస్టీ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చెల్లించాల్సిన మొత్తానికి వందశాతం జరిమానా విధిస్తారు. పన్నుకు జరిమానా విధించడంతో బాటు వ్యక్తిగతంగా కూడా పన్ను మొత్తమెంతో అంత జరిమానా విధించేందుకు జీఎస్టీ చట్టంలో అవకాశం ఉంది. ఈ చట్టం మేరకు ఐదేళ్లవరకూ జైలు శిక్ష విధించవచ్చు.

అయ్యప్ప దర్శనం ఎప్పుడెప్పుడు?

మండల దీక్షలు, మకర సంక్రాంతి సందర్భంగా తెరిచి ఉండే శబరిమల అయ్యప్ప ఆలయం మరికొన్ని ప్రత్యేక సందర్భాలు మినహా మూసి ఉంటుంది. ఈ ఏడాది ఆలయం తెరిచి ఉంచే రోజుల సమాచారం.

సందర్భం	ప్రారంభం	ముగింపు
మాసపూజ (మీనం)	14/03/2018	19/03/2018
వార్షికోత్సవం (పది రోజులు)	20/03/2018	30/03/2018
విష్ణు మహోత్సవం (మేడం)	10/04/2018	18/04/2018
ఎడవం మాస పూజ	14/05/2018	19/05/2018
విగ్రహ ప్రతిష్ఠ దినం	24/05/2018	25/05/2018
మిథున మాస పూజ	14/06/2018	19/06/2018
కర్కాటక మాస పూజ	16/07/2018	21/07/2018
చింగం మాస పూజ	16/08/2018	21/08/2018
ఓణం పండగ	23/08/2018	27/08/2018
కన్ని మాస పూజ	16/09/2018	21/09/2018
తులా మాస పూజ	16/10/2018	21/10/2018
శ్రీ చిత్ర అట్ట తిరుణాల్	05/11/2018	06/11/2018
మండల మహోత్సవం	16/11/2018	27/12/2018
మకర విళక్కు మహోత్సవం	30/12/2018	20/01/2019




కాటమరాయుడే కదిరి నరసింహుడు

దక్షిణ భారతదేశంలోని నవ నారసింహ ఆలయాల్లో అనంతపురం జిల్లాలోని శ్రీఖాద్రీ క్షేత్రం ఒకటి. నారసింహ క్షేత్రాలలో ప్రహ్లాదుడు వెలసిన క్షేత్రమిదే! పదకవితా పితామహుడు అన్నమాచార్యుడు 'కదిరి నృసింహుడు.. కంబమున వెడలె' అని కీర్తించింది ఈయననే. ఒకప్పుడు ఈ ఆలయం మైసూర్ సంస్థానంలో అంతర్భాగంగా ఉండటంతో కదిరి కాటమరాయుడిని తెలుగువారితో పాటు కన్నడిగులూ ఇలవేల్పుగా భావిస్తారు. ఈ నెల 25 నుంచి కదిరి నరసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా కాటమరాయుడి కథ మనమూ తెలుసుకుందాం!

కదిరి అసలు పేరు ఖాద్రి. ఖా అంటే విష్ణుపాదం. అద్రి అంటే పర్వతం. విష్ణుమూర్తి పాదం మోపిన ప్రాంతంగా ఖాద్రీ వాడుకలోకి వచ్చింది. కాలగమనంలో ఆ పేరే కదిరిగా రూపాంతరం చెందింది. కదిరి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో పెద్ద పర్వతం ఉంది. హిరణ్యకశిపుడిని సంహరించిన నృసింహుడు ఆగ్రహం చల్లారక భీకర అరుపులతో ఈ ప్రాంతానికి చేరుకున్నాడట. స్వామిని శాంతపరచడానికి దేవతలు, మహర్షులు, ప్రహ్లాదుడు అందరూ ఈ కొండపైకి వచ్చి అనేక స్తోత్రాలతో స్తుతించారట. అందుకే ఈ కొండకు స్తోత్రాద్రి అన్న పేరు వచ్చింది. **కాటమ అంటే అడవి. రాయుడు అధిపతి. అడవికి అధిపతి సింహం. కాబట్టి కాటమరాయుడే కదిరి నృసింహుడిగా పూజలందుకుంటున్నాడు.** అప్పట్లో నరసింహ స్వామివారిని స్తోత్రాద్రి ప్రాంతంలో నివసించే చెంచులు పాడుకున్న భక్తితత్వమే జానపదగేయంగా వాడులోకి వచ్చింది.





చెట్టు కింద పుట్టలో..

ఖాద్రీ క్షేత్రంలో మొదట పశ్చిమ చాళుక్యులు 985-1076 మధ్య దుర్గాదేవి ఆలయాన్ని అద్భుత శిల్పసంపదతో నిర్మించారు. 1274-1275 మధ్య కాలంలో విజయనగర రాజు వీరబుక్కరాయలు కదిరి ప్రాంతాన్ని సందర్శించారు. తన పరివారంతో రాత్రి ఇక్కడే బస చేశారు. రాజుకు కలలో నారసింహుడు కనిపించి ఖదిరి (చంద్ర) వృక్షంలో ఉన్నానని చెప్పాడట. స్వామి ఆదేశానుసారం ఖదిర వృక్షం కింద పుట్టలో నుంచి స్వామివారి సాలగ్రామాలు దొరికాయట. దుర్గాదేవి ఆలయానికి దక్షిణ భాగంలో నారసింహ ఆలయాన్ని నిర్మించి సాలగ్రామాలను ప్రతిష్ఠించారు. ప్రహ్లాదుడి విగ్రహం కొలువుదీర్చారు. 1356లో కొక్కంటి పాలెగాళ్లు పశ్చిమ గోపురాన్ని, 1457లో స్వామి భక్తురాలైన సాసవల చిన్నమ్మ దక్షిణ గోపురాన్ని, 1509లో శ్రీకృష్ణ దేవరాయలు ఉత్తర రాజగోపురాన్ని, తూర్పు సింహద్వారాన్ని 1529-42మధ్య కాలంలో అచ్యుతరాయలు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

-పునికిలి హరగోపాలరాజు,
ఈనాడు, అనంతపురం
చిత్రాలు: పి.చలపతి, న్యూస్‌టుడే, కదిరి

కుంకుమ.. మల్లెలు.. దవనం

కదిరి క్షేత్రంలో మరెన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇక్కడి కుంకుమకు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరుంది. సంప్రదాయ బద్ధంగా పసుపుతో చేసిన కుంకుమ సుగంధాలు వెదజల్లుతుంటుంది. ఒకప్పుడు వందల కుటుంబాలు కుంకుమ తయారీపై ఆధారపడేవి. కదిరిలో మరో ఆకర్షణ మల్లెలు. స్వామివారికి మల్లెలను విశేషంగా అలంకరిస్తుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులు, పర్యాటకులు మల్లెలు కొనకుండా తిరుగు ప్రయాణం అవ్వరు. సువాసనలు వెదజల్లే దవనాన్ని కదిరి ప్రాంతంలో అధికంగా సాగు చేస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో దవనం రైతుల చేతికొస్తుంది. మల్లెల పరిమళాలకు దవనం తోడవ్వడంతో నారసింహుని కల్యాణం సుగంధ భరితంగా సాగిపోతుంది.

స్వామి వారి స్వేద బిందువులు

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహుని జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రం. జన్మనక్షత్రం రోజున మూలవర్లకు (మూలవిరాట్టుకు) నిజరూప విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తారు. అభిషేక అనంతరం స్వామివారిని శేషవస్త్రంతో తుడిచినప్పుడు స్వేదబిందువులు వస్తుంటాయి. ఎన్నిసార్లు తుడిచినా ఆగకుండా వస్తుండటం విశేషం. స్వామివారి విగ్రహం నుంచి కారిన స్వేదబిందువులను తీర్థంగా భక్తులు స్వీకరించి అనుగ్రహప్రాప్తిగా భావిస్తారు.

ఇస్లాం సందేశం

దైవం పేరుతో..



ముస్లిం సోదరులు ఏ పని మొదలుపెట్టాలన్నా ముందుగా 'బిస్మిల్లాహ్' అంటారు. ఏ పని ప్రారంభించినా తొలుత అల్లాహ్‌ని స్మరించాలంటారు ప్రవక్త (స). బిస్మిల్లాహ్ అంటే 'అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తాను' అని అర్థం. ప్రతి క్షణం అల్లాహ్ నామాన్ని మననం చేయడం ద్వారా కార్యసిద్ధి, మానసిక ప్రశాంతత కలుగుతాయని విశ్వసిస్తారు. దివ్యఖుర్‌ఆన్‌లోని ప్రతి అధ్యాయం 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం'తోనే ప్రారంభం అవుతాయి. ఇందులో అల్లాహ్, రహ్మాన్, రహీం అని దైవానికున్న మూడు పేర్లు ఉన్నాయి. రహ్మాన్ అంటే కరుణించే వాడనీ, రహీమ్ అంటే పరమ కృపాశీలుడనీ అర్థం. అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తానని ప్రార్థన చేస్తారు. 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం' అని పూర్తిగా పలకలేకపోయినా ఫర్వాలేదు. బిస్మిల్లాహ్ అన్నా సరిపోతుందని చెప్పారు. వేలాది సంవత్సరాల కిందట ప్రవక్త సులైమాన్ (అలై) తన సబా అనే రాణికి లేఖ రాస్తూ 'బిస్మిల్లాహ్'తో ప్రారంభించారన్న విషయం దివ్యఖుర్‌ఆన్ ద్వారా తెలుస్తోంది. ప్రవక్తలందరూ ఇదే సూత్రాన్ని పాటించారు. పెద్దలు చూపిన బాటను అనుసరిస్తూ.. మనమూ బిస్మిల్లాహ్ అని మననం చేసుకొని మంచి పనులకు శ్రీకారం చుడదాం.

– ఖైరున్నీసా బేగం

లెంట్ దినాల్లో...

క్రీస్తువాణి


ఉపవాసం అనే పదానికి దైవానికి సమీపంగా ఉండటం అనే అర్థం ఉంది. ఈ విషయంలో క్రీస్తు సూచన అనుసరణీయం. ఉపవాసం చేసే విషయం అందరికీ తెలియజేయాల్సిన అవసరం లేదని ఉపదేశించారు ప్రభువు. "మీ ముఖం వికారం చేసుకోవద్దు. దైవానికి తప్ప మీరు ఉపవాసం చేస్తున్న విషయం ఎవరికీ తెలియాల్సిన అవసరం లేదు" అంటారాయన. క్రీస్తుప్రభువు కూడా 40 రోజులు ఉపవాసాలు చేశారు. ఆయన మరణించిన తరువాత విశ్వాసులు లెంట్ లేదా ఉపవాస దినాలు పాటిస్తున్నారు. ఈఏడాది ఫిబ్రవరి 14 నుంచి ఈ దినాలు ప్రారంభమయ్యాయి.



తన శిష్యులతో ఉపవాసాల గురించి క్రీస్తుచెబుతూ "ఉపవాసం రోజున మిగతా రోజుల్లాగే ఆహారం వండుకోవాలి. దానిని యాచకులకీ, బీదవారికీ దానమివ్వాలి" అని సూచించారాయన. ఎంత గొప్ప ఆలోచన.

– డాక్టర్ ఎం. సుగుణరావు

ధర్మ సందేహం



గోత్రాలంటే ఏమిటి?

– హర్ష, గిద్దలూరు

ప్రతి వంశానికి మూలపురుషులుగా ఉన్న రుషుల పేరు మీద గోత్రం ఏర్పడుతుంది. నిజానికి గోత్రం అంటే గోవులకు రక్షణ కల్పిస్తూ కట్టివేసే చోటు. పూర్వకాలంలో ఒక కుటుంబానికి చెందిన వారి గోవులన్నింటినీ ఒకచోట కట్టివేసేవారు. ఆ కుటుంబానికి చెందిన రుషి పేరుతో ఆ ప్రాంతాన్ని పిలిచేవారు. అదే వారి గోత్రం అయింది. కాలక్రమంలో ఎవరు.. ఎక్కడ స్థిరపడ్డా ఒకే కుటుంబానికి చెందిన వారికి ఒకే గోత్రమని వ్యవహారంలోకి వచ్చింది.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

కథా ప్రవంతి

స్వయం కృషి

ఈ సృష్టిలో ఏ జీవీ శ్రమ పడకుండా జీవించలేదు. శ్రమ మనిషి వ్యక్తిత్వానికి పదును పెడుతుంది. కష్టం లేకుండా జీవించడం ప్రకృతి ధర్మానికి విరుద్ధం కూడా. అందుకే కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. శ్రమైక జీవనం వల్ల మనిషికి తృప్తి, ఆనందం కలుగుతాయి.

ఒక రోజు ఆచార్య నాగార్జునుడు తక్షశిలా నగర వీధుల్లో నడిచి వెళుతున్నాడు. ఒక యాచకుడు అతణ్ణి సమీపించి 'అయ్యా! ధర్మం' అని యాచించాడు. నాగార్జునుడు ఆ యాచకుడి వైపు చూసి 'నువ్వు నిరుపేదవా?' అని ప్రశ్నించాడు. 'నాకున్న ఆస్తులు ఈ పాత్ర, ఈ గోనె' అని సమాధానమిచ్చాడా యాచకుడు. నాగార్జునుడు ఆ రెండింటినీ అందుకుని అక్కడే వేలం వేశాడు. నిజానికి ఆ రెండు వస్తువులు దమ్మిడీ విలువ కూడా చేయవు. కానీ వేలం వేసేది ఆచార్య నాగార్జునుడు కాబట్టి ఈ రెండూ ఎనిమిది మొహరీలు పలికాయి. వాటిని ఆ యాచకుడి చేతిలో పోశాడు నాగార్జునుడు. 'నాయనా! నీ సామాన్లు అమ్మేశానని విచారించకు. అవి నీ సోమరితనాన్ని, మందబుద్ధిని తెలియజేస్తున్నాయి. అవి నీ దగ్గర ఉన్నంత కాలం నీకు జ్ఞానోదయం కాదు. ఈ డబ్బుతో ఓ గొడ్డలి కొనుక్కో. దాంతో అడవిలో కట్టెలు కొట్టు. వాటిని విక్రయించి ఆకలి బాధ తీర్చుకో. కష్ట పడితే మంచి ఫలితం వస్తుంది. రెండు వారాల తర్వాత మళ్లీ కనిపించు.' అన్నాడు.



ఆ యాచకుడు గొడ్డలి కొని, కట్టెలు కొట్టుకుని బతకడం ప్రారంభించాడు. రెండు వారాలు గడిచాయి. ఆ యాచకుడు నాగార్జునుని కలుసుకున్నాడు. సువాసనలు వెదజల్లే పూలు సమర్పించి నాగార్జునినికి నమస్కరించాడు. అప్పుడు నాగార్జునుడు 'నాయనా గుర్తించావా! కష్ట పడే జీవితంలో ఎంత సుఖం ఉంటుందో... ఈ భారతావని యాచకులకు ఆలవాలం కారాదు. నీలా ప్రతి ఒక్కరూ కష్టపడి జీవించాల'ని బోధించాడు.

శ్రమైక జీవనం వల్ల మనిషి ఉన్నతంగా ఆలోచిస్తాడు. అతడు దేశ ప్రగతికి మైలురాయి వంటివాడు. అతడికి సర్వత్రా విజయాలే లభిస్తాయి.

– విశ్వనాథ రమ

అన్నీ ఉన్నాయి...
కానీ ఏదో వెలితి...
అంతుబట్టని భయం...
చివరకు తలలో తెల్ల వెంట్రుక వచ్చినా ఆందోళనే..
ప్రస్తుతాన్ని ఆస్వాదించగలిగితే..
వాస్తవాన్ని అంగీకరించగలిగితే..
భయాలేవీ దరి చేరవు.
ఆందోళనలు లేని మనసు అద్భుతాలు చేయగలిగే శక్తిని సంతరించుకుంటుంది.
అందుకే ఈ జీవన యాత్రలో నావికుడిగా.. నీ పాత్ర అమూల్యమైనది.

> **నిష్క్రియాపరత్వం అన్నింటి కన్నా ప్రమాదకరమైనది. దానిని వదిలి జీవితేచ్ఛను నిర్వర్తించాలి. నీ జన్మను సార్థకం చేసుకోవాలి. ఆయువు స్వల్పమైనది. జీవితం చాలా చిన్నది. మనిషిగా జన్మించినందుకు మానవత్వ పరిమాళాల్ని వెదజల్లాలి**
>
> **- కేనోపనిషత్తు**

అంగీకరించు అన్నిటినీ మించు!

ఎవరైనా ఉత్సాహంగా లేరు అంటే వారి మదిలో ఏదో ఆందోళన ఉందని అర్థం. మనసులో అలజడికి తొలి కారణం భయం. ప్రతి ఒక్కరూ అన్ని వ్యవహారాలు తమకు ఇష్టమైన రీతిలో చక్కబడాలని కోరుకుంటారు. అందుకు విరుద్ధంగా జరిగితే ఆందోళన మొదలవుతుంది. దీనిని అధిగమించి ఫలితం ఎలాంటిదైనా స్వీకరించగల మనస్తత్వాన్ని అలవర్చుకుంటే.. బతుకు దారిలో భయానికి తావుండదు. ఆ భయాన్ని అదుపు చేయగల శక్తి మనసుకే ఉంది. జీవితానికి స్పష్టమైన లక్ష్యం, నిర్దిష్టమైన ఉద్దేశం ఉన్నప్పుడు ఆ భయం తొలగి.. జీవితం సంతోషప్రదం అవుతుంది. లక్ష్యం దిశగా మన ప్రయాణం ముందుకు సాగుతుంది.

జీవితం ఓ ఆట

మనిషి ఒకసారి పోగొట్టుకుంటే, తిరిగి పొందలేని విషయాలు మూడు. అవి.. నోటి నుంచి వచ్చిన మాట, చేజార్చుకున్న అవకాశం, కరిగిపోయిన కాలం. వ్యక్తి పురోగమనానికి అడ్డువచ్చేది ఏంటో తెలుసా? సామర్థ్యం, స్తోమత లేకపోవడం కాదు. ఇక నాకు ఏ అవకాశం రాదు... వేరే దారిలేదు.. నా బతుకు ఇంతే! అనే నిర్ణయానికి రావడమే! ఆటల్లోనైనా గెలుపొందాలంటే.. కేవలం శారీరక దారుఢ్యం ఉంటే సరిపోదు. పరుగు పందెంలో పాల్గొనే క్రీడాకారుడు 'పరిగెడుతున్నప్పుడు నేను ఓడిపోతేనేమో' అని ఒక్క క్షణం భావించినా అతనిక పరిగెత్తలేడు. అందుకే.. పోటీ పడుతున్నప్పుడు, తర్ఫీదు పొందుతున్నప్పుడు కూడా ఆ క్రీడాకారుడు తనపై అచంచలమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఏర్పరుచుకోవాలి. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి. ఇది జీవితమనే ఆటకు కూడా అక్షరాలా వర్తిస్తుంది. గతమంతా గడిచిపోయిన కాలం. భవిష్యత్తు అంతుచిక్కని శేష ప్రశ్న. వర్తమానం దేవుడిచ్చిన వరం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

సంపద, కీర్తి, అధికారం.. ఇవన్నీ కొంతవరకు సంతృప్తినిస్తాయి. వీటన్నింటికీ మించి ఇంకా ఏదో కావాలని మనసు ఏదో ఒక క్షణంలో ఉవ్విళ్లూరుతుంది. లౌకికమైన కోరికలు నెరవేర్చుకోవడమే జీవితం కాదు. మన అంతరంగంలో ఏదో దశలో మథనం మొదలవుతుంది. అన్నీ ఉన్నాయి... కానీ మానసిక పరితృప్తిలేదు. సరిగ్గా మనకు అప్పుడు ఆధ్యాత్మిక చింతన దారి చూపుతుంది. వివేక చూడామణిలో ఆది శంకరులు అదే చెప్పారు. మానవ జన్మ శ్రేష్ఠమైనది. ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. ముక్తిని పొందేందుకు యోగ్యత సాధించాలి. మహత్తరమైన ఆశయం కోసం నిరంతర అన్వేషణ కొనసాగాలని ప్రబోధించారు. 'ఇయంతే యజ్ఞియా తనూః' అని యజుర్వేదం పేర్కొంది. ఈ జీవితం ఈశ్వర సాక్షాత్కారం కోసం లభించింది. దీనిని వ్యర్థం చేసుకోకూడదని దీని అర్థం. ఆ ఈశ్వరుడు ఎక్కడో లేదు. మన మనోమందిరాన దివ్యజ్ఞాన జ్యోతిలా ప్రకాశిస్తున్నాడు. ఆ దీపకాంతి వెలుగులో చైతన్య స్ఫోరకంగా మనల్ని మనం ఉద్ధరించుకోవాలి. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి మనసును తీసుకెళ్లకపోతే జీవితంలో ఎప్పుడూ ఆనందాన్ని పొందలేం.

వర్తమానం ఓ వరం...

మన మనోస్థితిలో మార్పు రావాలి. జీవితంలో మన దగ్గర నుంచి విడదీయరాని సంపద ఏమిటి? అదే వర్తమానం... అది ముంగిట ఉన్న షడ్రసోపేతమైన భోజనం లాంటిది. ఆ మాధుర్యాన్ని ఆస్వాదించాలి. సద్వినియోగం చేసుకోవాలి. అయితే మన ఆలోచనలన్నీ గడిచిపోయిన కాలం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. భవిష్యత్తు సంబంధించిన భయాల వెంట పరుగులు పెడుతున్నాయి. ఈ సమయంలో ఆధ్యాత్మిక పథం మనకు మంచి మార్గాలను చూపుతుంది. యోగ, ఆత్మ సాధనల వల్ల సంయమనం, స్థితప్రజ్ఞత చేకూరతాయి. ఫలితాన్ని యథాతథంగా స్వీకరించే సమున్నత స్థితి లభిస్తుంది. ఆధ్యాత్మిక ధోరణి అనేది వయసు మీద పడ్డాక, వృద్ధాప్యంలో ఆచరించే అంశం కాదు. అది నవనవోన్మేషం, నిత్యనూతనం. దివ్యతమ మార్గాన్ని ఆ చింతన అందిస్తుంది. సూక్ష్మమైన, సంకుచితమైన దృష్టికోణం నుంచి.. స్థూలమైన, విశాలమైన ఆధ్యాత్మిక భావజాలం వైపు మన మనసును మళ్లించాలి. ప్రగతి శీలమైన జీవన దృష్టివైపు మనం పురోగమించినప్పుడు మన ఉనికి కూడా మారిపోతుంది. చుట్టూ ఉన్న ప్రపంచం, వ్యక్తుల విషయంలో మన దృక్పథం మారాలి. సానుకూలత సర్వత్రా అలవర్చుకోవాలి.

ధర్మాచరణ అనే మాటకు విస్తృతార్థం ఉంది. నీతి, న్యాయం, దయ, సౌభ్రాతృత్వం, సహనం వంటి అంశాలతో జీవితాన్ని మేళవించి ఆంతరంగికంగా, బాహ్యంగా ధర్మంతో మమేకం కావడం ఆధ్యాత్మిక సాధనలో ముఖ్యాంశం. పర్వతారోహకులు, పర్వత పాదపీఠం నుంచి వివిధ మార్గాలలో ఓర్పుగా, నేర్పుగా వివిధ ఉపకరణాల సహాయంతో ముందుకు సాగుతూ పర్వతాగ్రానికి చేరుకుంటారు. లక్ష్యాన్ని సాధిస్తారు. ఆధ్యాత్మిక సాధన కూడా అలాంటిదే. మతాలేవైనా సరే, మానవీయత, సన్మార్గం వైపు ప్రయాణించాలని నిర్దేశించాయి. తనని తాను, హృద్యమైన శిల్పంలా తీర్చిదిద్దుకోవడానికి ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మిక ధోరణి ఉపకరిస్తుంది. మృత్యువు ఎప్పుడు.. ఎవరికి ఏ విధంగా ముంచుకొస్తుందో తెలియదు. అందుకే సత్కర్మలు చేయడానికి తొందరపడాలి. జీవితం ఎక్కుపెట్టిన బాణం లాంటిది. ఆ బాణానికి లక్ష్యం ఉండాలి. గురి తప్పకూడదు. కర్మయోగుల్లా నిరంతరం ప్రజ్వరిల్లుతూ.. సాఫల్యం సాధించాలి.

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్



కైజెన్ సూత్రం

జపనీస్ భాషలో కైజెన్ అంటే నిరంతరం, ఎల్లప్పుడూ అని అర్థం. మనం 'నమస్తే' అని అభివాదం చేస్తుంటాం. కానీ, జపనీయులు కలుసుకున్నప్పుడు 'జీవితం అనే నదికి విజయోస్తు' అని చెప్పుకుంటారు. నది లక్షణం నిరంతరం ముందుకు సాగడం. నది అంతిమ గమ్యం సముద్రం. అలా ప్రతి వ్యక్తీ సమున్నతమైన విశాలమైన లక్ష్యం వైపు పురోగమించాలి. జీవితంలో అతి ముఖ్యమైన విషయాలు.. అనవసరమైన అంశాల చెప్పుచేతల్లో ఉండరాదు. కొత్త ఆలోచనల వైపు పరుగులు తీస్తూ.. స్వయం ఆధిపత్యం సాధించాలి. అలా జరగకపోతే దట్టంగా అలుముకున్న మేఘాల మధ్యలో నుంచి అనంత ఆకాశాన్ని దర్శించడం ఎంత దుర్లభమో.. మన జీవన దృశ్యం అంతే క్లిష్టమవుతుంది. ఎవరికైనా సరే స్వయం శక్తి ధనుస్సు అయితే... పట్టుదల బాణంలాంటిది. రేపటి గురించి ఆలోచిస్తూ.. నేటిని మర్చిపోవడం అవివేకం. ఎప్పుడైనా సరే.. విజేతలు ప్రణాళికలు తయారు చేస్తారు. అదే పరాజితులైతే క్షమాపణల పరంపర కొనసాగిస్తారు. నిన్నటి గురించి సమీక్ష చేసుకుంటూ, నేటిని ఆస్వాదిస్తూ, రేపటిని ప్రణాళికయుతంగా మల్చుకోవడమే జీవన గమనంలో కాలక్రమణిక.

జీవితంలో అపజయాల్ని చవిచూసిన వారిని సైతం ప్రపంచం క్షమిస్తుంది. కానీ, జీవితాన్ని ఉద్ధరించుకోవడనికి అవకాశం లభించినా.. అవివేకంతో సదవకాశాలను జారవిడుచుకున్న వారిని ఈ ప్రపంచం క్షమించదు. అలాంటి వారు, ఉరవడిలో కొట్టుకుపోయే గడ్డిపోచలా, జీవన ప్రవాహంలో దారీతెన్నూ లేకుండా అగమ్యగోచరం అవుతారు. మనిషి శక్తి అనంతం, అపారం. ఆ శక్తిని బహిర్గతం చేసుకొని.. లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి. మన సమయాన్ని భగవంతుడు ప్రసాదించిన శక్తిని సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక జీవన విధానంగా అవలంబించాలి.

ఈనాడు సినిమా

శిక్షణ తీసుకుంటారా?


రామ్ చరణ్


ఎన్టీఆర్

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి పూర్వ నిర్మాణ పనులకి ఎంతో ప్రాధాన్యమిస్తారు. సినిమా మొదలు పెట్టడానికి ముందే, నటీనటులతో పాటు సాంకేతిక బృందాన్ని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తారు. తదుపరి చిత్రం కోసం కూడా ఆయన అదే తరహాలో సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా రాజమౌళి ఓ చిత్రం తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఒక క్రీడ నేపథ్యంలో సాగే కథతోనే ఆ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్టు సమాచారం. ఆ మేరకు కథానాయకులిద్దరికీ కూడా ఆ క్రీడకి సంబంధించిన శిక్షణ ఇప్పించబోతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రామ్ చరణ్, ఎన్టీఆర్ కొత్త చిత్రాలపై దృష్టిపెట్టారు. అవి చివరి దశకు చేరుకొన్న వెంటనే రాజమౌళి చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు.

భలే వ్యాపారం : రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సంబంధించి అప్పుడే వ్యాపారం మొదలైపోయింది. హిందీ శాటిలైట్ హక్కులు రూ.22 కోట్లకి అమ్ముడైనట్టు సమాచారం. రామ్‌చరణ్‌కి హిందీలో మంచి గుర్తింపు ఉండటం, బోయపాటి శ్రీను శైలి కూడా అక్కడి మాస్ ప్రేక్షకులకి బాగా నచ్చుతుండటంతో శాటిలైట్ హక్కులు రికార్డు స్థాయి ధరకు అమ్ముడైనట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో హిందీ నటుడు వివేక్ ఒబెరాయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. దాంతో చిత్రంపై హిందీ శాటిలైట్ మార్కెట్ వర్గాలు ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శించి హక్కుల కోసం పోటీపడ్డాయి.

అలా చేస్తే మనం వెనకే


తమన్నా

"ఒకరిని చూసి 'నేనూ ఇలాంటి పాత్రల్ని చేయాల'ని ఎప్పుడూ అనుకోలేదు. నేను చేసిన తప్పొప్పులే నాకు దారిని చూపించాయి. అవే అందరికంటే భిన్నంగా ఆలోచించేలా చేశాయి" అంటోంది తమన్నా. వాణిజ్య ప్రధానమైన చిత్రాలతోనూ నటిగా తనని తాను నిరూపించుకొన్న కథానాయిక ఆమె. ప్రస్తుతం కల్యాణ్ రామ్‌తో కలిసి 'నా నువ్వే'లో నటిస్తోంది. "ఎదుటి వాళ్లని చూసి స్ఫూర్తి పొందడం ఎప్పుడూ తప్పు కాదు. కానీ విజయాల బాటలో ఉన్నారు కదా అని, మక్కీకి మక్కీ వాళ్లలాగే మనం కూడా ప్రయత్నించాలనుకొన్నప్పుడే సమస్యలొస్తాయి. ఒకరిని అనుసరించడం అలవాటు చేసుకొన్నామంటే మనం ఎప్పుడూ వాళ్ల వెనకే ఉంటామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందుకే నేను ఎదుటి వాళ్లు పడే శ్రమని, వాళ్ల తపననే స్ఫూర్తిగా తీసుకొని నా ప్రయాణానికి అన్వయించుకొంటా. నా అనుభవాలే నాకు బలంగా భావిస్తూ నిర్ణయాలు తీసుకొంటుంటా. అవే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయ"ని చెప్పింది తమన్నా.

క్రిష్... 'అహం బ్రహ్మాస్మి'


క్రిష్

ప్రముఖ దర్శకుడు క్రిష్ 'అహం బ్రహ్మాస్మి' పేరుతో ఓ చిత్రం తెరకెక్కించబోతున్నారు. కొత్త రకమైన కథతో రూపొందనున్న ఆ చిత్రంలో ఒక స్టార్ కథానాయకుడు నటించబోతున్నారు. బాలకృష్ణ వందో చిత్రం 'గౌతమీపుత్ర శాతకర్ణి' తెరకెక్కించి విజయాన్ని సొంతం చేసుకొన్న క్రిష్, ఆ తర్వాత హిందీలో 'మణికర్ణిక' మొదలుపెట్టారు. కంగనరనౌత్ ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న ఆ చిత్రం సెట్స్‌పై ఉండగానే, క్రిష్ తన తదుపరి తెలుగు చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనుల్ని ఆరంభించారు. ఓ అగ్ర కథానాయకుడితో ప్రస్తుతం కథకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. సాయిబాబు జాగర్లమూడి, రాజీవ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మించనున్న 'అహం బ్రహ్మాస్మి' అత్యున్నత సాంకేతిక హంగులతో తెరకెక్కనుంది. ఆగస్టులో చిత్రీకరణ ప్రారంభమయ్యే ఈ సినిమాకి సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

గ.. ఘ.. మేఘ


నితిన్, మేఘ ఆకాష్


నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. మేఘ ఆకాష్ కథానాయిక. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. సుధాకర్‌రెడ్డి నిర్మాత. టీజర్‌ని విడుదల చేశారు. 24వ తేదీన కథానాయిక పేరుతో సాగే 'గ...ఘ... మేఘ' అనే గీతాన్ని విడుదల చేయబోతున్నారు. ఆ విషయాన్ని నితిన్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. వినోదాత్మక ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ సమకూర్చగా, తమన్ స్వరాలు అందించారు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

గీతోపదేశం

ఆత్మయే నిత్యమూ
జీవితం సత్యమూ
చేతలే నిలుచురా
చిరకాలం
బతికిననాడు బాసటగా
పోయిననాడు ఊరటగా
అభిమానం అనురాగం
చాటేదీ ఆ నలుగురూ

గీతం: ఒక్కడై రావడం...
చిత్రం: ఆనలుగురు
రచన: చైతన్య ప్రసాద్
- పంపినవారు:
వి.రామకృష్ణ, ఒంగోలు

గణిత శాస్త్రవేత్త కోసం రూ.10 కోట్ల సెట్


హృతిక్ రోషన్

ప్రముఖ గణిత శాస్త్రవేత్త ఆనంద్ కుమార్ జీవిత కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'సూపర్ 30'. ఆనంద్ కుమార్ పాత్రలో హృతిక్ రోషన్ నటిస్తున్నాడు. ఆనంద్ బిహార్‌కు చెందిన వ్యక్తి కావడంతో అక్కడ తెరకెక్కిస్తే సహజత్వానికి దగ్గరగా ఉంటుందని అనుకుంది చిత్రబృందం. కానీ వేసవిలో బిహార్‌లో చిత్రీకరణ అంటే కత్తి మీద సామే. అక్కడి వేడివాతావరణంలో షూటింగ్ చేయడం కష్టమవుతుందని ముంబయిలో ఓ భారీ సెట్‌ను వేయడానికి ఏర్పాట్లు చేస్తోంది చిత్రబృందం. సుమారు రూ.పది కోట్లతో ఈ సెట్ వేయనున్నారు. సినిమాలో ఎక్కువ భాగం ఇక్కడే తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వికాస్ భల్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

చిరంజీవి మెచ్చుకున్నారు!


రంజిత్ సోమి

"కథానాయకుడు చిరంజీవి మా సినిమా టీజర్ చూసి నాది ఫొటోజెనిక్ ఫేస్ అని మెచ్చుకున్నారు. సంగీత దర్శకుడు కీరవాణి సినిమాని చూసి నా నటన, సినిమా నచ్చాయని సందేశం పంపారు. వాళ్లిద్దరి ప్రశంసలు నాలో మరింత ఉత్సాహం నింపాయి" అన్నారు రంజిత్ సోమి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'జువ్వ'. పాలక్ లల్వాని కథానాయిక. త్రికోటి దర్శకత్వం వహించారు. డా.భరత్ సోమి నిర్మించారు. శుక్రవారం చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా కథానాయకుడు రంజిత్ సోమి బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

- "నేను నటించిన రెండో చిత్రమిది. తొలి చిత్రం 'నువ్వు నేను ఒకటవుదాం' నాకు నటుడిగా ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. దాంతో మా సొంత నిర్మాణ సంస్థలోనే నా రెండో చిత్రం చేశా. రచయిత రత్నం కథతో త్రికోటి చిత్రాన్ని చాలా బాగా తెరకెక్కించారు. యాక్షన్, ప్రేమ, హాస్యం... ఇలా అన్ని వాణిజ్యాంశాలు ఇందులో ఉన్నాయి. కీరవాణి సంగీతం చిత్రానికి ప్రధాన బలం".
- "ఇందులో నేను రానా అనే యువకుడిగా కనిపిస్తా. పోస్టర్‌పై ఒక అమ్మాయిని చూశాక అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నది తెరపైనే చూడాలి. దర్శకుడు త్రికోటి సినిమాని ఆసక్తికరంగా మలిచారు. మా అన్నయ్య భరత్ వైద్యుడు. ఆయన ఈ చిత్రం కోసం నిర్మాతగా మారారు. ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ప్రేమకథలతో పాటు, క్రీడల నేపథ్యంలో సాగే చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. ప్రస్తుతం ఓ కథ చర్చల దశలో ఉంది. బయటి సంస్థలోనే ఆ చిత్రం తెరకెక్కబోతోంది".

పంచ్ డైలాగ్

అమ్మోరు రాక్షసుణ్ని చంపినా..
రాముడు రావణాసురిణ్ని
చంపినా మనం చూసొచ్చామా..
చెడ్డోడొకడు చచ్చాడని పండుగ చేసుకున్నాం.

చిత్రం: కృష్ణం వందే జగద్గురుమ్
- పంపినవారు: కె.రామచంద్ర, కడప

తెరపై పాత్రలు... నా ప్రతిరూపాలు


విద్యా బాలన్

బాలీవుడ్‌లో ఇప్పుడు దాదాపు అందరు అగ్రకథానాయికలూ నాయికాప్రాధాన్య చిత్రాలు ఎంచుకునేందుకు ముందుకొస్తున్నారు. అయితే నాయికా ప్రాధాన్య చిత్రాల హవా అంతగా లేని రోజుల్లోనే దశాబ్దం కిందటే అలాంటి చిత్రాల్లో నటించే సాహసం చేసింది విద్యా బాలన్. 'పరిణీత' మొదలుకొని 'ఇష్కియా', 'నో ఒన్ కిల్డ్ జెస్సికా', 'డర్టీ పిక్చర్', 'కహానీ', 'బేగంజాన్' ఈమధ్యే వచ్చిన 'తుమ్హారీ సులు' తదితర చిత్రాల్లో తన అభినయంతో అదరగొట్టేసింది. అగ్ర కథానాయకుల చిత్రాలకు దీటుగా ప్రేక్షకులను మెప్పించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు, పురస్కారాలూ అందుకుంది. నాయికా ప్రాధాన్య చిత్రాలను ఎంచుకోవడంలోనూ, వాటిలో తన పాత్రలను పండించడంలోనూ విద్యా ప్రత్యేకత సృష్టించుకుంది. దీని వెనుక ఉన్న రహస్యమేంటని ఆ భామని అడిగితే తన వ్యక్తిత్వానికి దగ్గరగా ఉండే పాత్రలను ఎంచుకోవడమే అంటోంది. "నేను చేసే ప్రతి చిత్రం, పాత్రా ఎంతో కొంత నా వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటాయి. తెరపై నేను నటించే నాయిక పాత్రలు తమ మనసు చెప్పింది వింటాయి. నచ్చిన మార్గాన్నే ఎంచుకుంటాయి. ఓ రకంగా అవి నాకు ప్రతిరూపాల"ని చెప్పింది విద్యా.

అవార్డు షోలో అల్లరే అల్లరి

విడుదలకు సిద్ధం

'వెల్‌కమ్ టు న్యూయార్క్'



బాలీవుడ్‌లో మల్టీస్టారర్ చిత్రాలన్నవి సర్వసాధారణమే. అయితే ఇప్పుడు రాబోతున్న ఓ మల్టీస్టారర్ మాత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి సిద్ధమవుతోంది. ఎందుకంటే అరడజను మంది బాలీవుడ్ ప్రముఖులు ఇందులో కీలక పాత్రల్లో నటించగా మరో డజను మంది అతిథి పాత్రల్లో అలరించనున్నారు. ఇండియాలోనే తొలి త్రీడీ కామెడీ చిత్రంగా తెరకెక్కిన ఆ సినిమానే 'వెల్‌కమ్ టు న్యూయార్క్'. 'ఈనాడు', 'బిల్లా 2' చిత్రాల దర్శకుడు చక్రి తోలేటి తెరకెక్కించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఆ చిత్ర విశేషాలివీ.

'వెల్‌కమ్ టు న్యూయార్క్'లో సోనాక్షి సిన్హా, దిల్జిత్ దొసాంజ్, రితేష్ దేశ్‌ముఖ్, లారా దత్తా, కరణ్ జోహార్, బొమన్ ఇరానీ తెరపై నవ్వులు పంచనున్నారు. వీరికి తోడుగా సల్మాన్ ఖాన్, షాహిద్ కపూర్, రానా, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, ఆదిత్యరాయ్ కపూర్, టైగర్ ష్రాఫ్, సునీల్ షెట్టి, దిశా పటానీ, తాప్సీ, కృతి సనన్, ప్రీతి జింతా, నేహా ధూపియా తళుక్కున మెరిసి సందడిని రెట్టింపు చేయనున్నారు. కరణ్ జోహార్ ద్విపాత్రాభినయం చేయడం గమనార్హం. షారుఖ్ ఖాన్ కవలలుగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'కరణ్ అర్జున్' పేరుతో ఉన్న కరణ్, అర్జున్ అనే రెండు పాత్రల్లో ఆయన అలరించనున్నారు. ఇంతకు ముందు పలు చిత్రాల్లో నిజజీవిత పాత్రలో అతిథిగా కనిపించిన కరణ్ తొలిసారి పూర్తిస్థాయి పాత్రలో నటించడం విశేషం. న్యూయార్క్‌లో జరిగే బాలీవుడ్ అవార్డ్ షో నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది.

కథేంటి: సినిమా హీరోలా ఫీలయ్యే రికవరీ ఏజెంటు గబ్రు(దిల్జిత్ దొసాంజ్), ఫ్యాషన్ డిజైనర్ దించక్(సోనాక్షి)లకు న్యూయార్క్‌లో జరిగే బాలీవుడ్ అవార్డు షోలో పాల్గొనే అవకాశం వస్తుంది. ఆ షోకు రితేష్(రితేష్ దేశ్‌ముఖ్), కరణ్(కరణ్ జోహార్) యాంకరింగ్ చేస్తుంటారు. అచ్చం కరణ్ పోలికలతో ఉండే అర్జున్ డాన్ అవతారంలో పక్కా బాలీవుడ్ విలన్‌లా దాదాగిరి చేస్తుంటాడు. అయితే కరణ్‌ను కిడ్నాప్ చేసి అర్జున్ అతని స్థానంలో యాంకర్‌గా వస్తాడు. ఆ విషయం మధ్యలో తెలియడంతో గందరగోళం నెలకొంటుంది. ఇంతకీ అర్జున్ ఆ షోకు ఎవరికోసం వచ్చాడు? కరణ్‌ను కాపాడటానికి బాహుబలి(రానా) ఎందుకొచ్చాడు? అక్కడికొచ్చిన సెలబ్రిటీల పరిస్థితి చివరకు ఏమైందన్నది చిత్రంలో చూడాలి.

సత్య సందేశం


అక్షిత, సాత్విక్

సాత్విక్ ఈశ్వర్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. అక్షిత కథానాయిక. ప్రభాస్ దర్శకత్వం వహించారు. ఆయనే స్వరకర్త. మహేష్‌ఖన్నా నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో పాటల విజయోత్సవం జరిగింది. నిర్మాత మాట్లాడుతూ "అనాథల జీవితాల నేపథ్యంలో సాగే చిత్రమిది. ఒక మంచి సందేశాత్మక కథకి వినోదాన్ని జోడించి తెరకెక్కించారు దర్శకుడు. ప్రభాస్ దర్శకుడిగానూ, సంగీత దర్శకుడిగానూ చక్కటి పనితీరును కనబరిచాడు. పాటలకి మంచి స్పందన లభిస్తోంది. కథానాయకుడు సాత్విక్‌కి మంచి భవిష్యత్తు ఉంటుంది. అతని అభినయం చాలా బాగుంది. మార్చి 15న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథాబలమున్న చిత్రమిది. నిర్మాత అందించిన సహకారంతోనే ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకానాయికలతో పాటు, ఛాయాగ్రాహకుడు అడుసుమిల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సంత'లో ప్రేమకథ


సూర్య భరత్ , శ్రావ్యారావు

సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు జంటగా నటిస్తున్న చిత్రం 'సంత'. మట్టిమనుషుల ప్రేమకథ... అనేది ఉపశీర్షిక. నెల్లుట్ల ప్రవీణ్‌చందర్ దర్శకుడు. జైవర్ధన్ బోయెనేపల్లి నిర్మిస్తున్నారు. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. సంతతో ముడిపడిన ఈ కథని తెలంగాణలోని పలు అందమైన ప్రాంతాల్లో తెరకెక్కిస్తున్నాం. ఇందులో ప్రతి పాత్ర ఒక మంచి అనుభూతిని పంచుతుంది" అన్నారు. కిన్నెర, మధుమణి, తాగుబోతు రమేష్, రఘు కారుమంచి, జబర్దస్త్ ఫణి, ప్రసన్న, ఆర్.ఎస్.నందా, దుర్గేష్ తదితరులు నటిస్తున్నారు.

ఈనాడు

వసుంధర

గురువారం ఫిబ్రవరి 22, 2018 కరీంనగర్ 9

■ సుధ కష్టపడి పని చేస్తుంది. అవసరం అయితే అదనంగా ఎక్కువ గంటలు కూడా ఆఫీసులో ఉండిపోతుంది. ఉద్యోగినిగా అన్నీ మంచి లక్షణాలే కానీ ఆమె ఎవరికీ నచ్చదు. తోటి ఉద్యోగులెవరూ ఆమెతో సరిగ్గా మాట్లాడరు. తమలో కలుపుకోవడానికి ఇష్టపడరు.

■ నిర్మల లక్ష్యం సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడటం. అందుకే విదేశాలకెళ్లి మరీ ఉన్నత చదువులు చదివొచ్చింది. మాతృభూమి మీద మమకారంతో ఇక్కడే స్థిరపడింది. దూసుకుపోయే తత్వం. అలానే పనిచేస్తుంది కానీ.. సంస్థలో చేరి పదేళ్లవుతున్నా.. పదోన్నతి లేదు. జీతంలో, జీవితంలో ఇంక్రిమెంట్ లేదు.

■ రాగిణి క్యాంపస్ సెలక్షన్‌లోనే మేనేజర్ స్థాయి ఉద్యోగం సంపాదించింది. కానీ ఏళ్లు గడుస్తున్నా... అక్కడే ఉండిపోయింది తప్ప ఒక్క మెట్టు కూడా పైకి ఎక్కలేదు. ఐదేళ్లకే రాజీనామా చేసి మరోచోట చేరింది. ఇతర సంస్థల్లో చేరినా ఉద్యోగంలో నిలవలేకపోయింది. చివరకు ఇంటికే పరిమితమైంది.

- ఈ ముగ్గురి గురించి తెలిశాక ఎందుకిలా అనే సందేహం తలెత్తే ఉంటుంది. అన్నింటికీ ఒకటే కారణం.. భావోద్వేగాలను అదుపులో చేసుకోలేకపోవడమే. సుధకి కోపం ఎక్కువ. పని వాతావరణంలో ఎప్పుడూ అరుస్తూ.. కోపం ప్రదర్శిస్తుంటుంది. ఎవరినీ ఆప్యాయంగా పలకరించదు. నిర్మల ఎప్పుడూ ఎదుటి వారిలో లోపాలు వెతుకుతుంది. వాటి గురించి వారి మొహాన్నే ప్రస్తావిస్తుంది. అలా ఉద్యోగుల్ని ఎప్పుడు నొప్పించి ఫిర్యాదుల వరకూ వెళ్లేదాకా తెచ్చుకుంది. రాగిణి సున్నిత మనస్కురాలు. బాస్ కాస్త కళ్లు ఎర్రజేసినా కన్నీళ్లు రాలుస్తుంది. ఇంట్లో సమస్యల్ని సహోద్యోగుల దగ్గర ఏకరవు పెడుతుంది. సెలవులూ ఎక్కువే. అయితే...

కోపం... నవ్వూ... ఏడుపు...

ఏదీ అతి వద్దు!



మనుషులం అందునా మహిళలం అన్నాక భావోద్వేగాలు కాస్త ఎక్కువగానే ఉంటాయి కానీ.. దానికే ఉద్యోగపరంగా సమస్యలు ఎదుర్కోవాలా అంటే.. తప్పదు అంటారు కెరీర్ నిపుణులు. ఎందుకంటే...

మంచీ చెడులుంటాయి...

భావోద్వేగాలు రెండు రకాలు. సానుకూలం, ప్రతికూలం. సానుకూల ఉద్వేగాలు పని వాతావరణంలో ప్రదర్శించడం మంచిదే. అలాగని ఎక్కువగా నవ్వడం, జోకులు వేసి నవ్వించడం, అత్యుత్సాహం వంటివాటితో మనల్ని మనం మర్చిపోతాం. ఒక్కోసారి ఇతరుల్నీ ఇబ్బంది పెడతాం. అదే విధంగా ప్రతికూలంగా వచ్చే ఉద్వేగాల్లో... ప్రతి చిన్న విషయానికీ ఏడుపూ, గట్టిగా అరవడం, కోపం, అసహనం.. వంటివి వస్తాయి. ఉద్యోగికి విషయావగాహన, భావవ్యక్తీకరణ, దూసుకుపోయే తత్వం.. ఇలా ఎన్ని ప్రత్యేకతలున్నా... భావోద్వేగాలను అదుపు చేసుకోలేకపోతే అది బలహీనతే. మగవాళ్లతో పోలిస్తే మహిళకు ఎన్నో బాధ్యతలు. మరెన్నో సవాళ్లు. ఈ క్రమంలో ఎదురయ్యే ఒత్తిడి 'నేను బలహీనురాలిని' అనే భావనను తెస్తుంది. అదే క్రమంగా ఆత్మన్యూనతగా మారి భావోద్వేగాలు వ్యక్తం చేసేలా చేస్తుంది. కొందరిని పరిస్థితులు ఇలా మారిస్తే, మరికొందరికి స్వతహాగానే ఇలాంటి లక్షణాలుంటాయి. దీనికి వైద్యులు హార్మోన్ల ప్రభావం అంటారు కానీ.. ఏది ఎలా ఉన్నా.. సంస్థ యాజమాన్యాలు మాత్రం పదోన్నతి విషయంలో వృత్తిగత ప్రతిభతోపాటూ... వ్యక్తిగత ప్రవర్తననూ పరిగణనలోకి తీసుకుంటాయని గమనించాలి. నిద్ర లేచిన దగ్గర్నుంచీ ఎన్నో పనులు చేస్తూ... కొన్నాళ్లకు అన్నీ చేయలేక ఏ బాధ్యతా సరిగా నిర్వర్తించలేక నిర్లిప్తతంగా మారిపోవచ్చు. వ్యక్తిగత జీవితంలో ఆనందాన్ని అందిపుచ్చుకోలేక బలహీనమైపోతున్నామనే భావన వచ్చేస్తుంది. ఇవన్నీ భావోద్వేగాల ప్రదర్శనకు కారణమవుతాయి. అందుకే పనిచేసే చోట ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవడమే అసలైన పరిష్కారం అంటారు ఆర్గనైజేషనల్ సైకాలజిస్టు డాక్టర్ పి. జ్యోతి.

మనం మనలా ఉండాలి

◆ ఉద్యోగిని ఆఫీసు గుమ్మంలోనే ఉద్వేగాలను వదిలేసి కుర్చీలో కూర్చోవాలి. నచ్చని వ్యక్తులూ, నచ్చని విషయాల గురించి పదే పదే ఆలోచించడం వల్లా ఉద్వేగాలు మొదలై, పనిలో నాణ్యత తగ్గుతుంది. అలాంటి భావన కలిగినప్పుడు ఎందుకు నచ్చట్లేదు... అని ప్రశ్నించుకుని సమాధానం చెప్పుకోవాలి. అప్పుడే సానుకూలంగా ఆలోచించగలుగుతాం.

◆ ఏ విషయాన్నైనా తొంభైతొమ్మిదిశాతం సానుకూలంగా తీసుకోగలగాలి. పనిచేసే చోట ఎట్టిపరిస్థితుల్లోనూ సానుభూతి కోరుకోకూడదు. ఎప్పుడైతే బలహీనతలు మనం బయట పెట్టుకున్నామో అప్పుడే బలహీనులమవుతాం అని మర్చిపోకూడదు.

◆ మహిళగా పనిచేసే చోట...టీచర్, మెంటార్, కోచ్ తరహాలో వ్యవహరించాలి. హుందాగా ఉండాలి. కోపం, ఆవేశం, అసహనం వంటి వాటిని దూరం చేసుకునే ప్రయత్నం చేయాలి

◆ ఒక్కోసారి మహిళలు హార్మోన్ల అసమతుల్యతను ఎదుర్కొంటూ ఉంటారు. ఈ క్రమంలో తమని తామే తక్కువ చేసుకుంటారు. 'నేను ఏం పనీ చేయలేను' అనుకుంటే అక్కడే ఆగిపోతాం. ఆ భావాలను గమనించుకుంటూ ఎప్పటికప్పుడు రీఛార్జ్ చేసుకోవాలి. లేదంటే త్వరగా భావోద్వేగాలను ప్రదర్శించే ప్రమాదం ఉంటుంది.

◆ భావోద్వేగాలు అదుపు చేసుకోలేని వారు మల్టీటాస్కింగ్‌కి దూరంగా ఉండాలి. ఎక్కువ బాధ్యతలు మీద వేసుకోవద్దు. చిన్న చిన్న లక్ష్యాలను పెట్టుకుని అధిగమించుకుంటూ వెళ్లాలి.

◆ వ్యక్తిగత విషయాలూ, రహస్యాలూ, సమస్యల్నీ ఇతరులతో ఎట్టిపరిస్థితుల్లో పంచుకోవద్దు. అలా చేస్తే ఎవరైనా మనల్ని తక్కువ చేసి మాట్లాడితే కుంగిపోయే ప్రమాదం ఉంటుంది. ఇతరుల్లోని మంచీ చెడులను అంగీకరించాలి. ప్రతికూలతలు ఉన్నా వారిని వారిలానే చూడాలి.


పని భారం కాకూడదు...



భావోద్వేగాలను దాచుకోవడం చాలా కష్టం. కెమెరా ముందు మేం నిత్యం చేసేది అదే. వ్యక్తిగతం, వృత్తిగతంగా ఎన్ని సవాళ్లు ఉన్నప్పటికీ అవన్నీ కెమెరా వెనకే వదిలేయాలి. పాత్రను బట్టి కొత్త వ్యక్తిలా మారాలి. నిజానికి ఇది సవాలే. మన మీద మనకు స్వీయ నియంత్రణ ఉన్నప్పుడు సమస్యల్ని పక్కన పెట్టి.. ఇంకో వ్యక్తిని బయటకు తీయగలం. నేను అలా మారడానికి చాలా సమయం పట్టింది. అందుకే ఒత్తిళ్ల ప్రభావం నా మీద లేకుండా చూసుకుంటా. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టులు ఒప్పుకోను. అప్పుడప్పుడూ విరామం తీసుకుంటా. దీనివల్ల. ఒత్తిడి ప్రభావం ఉండదు. భావోద్వేగాలూ అదుపులో ఉంటాయి.

- రెజీనా, నటి

వారిపై ప్రత్యేక శ్రద్ధ...



సంస్థ అధినేతగా నా వద్ద పనిచేసే మహిళా ఉద్యోగినులని ఎప్పుడూ గమనిస్తుంటా. మగవారి ముందు తక్కువ కాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటా. వారికి వృత్తిగతం, వ్యక్తిగతంగా సమస్యలుంటే నాతో చెప్పుకొనే చొరవ ఇస్తా. ఇంటిల్లిపాదినీ కంటికి రెప్పలా కాపాడుకునే మహిళలు భావోద్వేగాల పరంగా బలహీనంగానే ఉంటారు. అలాంటి వారి పట్ల నేను ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటా. మరీ ఎక్కువగా ఉద్వేగాలను ప్రదర్శిస్తున్నారని తెలిస్తే కౌన్సెలింగ్ ఇస్తాను.

- రాణి పరుచూరి, డ్రీమ్‌టెక్కీస్‌సాఫ్ట్‌వేర్ ప్రయివేట్ లిమిటెడ్ అధినేత

– పద్మ వడ్డె

న్యాపీ దద్దుర్లు దూరమిలా!



బయటకు తీసుకెళ్తున్నప్పుడే కాదు... ఇంట్లోనూ పసిపిల్లలకు అప్పుడప్పుడూ న్యాపీలు వేయడం కొందరు అమ్మలు చేసేదే. దానివల్ల కొన్నిసార్లు చర్మం కందిపోయి.. ఎర్రగా మారి, దద్దుర్లు రావచ్చు. న్యాపీర్యాష్‌గా చెప్పుకొనే ఈ సమస్యను ఎలా తగ్గించుకోవాలంటే...

- సమస్య ఉన్నా సరే.. కొందరు న్యాపీలో పౌడరు చల్లి వేసేస్తుంటారు. దానివల్ల సమస్య తగ్గకపోగా పెరుగుతుంది. అందుకే ఆ ఎరుపు తగ్గనంతవరకూ లోదుస్తులు కూడా వేయకపోవడం మంచిది.
- ఆ భాగానికి కాస్త కొబ్బరి నూనె రాస్తే... హాయిగా ఉంటుంది. దానివల్ల సమస్య పెరగకుండా ఉంటుంది కూడా. అందుకే స్నానానికి ముందు... ఒళ్లంతా మర్దన చేయడంతోపాటు న్యాపీర్యాష్ ఉన్న చోటా కాస్త నూనె రాయాలి. ఓ అరగంటాగి స్నానం చేయించాలి. దీనివల్ల లేత చర్మం కమిలిపోకుండా, ఎర్రగా మారకుండా ఉంటుంది.
- మొక్కజొన్న పిండిని దద్దుర్లు ఉన్న చోట చల్లాలి. ఇలా చేయడం వల్ల ఆ భాగం పొడిగా మారుతుంది. పైగా సమస్య పెరగకుండా కూడా ఉంటుంది. చర్మానికి కాస్త కలబంద గుజ్జు రాసినా కూడా మంచిదే.
- నీళ్లు, ఆలివ్ నూనె సమపాళ్లలో తీసుకుని... చర్మం ఎర్రగా మారి, దద్దుర్లున్న చోట నెమ్మదిగా రాయాలి. ఆలివ్‌నూనె ఎరుపును తగ్గించి నొప్పిని అదుపులోకి తెస్తుంది.
- ఈ సమస్య ఉన్నప్పుడు వెట్‌వైప్స్ వాడకూడదు. వాటిలోని రసాయనాలు సమస్యను ఇంకా పెంచొచ్చు. అందుకే నీళ్లతో శుభ్రం చేయాలి లేదంటే మెత్తని వస్త్రంతో తుడవడం మంచిది.

email: vasundhara @eenadu.net

అందానికి ఆలూపూత!



ముఖానికి ఎన్ని రకాల సౌందర్యోత్పత్తులు వాడినా... అప్పుడప్పుడూ ఇంట్లో దొరికే పదార్థాలనూ వాడాలి. దానివల్ల సహజ మేని కాంతులు సొంతమవుతాయి.

తేనె: వారానికోసారి తేనెతో ముఖం, మెడ, చేతుల్ని మర్దన చేసుకోవాలి. పావుగంటయ్యాక కడిగేసుకుంటే ముఖం తాజాగా మారుతుంది. చర్మానికీ తేమ అంది మెరుస్తుంది.

గులాబీనీళ్లు: అరచెంచా గులాబీనీళ్లకి నాలుగుచుక్కల నిమ్మరసం, రెండుచెంచాల గ్లిజరిన్ కలిపి.. అందులో దూది ఉండలు వేసి ముఖాన్ని తుడుచుకోవాలి. కాసేపయ్యాక కడిగేసుకుంటే సరిపోతుంది. చర్మం శుభ్రపడుతుంది.

బంగాళాదుంప రసం: మెత్తగా మిశ్రమంలా చేసిన బంగాళాదుంప గుజ్జు నుంచి రసం తీసి ముఖానికి రాసుకోవాలి. కాసేపయ్యాక కడిగేయాలి. ఈ రసంలో ఉండే విటమిన్ సి చర్మంపై నలుపును దూరం చేస్తుంది.

అరటిపండు: పండిన అరటిపండు గుజ్జు రెండు చెంచాలు, చెంచా చొప్పున గులాబీనీళ్లు, తేనె, పెరుగు తీసుకుని బాగా కలపాలి. దాన్ని ముఖానికీ, మెడకీ పూతలా వేసుకోవాలి. కాసేపయ్యాక చల్లటి నీళ్లతో కడిగేసుకుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ పూత వల్ల నలుపు తగ్గి, చర్మం మృదువుగా మారుతుంది.

క్యారెట్: దీన్నీ, బంగాళాదుంపని సమపాళ్లలో తీసుకుని ఉడికించాలి. తరవాత మెత్తగా చేసి అందులో కొద్దిగా పసుపూ, వంటసోడా, కాసిని గులాబీనీళ్లు చేర్చి పూతలా వేసుకోవాలి. ఇరవై నిమిషాలయ్యాక కడిగేయాలి. మేని మృదువుగా, అందంగా మెరిసి పోతుంది.

గది పెద్దగా లేదా...

మనింట్లో కొన్ని గదులు చిన్నగా, కిక్కిరిసినట్టుగా అనిపిస్తాయి. వాటి పరిమాణాన్ని ఎలాగో మార్చలేం. కానీ, కొన్ని చిట్కాలు పాటిస్తే మాత్రం గది పెద్దగా ఉన్నట్లు భ్రమింప చేయొచ్చు. ఇంతకీ అదెలాగంటే...!

రంగులు: గది గోడలకున్న రంగులోనే కిటికీలూ, గుమ్మాలకు పరదాలు ఎంచుకోవాలి. దానివల్ల ఎక్కువ స్థలం ఉన్నట్లుగా కనిపిస్తుంది. డోర్‌మ్యాట్లూ, కార్పెట్లూ, అలంకరణ వస్తువులు... ఇవన్నీ కూడా అలాంటి రంగుల మేళవింపులోనే ఎంచుకుంటే గది ఇరుగ్గా అనిపించదు. పూల డిజైన్ల కన్నా పొడవాటి గీతలున్న కార్పెట్లు నేలమీద పరిస్తే గది పెద్దగా ఉందనిపిస్తుంది. ఇక గోడల విషయానికొస్తే... లేత రంగులూ, లేదంటే తెలుపు రంగులో ఉండేలా చూసుకోవాలి. సీలింగ్‌కు మాత్రం ముదురు రంగులే మంచి ఎంపిక. అలా చేస్తే గది ఎత్తు ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది.

వెలుతురు: చీకటిగా ఉంటే గది కిక్కిరిసినట్లుగా ఉంటుంది. అందుకే గదిలో వీలైనంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. సహజ వెలుతురు పడే అవకాశం లేకపోతే గది పరిమాణాన్ని బట్టి బల్బులను అమర్చుకోవాలి. దాంతోపాటే పొడవాటి అద్దాలు ఉండేలా చూసుకుంటే వెలుతురు పడ్డప్పుడు గది పెద్దగా కనిపిస్తుంది.



ఫర్నిచర్: సోఫాలూ, కుర్చీలు నేలను తాకేలా కాకుండా కాస్త ఎత్తులో ఉన్నవాటిని ఎంపిక చేసుకోవాలి. వాటిని గోడకు ఆనించి పెట్టకుండా కాస్త స్థలం వదిలేయాలి. దీనివల్ల ఇరికించి పెట్టామన్న భావన రాకుండా ఉంటుంది. గది చిన్నగా ఉన్నప్పుడు కాస్త చిన్న సైజులో ఉండే గృహోపకరణాలు ఎంచుకుంటేనే సరిపోతాయనుకుంటాం. కానీ పెద్దగా ఉన్నవి ఎంచుకుంటేనే ఎక్కువ స్థలం ఉన్నట్లు కనిపిస్తుంది. అలాగే కలపతో చేసిన వాటిని కాకుండా గాజుతో చేసిన కుర్చీలూ, బల్లలు వాడితే ఎక్కువ స్థలం మిగిలి ఉన్నట్లు కనిపిస్తుంది.

సర్దుకోవడం: అల్మారాలూ, బుక్ కేస్‌లు... నేల నుంచి సీలింగ్ వరకూ ఉంటే గది కాస్త విశాలంగా కనిపిస్తుంది. చూడటానికీ ఆకర్షణీయంగానే కాకుండా, స్థలం కూడా కలిసొస్తుంది. అరలను కూడా దుస్తులతో, వస్తువులతో నింపేయకూడదు. కాస్త ఖాళీ స్థలం ఉండేట్లు చూసుకుంటే చూడటానికి గజిబిజిగా అనిపించదు. ఇప్పుడు మార్కెట్లో స్టోరేజ్ కంటైనర్లు దొరుకుతున్నాయి. వాటిలో కొన్ని వస్తువులు సర్దుకుంటే చూడటానికీ బాగుంటుంది.

నజరానా

అజీర్తి, కడుపు ఉబ్బరంతో బాధపడుతున్నప్పుడు... రెండు మూడు చెంచాల సోంపును కప్పు నీటిలో మరిగించి.. వడకట్టాలి. రోజులో మూడుసార్లు ఈ నీరు తీసుకుని చూడండి. ఉపశమనంగా ఉంటుంది.

ఆంక్షలు పెట్టినా ఆడుతున్నాం



సామాజిక కట్టుబాట్లు వారిలో క్రీడానైపుణ్యాన్ని దాచలేకపోయాయి. ఆచారవ్యవహారాలేవీ వారి అభివృద్ధికి ఆటంకాలుగా మారలేకపోయాయి. ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఒకటై క్రీడారంగం వైపు అడుగులేసి సత్తా చూపారు. తమ గ్రామం కట్టుబాట్లను తెంచుకుని, మైదానంలోకి వచ్చారు స్నేహ, మేఘన, నమ్రత. ఫుట్‌బాల్‌లో ముందుకు సాగుతూ... పలు అవార్డులూ అందుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఈ అక్క చెల్లెళ్ల విషయాలు వారి మాటల్లోనే.

నాన్న బామన్ రైమల ప్రభుత్వోద్యోగి. అమ్మ సూర్యకళ. మాది నిజామాబాద్. నాన్న షటిల్ బాగా ఆడతారు. మమ్మల్ని క్రీడాకారులను చేయాలని నాన్నకు ఆశ. అయితే మా బంధువులు దీనికి వ్యతిరేకం. మా నేపథ్యం ప్రకారం... ఆడపిల్లలు ఎక్కువగా చదువుకోకూడదు. పదో తరగతే ఎక్కువ. ఆ వెంటనే పెళ్లి చేసేస్తారు. అయితే నాన్న మాత్రం మాకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇప్పించాలనుకున్నారు. కానీ అమ్మ ఒప్పుకోలేదు. బంధువులకు సమాధానం చెప్పలేం కాబట్టి కుదరదంటే కుదరదు అంది.

జాతీయస్థాయి పోటీల్లో...

కానీ నాన్న ప్రోత్సాహంతో శిక్షణ తీసుకుంటూనే స్థానికంగా ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాం. క్రమేపీ జాతీయస్థాయి పోటీలకు వెళ్లగలిగాం. ముంబయి, పుణె, మణిపూర్, కర్ణాటక, జమ్మూ కశ్మీర్, సేలం, ఒడిశా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, పాండిచ్చేరి, గోవాలో నిర్వహించిన పోటీల్లో పాల్గొనడమే కాదు, గెలుపుతో తిరిగి వచ్చాం. అలాగే జమ్మూ కశ్మీర్‌లో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఊర్జా కప్ కైవసం చేసుకున్న మా నమ్రత ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైంది. ఇది ప్రధానమంత్రి కప్. దీంతోపాటు రూ.60వేల నగదు బహుమతి కూడా అందుకుంది. ఈ విజయమే మా ఇంట్లోనూ మార్పు తెచ్చింది. మమ్మల్ని చూశాక అమ్మ కూడా ప్రశంసించడం ప్రారంభించింది. ఇప్పటి వరకూ 15 సార్లు జాతీయ స్థాయి, 17 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాం. ఇదంతా ఓ వైపు చదువుకుంటూనే. ముగ్గురం బీటెక్ పూర్తిచేయబోతున్నాం.



- సీహెచ్.శ్రీను, ఈనాడు పాత్రికేయ పాఠశాల,

బంగారం వెండి

21న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,912	2,936
వెండి (గ్రా)	41.30	41.60



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,480	31,770	31,300	31,400	31,300	30,132	31,120	31,400	31,300	31,570
ఆర్నమెంట్	29,400	29,670	29,100	29,150	28,980	29,030	29,120	29,360	29,110	29,360
వెండి(కిలో)	39,380	39,665	39,700	40,000	39,400	39,800	38,700	38,900	39,900	39,900

జాలువారే జలపాతంలా...

జడను వేసి దానికి మరో జడ జతచేస్తే... ఇదేదో బాగుంది కదూ... ప్రత్యేక సందర్భాలకు ఇలాంటి కేశాలంకరణ ప్రయత్నిస్తే గనుక... అందానికి అందమే కాదు.. నలుగురిలోనూ కొత్తగా కనిపిస్తారు. అలాంటిదే ఇది. ఒకసారి వేసి చూడండి మరి.



సిగ సింగారం

1




ముందుగా ఎడమవైపున పై భాగంలో మూడు సన్నటి పాయలు తీసుకుని జడ వేసుకోవాలి. అయితే అల్లుతున్న ప్రతి పాయ నుంచీ.. ఒక్కో సన్న పాయను వదిలేసుకుంటూ రావాలి. ముప్పావువంతు వరకూ అల్లి చివరన రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.

2



ఆ జడను చిత్రంలో చూపించినట్లు కుడివైపు తేవాలి. మళ్లీ కుడివైపున ఇందాకటిలానే మూడు సన్నటి పాయల్ని తీసుకుని ఈ జడను దానికి కలపాలి. రెండు వరుసలు అల్లాక... దీనికి ఇందాక వదిలేసిన పాయలు ఉంటాయి కదా... ఒక్కోదాన్ని కలుపుతూ ఆ జడను పూర్తిచేయాలి. ఇలా చివరకు చేసి చివరన రబ్బరుబ్యాండు పెడితే చాలు.

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

సరదా జోకులు గానీ, హాస్యభరితమైన మాటలు గానీ వింటే మనకు విపరీతంగా నవ్వు వచ్చేస్తుంది. ఇలా పగలబడి నవ్వటాన్ని వర్ణించటానికి ఆంగ్లంలో ఒక వ్యక్తీకరణ ఉంది. అదేమిటో ఉదాహరణల సహాయంతో తెలుసుకుందాం!

crack up అంటే?

English language skills



ఎం. సురేశన్

Mallik: Your jokes make people around you crack up. They cannot control themselves (నీ జోకులు నీచుట్టూ ఉన్నవాళ్లను పగలబడి నవ్విస్తాయి. వాళ్లు తమను తాము ఆపుకోలేరు).

Janardan: By the way, did you go the doctor yesterday? What did he say? (అది సరే కానీ నిన్న నువ్వు డాక్టర్ దగ్గరికి వెళ్లావా? ఆయన ఏం చెప్పాడు?)

Mallik: I did. I explained my problem to him. He gave me a medicine. He told me that if I do not take the medicine continuously, Its effect would wear off after some time, he warned me (వెళ్లాను. నా సమస్యను ఆయనకు వివరించాను. నాకు ఆయన మందులిచ్చాడు. తరచూ మందు తీసుకోమన్నాడు. అయితే ఆయన హెచ్చరించాడు కూడా, దాని ప్రభావం కొంత కాలం తరువాత క్రమంగా తగ్గవచ్చని).

Janardan: How long did he advise you to take it? (ఆయన ఆ మందును ఎంత కాలం తీసుకోమని సలహా ఇచ్చాడు?)

Mallik: Till my ailment is cured (నా జబ్బు నయం అయ్యేంతవరకు).

Janardan: What did he say was the cause of your problem? (నీ సమస్యకు కారణమేమైనా చెప్పాడా?)

Mallik: He conducted a number of tests. With their help, he was able to zero in on the cause of the problem. He is very good at diagnosis (ఆయన చాలా పరీక్షలు నిర్వహించాడు. వాటి సాయంతో ఆయన సమస్యకు మూల కారణాన్ని కనుక్కున్నాడు. ఆయన రోగనిర్ధారణలో చాలా గొప్పవాడు).

Janardan: You are lucky in going to that doctor. I am sure you will soon be released of your trouble (ఆ డాక్టర్ దగ్గరికి వెళ్లడం నీ అదృష్టం. త్వరలోనే నీ సమస్య తీరిపోతుంది).

Now look at the following expressions from the above conversation:



1. Crack up = burst out into laughter / laugh uncontrollably (పగలబడి నవ్వడం)

Hanuman: Did you see the movie I went to yesterday? It is full of jokes (నిన్న నేను వెళ్లిన సినిమా నువ్వు చూశావా? అది పూర్తిగా హాస్యంతో నిండి ఉంది).

Lakshman: Yes I did. It made all the spectators crack up. They tickled every one uncontrollably (అవును. నేనూ చూశాను. అది ప్రేక్షకులందరినీ పగలబడి నవ్వించింది. ఆ జోకులు ప్రతివాళ్లనూ కట్టడి లేకుండా నవ్వించేసింది).

2. Wear off = Disappear after some time (కొంత కాలం తరువాత మాయమవడం/ ఫలితం కోల్పోవడం).

Venkatesh: Our boss's warnings are not at all effective. None cares about them (మన బాస్ హెచ్చరికలు అంత ఫలితాన్ని చూపేవి కావు. ఎవరూ వాటిని పట్టించుకోరు).

Sudheer: You are right. He is not at all serious about his warnings. That is the reason why their effect wears off (నువ్వు అనేది కరెక్టే. తన హెచ్చరికలను గురించి అంత గంభీరంగా ఉండడు. వాటి ప్రభావం లేకపోవడానికదీ కారణం).

3. Zero in on = Pin point something (దేన్నైనా కచ్చితంగా చూపించడం).

Jagannath: Have you studied the problem? What do you think? (నువ్వా సమస్యను పరిశీలించావా? ఏమనుకుంటున్నావు?)

Rathnasri: Yes, it took me three days to study the whole problem. But I am happy that I have been able to zero in on the cause of the problem. It is due to the officer's negligence (అవును, అది పరిశీలించడానికి మూడు రోజులు పట్టింది. అయితే నాకు సంతోషంగా ఉంది, ఆ సమస్యకు కారణమేంటో తెలుసుకున్నందుకు. మన అధికారి ఉపేక్ష వల్లే ఇదంతా).

చదువు



ఆరోగ్యం మనిషి జీవితంలో అత్యున్నత ప్రమాణం. నిత్యం ఆసుపత్రుల్లో లేదా చుట్టుపక్కల ఎన్నో ఆరోగ్య సంబంధ సమస్యలను మీరు చూస్తుంటారు. వాటి పరిష్కారానికి మీకేదైనా ఆలోచన వస్తే.. దాన్ని ఆచరణలోకి మార్చి.. మీతో స్టార్టప్‌లు పెట్టించి మిమ్మల్ని సరికొత్త పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్‌లో ఒక సెంటర్ ఉంది. ఇది ప్రస్తుతం మూడో బ్యాచ్‌కి నోటిఫికేషన్‌తో యువ పట్టభద్రులకు ఆహ్వానం పలుకుతోంది.

ఆరోగ్య రంగ ఆవిష్కరణలకు ఆహ్వానం

CfHE

అప్పుడే పుట్టిన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఏ క్షణం వారికి ఎలాంటి ఆరోగ్య సమస్య వస్తుందో తెలియదు. మరి రోజంతా జాగ్రత్తగా ఉండటం వీలవుతుందా? చిన్న పరికరంతో అనుక్షణం అప్రమత్తత సాధ్యమే అని ఓ యువతి నిరూపించింది.

పక్షవాతం వచ్చి చచ్చుబడిపోయిన అవయవాలకు మళ్లీ కదలిక తెప్పించే ఆలోచనను ఆచరణలో పెట్టి ఒక చక్కటి ఉపకరణాన్ని సిద్ధం చేస్తున్నాడో యువకుడు.

ఈ ఇద్దరే కాదు ఇంకా ఎందరో యువ పట్టభద్రుల ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చి వారిని ఆంత్రప్రెన్యూర్‌లుగా మారుస్తోంది హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (సీఎఫ్‌హెచ్‌ఈ). వీరికి ఆర్థిక చేయూతను ఫెలోషిప్‌తో మొదలుపెట్టి పరిశ్రమల ఏర్పాటు వరకు ప్రోత్సహిస్తోంది.

ఐఐటీ- బాంబే పూర్వ విద్యార్థులు రాజ్ మస్త్రూవాలా, అవినాష్‌ల మదిలో నుంచి ఈ సెంటర్ ఆవిర్భవించింది. యువతకు వచ్చే ఎన్నో ఆలోచనలకు అవసరమైన ఆర్థిక మద్దతు లేక వృథా అవుతున్నాయని గుర్తించిన వీరు తగిన వేదిక సిద్ధం చేయాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా ఐఐటీలను, ఇతర ప్రసిద్ధ సంస్థలను పరిశీలించి చివరకు హైదరాబాద్ ఐఐటీని ఎంచుకొని సీఎఫ్‌హెచ్‌ఈని ఏర్పాటు చేశారు.

హెల్త్‌కేర్ పరిష్కారాలు

వైద్యరంగంలో ఎదురవుతున్న ఎన్నో రకాల సమస్యలకు యువత సాయంతో పరిష్కారం అందించడమే లక్ష్యంగా సీఎఫ్‌హెచ్‌ఈని హైదరాబాద్ ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. యువ ఆవిష్కర్తల పరిశోధనలకు నిధులను ఏర్పాటు చేయడంతోపాటు, నిపుణుల తోడ్పాటును అందిస్తారు. 2016-17లో మొదటి బ్యాచ్ పూర్తయింది. ప్రస్తుతం రెండో బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు తాము గుర్తించిన సమస్యలకు పరిష్కారాన్ని అందించడంలో నిమగ్నమై ఉన్నారు. మూడో బ్యాచ్‌కి ఇప్పుడు ప్రకటన విడుదలైంది.

వివిధ దశల్లో పరీక్షలు

ప్రాథమిక సమాచారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్టార్టప్ అనుభవం ఉంటే క్లుప్తంగా ఆ వివరాలను కూడా పొందుపరచాలి. దరఖాస్తుల స్వీకరణ పూర్తికాగానే తొలిదశలో వీడియో రౌండ్ ఉంటుంది. ఇందులో ఆన్‌లైన్‌లో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారు. ఈ రౌండ్‌లో ఎంపికైనవారిని రెండు రోజులపాటు ఐఐటీ- హైదరాబాద్ ప్రాంగణంలో వివిధ దశల్లో పరీక్షిస్తారు. బృంద చర్చలు, మళ్లీ ముఖాముఖిలు ఉంటాయి. నిపుణులతో కూడిన కమిటీ తుది ఎంపికలు నిర్వహిస్తుంది.

నిపుణుల పర్యవేక్షణ

వడపోతల అనంతరం ఎంపికైన వారికి నెలకు రూ.50 వేలు ఫెలోషిప్ ఇస్తారు. హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. ఏడాదిపాటు ఉండి గుర్తించిన సమస్యలకు తగిన పరిష్కారంగా ఆవిష్కరణలు చేయవచ్చు. అవసరమైతే మరో ఏడాది కూడా ఆర్థిక సాయం అందిస్తారు. తాము ఆవిష్కరించిన సాధనానికి అవసరమైన మార్కెటింగ్ మెలకువలు కూడా నేర్పిస్తారు. ఐఐటీలోని అన్ని ప్రయోగశాలలను వీరు 24 గంటలూ వినియోగించుకోవచ్చు. బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగంలోని నిపుణులు వీరికి సూచనలు, సలహాలు అందిస్తారు.

వైద్యరంగానికి అవసరమైన ఆవిష్కరణలే లక్ష్యంగా ఉన్న సీఎఫ్‌హెచ్‌ఈ హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రి, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వంటి వాటితో కలిసి పనిచేస్తోంది. ఫెలోషిప్‌కి ఎంపికైన అభ్యర్థులు మొదటి మూడు నెలలు ఈ ఆసుపత్రుల్లోని వైద్యులు, ఇతర సిబ్బందితో కలిసి పని చేయాల్సి ఉంటుంది. శస్త్ర చికిత్సలు జరిగే తీరు, ఉపయోగిస్తున్న టెక్నాలజీ, ప్రధానంగా ఆపరేషన్ల సమయంలో జరుగుతున్న లోపాలను వీరు గుర్తిస్తారు. పరిశీలన సూక్ష్మస్థాయిలో జరుగుతుంది. ఈ విధంగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తారు. సమస్యలకు పరిష్కారాన్ని ఆవిష్కరణల రూపంలో సూచిస్తారు. తక్కువ ఖర్చుతో ఎక్కువమందికి ఉపయోగపడే పరికరాలను రూపొందిస్తారు.

నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యుడికి తెలియజేసే పరికరాన్ని ఈ సెంటర్ విద్యార్థిని ప్రత్యూష పొరెడ్డి ఆవిష్కరించారు. 'నియోకేర్' అంకుర సంస్థను నెలకొల్పి ఈ పరికరాన్ని మార్కెట్లోకి తీసుకురానున్నారు. అలాగే బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేసిన హబీబ్ అలీ మరో ఉపకరణాన్ని తయారు చేశారు. పక్షవాతంతో చచ్చుబడిపోయిన చేతులకు మళ్లీ జీవం పోసే విధంగా వ్యాయామాలు చేసేందుకు ఉపయోగపడే సాధనం అది. దీనికి 'ఆర్మ్ ఏబుల్' అని పేరుపెట్టారు. 'బీ ఏబుల్' అనే స్టార్టప్‌తో మార్కెట్లోకి రానున్నారు.

ఇలాంటి ఆవిష్కరణలన్నింటికీ అన్ని దశల్లోనూ అవసరమైన ప్రోత్సాహాన్ని సీఎఫ్‌హెచ్‌ఈ అందిస్తుంది. మరిన్ని వివరాల కోసం 9000021386 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

దరఖాస్తులకు చివరి తేదీ: 15 ఏప్రిల్, 2018

వెబ్‌సైట్: http://hc.iith.ac.in

e-mail: fhe@iith.ac.in

● ***రాజేందర్ సురకంటి,*** ఈనాడు, సంగారెడ్డి

ఆవిష్కరించాలనే తపనే తొలి అర్హత

వైద్యరంగంలో కీలక ఆవిష్కరణలను ప్రోత్సహించాలనేది ప్రధాన లక్ష్యం. సమాజం కోసం, వైద్య రంగానికి తమ వంతుగా ఏదైనా చేయాలనే తపన, ఆంత్రప్రెన్యూర్‌గా మారాలనే ఆకాంక్ష ఈ కేంద్రంలో అడుగుపెట్టేందుకు కావాల్సిన ప్రధాన అర్హతలు. కొత్తగా డిగ్రీలను అందుకున్న వారితోపాటు అప్పటికే ఏదైనా స్టార్టప్ అనుభవం ఉన్నవారికి మరింత ప్రాధాన్యం ఉంటుంది. సమస్యను గుర్తించడం నుంచి దానికి పరిష్కారం చూపే ఉత్పత్తిని మార్కెట్లో తెచ్చే వరకు ఈ కేంద్రం వారికి అన్ని విధాలుగా మద్దతుగా ఉంటుంది.

జుహీ అహ్మద్, సీఈవో, సీఎఫ్‌హెచ్‌ఈ



ఉత్సాహంతో మొదలు

వైద్యరంగంలో కొత్త ఆవిష్కరణలు చేయాలనే ఉత్సాహం మొదటి క్వాలిఫికేషన్. మేనేజ్‌మెంట్ స్టడీస్, బీటెక్, బీడీఎస్, ఎంబీబీఎస్, బీడిజైన్ తదితరాల్లో ఏదో ఒక కోర్సు చేసి ఉండటం కనీస విద్యార్హత. మెడికల్ ఫీల్డ్‌లో ఏదైనా స్టార్టప్‌ను ప్రారంభించిన వారు లేదా ఎవరితో అయినా కలిసి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఈ రంగంలో ఆవిష్కరణల కోసం పరిశ్రమించేందుకు పట్టుదల ఉన్నట్లు రుజువు చేసుకున్నా అవకాశం ఇస్తారు. ఏటా దరఖాస్తుల సంఖ్య పెరుగుతోందని సీఎఫ్‌హెచ్‌ఈ కో-హెడ్, బయోమెడికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ రేనూ జాన్ తెలిపారు. తాజా నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన చెప్పారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో కోరుకున్న కోర్సు

ఇంటర్ తర్వాత మనకు ఇష్టమైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కోరుకున్న కోర్సు చదువుకునే అవకాశం ఉంది. ఒకే పరీక్షతో పదకొండు కేంద్ర సంస్థల్లోకి ప్రవేశించవచ్చు. బీఎస్సీ, బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, బీఏ, ఇంటిగ్రేటెడ్ ఎంఏ, బీఎడ్, ఇంటిగ్రేటెడ్ బీఎడ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, లా, ఆర్ట్స్, సైన్స్, హ్యుమానిటీస్ ఇలా వందకు పైగా కోర్సుల్లో అడ్మిషన్‌కు వీలు కల్పిస్తోంది సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (సీయూ సెట్).



- వందకు పైగా కోర్సుల్లోకి ప్రవేశం
- సీయూ సెట్ ప్రకటన విడుదల

సాధారణంగా నచ్చిన కోర్సుల్లో చేరడానికి పలు సంస్థలకు దరఖాస్తు చేసుకోవాలి. చాలా పరీక్షలూ రాయాలి. దీనికి ఎక్కువ సమయంతోపాటు డబ్బు కూడా వెచ్చించాలి. కానీ ఇటీవలి కాలంలో ఏర్పడిన కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఒకే పరీక్షతో అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయి. అదే సీయూ సెట్. దీని ద్వారా 11 సంస్థల్లో నచ్చిన కోర్సుల్లో చేరిపోవచ్చు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, టీచింగ్, ఇంజినీరింగ్, లా, డిజైన్, ఎంఫిల్, పీహెచ్‌డీ...ఇలా ప్రతి విభాగంలోనూ ఈ విశ్వవిద్యాలయాలు కోర్సులు అందిస్తున్నాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష గొప్ప అవకాశం. సెంట్రల్ యూనివర్సిటీల్లో బోధన, ల్యాబ్, లైబ్రరీలు, వసతులు మెరుగ్గా ఉంటాయి. ఫీజు కూడా భరించగలిగే స్థాయిలోనే ఉంటుంది. కాబట్టి డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలనుకున్నవాళ్లు సీయూ సెట్ ప్రయత్నించవచ్చు. ఈ ఏడాది పరీక్షలకు రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది.

ప్రవేశం కల్పించే కేంద్రీయ విశ్వవిద్యాలయాలు: హరియాణ, జమ్మూ, జార్ఖండ్, కర్ణాటక, కశ్మీర్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, సౌత్ బిహార్, తమిళనాడులతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్- బెంగళూరు.

ప్రశ్నపత్రం ఇలా...

అభ్యర్థి ఏ కోర్సుకి, ఏ విభాగానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటుంది. పార్ట్-ఎలో లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, మ్యాథమేటికల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ స్కిల్స్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. పార్ట్-బిలో సంబంధిత అంశం (సబ్జెక్టు) నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మూడు నుంచి అయిదు వరకు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్ నుంచీ 25 ప్రశ్నల చొప్పున వస్తాయి. అభ్యర్థులు తమకు నచ్చిన 3 సెక్షన్లు ఎంచుకుని 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. కొన్ని ఇంటిగ్రేటెడ్ కోర్సులు/ ఎంబీఏ/ ఎల్‌ఎల్‌బీ లేదా మరేదైనా ఇతర కోర్సుల్లో ప్రవేశానికి వంద మార్కులకు ఒకే పేపర్ ఉండవచ్చు. ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్/ న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ స్కిల్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు. తప్పుగా గుర్తించిన ప్రతి జవాబుకు పావు మార్కు చొప్పున తగ్గిస్తారు.

డిగ్రీ విద్యార్థులకు...

డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ కింది కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, జాగ్రఫీ, జియో ఇన్‌ఫర్మేటిక్స్, జియాలజీ, అప్లైడ్ జియాలజీ, జీనోమిక్ సైన్స్, యానిమల్ సైన్స్, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ప్లాంట్ సైన్స్, న్యూట్రిషన్ బయాలజీ, బయో ఇన్‌ఫర్మేటిక్స్, కెమికల్ సైన్సెస్ (మెడిసినల్ కెమిస్ట్రీ), అప్లైడ్ కెమిస్ట్రీ, కంప్యుటేషనల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అట్మాస్ఫిరిక్ సైన్స్, ఎపిడమాలజీ అండ్ పబ్లిక్ హెల్త్, యోగా థెరపీ, డిజిటల్ సొసైటీ, సైకాలజీ, అప్లైడ్ సైకాలజీ మొదలైనవి.

ఎంఏ: ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, లింగ్విస్టిక్స్, హిందీ, హిస్టరీ, పెర్ఫామింగ్ ఆర్ట్స్, జాగ్రఫీ, సోషియాలజీ, సోషల్ వర్క్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, హ్యూమన్ రైట్స్ అండ్ కాన్ఫ్లిక్ట్స్ మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ స్టడీస్, కంపారిటివ్ రెలిజియన్, నేషనల్ సెక్యూరిటీ స్టడీస్, డిజిటల్ సొసైటీ, కస్టమరీ లా అండ్ ట్రైబల్ గవర్నెన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, సైకాలజీ తదితరాలు.

ఎంఫార్మ్: ఫార్మాస్యూటికల్ సైన్సెస్

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బీఎడ్: కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్.

ఇంకా ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపీహెచ్), ఎంఎల్ఐఎస్సీ, ఎంటెక్, ఎంపీఈడీ, బీఎడ్, ఎంఎడ్, ఎల్‌ఎల్ఎం, ఎంటీటీఎం, ఎంహెచ్ఎంసీటీ తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

పీజీ డిప్లొమా: కెమికల్ ల్యాబ్ టెక్నీషియన్, సైబర్ సెక్యూరిటీ, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

వీటితోపాటు ప్రతి సబ్జెక్టులోనూ ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

యూనివర్సిటీ, కోర్సులవారీ సీట్లు, సిలబస్ వివరాలు, మాదిరి ప్రశ్నపత్రాలు సీయూ సెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: మార్చి 26

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.

పరీక్ష ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.800, ఎస్సీ, ఎస్టీలకు రూ.350. దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.

పరీక్ష తేదీలు: ఏప్రిల్ 28, 29

ఫలితాలు: మే 25న ప్రకటిస్తారు.

వెబ్‌సైట్: https://cucetexam.in

ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులు

ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ), బీటెక్ (కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, సివిల్, ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ) హరియాణ సెంట్రల్ యూనివర్సిటీ అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఎడ్ కోర్సును తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఎడ్, ఇంటిగ్రేటెడ్ బీఏ బీఎడ్ కోర్సులను సౌత్ బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ అందిస్తున్నాయి.

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, లైఫ్ సైన్సెస్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బోటనీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, సైకాలజీ, జాగ్రఫీ, జియాలజీ, ఎకనామిక్స్

ఇంటిగ్రేటెడ్ ఎంఏ: ఇంగ్లిష్, ఎకనామిక్స్,

ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ బీఎస్సీ: టెక్స్టైల్స్, **బీఏ:** ఇంటర్నేషనల్ రిలేషన్స్.

బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ స్టడీస్: బయోమెడికల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రిటైల్ అండ్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

వైజాగ్ పోర్టులో మేనేజర్లు

పోస్టు-ఖాళీలు (ఒప్పంద ప్రాతిపదికన): చీఫ్ మేనేజర్-3, సీనియర్ మేనేజర్-4, మేనేజర్-3.

అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీతో పాటు సంబంధిత రంగంలో పని అనుభవం. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** 16.03.2018.

వెబ్‌సైట్: www.vizagport.com

ఐఐఆర్ఆర్‌లో రిసెర్చ్ ఫెలో

పోస్టు-ఖాళీలు (తాత్కాలిక ప్రాతిపదికన): ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్, యంగ్ ప్రొఫెషనల్, ఫీల్డ్/ ల్యాబ్ అసిస్టెంట్ తదితరాలు- 22.

అర్హతలు: పదోతరగతి, డిగ్రీ, పీజీ, నెట్ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 12 నుంచి 17, 21 **వేదిక:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్.

వెబ్‌సైట్: www.icarniirr.org

ఎస్వీపీ జాతీయ పోలీసు అకాడమీ

పోస్టు (దినసరి వేతనం ప్రాతిపదికన): డ్రైవర్.

అర్హత: తెలుగు/హిందీ భాషలు మాట్లాడగలిగి, డ్రైవింగ్ లైసెన్స్‌తో మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేది: 06.03.2018.

వేదిక: ఎస్వీఎన్‌పీఏ, ఎంటీ గ్యారేజ్, శివరాంపల్లి, హైదరాబాద్. **వెబ్‌సైట్:** www.svpnpa.gov.in

వాక్ - ఇన్స్

కేంద్రీయ విద్యాలయంలో టీచర్లు

పోస్టులు (ఒప్పంద ప్రాతిపదికన): పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, కంప్యూటర్/ ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, యోగా/ స్కిల్ టీచర్. **అర్హతలు:** ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణత.

ఇంటర్వ్యూ తేది: 27.02.2018.

వేదిక: కేంద్రీయ విద్యాలయం, ఎస్వీపీ ఎన్‌పీఏ, శివరాంపల్లి, హైదరాబాద్.

వెబ్‌సైట్: www.kvsvpnpaap.org

సీఆర్ఐడీఏ, హైదరాబాద్

పోస్టు-ఖాళీలు (తాత్కాలిక ప్రాతిపదికన): యంగ్ ప్రొఫెషనల్- 27, ఆఫీస్ అసిస్టెంట్- 1.

అర్హతలు: డిప్లొమా, బీఎస్సీ, బీవీఎస్సీ, బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 12, 13, 14. **వేదిక:** సీఆర్ఐడీఏ, సంతోష్‌నగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** www.crida.in

ప్రవేశాలు

ఎన్ఏఏఆర్ఎంలో పీజీ డిప్లొమా

కోర్సు: దూరవిద్యలో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్- టెక్నాలజీ మేజేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్.

అర్హత: డిగ్రీతోపాటు పని అనుభవం లేదా పీజీ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.

చివరితేదీ: 28.02.2018.

వెబ్‌సైట్: https://naarm.org.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

స్వచ్ఛత బాట.. అప్పుల మూట

- మరుగుదొడ్డి లేకుంటే పింఛను, బియ్యం ఆపేస్తాం
- కొన్నిచోట్ల అధికారుల హెచ్చరికలతో బడుగుజీవుల హైరానా
- వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్మాణం
- 10 నెల్లలో 13 లక్షల నిర్మాణాలు పూర్తి
- బిల్లులు ఇవ్వకుండా ముఖం చాటేస్తున్న అధికారులు
- బకాయిలు రూ.300 కోట్లపైనే

ఈనాడు- హైదరాబాద్

మరుగుదొడ్డి కట్టుకోవాల్సిందే.. లేదంటే రేషను బియ్యం రావు, పింఛను ఆపేస్తాం.. అని తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో కొన్ని చోట్ల క్షేత్రస్థాయి అధికారుల హెచ్చరికలు. దీంతో బడుగుజీవులు అప్పు చేసి మరీ మరుగుదొడ్లు కట్టుకుంటున్నారు. తీరా కట్టాక నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి సొమ్ము రావడం లేదని పలు గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారికి సకాలంలో సొమ్ము అందేలా చూడాల్సిన అధికారులు.. లక్ష్యాలు పూర్తిచేశామని నివేదికలు పంపుతున్నారే తప్ప బడుగుజీవుల ఘోషను పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకాన్ని పక్కనపెట్టి.. నిర్మాణ బాధ్యతలను పూర్తిగా స్వచ్ఛభారత్ మిషన్‌కే అప్పగించిన సమయంలో దాదాపు లక్ష మందికి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమై వారికి బిల్లులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. కొన్నిచోట్ల నిధులు వెళ్లినా గుత్తేదారు, క్షేత్రస్థాయి సిబ్బంది పంచుకు తింటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'ఈనాడు' ప్రతినిధి వివిధ జిల్లాల్లో పర్యటించినప్పుడు లబ్ధిదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

తెలంగాణలో 2018 డిసెంబరు నెలాఖరు నాటికి అన్ని గ్రామీణ కుటుంబాలు మరుగుదొడ్లు నిర్మించుకునేలా చేసి, రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరుబయలు మలవిసర్జన రహితంగా ప్రకటించాలనేది ప్రభుత్వ సంకల్పం. రాష్ట్రంలో 2012లో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే ప్రకారం మొత్తం 44.84 లక్షల గ్రామీణ కుటుంబాలున్నాయి. వాటిలో అప్పటికి 11.58 లక్షల కుటుంబాలకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తుండటంతో 2013–14 నుంచి 2016–17 వరకు మరో 9.60 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటయ్యాయి. వీటిలో 5 లక్షలు 2016–17లోనే నిర్మించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు 13 లక్షల మరుగుదొడ్లు నిర్మించినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామాల్లో ఇప్పుడు 36 లక్షల మరుగుదొడ్లు ఉండగా ఈ ఏడాది డిసెంబరు నాటికి మిగిలిన 8 లక్షలు కూడా నిర్మించాలన్నది ప్రభుత్వ సంకల్పం.

మరుగుదొడ్ల నిర్మాణ వేగానికి ఈ లెక్కే ఉదాహరణ

సంవత్సరం	నిర్మించిన మరుగుదొడ్లు
2014–15	85,798
2015–16	2,40,073
2016–17	5,20,029
2017–18(ఇప్పటికి)	13,19,751

ఉరుకులు పరుగులు

స్వచ్ఛభారత్ కార్యక్రమం 2014లో అమల్లోకి వచ్చింది. మొదట్లో పెద్దగా పట్టించుకోని అధికారులు.. గడువు సమీపిస్తుండటంతో ఇప్పుడు హైరానా పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధికారులు ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాల్సిందేనని.. లేకపోతే రేషన్ బియ్యం, పింఛను నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రతి మరుగుదొడ్డికి రూ.12 వేల చొప్పున వస్తుందని సర్పంచులు చెబుతుండటంతో వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ మరుగుదొడ్లు కట్టుకుంటున్నారు. చాలాచోట్ల సర్పంచులు, వార్డు సభ్యులు లేదా వారి సంబంధీకులే గుత్తేదార్లుగా మారి.. బడుగు జీవులు అప్పు తెచ్చిన డబ్బులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. పలుచోట్ల వీటిలో నాణ్యత లోపిస్తుంటే, మరికొన్ని చోట్ల అసంపూర్తిగా వదిలేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.12 వేలకు మరుగుదొడ్డి పూర్తికాదంటూ అదనంగా రూ.3వేల చొప్పున వసూలు చేసినవారూ ఉన్నారు. కొంత మంది మేస్త్రీని నియమించుకొని సొంతంగానూ కట్టించుకున్నారు. మరికొన్ని చోట్ల కలెక్టర్ల దృష్టికి రాకుండా నిర్మాణాలు పూర్తి చేయిస్తున్నారు.



అప్పుల ఊబిలో కూరుకుపోయామని వాపోతున్న సంగారెడ్డి జిల్లా నారాయణపల్లి గ్రామస్థులు



రింగులు వేయకుండానే నిర్మాణం పూర్తయిపోతుందని గుత్తేదారు చెబుతున్న మరుగుదొడ్డి

ఉపాధి హామీ సొమ్ము ఇచ్చేదెప్పుడు?

ఉపాధి హామీ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినవాటికి సంబంధించి బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 13 లక్షల మరుగుదొడ్లలో.. వ్యక్తిగతంగా నిర్మించుకొన్నవి మినహాయించి మిగతా వాటికి రూ.588 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని, ఇంతవరకు రూ.550 కోట్లు చెల్లించామని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంతో సహా పాత బకాయిలు మరో రూ.300 కోట్లు ఉన్నట్లు చెబుతున్నారు. స్వచ్ఛభారత్ ద్వారా నిధులు లబ్ధిదారులకు కాకుండా గ్రామ పారిశుద్ధ్య కమిటీలకు వెళుతుండటంతో పలుచోట్ల నిధుల మేతకు ఆస్కారం ఏర్పడుతోంది.

వలస వెళ్లిన చోట అప్పులు తెచ్చి..

ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వ్యక్తుల్లో చాలామందికి రేషన్ కార్డులు స్వగ్రామంలోనే ఉంటున్నాయి. మరుగుదొడ్డి నిర్మించుకోకపోతే రేషన్ కార్డు రద్దు చేస్తారేమోనన్న భయంతో.. వలస వెళ్లిన వారు కూడా అప్పులు తెచ్చి మరీ సొంతూరిలో మరుగుదొడ్లు నిర్మించుకుంటున్నారు.

- సంగారెడ్డి జిల్లా పెద్ద శంకరంపేట మండలం నారాయణపల్లిలో ప్రతి ఇంటి ముందు మరుగుదొడ్డి కనిపిస్తోంది. అక్కడ ఏ ఇంటికి వెళ్లినా డబ్బులు రాలేదన్న ఆవేదనే. సంగమ్మ అనే వృద్ధురాలి కొడుకు, కోడలు భవన నిర్మాణ పనులకు హైదరాబాద్ వలసపోయారు. సంగమ్మ ఒక్కర్తే నారాయణపల్లిలో ఉంటోంది. మరుగుదొడ్డి లేకుంటే పింఛను ఆపేస్తారేమోనన్న భయంతో ఆమె కుమారుడు ఆర్నెల్ల క్రితం రూ.3 లక్షకు అప్పు తెచ్చి కట్టించాడు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి సొమ్ము అందలేదు.
- వరంగల్ జిల్లా సంగం గలిచర్లలో బేరోజు నారాయణ ఏడాదిన్నర క్రితం మరుగుదొడ్డి నిర్మించుకున్నా నేటికీ సొమ్ము అందలేదు. ఇదే గ్రామానికి చెందిన సంపత్ తనకు రావాల్సిన రూ.12 వేల కోసం రెండు నెలల పాటు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. అప్పు తీర్చడానికి మళ్లీ సూరత్‌కు వలసపోయాడు.
- గలిచర్లలో మల్లికాంబది మరో రకం వ్యథ. ఈమె ఖాతాలో మూడేళ్ల క్రితం మరుగుదొడ్డి నిర్మాణం కోసం రూ.12 వేలు జమయ్యాయి. వాటికి మరో రూ.2 వేలు కలిపి గ్రామంలో గుత్తేదారుకు ఇస్తే అతను మరుగుదొడ్డి సగం కట్టి మధ్యలో వదిలేశాడు. మరుగుదొడ్డి పూర్తికాకపోతే రేషన్ ఇవ్వబోమన్న అధికారుల హెచ్చరికలతో మల్లికాంబ కలవరపడుతోంది.
- కొంత మంది మరుగుదొడ్డి పరిమాణాన్ని పెంచి స్నానాల గదిని కూడా నిర్మించుకొని దాదాపు రూ.20 వేల వరకు అప్పులపాలయ్యారు.
- భర్త అకాలమరణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనుమల్ల నిర్మల అప్పు చేసి మరుగుదొడ్డి కట్టించుకున్నారు. ఆమెకూ ఇంతవరకు సొమ్ము అందలేదు.
- నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాచ్యాతండాకు చెందిన లావూరి నీల మరుగుదొడ్డి నిర్మించుకుని రెండున్నరేళ్లు దాటినా పైసా రాలేదు.

ఆ లక్ష మందికి ఇక సొమ్ము రానట్టేనా?

రాష్ట్రంలో మరుగుదొడ్లు నిర్మించుకొన్నవారికి రూ.300 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల వరకు ఉపాధి హామీ పథకం కింద కూడా మరుగుదొడ్లు నిర్మించేవారు. కొద్ది నెలలుగా కేవలం స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మాత్రమే వాటిని చేపడుతున్నారు. ఇలా స్వచ్ఛభారత్‌కు మారే సమయంలో జిల్లాల్లో అధికారుల ఒత్తిడితో నిర్మాణాలు చేపట్టినవారికి ఇప్పుడు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వారికి ఉపాధి హామీ పథకం నిధులు ఇవ్వటానికి సాధ్యం కాని పరిస్థితి. స్వచ్ఛభారత్ ద్వారా ఇవ్వాలంటే ముందే మంజూరు చేయాలి. ఇలా దాదాపు లక్షకుపైగా మరుగుదొడ్లకు సాంకేతిక సమస్యలతో నిధులు రావడం అనుమానంగా మారినట్లు అధికారిక సమాచారం. వీరిలో ఎంత మందికి సొమ్ము అందుతుందో దైవాధీనమే.

రూ.18వేలు అప్పు చేశా



వార్డు సభ్యుడు చాలా రోజుల క్రితం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి సగం గోడల వరకు కట్టి నిలిపివేశాడు. రంధ్రాలన్నీ పూడుకుపోయాయి. ఎన్నిసార్లు అడిగినా పూర్తి చేయలేదు. చెల్లి పెళ్లి ఉండటంతో నేనే అప్పు చేసి పూర్తి చేసుకొన్నాను. రూ.18 వేలు ఖర్చయ్యింది.

– గుండు రాము, గలిచర్ల, వరంగల్ జిల్లా

ఏడాదిన్నరగా వస్తాయనే అంటున్నారు



ఏడాదిన్నర కాలంగా డబ్బులు వస్తాయనే చెబుతున్నారు. అప్పు చేసి మరుగుదొడ్డి కట్టాను. మాలాంటోళ్ల కష్టాల్ని అధికారులు పట్టించుకోవాలి.

– నారాయణ, సోమలక్ష్మి, వరంగల్ జిల్లా

వడ్డీ పెరిగిపోతోంది



మరుగుదొడ్డి కట్టినా పైసలు రావటం లేదు. మరోపక్క వడ్డీ పెరిగిపోతోంది. ఇంత సొమ్ము ఎలా కట్టాలో తెలియడం లేదు.

– సంగమ్మ, నారాయణపల్లి, సంగారెడ్డి జిల్లా

నటి ప్రియా వారియర్‌కు ఊరట

క్రిమినల్ చర్యలపై సుప్రీంకోర్టు స్టే



ఈనాడు, దిల్లీ: కను సైగలతో సంచలనం సృష్టించిన మలయాళ నటి ప్రియాప్రకాశ్ వారియర్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మలయాళ చిత్రం 'ఒరు ఆదార్ లవ్'లో 'మాణిక్య మలరాయి పూవి...' అనే పాట ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందంటూ తెలంగాణలోని ఫలక్‌నుమా పోలీసుస్టేషన్, మహారాష్ట్రల్లో నమోదైన కేసులను కొట్టేయాలంటూ ప్రియావారియర్ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఖన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ప్రియ ప్రకాశ్ తరపున న్యాయవాది హారిస్ బీరెన్ వాదనలు వినిపిస్తూ.. ఒరు ఆదార్ చిత్ర ప్రచార వీడియో ఎవరి మనోభావాలకు ఇబ్బంది కలిగించేలా లేదని తెలిపారు. కేరళలోని ముస్లింలు ఎవరూ ఈ ప్రచార పాటను వ్యతిరేకించలేదన్నారు. తెలంగాణ, మహారాష్ట్రల్లో నమోదైన కేసులకు సంబంధించి క్రిమినల్ చర్యలపై స్టే విధించాలని విజ్ఞప్తి చేశారు. క్రిమినల్ చర్యలపై స్టే విధించిన కోర్టు ప్రచార వీడియోకు సంబంధించి నటి, దర్శక నిర్మాతలపై దేశంలో ఎక్కడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కేసు నమోదు అయినందున తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

రైతుకు కొత్త చేతులు

ఓ జీవన్మృతుడి చేతులను అమర్చిన చెన్నై వైద్యులు

చెన్నై, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో చేతులు అచేతనంగా మారిన ఓ రైతుకు చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కొత్త చేతులు అమర్చారు. దిండుకల్‌కు చెందిన రైతు నారాయణస్వామి (45) రెండు చేతులూ 2015లో విద్యుదాఘాతం కారణంగా అచేతనంగా మారాయి. ఇటీవల ఓ ప్రమాదంలో జీవన్మృతుడైన చెన్నై మణలికి చెందిన వెంకటేశన్ అనే వ్యక్తి చేతులను నారాయణస్వామికి అమర్చాలని ఆసుపత్రి వైద్యులు నిర్ణయించారు. ఈ నెల 7న 75 మంది వైద్యసిబ్బంది సుమారు 13 గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించి చేతులను అమర్చారు. వాటిని సహజంగా ఉపయోగించడంపై నారాయణస్వామికి శిక్షణ కూడా ఇచ్చారు. చేతుల మార్పిడి శస్త్రచికిత్సపై బుధవారం ఆసుపత్రిలో జరిగిన సదస్సులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.విజయభాస్కర్ ఈ వివరాలను వెల్లడించారు. దేశంలోనే తొలిసారి ఇక్కడి వైద్యులు ఈ తరహా మార్పిడిని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. సంబంధిత వైద్యులను అభినందించారు.

రాష్ట్రంలో 8 క్యాన్సర్ పరీక్షా కేంద్రాలు

టాటా ట్రస్ట్‌తో ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది క్యాన్సర్ పరీక్ష, చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సాంకేతికత, పరికరాలు, ఇతర సహకారాలను టాటా ట్రస్ట్ నుంచి తీసుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డితో టాటా ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. క్యాన్సర్ వైద్య పరీక్షలు, చికిత్సలకు సంబంధించి తమ వంతు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎంఎన్‌జే ఆస్పత్రి ప్రధాన కేంద్రంగా రాష్ట్రంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ వైద్య కళాశాలల పరిధుల్లో ఒక్కొక్కటి చొప్పున, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. విధివిధానాలు ఖరారైతే రాష్ట్రంలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స విస్తృతమవుతాయి.

5లక్షల డాలర్ల పెట్టుబడితో ఐదేళ్లలో గ్రీన్‌కార్డు

ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్ ప్రోగ్రాంపై నేడు అవగాహన

హైదరాబాద్, న్యూస్‌టుడే: అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్‌కార్డు) కోరుకునే భారతీయులు, పారిశ్రామికవేత్తలకు ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్ ప్రోగ్రాం చక్కటి అవకాశమని న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ముఖ్య భాగస్వామి అరుణ్ నందా వెల్లడించారు. 5 లక్షల డాలర్ల పెట్టుబడితో ఐదేళ్లలో గ్రీన్‌కార్డు పొందవచ్చునని తెలిపారు. బుధవారమిక్కడ జరిగిన విలేకర్ల సమావేశంలో క్రాస్ బార్డర్స్ సంస్థ డైరెక్టర్, సీఓఓ భాస్కర్ దూలంతో కలిసి అరుణ్ నందా మాట్లాడారు. అమెరికాలో వీసాల జారీకి నిబంధనలు కఠినతరమైన తరుణంలో అక్కడి ప్రభుత్వం ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్ ప్రోగ్రాం రూపంలో ఫెడరల్ చట్టాన్ని ప్రవేశపెట్టిందని వెల్లడించారు. ఈ విషయాలపై పారిశ్రామికవేత్తలు, వృత్తినిపుణులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర సంపన్న వర్గాలకు అవగాహన కల్పించేందుకు మాదాపూర్‌లోని హోటల్ ట్రైడెంట్‌లో గురువారం మధ్యాహ్నం సదస్సునునిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్‌ఫండ్ బృందంసభ్యులు అవగాహన కల్పిస్తారు.

నవాజ్ షరీఫ్‌కు ఎదురుదెబ్బ

ఇస్లామాబాద్: పనామా పత్రాల వ్యవహారంతో పదవీచ్యుతుడైన పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ రాజకీయ కెరీర్‌కు తాజాగా మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాక్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 62, 63 కింద అనర్హుడైన వ్యక్తి ఎవరైనా సరే ఏ రాజకీయ పార్టీకి కూడా సారధిగా కొనసాగరాదంటూ సుప్రీంకోర్టు బుధవారం విస్పష్టంగా పేర్కొంది. అయితే, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మూలంగా ఓ రాజకీయ పార్టీగా పీఎంఎల్-ఎన్ రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రధాన న్యాయమూర్తి సాకిబ్ నిసార్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పు చెబుతూ పార్లమెంటు కార్యకలాపాలను నిర్వహించాల్సిన వ్యక్తి నిష్కళంకుడై ఉండటం అవసరమని పేర్కొంది. ఆర్టికల్ 62, 63 కింద అనర్హులైన వారు నేషనల్ అసెంబ్లీ లేదా సెనేట్‌కు ఎవరి అభ్యర్థిత్వాన్నైనా ప్రతిపాదించడానికి వీలు పడదని స్పష్టం చేసింది. అంతేకాదు, ఇప్పటిదాకా ఈ దిశగా నవాజ్ షరీఫ్ తీసుకున్న నిర్ణయాలు నిష్ఫలమైపోతాయి.



సదస్సులో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి. చిత్రంలో ఏనుగు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, ఎస్వీ సత్యనారాయణ, సంగనభట్ల నర్సయ్య

ఎదిరించి నిలిచిన భాష.. తెలుగు

ప్రపంచ మాతృభాషా దినోత్సవ సదస్సులో నందిని సిధారెడ్డి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: వేల సంవత్సరాలుగా ఆధిపత్య భాషలను ధిక్కరించి, ఎదిరించి నిలిచిన భాష తెలుగు అని తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి అన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో సిధారెడ్డి ప్రసంగిస్తూ.. తెలుగుకు ప్రమాదాలు కొత్తేమీ కాదన్నారు. తొలుత తెలుగుపై సంస్కృతం దండెత్తిందని, అయినా ఆ భాషను నిరాకరించలేదన్నారు. సంస్కృతభాషలోని కొన్ని సౌకర్యాలను కలుపుకొని, తనదైన అస్తిత్వంతో సగర్వంగా తలెత్తుకొని నిలబడిందన్నారు. అలాగే అరబ్బీ, పార్సీ భాషలోని పదాలనూ తెలుగు ఇనుమడించుకుందన్నారు. భాష ఏదైనా అనేక భాషల పదాలతో కలిసి నడిచినప్పుడే అది వికాసం పొందుతుందన్నారు. మాతృభాష ప్రజల్లో ఎల్లప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. కానీ రాజకీయాలు ముసురుకొని ఒకసారి ఒక భాషను అణిచివేస్తూ.. మరో భాషను భుజానెత్తుకోవడం జరుగుతోందన్నారు. అలాంటి దశలను దాటుకొన్న తెలుగు ఆంగ్లాన్ని కూడా జయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. జాతి జీవన విధానమే మాతృభాష అని ఎన్ని భాషలు నేర్చుకున్నా.. మాతృభాషపై సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమి కార్యదర్శి డా.ఏనుగు నరసింహారెడ్డి, సంగనభట్ల నరసయ్య, చంద్రమోహన్, నలిమెల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయండి:ఇంద్రకరణ్ రెడ్డి

ఈనాడు, దిల్లీ: కొత్తగా ఏర్పడిన నిర్మల్ జిల్లా కేంద్రంలో 50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గాంగ్వార్‌ను తెలంగాణ గృహనిర్మాణ, న్యాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన దిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన పాత ప్రాంతీయ ఆసుపత్రి భవనాన్ని అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. తెలంగాణలో ఈసారి భారీ ఎత్తున పండిన కందులను కొనుగోలు చేయాలని ఇంద్రకరణ్‌రెడ్డి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తితో కొంతమేర కొనుగోలు చేశారని, ఇంకా రైతుల దగ్గర పెద్ద ఎత్తున నిల్వలున్నందున కేంద్రం చేయూతనందించి కొనగోళ్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇంద్రకరణ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తమ విజ్ఞప్తులపై కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు.

కాంగ్రెస్ బస్సుయాత్ర షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రజా చైతన్య బస్సు యాత్రకు సంబంధించిన షెడ్యూల్‌ను టీపీసీసీ ప్రకటించింది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 9 వరకు తొలి విడత యాత్ర వివరాలను విడుదల చేసింది. 26న ఉదయం 10 గంటలకు నాంపల్లి దర్గా నుంచి యాత్ర ప్రారంభమై... మధ్యాహ్నం 1కి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల చేరుకుంటుంది. చేవెళ్లలో బహిరంగ సభ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు వికారాబాద్‌లో సభ ఉంటుంది. రాత్రి అక్కడే బస చేస్తారు. 27న తాండూరు, సంగారెడ్డిలో సభ.. రాత్రి సంగారెడ్డిలో బస. 28న జహీరాబాద్, నారాయణఖేడ్‌లో సభలుంటాయి. మార్చి 4న బోధన్, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాలు), 5న ఆర్మూర్, బాల్కొండలో యాత్ర సాగుతుంది. రాత్రికి పోచంపాడు ప్రాజెక్టు దగ్గర బస చేస్తారు. 6న నిర్మల్, మెట్‌పల్లిలో యాత్ర జరుగుతుంది. మార్చి 7 నుంచి 9 వరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో యాత్ర కొనసాగనుంది.

సామాజిక మాధ్యమాల్లోని ఎంపీల జాబితా నిజం కాదు

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏఐసీసీ ఆమోదం పొందిన పార్టీ పార్లమెంట్ అభ్యర్థుల జాబితా అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఈ ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇంకా ఎలాంటి కసరత్తూ అధిష్ఠానం ప్రారంభించలేదని స్పష్టం చేశారు. కావాలనే కొంతమంది.. కాంగ్రెస్ శ్రేణులను ఆందోళనకు, అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. మరోవైపు ఆర్టీసీకి ప్రభుత్వం ఏ రకమైనటువంటి ప్రయోజనమూ చేకూర్చడం లేదని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి విమర్శించారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ ఐఎన్‌టీయూసీ విభాగం బుధవారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మల్లురవి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో గెలిచిన సంఘం..కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రభుత్వానికి కొమ్ము కాస్తోందన్నారు.

పిల్లల చోదన.. పెద్దలకు వేదనే!

- వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు పాల్పడుతున్న మైనర్లపై ట్రాఫిక్ పోలీసుల నజర్
- ఇటీవల నలుగురు తండ్రులకు జైలు శిక్ష

ఈనాడు, హైదరాబాద్: "వాహనాలు నడుపుతూ మైనర్లు పోలీసులకు దొరికిపోతే వారిపై కేసు నమోదు చేయడంతోపాటు తల్లిదండ్రులు(వాహన యజమాని) జైలుకు వెళ్లాల్సి వస్తుంది" అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. హెచ్చరికలతో వదిలిపెట్టకుండా కోర్టులో వారిపై అభియోగపత్రాలను నమోదు చేస్తున్నారు. న్యాయస్థానం పోలీసుల నివేదికలకు పరిశీలించి తల్లి లేదా తండ్రికి జైలు శిక్ష విధిస్తోంది. గత పదిహేను రోజుల వ్యవధిలో నలుగురు తండ్రులకు ఇలా జైలు శిక్ష పడింది. హైదరాబాద్‌లో మైనర్ డ్రైవింగ్ పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. పిల్లలు, చోదక అనుమతి లేకుండా వాహనాలు నడిపేవారిని పట్టుకునేందుకు భవిష్యత్తులో ప్రత్యేక డ్రైవ్‌లు సైతం నిర్వహించనున్నారు.

ప్రేమ.. కడుపుకోత..

పిల్లలపై ప్రేమతో తల్లిదండ్రులు వారికి కొత్త వాహనాలు కొనిస్తున్నారు. కొందరైతే మైనర్లకే ఖరీదైన స్పోర్ట్స్‌బైకులు, కార్లను ఇస్తున్నారు. వీరిలో చాలా మంది ప్రమాదకరంగా వాహనాలు నడిపి ప్రమాదాలు



ఇటీవల హైదరాబాద్ ఎన్ఎండీసీ వద్ద స్కూటీ నడుపుతూ ప్రమాదానికి గురై మరణించిన మైనర్

చేస్తున్నారు. ఒకరు, ఇద్దరు మాత్రమే వెళ్లే బైక్‌లపై ముగ్గురు, నలుగురు వెళ్తున్నారు. వేగంగా వెళ్లే క్రమంలో నియంత్రణ కోల్పోయి రహదారులపై పడిపోతున్నారు. ఇక కార్లు నడిపే యువకుల్లో చాలా మందికి జాతీయ రహదారులపై ఎలా నడపాలో తెలియదు. తాత్కాలిక ఆనందం కోసం తల్లిదండ్రులు మైనర్లకు ఇచ్చే ఇలాంటి బహుమతులు వారికి కడుపుకోత మిగుల్చుతున్న సందర్భాలు అనేకం.

మత్తు.. రేసులు..

రాజధానిలో ఖరీదైన బైకులు, కార్లున్న మైనర్లలో 60 శాతం మంది వారాంతాల్లో మద్యం పార్టీలు చేసుకుంటున్నారని పోలీసుల పరిశీలనలో తేలింది. అర్ధరాత్రి దాటాక మత్తులోనే వాహనాలను నడుపుకొంటూ ఇళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్లపై ప్రమాదాలు చేస్తున్నారు. మరికొందరు మైనర్లు అర్ధరాత్రి వేళల్లో రేసుల్లో పాల్గొంటున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకూ 2257 కేసులు నమోదయ్యాయి.

మైనర్లను జువైనల్ హోంకు పంపుతాం

- ఎ.వి.రంగనాథ్, డీసీపీ ట్రాఫిక్

వాహనచోదక అనుమతుల్లేకుండా మైనర్లు కార్లు, బైకులు నడుపుతున్నారు. మైనర్ వాహనాన్ని నడిపితే అతడితో పాటు తల్లిదండ్రులపైనా కేసు నమోదు చేస్తున్నాం. కొద్దిరోజుల వ్యవధిలో బహదూర్‌పురా, ఎన్ఎండీసీ ప్రాంతాల్లో మైనర్ డ్రైవింగ్ వల్ల ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. ఈ అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లి చట్టపరిధిలో శిక్షలు విధించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించాం. మా అభ్యర్థనను మన్నించి మేజిస్ట్రేట్‌లు శిక్షలు విధిస్తున్నారు. మైనర్లు రెండోసారి పట్టుబడితే జువైనల్ హోంలకు తరలించనున్నాం.

హైదరాబాద్‌లో ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు
2015	2485	2438	380
2016	2271	2552	371
2017	2367	2383	311

కాంగ్రెస్‌లోకి నాగం జనార్దన్‌రెడ్డి!

- రెండ్రోజుల క్రితం రాహుల్‌తో భేటీ అయినట్లు సమాచారం
- అదేబాటలో కొత్తకోట దయాకర్‌రెడ్డి దంపతులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భాజపాలో ఉన్న ఆయన..కొద్దికాలంగా ఆ పార్టీతో అంటీముట్టనట్లు ఉంటున్న విషయం తెలిసిందే. 2014 ఎన్నికల్లో భాజపా నుంచి జనార్దన్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎంపీగా, ఆయన కుమారుడు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి..ఇద్దరూ ఓడిపోయారు. అప్పటి నుంచి జనార్దన్‌రెడ్డి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. భాజపా కార్యక్రమాలకూ హాజరుకావడం లేదు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టారు. కాంగ్రెస్ నుంచి సానుకూల స్పందన రావడంతో ఆ పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. తాజాగా రెండు రోజుల క్రితం దిల్లీ వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏఐసీసీ ఎస్సీ విభాగం ఛైర్మన్ కొప్పుల రాజు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు జనార్దన్‌రెడ్డిని రాహుల్ దగ్గరకు తీసుకువెళ్లినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు నాగం ఆసక్తి చూపిస్తున్నారని...రాహుల్ నుంచి స్పష్టమైన హామీ లభించినట్లు తెలిసింది. మార్చి 18 తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. దీనిపై నాగంను సంప్రదించగా..నియోజకవర్గంలో తన అభిమానులు కాంగ్రెస్ పార్టీలో చేరమని కోరుతున్నారన్నారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు. ఇదిలాఉండగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తెదేపా మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట దయాకర్‌రెడ్డి, సీత దంపతులు సైతం కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బుధవారం వారిద్దరూ దిల్లీకి వెళ్లి కొప్పుల రాజును కలిశారని..గురువారం రాహుల్‌గాంధీతో సమావేశం అవుతారని తెలిసింది. గురువారం ఉదయానికల్లా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం దిల్లీకి వెళ్లే అవకాశం ఉంది. దయాకర్‌రెడ్డి దంపతులు దేవరకద్ర, మక్తల్ నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని, రాహుల్‌గాంధీ నుంచి స్పష్టమైన హామీ లభిస్తే వారు కాంగ్రెస్‌లో చేరతారని తెలుస్తోంది.

నేడు టీపీసీసీ సేవాదళ్ సదస్సు

టీపీసీసీ సేవాదళ్ ఒకరోజు సదస్సును గురువారం నిర్వహిస్తున్నట్లు సేవాదళ్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఇందిరాభవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా, భట్టి విక్రమార్క, జానారెడ్డి, షబ్బీర్ అలీ, తదితరులతో పాటు పార్టీ ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు.

హాజరు నుంచి మినహాయించండి

ఈడీ కేసులో హైకోర్టును ఆశ్రయించిన ఇండియా సిమెంట్స్ శ్రీనివాసన్

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నమోదు చేసిన కేసులో కోర్టు హాజరు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ ఇండియా సిమెంట్స్ ఛైర్మన్ ఎన్.శ్రీనివాసన్ హైకోర్టును ఆశ్రయించారు. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ ఈడీ కేసులను విచారించే ప్రత్యేక హోదా ఉన్న సీబీఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ శ్రీనివాసన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ షమీమ్ అక్తర్ బుధవారం విచారణ చేపట్టారు. శ్రీనివాసన్ తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హాజరు నుంచి మినహాయింపునివ్వడం వల్ల కేసు విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది హాజరవుతారన్నారు. అంతేగాకుండా సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగానే ఈడీ దర్యాప్తు జరిగిందని, సీబీఐ నమోదు చేసిన కేసునే హైకోర్టు కొట్టివేసినందున ఈడీ కేసును తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై ఈడీ తరపు న్యాయవాది కె.మన్మథరావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీబీఐ కేసుతో ఈడీ కేసును పోల్చి చూడరాదంటూ ఇది మనీలాండరింగ్‌కు సంబంధించిన వ్యవహారమని అన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈడీ వివరణ కోరుతూ తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు. అదేవిధంగా సీఆర్‌పీసీ 205 కింద సెషన్స్ జడ్జి వద్ద పిటిషన్ విచారణార్హతను చెప్పాలని ఆదేశించారు.

సెన్సెక్స్ ▲ 141 — **33845**

నిఫ్టీ ▲ 37 — **10397**

రూపాయి 64.76 ▲ (ఒక అమెరికా డాలరుకు) 03 పైసలు

బంగారం 30,585 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 200

వెండి 38,180 ▼ ముంబయిలో కిలో రూ.లలో 130

ముడి చమురు 65.18 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,106	+141
నాస్‌డాక్	7,296	+62
నిక్కీ 225 (జపాన్)	21,971	+46
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,516	+40
షాంఘై(చైనా)14న ముగింపు	3,199	+15
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,282	+35
డాక్స్ (జర్మనీ)	12,471	−17

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.03	68.44
పౌండ్ స్టెర్లింగ్	82.56	95.75
యూరో	72.76	84.39
జపనీస్ యెన్/100	54.74	63.47
ఆస్ట్రేలియా డాలరు	46.39	53.66
సింగపూర్ డాలరు	44.73	52.98
థాయ్ బాత్/100	187.11	223.76
బహ్రెయిన్ దీనార్	159.85	183.17
కువైట్ దీనార్	179.03	222.85
సౌదీ రియాల్	15.69	18.60
యూఏఈ దిర్హమ్	16.06	18.78
మలేషియా రింగిట్	14.79	18.18
చైనీస్ యువాన్	7.23	11.74



బుధవారం నిఫ్టీ కదలికలు



మరిన్ని బలహీన పీఎస్‌యూల్లో వాటా విక్రయం

జాబితా సిద్ధం చేస్తున్న నీతి ఆయోగ్

దిల్లీ: వ్యూహాత్మక వాటా విక్రయించదగిన మరికొన్ని బలహీన ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూలు)ను గుర్తించే పనిలో నీతి ఆయోగ్ ఉంది. ఇప్పటికే ఇలాంటి పీఎస్‌యూలను 40 వరకు గుర్తించగా.. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) సూచన మేరకు మరికొన్నింటితో కొత్త జాబితా రూపొందిస్తోంది. 'బలహీన పీఎస్‌యూలపై ఇప్పటికే నాలుగు జాబితాలు పంపించాం. ప్రస్తుతం అయిదో జాబితాపై కసరత్తు చేస్తున్నాం. ఆరు, ఏడో జాబితాలు కూడా సిద్ధం చేయనున్నామ'ని నీతి ఆయోగ్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈఓ) అమితాబ్ కాంత్ వెల్లడించారు. ఇంతకుముందు గుర్తించిన 40 బలహీన పీఎస్‌యూల్లో వాటా విక్రయ ప్రక్రియ తుది దశకు చేరిందని తెలిపారు. ఈ బాధ్యతను పెట్టుబడుల విభాగం, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ (దీపమ్) చూసుకుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో (2017-18) సమీకరించిన రూ.లక్ష కోట్లతో పోలిస్తే ఇది తక్కువ. అయితే 2017-18లో ప్రభుత్వం నిర్దేశించుకున్న పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.72,500 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఇందులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక వాటా విక్రయాల ద్వారా రూ.15,000 కోట్లు, బీమా కంపెనీలను ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయడం ద్వారా రూ.11,000 కోట్లు సమీకరించాలని భావించింది.

స్వల్ప ఉపశమనం

- వరుస నష్టాలకు తెర
- సెన్సెక్స్‌కు 141 పాయింట్ల లాభం
- రాణించిన ఐటీ షేర్లు



సమీక్ష

మూడు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ సానుకూల సంకేతాలకు తోడు ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో దేశీయ మార్కెట్లలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరిగాయి. ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రభుత్వ బ్యాంక్ షేర్లు పుంజుకోవడంతో మదుపరికి స్వల్ప ఉపశమనం దక్కింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి తగ్గడంతో హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, హెక్సావేర్, టీసీఎస్ షేర్లు 3.88 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి. ఎఫ్ఎమ్‌సీజీ, చమురు- గ్యాస్ షేర్లు కూడా లాభాలకు దోహదపడ్డాయి. ముడిచమురు ధరలు తగ్గడంతో అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా మారడం దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. ఆసియా షేర్లు మెరుగ్గా ముగియగా, ఐరోపా మార్కెట్లు బలహీనంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,813.83 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజులో అధిక భాగం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 33,911.36 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 141.27 పాయింట్ల లాభంతో 33,844.86 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 593.88 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 37.05 పాయింట్లు పెరిగి 10,397.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,349.60- 10,426.10 పాయింట్ల మధ్య కదలాడింది.

ఎరోస్ దూకుడు: ఎరోస్ ఇంటర్నేషనల్‌లో 5 శాతం వాటాను రూ.1000 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించడంతో ఎరోస్ షేరు పరుగులు తీసింది. ఇంట్రాడేలో 10.77 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 4.39 శాతం లాభంతో రూ.206.55 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభాలతో ముగిశాయి. టీసీఎస్ 3.33%, ఐటీసీ 2%, ఓఎన్‌జీసీ 1.66%, ఎస్‌బీఐ 1.28%, ఇన్ఫోసిస్ 1.23%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.97%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.93%, యెస్ బ్యాంక్ 0.92%, హెచ్‌డీఎఫ్‌సీ 0.83%, యాక్సిస్ బ్యాంక్ 0.66% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. సన్‌ఫార్మా (6.19%), ఇండస్‌ఇండ్ బ్యాంక్ (2.01%), టాటా స్టీల్ (1.57%), బజాజ్ ఆటో (1.36%), టాటా మోటార్స్ (1.23%), ఎన్‌టీపీసీ (0.92%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 2.20% లాభపడింది. టెక్ 1.79%, ఎఫ్ఎమ్‌సీజీ 0.75%, చమురు-గ్యాస్ 0.42% మేర రాణించాయి.

నేటి మార్కెట్

నేడూ సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలను మదుపర్లు అందిపుచ్చుకోవచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు నేటితో ముగియనుండటం, మందకొడి సెంటిమెంట్‌తో గత మూడు సెషన్లలో నిఫ్టీ 10300- 10490 పాయింట్ల శ్రేణిలో చలించింది. ఈ నెల 6-7 తేదీల్లో జరిగిన అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పరపతి సమావేశ నిర్ణయాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. భవిష్యత్ వడ్డీ రేట్ల పెంపునకు సంబంధించిన సంకేతాలపై మదుపర్లు కన్నేసే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక గణాంకాలు సైతం ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపొచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనతలు, నాస్కామ్ భవిష్యత్ అంచనాలతో ఐటీ షేర్ల జోరు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తక్కువ స్థాయిలో ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. షార్ట్ కవరింగ్‌తో ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్ల లాభాలు కొనసాగొచ్చని, అయితే స్వల్ప కాలంలో బలహీనపడొచ్చని నిపుణులు భావిస్తున్నారు. నేడు నిఫ్టీకి 10460- 10490 పాయింట్ల దగ్గర నిరోధం, 10300- 10330 పాయింట్ల వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో ఐడీఎఫ్‌సీ బ్యాంకు శాఖ

ఈనాడు, హైదరాబాద్: ఖాతాదారులకు వినూత్నంగా సేవలు అందించేందుకు ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఎప్పుడూ ముందుంటుందని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవతార్ మోంగా పేర్కొన్నారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు కూడా బ్యాంకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇ-కేవైసీతో కేవలం నాలుగు నిమిషాల్లోనే ఖాతా ప్రారంభించి, పూర్తి స్థాయిలో వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. బుధవారం ఆ బ్యాంకు తెలంగాణ రాష్ట్రంలో తొలి శాఖను హైదరాబాద్ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికే 750 ప్రాంతాల్లో మైక్రో ఏటీఎంల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పూర్తిస్థాయి బ్యాంకును ప్రారంభించడం ద్వారా ఐడీఎఫ్‌సీ బ్యాంకు అందిస్తున్న పలు సేవలను పొందేందుకు ప్రజలకు వీలవుతుందని పేర్కొన్నారు. ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు ఎలా ఎంపిక చేసుకోవాలనే విషయంలోనూ 'సంపద నిర్వహణ' సేవలను తమ వెబ్‌సైట్ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. రానున్న 6 నెలల్లో హైదరాబాద్‌లో మరో నాలుగు శాఖలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. సెప్టెంబరు నాటికి దేశ వ్యాప్తంగా 200 శాఖలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా విధించుకున్నట్లు చెప్పారు. మార్చి 2019 నాటికి మైక్రో ఏటీఎంల సంఖ్యను 25వేల వరకూ చేర్చాలని భావిస్తున్నామన్నారు. పర్సనల్ బ్యాంకింగ్ హెడ్ అమిత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారి స్థాయి నుంచి.. పట్టణాల్లో ఉండే ఉద్యోగులు, వ్యాపారులందరికీ అనువైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.5శాతం వరకూ వడ్డీ అందిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఈడీ అవతార్ మోంగా, పక్కన అమిత్ కుమార్

ప్రభుత్వ సెక్యూరిటీల కంటే ఎక్కువ వడ్డీ రేటు

- సీపీఎస్ఈ డెట్ ఈటీఎఫ్ ఇచ్చే అవకాశం

దిల్లీ: ప్రభుత్వ సెక్యూరిటీలు(జి-సెక్స్) ఇచ్చే వడ్డీ రేటు కంటే సీపీఎస్ఈ డెట్ ఈటీఎఫ్ ఎక్కువ వడ్డీ రేటు ఇచ్చే అవకాశం ఉందని ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. డెట్ ఈటీఎఫ్‌ను ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వ రంగ కంపెనీలు ప్రస్తుతం అవి చెల్లిస్తున్న వడ్డీ కంటే తక్కువకు మార్కెట్ నుంచి నిధులు సమీకరించే అవకాశం ఉండడం ఇందుకు నేపథ్యమని ఆ అధికారి వివరించారు. అధికారిక గణాంకాల ప్రకారం.. 15 కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీలు (సీపీఎస్ఈ) గత మూడేళ్లలో బాండ్ల ద్వారా రూ.3 లక్షల కోట్లు సమీకరించాయి. ఇందులో 12 కంపెనీలకు 'ఏఏఏ' రేటింగ్ ఉంది. ఏఏఏ అనేది అగ్రగామి పెట్టుబడుల గ్రేడు.

ప్రస్తుతం పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ(దీపమ్) విభాగం ఈటీఎఫ్‌కు సంబంధించిన వ్యవస్థపై పనిచేస్తోంది. ఒక 'కామన్ పూల్'ను ఏర్పాటు చేసి దాని ద్వారా సీపీఎస్ఈలు అవసరమైన నిధులను తీసుకునేలా వీలు కల్పించాలని భావిస్తోంది. పింఛను ఫండ్‌లు, రిటైల్ పెట్టుబడుదార్లు వంటి వారు దీర్ఘకాలిక దృక్పథంతో స్థిర ప్రతిఫలాలను ఆశించి ఈ సీపీఎస్ఈ డెట్ ఆధారిత ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. జి-సెక్‌ల కంటే ఎక్కువ కూపన్ రేటు ఉండేలా. . రిటైల్ మదుపర్లు డెట్ ఈటీఎఫ్ యూనిట్లను కొనుగోలు చేసేలా ప్రయత్నిస్తున్నట్లు ఆ అధికారి వివరించారు.

బీఎస్ఈలో 28 నుంచి క్రాస్ కరెన్సీ డెరివేటివ్‌ల ట్రేడింగ్

దిల్లీ: క్రాస్ కరెన్సీ డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను ఈ నెల 28 నుంచి బీఎస్ఈ ప్రారంభించనుంది. రెండు రకాల ఇతర దేశాల కరెన్సీలను కలిపి చేసే ట్రేడింగ్‌ను క్రాస్ కరెన్సీ డెరివేటివ్స్ ట్రేడింగ్ అంటారు. ప్రస్తుతం రూపాయితో ఇతర కరెన్సీల ఫ్యూచర్ల ట్రేడింగ్ మాత్రమే జరుగుతోంది. ఆప్షన్ల విభాగంలో రూపాయి- డాలరు డెరివేటివ్‌లకు మాత్రమే వీలుంది. సెబీ ఇచ్చిన తాజా అనుమతులతో యూరో- డాలరు, పౌండు స్టెర్లింగ్- డాలరు, డాలరు- యెన్‌ల డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను నిర్వహించే వీలు బీఎస్ఈకి ఏర్పడింది. ప్రస్తుతమున్న డాలరు- రూపాయి ఆప్షన్ల ట్రేడింగ్‌తో పాటు యూరో- రూపాయి, పౌండు- రూపాయి, యెన్-రూపాయిలకు ఆప్షన్ల ట్రేడింగ్‌ను ప్రారంభించేందుకు కూడా బీఎస్ఈకి అనుమతులు లభించాయి. క్రాస్ కరెన్సీ డెరివేటివ్‌ల ట్రేడింగ్ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు జరుగుతుంది.


నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 నుంచి పీఎన్‌బీ తొలగింపు

దిల్లీ: ఎన్ఎస్ఈకి చెందిన నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వైదొలగనుంది. ఏప్రిల్ 2 నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఎన్ఎస్ఈ విభాగం ఇండియా ఇండెక్స్ సర్వీసెస్ అండ్ ప్రోడక్ట్స్ (ఐఐఎస్ఎల్) ప్రకటించింది. ఇదే సమయంలో నిఫ్టీ 50 సూచీ నుంచి అంబుజా సిమెంట్స్, అరబిందో ఫార్మా, బాష్‌లు వైదొలగనున్నాయి. వీటి స్థానాలను బజాజ్ ఫిన్‌సర్వ్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, టైటన్ కంపెనీలు భర్తీ చేయనున్నాయి. నిఫ్టీ నెక్స్ట్ 50 సూచీ నుంచి బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా పవర్, టైటన్, గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్జూమర్, గ్లాక్సోస్మిత్‌క్లైన్ ఫార్మా, గ్లెన్‌మార్క్, టొరెంట్ ఫార్మాలు తప్పుకోనుండగా.. ఆదిత్య బిర్లా కేపిటల్, అంబుజా సిమెంట్స్, అరబిందో ఫార్మా, బాష్, జనరల్ ఇన్సూరెన్స్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు వచ్చి చేరనున్నాయి.

మార్కెట్ కబుర్లు


- ✦ **సన్‌ఫార్మా**కు చెందిన అమెరికా విభాగం ఆ మార్కెట్ నుంచి 17,500 బాటిళ్ల యాంటీహిస్టామిన్ అజెలాస్టిన్ హెచ్‌సీఎ అనే ముక్కు ద్వారా పీల్చుకునే ఔషధాన్ని(నాజల్ స్ప్రే) వెనక్కి పిలిపించింది.
- ✦ **పీ అండ్ జీ ఇండియా** ఎండీ, సీఈఓగా మధుసూదన్ గోపాలన్ నియమితులయ్యారు. 2018 ఏప్రిల్ నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆయన పీ అండ్ జీకి చెందిన ఇండోనేషియా వ్యాపార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- ✦ ఒక్కో షేరు రూ.150 చొప్పున 2.81 శాతం వాటాకు సమానమైన 66 లక్షల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు **బలరామ్‌పూర్ చినీ మిల్స్** తెలిపింది. ఆ మేరకు బోర్డు అనుమతి లభించింది.
- ✦ హెచ్‌పీసీఎల్ నుంచి గ్యాస్ టర్బైన్ ఆధారిత సొంత విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు రూ.1034 కోట్ల ఆర్డరు దక్కించుకున్నట్లు **భెల్** తెలిపింది.
- ✦ గెయిల్ నుంచి **ఎస్సార్ ఆయిల్‌ఫీల్డ్స్** రూ.28 కోట్ల ఆర్డరు దక్కించుకుంది. దీని కింద గుజరాత్‌లో కాంబే క్షేత్రంలో కనీసం మూడు బావులు తవ్వాలి.
- ✦ తీవ్ర శ్వాసకోస ఇబ్బందుల చికిత్సకు ఉపయోగించే నోటి మందు ఓసల్టమివీర్ ఫాస్ఫేట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతి లభించినట్లు **లుపిన్** పేర్కొంది. అదే సమయంలో చిత్తవైకల్య చికిత్సకు ఉపయోగించే మెమాంటిన్ హైడ్రోక్లోరైడ్ క్యాప్సూళ్లను అమెరికా మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపింది.
- ✦ అర్హత గల సంస్థాగత మదుపర్ల(క్యూఐపీ)కు షేర్లను ఒక్కోటీ రూ.82.50 జారీ ధరతో విక్రయించడం ద్వారా రూ.3500 కోట్ల నిధులు సమీకరించడానికి తమ మూలధన సమీకరణ కమిటీ ఆమోదం తెలిపిందని **ఐడియా సెల్యులార్** వెల్లడించింది.
- ✦ **ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్** తన పబ్లిక్ ఇష్యూకు, ఇష్యూ ధరను రూ.190గా నిర్ణయించింది. అయితే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఏ తేదీన నమోదు చేయనుందనే విషయాన్ని కంపెనీ వెల్లడించలేదు.

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్



రూ.918 వద్ద ప్రారంభమై రూ.912-947.80 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.907.45తో పోలిస్తే రూ.35.45 (3.91%) లాభంతో రూ.942.90 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 27,84,756.

సన్‌ఫార్మా



రూ.560.05 వద్ద మొదలై రూ.511.30- 563 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.559.50తో పోలిస్తే రూ.33.75 (6.03%) నష్టంతో రూ.525.75 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 2,18,98,950 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

జీఎస్ఎస్ ఇన్ఫోటెక్	54.80
కాస్మో ఫిల్మ్స్	287.95
ఆర్ఈసీ	137.10
త్రివేణి టర్బైన్	116.10
లక్ష్మీ విలాస్ బ్యాంక్	114.05
పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	103.30
యునైటెడ్ బ్యాంక్	13.95


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

ఫ్యూచర్ సప్లై చైన్	643.05
రెప్కో హోమ్ ఫైనాన్స్	517.00
శిల్పా మెడికేర్	453.20
ఐటీసీ	362.50

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
21/02	5,860	7,074	−1,214	4,218	2,843	1,375
20/02	3,053	3,903	−850	4,124	2,687	+1437
19/02	3,368	4264	−896	3,121	2,534	587
16/02	3,105	4,171	−1066	3,926	2,798	−1128
15/02	4,272	4512	−240	3,024	2,975	+49

21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	375
బెంగళూరు	395	చెన్నై	410
22వ తేదీకి		చిత్తూరు	403
విజయవాడ/గోదావరి	375	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 395.60 (394.90) 1800533
AMBUJA CEMEN 261.70 (263.70) 6498774
ASIAN PAINTS 1127.20 (1126.40) 720563
AUROBIND PHA 571.00 (574.80) 4040988
AXIS BANK LT 535.80 (531.70) 4638382
BAJAJ AUTO L 3012.60 (3049.85) 275688
BAJAJ FINANC 1596.45 (1638.75) 1689744
BHARTI AIRTE 419.65 (418.10) 4264637
BHARTI INFRA 338.05 (334.00) 2192907
BOSCH LTD 19160.05 (19398.05) 13402
BPCL 447.55 (453.05) 9163043
CIPLA 597.25 (603.45) 1409752
COAL INDIA L 310.55 (310.40) 5399556
DR. REDDYS 2165.90 (2163.65) 498005
EICHER MOTOR 27365.75 (26916.40) 36682
GAIL 466.10 (465.15) 2322768
HCL TECH 942.90 (907.45) 2784756
HDFC 1824.80 (1811.75) 3795216
HDFC BANK 1857.40 (1863.20) 688268
HERO MOTOCOR 3490.75 (3477.45) 266352
HINDALCO IND 240.65 (248.80) 11901519
HINDUSTAN UN 1330.60 (1331.80) 1406451
HPCL 386.90 (380.85) 2789103
ICICI BANK 319.20 (317.25) 9974873
INDIABULLS H 1244.05 (1237.45) 1194393
INDIAN OIL 368.50 (366.60) 4396885
INDUSINDBANK 1594.25 (1622.70) 1425276
INFOSYS LTD 1147.40 (1136.95) 6885679
ITC 268.20 (263.25) 10555155
KOTAK MAHIND 1055.05 (1045.80) 3572028
LARSEN & TOU 1282.80 (1290.60) 1584305
LUPIN 813.95 (815.80) 1184810
M&M 708.40 (709.00) 2290218
MARUTI SUZIK 8782.75 (8722.65) 471756
NTPC LTD 162.30 (164.20) 7763625
ONGC 190.15 (187.00) 4651807
POWER GRID C 193.95 (195.00) 5207855
RELIANCE IND 929.35 (921.10) 5448230
SBI 273.30 (269.65) 23714454
SUN PHARMA 525.75 (559.50) 21898950
TATA CONSULT 3042.30 (2944.75) 1544614
TATA MOTORS 364.45 (369.30) 8640166
TATA STEEL L 640.95 (651.30) 10307539
TECH MAHINDR 595.20 (574.20) 5590807
ULTRATECH 4131.55 (4140.60) 170432
UPL LIMITED 688.25 (695.35) 2279472
VEDANTA LIMI 327.60 (328.70) 12281795
WIPRO 292.20 (291.45) 5155603
YES BANK LTD 312.35 (308.70) 13342678
ZEE ENTERTAI 573.10 (570.75) 1201048

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1511.40 (1509.30) 35217
ACC 1645.25 (1640.35) 322498
ASHOK LEYLAN 132.35 (133.40) 9506894
AVENUE SUPER 1237.80 (1186.80) 1209483
BAJAJ FINSER 4973.45 (5014.30) 100845
BANK OFBAROD 145.90 (144.80) 13511046
BEL 150.85 (153.75) 3970545
BHEL 91.70 (93.05) 6127936
BRITANNIA 4769.75 (4734.10) 123451
CADILA HEALT 411.15 (409.05) 812011
COLGATE PALM 1080.75 (1067.75) 443620
CONTAINER 1308.90 (1290.45) 203255
CUMMINS INDI 842.85 (850.00) 67869
DABUR INDIA 334.50 (340.70) 1312888
DLF LIMITED 221.00 (225.10) 5996226
EMAMI LIMITE 1053.50 (1044.95) 131910
GLAXOSMI CON 6477.15 (6500.45) 5841
GLAXOSMI PHA 2388.90 (2419.05) 11251
GLENMARK PHA 524.95 (523.95) 559394
GODREJ CONSU 1057.20 (1054.70) 348258
HAVELLS INDI 506.35 (508.65) 720502
HINDUSTAN ZI 316.20 (315.40) 3448007
ICICI PRU LI 409.05 (402.30) 492741
IDEA CELLULR 83.10 (84.00) 7065196
INTERGLOBE A 1274.00 (1265.15) 592221
JSW STEEL LT 298.30 (305.60) 5947856
LIC HOUS.FIN 511.55 (512.85) 1172281
MARICO LIMIT 306.95 (308.45) 480362
MCDOWELL 3177.70 (3215.15) 253532
MOTHERSON 314.10 (325.80) 6239954
MRF 71787.05 (70825.50) 5414
NHPC LTD 27.25 (27.35) 4171371
NMDC LTD 128.95 (130.90) 3802685
OIL INDIA 343.15 (362.20) 1065339
ORACLE FIN S 4072.75 (4054.35) 82197
P&G HYG&HEAL 9394.20 (9304.20) 936
PETRONET LNG 245.10 (244.10) 2286228
PIDILITE IND 903.15 (894.20) 739323
PIRAMAL ENTE 2639.95 (2633.60) 100388
PNB 117.30 (116.55) 67541786
POWER FIN CO 104.60 (105.70) 5085209
RURAL ELEC C 137.75 (138.65) 2331192
SAIL 84.15 (86.50) 11068826
SHREE CEMENT 17004.50 (16930.85) 5665
SHRIRAM TRAN 1261.85 (1292.65) 620250
SIEMENS 1244.20 (1242.25) 108583
SUN TV LTD 932.85 (909.05) 1671516
TATA POWER 86.35 (86.40) 6105693
TITAN IND 822.90 (832.25) 2067029
TORRENT PHAR 1354.00 (1383.95) 94520

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 168.75 (171.35) 623932
ADANI ENTERP 197.40 (198.00) 4152954
ADANI POWER 31.35 (31.35) 6096399
ALL BANK 52.45 (51.70) 6542974
AMARA RAJA 795.25 (806.40) 270748
ANANT RAJIND 56.75 (56.10) 749044
ANDHRA BANK 45.70 (46.60) 2617792
APOLLO HOSPI 1211.20 (1199.25) 640761
APOLLO TYRES 262.15 (264.70) 1935835
APTECH 317.10 (327.90) 807132
BAJAJ ELECT. 502.85 (502.50) 104814
BAJAJ HIND 12.95 (12.85) 1104527
BAJAJ HOLDIN 2718.65 (2723.15) 19881
BALAJI TELE 140.15 (140.25) 45694
BALLARPUR IN 13.35 (13.60) 836515
BALRAMPUR CH 114.35 (119.15) 6499289
BANK OF MAHA 16.90 (16.80) 733397
BANK OFINDIA 128.75 (129.50) 7918645
BATA INDIA 704.65 (711.55) 321261
BGR ENERGY S 118.75 (119.05) 35923
BHARAT FORGE 757.55 (738.80) 1213985
BHUSHAN STEE 49.35 (51.75) 9273312
BIOCON LTD 579.65 (572.45) 5859856
BOMBAY DYE 280.75 (281.95) 3607739
CANARA BANK 311.70 (311.25) 3381221
CEAT LIMITED 1587.20 (1601.05) 437816
CENTRAL BANK 66.30 (66.30) 248234
CHAMBAL FERT 157.90 (157.20) 541556
CHENNAI PETR 358.15 (364.50) 295979
CITY UNIBANK 172.65 (174.15) 349690
CORPO BANK 32.60 (32.40) 174507
COX & KINGS 234.60 (236.70) 121178
D B REALTY L 54.90 (52.30) 779611
DELTA CORP L 352.20 (356.20) 1259800
DENA BANK 20.80 (20.25) 1521745
DHANALAKBANK 23.00 (23.20) 406734
DIVIS LAB 1006.75 (1013.90) 628446
EDELWEISS CA 258.85 (251.35) 1553544
EID PARRY 313.30 (319.35) 373205
EIH 172.80 (171.85) 241668
ESSAR SHIPPI 25.30 (25.70) 25915
ESTER INDUST 65.20 (62.10) 280288
EXIDE INDUST 211.00 (210.95) 817084
FEDERAL BANK 92.00 (91.85) 7095263
FINOLEX CABL 703.50 (712.75) 25669
G E SHIP LTD 390.45 (384.85) 541511
GAMMON INFRA 3.20 (3.20) 1938174
GATI LIMITED 113.45 (112.55) 415151
GAYATRI PROJ 215.25 (216.40) 112137
GITANJALIGEM 27.40 (30.40) 88268
GMR INFRASTR 17.30 (17.65) 30344685
GODREJ IND 540.70 (544.15) 156765
GRASIM IND 1110.60 (1118.65) 402766
GUJ ALK&CHEM 757.25 (748.70) 98909
HCL INFOSYS 61.60 (61.05) 2743618
HEXA TECH 345.85 (333.05) 2165646
HIMACHAL FUT 28.30 (28.10) 2823122
HOUSING DEV 49.15 (51.45) 18235779
IDBI 70.30 (66.45) 19509732
IDFC 52.50 (52.50) 2396417
IFCI 22.55 (22.80) 5437101
IL&FS TRANS 71.25 (71.00) 118527
IND SWIFTLAB 69.60 (73.25) 14058
INDBULLS REL 217.10 (217.80) 8450424
INDIA CEM 158.00 (158.55) 2761947
INDIAN BANK 326.45 (327.70) 1961660
INDO RAMA SY 34.70 (34.20) 102117
INDRAPRASTHA 293.90 (296.85) 1954906
IND-SWIFTLTD 9.25 (9.05) 2245
INGERSOLL-R 728.10 (733.30) 8468
IOB 19.65 (19.60) 527120
IPCA LAB 640.05 (629.40) 426141
IRB INFRA DE 221.55 (222.30) 1174499
J&K BANK 67.45 (67.80) 260798
JAI CORP 161.05 (162.40) 947372
JAIN IRRIGAT 116.30 (118.50) 4582633
JAYPEE INFRA 13.25 (13.40) 1371787
JAYSHREE TEA 100.90 (101.90) 12876
JET AIRWAYS 745.90 (751.75) 2165245
JINDAL SAW 136.40 (133.80) 1523773
JINDAL STEEL 247.30 (252.00) 8618601
JK LAKSHMI C 420.15 (419.10) 37564
JK PAPER LIM 135.40 (135.75) 274883
JM FINANCIAL 145.45 (147.80) 1089836
JP ASSOCIATS 16.65 (16.75) 23753531
JSW ENERGY L 79.30 (79.90) 1087538
JUBILANT FOO 1990.30 (1997.20) 533111
JUBILANT ORG 987.95 (927.50) 1102329
JYOTHY LABS 348.15 (347.90) 21261
JYOTI STRUC 10.10 (10.35) 272393
KARNATA BANK 132.15 (133.25) 1076875

ఘనం (+)

నిఫ్టీ	21న	మార్పు %
HCL TECH	942.90	3.91
TECH MAHINDRA	595.20	3.66
TCS	3042.30	3.31
ITC	268.20	1.88
ONGC	190.15	1.68
EICHER MOTORS	27365.75	1.67
HPCL	386.90	1.59

గ్రహణం (-)

నిఫ్టీ	21న	మార్పు %
SUN PHARMA	525.75	-6.03
HINDALCO	240.65	-3.28
BAJAJ FINANCE	1596.45	-2.58
INDUSIND BANK	1594.25	-1.75
TATA STEEL	640.95	-1.59
TATA MOTORS	364.45	-1.31
BOSCH	19160.05	-1.23

KEC INTL LTD 392.65 (382.15) 885375
KOLTE PATIL 338.85 (338.65) 69827
KPIT CUMMINS 200.45 (198.85) 2410295
L&TFIN.HOLD 158.10 (158.55) 2690900
LAK VIL BANK 114.65 (118.40) 445241
M & M FINANC 435.80 (435.90) 1124121
MANAPPURAM G 105.80 (106.75) 3430466
MMTC LIMITED 52.05 (53.00) 566438
MPHASIS LTD 886.35 (865.75) 348310
MRPL 118.75 (118.40) 873414
MTNL 22.50 (22.70) 560489
NAGARJUNA OI 4.05 (4.20) 545162
NCC LIMITED 123.70 (123.85) 3562040
NETWORK18 FI 48.25 (48.40) 255187
NEULAND LAB 699.90 (712.05) 4826
NIIT LTD 92.65 (93.80) 328022
NIIT TECHNOL 795.35 (758.20) 2022052
OMAXE LTD 227.85 (227.90) 211613
ONMOBILE GLO 51.60 (52.65) 170154
ORIENT PAPER 41.25 (39.50) 529504
ORIENTALBANK 106.70 (106.15) 3635304
PARSVNATH DE 22.25 (22.85) 165240
PATEL ENGG 72.10 (71.90) 138624
PFIZER 2282.00 (2297.05) 10572
POLARIS SOFT 470.25 (470.05) 132071
POWERTRADING 98.65 (99.75) 1253023
PRAJ IND 88.75 (90.10) 405236
PRISM CEMENT 125.05 (122.70) 890821
PROVOGUE (IN 5.80 (5.80) 47650
PUNJ LLOYD 20.70 (21.00) 867251
PUNJAB & SIN 39.10 (38.55) 75576
PURAVANKARA 137.90 (138.10) 156910
PVP VENTURES 7.10 (7.00) 182998
PVR LIMITED 1396.85 (1410.25) 179595
RADICO KHAIT 331.90 (326.95) 1163058
RAJESH EXPOR 799.05 (795.65) 142379
RALLIS INDIA 227.85 (231.05) 144549
RAMCO IND 245.30 (247.30) 73189
RAMCO SYS 437.75 (443.45) 13971
RAMKY INFRA 198.55 (189.05) 695317
RAYMOND 943.90 (955.20) 233872
RELIANCE CAP 466.90 (473.55) 4114236
RELIANCE COM 28.00 (27.85) 53366023
RELIANCE INF 443.40 (446.30) 1825773
RELIANCE POW 43.85 (42.90) 8907241
ROLTA INDIA 70.15 (70.65) 1055181
SAGAR CEMENT 965.40 (969.80) 2407
SAREGAMA 670.35 (676.75) 69694
SHANTHI GEAR 138.90 (140.10) 35638
SHIPPNG CORP 74.65 (76.90) 621879
SHREE RENUKA 15.45 (15.35) 1071470
SINTEX IND 21.25 (21.40) 1705264
SOBHA DEVELO 550.40 (550.80) 82994
SOUTHINDBANK 26.90 (26.85) 6586903
SRS LIMITED 1.10 (1.05) 1879822
STERLITE TEC 334.60 (342.75) 848576
SUJANA METAL 1.35 (1.40) 23022
SUN PHARMA 419.65 (428.60) 314702
SUND FASTNER 540.15 (533.20) 72034
SUZLON ENERG 12.90 (13.05) 23464838
SYND. BANK 58.80 (58.45) 4458776
TATA CHEM 699.75 (704.25) 752851
TATA COFFEE 132.80 (134.00) 268829
TATA COMMUN 625.50 (630.30) 222232
TATA GLOBAL 266.60 (262.85) 3638163
TATA METALIK 789.35 (802.75) 57133
TATA MOT DVR 204.05 (205.35) 4042539
TATA TELESER 6.20 (6.30) 710918
THE INDIAN H 132.65 (135.80) 899724
TORRENT POWE 260.65 (262.15) 1372569
TRIVENI ENGG 64.65 (66.20) 268418
TTK PRESTIGE 7069.95 (7058.45) 2584
TV TODAY NET 450.10 (476.40) 167538
TV18 BROADCA 55.10 (55.20) 2306512
TVS MOTOR 637.25 (650.80) 1024992
UCO BANK 26.65 (26.85) 466124
UNION BANK 109.45 (111.35) 11957085
UNITECH 7.20 (7.25) 11239131
UNITED BANK 14.00 (14.30) 824517
UNITED BREWE 1036.20 (1051.35) 193979
USHA MARTIN 23.25 (21.25) 3660733
VADILAL INDU 850.80 (876.50) 13528
VENKYS 2841.00 (2669.50) 194437
V-GUARD IND 235.90 (231.10) 1374082
VIJAYA BANK 58.90 (58.85) 742538
VIP 338.90 (341.05) 144781
VOLTAS 582.50 (557.70) 3319408
ZEE LEARN LI 41.40 (42.10) 308362
ZUARI GLOBAL 194.55 (197.60) 40269
ZYDUS WELLNE 1243.20 (1259.65) 38971

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AMAR RAJA BA 797.20 (807.30) 14315
ANDHRA BANK 45.80 (46.60) 159047
ANDHRA CEMEN 10.97 (11.05) 18361
ANDHRA PAPER 312.25 (314.90) 6633
ANDHRA PETRO 57.80 (56.95) 52136
ANDHRA SUGAR 479.50 (481.55) 5306
ANJANI PORTL 190.05 (192.50) 135
ASTRA MICROW 89.90 (95.55) 222913
AUROBINDO PH 570.80 (574.10) 190497
AVANTEL SOFT 537.35 (559.60) 6697
AVANTI FEEDS 2336 (2315.30) 7433
AVON ORG 12.90 (13.50) 17856
BALAJI AMIN 653.40 (662.20) 2862
BHAGIRA CHEM 293.15 (285.90) 2001
BHAGYA NAG 42.75 (43.75) 14983
BN RATHI SEC 40.05 (40.30) 2367
BRILLIANT SE 10.55 (11.10) 304253
CONT COFFEE 281.25 (281.80) 3032
COROMAN FERT 508.20 (511.25) 3674
CYIENT LIMIT 630.15 (612.95) 9866
DECCAN CEMEN 564.35 (565.90) 782
DIVI'S LAB 1008.50 (1013.10) 43349
DR REDDY 2168.80 (2162.15) 35276
FOUR SOFT 95.05 (93.20) 2406
GATI CORPN 113.30 (112.65) 69420
GAYATRI PROJ 214.60 (215.95) 8075
GMR INFRASTR 17.35 (17.70) 1634203
GOLDST INFRA 198.55 (192.30) 56680
GOLDSTONE EN 13.85 (13.50) 9106
GRANULES (I) 114.70 (116.25) 98916
GSS AMERICA 50.65 (53.30) 1071822
GVK POWER 16.75 (17.45) 804585
HBL NIFE POW 55.65 (55.65) 49056
HERITAGE FOO 679.25 (684.90) 1118
IDL INDUSTRS 573 (585.85) 4156
IKF SOFT 0.72 (0.75) 123727
ILFS ENGINEE 43.45 (43.65) 24819
INNAREDY COM 3.51 (3.69) 5951
IVRCL INFRAS 4.59 (4.49) 114782
KAKATIYA CEM 290.10 (293.40) 15978
KALLAM SPG 30.80 (29.55) 150468
KAVERI SEED 468.35 (473.60) 16606
KCP LTD 127.30 (127.35) 7252
KNR CONSTRUC 297.75 (307.80) 9867
LANCO INDUS 361.75 (361.55) 5666
LANCO INFRAT 1.20 (1.15) 1217808
LAURUS LABS 517 (518.35) 6582
MEGA SOFT 13.72 (14.21) 11269
MIC ELECTRON 7.09 (6.79) 29372
MOLD-TEK.TEC 61.65 (60.85) 4710
MOLDTK PLA 320.60 (320.50) 6513
NAGARJAGRICH 43.10 (43.75) 8476
NATCO PHARMA 776.90 (784.95) 28425
NAVA BH VENT 147.95 (148.25) 8783
NCC 123.40 (123.75) 313226
NETTLINX 82.80 (86.05) 30894
NIHAR INFO 14.80 (14.50) 550
PANKAJ POLY 11.25 (12.50) 9289
PENNER IND 59.25 (61.75) 46057
PHYTOCHEM I 65.60 (64.95) 3399
PITTI LAMIN 91.10 (92.55) 8473
POKARNA 210.70 (211.95) 3059
PRAJAY ENGS 12.90 (12.30) 34489
PRISM CEMENT 124.65 (122.95) 126548
PRUDENTL PHA 4.26 (4.44) 240697
RAIN INDUSTR 383.60 (376.65) 554776
RAM INFORMAT 38.90 (39) 3056
SAMKRG PIST 300 (298.10) 6216
SATVAH. ISPA 21.15 (19.25) 12406
SMS PHARMA 89.75 (90.30) 2628
SREE RAYAL A 56.40 (57.90) 171865
STEEL EXCHAN 29.60 (31.10) 29745
SUJANA METAL 1.37 (1.43) 12502
SUJANA TOWER 3.99 (3.90) 7681
SUJANA UNIVE 0.94 (0.94) 67786
SUVEN PHARMA 190.45 (191.10) 28687
TAJ GVK HOTE 164 (163.50) 3200
TANLA 30.60 (30.70) 17855
TERA SOFTWAR 62 (63.05) 14679
VICEROY HOTE 15.60 (15.85) 40376
VIMTA LABS 205.90 (204.55) 2065
VISAKA IND 677.15 (670.55) 10446
VISTA PHARMA 41.50 (42.30) 41283
VIVIMED LABS 78.05 (79.60) 63967
VJIL CONSULT 17.60 (16.80) 807
YBRANT DIGIT 5.43 (5.41) 150280
ZENTECH 118.05 (118.35) 21694

స్కోడా ధరలు రూ.35,000 వరకు పెంపు

దిల్లీ: స్కోడా ఆటో ఇండియా తన అన్ని మోడళ్ల ధరలను రూ.35,000 వరకు పెంచింది. కేంద్ర బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం పెంచడంతో, ఆ భారాన్ని మార్చి 1 నుంచి వినియోగదార్లకు బదలాయించాలని కంపెనీ భావిస్తోంది. 'కస్టమ్స్ సుంకం ప్రభావాన్ని పూర్తిగా బదలాయించడానికి దశలవారీగా ధరలు పెంచుతాం. ప్రస్తుతం 1% మేర మాత్రమే పెంచుతున్నాం. అంటే రూ.10,000-35,000 వరకు మా అన్ని మోడళ్ల ధరలు ప్రియం కావచ్చు. వాహనం, రకాన్ని బట్టి మొత్తం మీద 3-4 శాతం వరకు ధరల పెంపు ఉంటుంద'ని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. రాపిడ్ (రూ.8.32 లక్షలు) మొదలుకొని.. కొడియాక్(రూ.34.5 లక్షలు) వరకు ఈ కంపెనీ వివిధ కార్లను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.



బ్యాంకులను ప్రైవేటీకరించాలి



- ఎయిరిండియా ప్రైవేటీకరణ మంచిదే
- 'పీఎన్‌బీ'లో ఆర్‌బీఐ పొరబాటు ఉండకపోవచ్చు
- గోద్రేజ్ గ్రూప్ ఛైర్మన్ ఆది గోద్రేజ్

దిల్లీ: పీఎన్‌బీలో రూ.వేల కోట్ల మోసపూరిత లావాదేవీలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రభుత్వం ప్రైవేటీకరించాలని.. తద్వారా మెరుగైన యాజమాన్య నిర్వహణ తీసుకురావాలని గోద్రేజ్ గ్రూప్ ఛైర్మన్ ఆది గోద్రేజ్ పిలుపునిచ్చారు. ఈ ప్రైవేటీకరణ అనేది కేవలం బ్యాంకులకే పరిమితం చేయకుండా.. ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకూ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అన్నారు. 'ప్రభుత్వ రంగంలో అన్ని బ్యాంకుల అవసరం ఉన్నట్లు నాకు అనిపించడం లేదు. మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు మరీ ఎక్కువగా ఉన్నాయి. వాటిని ప్రైవేటీకరించాల'ని బుధవారమిక్కడ జరిగిన ఏఐఎమ్ఏ సదస్సు అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పేర్కొన్నారు. 'మంచి విషయం ఏమిటంటే ఎయిరిండియాను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ కూడా మంచి అడుగు అవుతుంద'ని పేర్కొన్నారు. 'ప్రైవేటు బ్యాంకుల్లో మంచి నిర్వహణ ఉంటోంది. ఇప్పటిదాకా పెద్ద కుంభకోణాలేమీ అందులో బయటపడలేదు. ప్రతి చోటా అవకతవకలు జరుగుతుంటాయి. కానీ ప్రైవేటులో వాటిని అదుపులో పెట్టే వ్యవస్థ సమర్థంగా పనిచేస్తోంది. అందుకే పెట్టుబడుల ఉపసంహరణతో పాటు.. సంస్థల ప్రైవేటీకరణ పైనా దృష్టి సారించాలి. వాజ్‌పేయీ ప్రభుత్వం చాలా సంస్థలకు ప్రైవేటీకరించింది. ఇప్పటి ప్రభుత్వం కూడా ఆ పనిచేస్తుంద'నే భావిస్తున్నానన్నారు. మరో పక్క, పీఎన్‌బీ విషయంలో ఆర్‌బీఐ పొరబాటు ఉందని నేను అనుకోవడం లేదన్నారు.

ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉంది

- అప్రమత్తత వైపు ఆర్‌బీఐ గవర్నరు మొగ్గు
- ఎంపీసీ సమావేశ ముఖ్యాంశాల వెల్లడి

దిల్లీ: ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నందున, ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన ఈ విషయాన్ని చెప్పారు. ఈ నెల 6-7 తేదీల్లో ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశ ముఖ్యాంశాలను బుధవారం ఆర్‌బీఐ విడుదల చేసింది. ఉర్జిత్ పటేల్ చేసిన పై వ్యాఖ్యలు అందులోనివే. కీలక రేట్లను యథాతథంగా ఉంచుతూ ఈ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఉర్జిత్‌తో సహా అయిదుగురు సభ్యులు రేట్ల యథాతథానికి ఓటు వేయగా.. మైఖేల్ దేవవ్రత పాత్రా మాత్రం 25 బేసిస్ పాయింట్ల పెంపునకు మొగ్గు చూపారని ముఖ్యాంశాలు వెల్లడించాయి. ఎవరెవరు ఏమన్నారో వారి మాటల్లోనే...

ఉర్జిత్ పటేల్: ఇటీవల కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణం అధికమయ్యే ముప్పు పెరిగినప్పటికీ.. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం ఎంత సమయం పాటు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగొచ్చనే విషయంపై స్పష్టత వచ్చింది. ప్రస్తుతం ఆర్థిక వృద్ధి పునరుత్తేజం ప్రారంభ దశలో ఉంది. ఇలాంటి సమయంలో అప్రమత్తత వైఖరి అనుసరించడం మంచిది. 2018-19లో ద్రవ్యోల్బణం నియంత్రిత లక్ష్యమైన 4 శాతానికి పైగానే నమోదు కావొచ్చని అంచనా వేస్తున్నాం. వివిధ రాష్ట్రాల్లో గృహ అద్దె భత్యం (హెచ్‌ఆర్ఏ) పెంపు, ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరపై బడ్జెట్లో ప్రతిపాదన, ద్రవ్యలోటు పెరగొచ్చనే అంచనాలు లాంటివి ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా దోహదం చేయొచ్చు. ముడి చమురు ధరలు పెరగడం కూడా ప్రభావం చూపించొచ్చు.

విరాల్ ఆచార్య (ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నరు): ప్రస్తుత ద్రవ్యోల్బణ స్థితి మున్ముందు కీలక రేట్ల పెంపునకు దారి తీయొచ్చు. వృద్ధి బలంగా ఉండి, ద్రవ్యోల్బణం నియంత్రిత లక్ష్యాన్ని మించితే 'తటస్థ' వైఖరి నుంచి 'సరళ వైఖరి ఉపసంహరణ'ను పరిశీలించాల్సి రావొచ్చు.

దేవవ్రత పాత్రా (ఎంపీసీ సభ్యుడు): కొన్ని సమావేశాలుగా రేట్లను యథాతథంగా ఉంచిన దృష్ట్యా, ఇప్పటివరకు అనుసరించిన సరళ వైఖరిని తొలగించి కీలక రేట్లను పెంచాల్సిన అవసరం ఉంది.

చేతన్ ఘటే (ఎంపీసీ సభ్యుడు): రెండు నెలల ముందుతో పోలిస్తే ద్రవ్యోల్బణం పెరగడాన్ని నియంత్రించే కొన్ని ఉపశమన అంశాలు ప్రస్తుతం కనిపిస్తున్నాయి.

మూడేళ్లలో రూ.10,000 కోట్లు

జియో ద్వారా ఉత్తర ప్రదేశ్‌లో పెడతాం: ముకేశ్



లఖ్‌నవూ: వచ్చే మూడేళ్లలో ఉత్తరప్రదేశ్‌లో జియో ద్వారా మరో రూ.10,000 కోట్లు పెట్టుబడులు పెడతామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఆ రాష్ట్ర పెట్టుబడిదార్ల సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి దోహదపడటం నా బాధ్యత' అని అన్నారు. ఈ సదస్సును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. జియో సేవల ప్రారంభానికి రాష్ట్రంలో ఇప్పటికే రూ.20,000 కోట్లకు పెట్టుబడులు పెట్టామని అంబానీ వివరించారు. 'గంగా ప్రక్షాళన' కార్యక్రమానికి ముకేశ్ అంబానీ పూర్తి మద్దతు ప్రకటించారు. 'ఈ బృహత్ కార్యక్రమానికి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా తోడ్పాటు ఇవ్వాలని భావిస్తున్నాం. ప్రాజెక్ట్‌లో ఏ పని అప్పగించినా.. పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని ముకేశ్ తెలిపారు. వచ్చే రెండు నెలల్లో రెండు కోట్ల జియో ఫోన్లను అందుబాటులోకి తెస్తామని అన్నారు. 2018 చివరకు ప్రతి గ్రామంలోను జియో సేవలు అందుబాటులోకి ఉంటాయని హామీ ఇచ్చారు. ఉత్తర్ ప్రదేశ్‌లో జియో ద్వారా 40 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించామని, వచ్చే మూడేళ్లలో మరో లక్ష కొత్త ఉద్యోగాలు వస్తాయని అన్నారు. రాష్ట్రంలో 30,000 మంది సామర్థ్యం కలిగిన ప్రాంగణం ఏర్పాటు చేస్తామని ఐటీ దిగ్గజం టీసీఎస్ ప్రకటించింది. అదానీ రూ.35,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలు వెల్లడించగా, ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.250 కోట్ల పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇక ఉత్తర్ ప్రదేశ్‌లో విద్యుత్ వాహనాల తయారీ ప్లాంట్ నెలకొల్పనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడించారు.

అమ్మకాల రిటర్న్‌ల దాఖలు సులభతరం

ఒకటే చోట ఐటీసీ, నగదు నిల్వ సమాచారం

దిల్లీ: అమ్మకాల రిటర్న్‌ల దరఖాస్తు జీఎస్‌టీఆర్- 3బీ దాఖలు ప్రక్రియను సరళీకరించినట్లు జీఎస్‌టీ నెట్‌వర్క్ వెల్లడించింది. దీని వల్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) నిల్వ ఎంత ఉందో రిటర్న్‌ల ఫారంలో వ్యాపారులు చూసుకునే వీలుంటుందని పేర్కొంది. 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను ఉపయోగించే విషయంలో పన్ను చెల్లింపుదార్లు తరుచు పొరపాట్లు చేస్తున్నారు. దీంతో ఐటీసీ మినహాయించగా, నగదు రూపేణా ఇంకెంత చెల్లించాలో లెక్కించడంలో తప్పులు దొరుకుతున్నాయి. అందుకే యూజర్ ఇంటర్‌ఫేస్‌ను మెరుగుపర్చడం, రీడిజైనింగ్ ప్రక్రియ ద్వారా జీఎస్‌టీఆర్-3బీ దాఖలును సలుభతరం చేశామ'ని జీఎస్‌టీఎన్ సీఈఓ ప్రకాశ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఒకటే చోట అవసరమైన మొత్తం సమాచారం కనిపించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. తాజా మార్పుల అనంతరం ఐటీసీ నిల్వ, నగదు సమాచారం తెర పైన కనిపిస్తాయి. ఏయే పద్దుల్లో ఎంతెంత పన్ను చెల్లించాలో దాని కింద కనిపిస్తుంది. ఐటీసీని వాడుకోగానే, ఇంకా చెల్లించాల్సిన పన్ను విలువ కూడా మారుతుంది. అప్పుడు ఆ పన్ను మొత్తానికి సమానంగా నగదుతో చెల్లింపులు చేస్తే సరిపోతుంది. దీనికి తగ్గట్లుగా నగదు చెల్లింపులకు సంబంధించి చలానాల విషయంలోనూ మార్పులు చేశారు.



జనవరి నెలకు 56 లక్షల జీఎస్‌టీ రిటర్న్‌ల దాఖలు

జనవరి నెలకు సంబంధించి 56.30 లక్షల రిటర్న్‌లు దాఖలయ్యాయని జీఎస్‌టీఎన్ (వస్తు, సేవల పన్ను నెట్‌వర్క్) ఛైర్మన్ అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ఒక నెలకు సంబంధించిన రిటర్న్‌లను మరుసటి నెల 20వ తేదీ వరకు సమర్పించాల్సి ఉంటుంది. అందువల్ల జనవరి రిటర్న్‌లకు ఫిబ్రవరి 20తో గడువు ముగిసింది. అయితే గడువు ముగిశాక కూడా ఆలస్య రుసుం చెల్లించి రిటర్న్‌ల దాఖలు చేసే వీలుంది. అందువల్ల మరింత మంది వ్యాపారులు రిటర్న్‌లు దాఖలు చేసే అవకాశం ఉండటంతో, రిటర్న్‌ల సంఖ్య పెరగొచ్చు. 56.03 లక్షల రిటర్న్‌లపై ప్రభుత్వానికి రూ.86,703 కోట్ల ఆదాయం వచ్చింది.

డెట్ పథకాలకు పెరుగుతున్న ఆదరణ

మిరే అసెట్ ఫిక్స్‌డ్ ఇన్‌కం హెడ్ మహీంద్ర కుమార్

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడుల్లో వైవిధ్యం కోసం మార్కెట్ ఆధారిత సురక్షిత పథకాల వైపు మదుపర్లు మొగ్గు చూపిస్తున్నారని మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫిక్స్‌డ్ ఇన్‌కం హెడ్ మహీంద్ర కుమార్ జాజూ అన్నారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు పెరుగుతూ ఉండటం, ఫెడ్ వడ్డీ రేట్లలో వృద్ధి మన మార్కెట్‌లోకి పెట్టుబడుల ప్రవాహాన్ని కాస్త తగ్గిస్తోందని పేర్కొన్నారు. మార్కెట్లలో కాస్త దిద్దుబాటు కూడా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటప్పుడు 1-3 ఏళ్లలోపు షార్ట్ టర్మ్ ఫండ్లలో మదుపు చేసేందుకు మంచి సమయం అన్నారు. గత ఐదేళ్లకాలంలో షార్ట్ టర్మ్ పథకాలు 8-9శాతం రాబడినిచ్చాయన్నారు. బంగారం, స్థిరాస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పెద్దగా రాబడి రాని పరిస్థితుల్లో మదుపరులకు ఇవి మంచి అవకాశాన్నిస్తున్నాయని తెలిపారు. మిరే అసెట్ షార్ట్ టర్మ్ ఫండ్ పేరుతో తొలిసారి ఈ విభాగంలో కొత్త పథకాన్ని విడుదల చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 9 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుందనీ, కనీస పెట్టుబడి రూ.5వేలనీ తెలిపారు.

బ్యాంకింగ్ రంగానికి వచ్చే ఏడాది

మంచి రోజులే!



- ఆర్‌బీఐ కొత్త నిబంధనలు ప్రయోజనకరం
- లాభాలపై పెద్ద ప్రభావం పడదు
- ఇప్పటికే అధిక కేటాయింపులు చేశాం
- గ్రామీణులకు బంగారం తాకట్టుతో రుణాలు
- ఎస్ఎమ్ఈలను జీఎస్‌టీ రిటర్నులు అడుగుతున్నాం
- గ్రామాల్లోకి సంపద నిర్వహణ సేవలు

ఇంటర్వ్యూ — బ్యాంక్ ఆఫ్ బరోడా ఈడీ ఎ.కె. గార్గ్

డిసెంబరు త్రైమాసికంలో లాభం ప్రకటించిన కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా ఒకటి. ఒత్తిడిలో ఉన్న ఆస్తుల పరిష్కారం కోసం ఆర్‌బీఐ ఇటీవల తీసుకువచ్చిన నిబంధనల వల్ల తమ లాభాలపై ఎక్కువ ప్రభావం పడదని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) ఎ.కె. గార్గ్ అంటున్నారు. నిరర్థక ఆస్తుల కోసం తాము అధిక కేటాయింపులు చేయడమే ఇందుకు కారణమని వార్తా సంస్థ కోజెన్సిస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. వివిధ అంశాలపై ఆయన ఏమన్నారంటే..

డిసెంబరు చివరినాటికి బ్యాంకు కేటాయింపుల కవరేజీ నిష్పత్తి 68 శాతంగా ఉంది. మార్చి చివరకు దీన్ని 70 శాతానికి పెంచాలని భావిస్తున్నాం. ఒక వేళ ఒత్తిడిలో ఉన్న ఆస్తులకు నిర్దేశించిన గడువులోగా పరిష్కారం లభించకపోతే వాటిని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి సిఫారసు చేస్తాం. అందుకు అనుగుణంగా కేటాయింపులు చేస్తాం. (అంతక్రితం ఉన్న రుణ పునర్నిర్మాణ పథకాలన్నిటినీ రద్దు చేసి.. నిర్దేశిత సమయంలో పరిష్కారం లభించకపోతే ఎన్‌సీఎల్‌టీకి సిఫారసు చేయాలని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.) డిసెంబరు చివరకు నికర నిరర్థక ఆస్తులు 4.97 శాతానికి చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరకు 5 శాతం దిగువనే ఉంచాలని బ్యాంకు భావిస్తోంది.

పరిష్కరించాలన్నదే మా ధ్యేయం

ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన కొత్త నిబంధనల వల్ల ప్రయోజనమే ఎక్కువ. మేం కూడా నిరర్థక ఆస్తులకు పరిష్కారం కోసమే వేచిచూస్తున్నాం. తాజా నిరర్థక ఆస్తులను అదుపులో ఉంచుకోవడానికి, బకాయిల వసూళ్లు పెరగడానికి కేంద్రీకృత న్యాయ బృందం ద్వారా ప్రయత్నాలు చేస్తున్నాం. బ్యాంకు నిర్వహణ లాభంలో ఆ ప్రయత్నాలు ప్రతిఫలిస్తున్నాయి కూడా. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే అక్టోబరు-డిసెంబరులో నికర లాభం 68.5 శాతం తగ్గినా.. నిర్వహణ లాభం 20 శాతం పెరిగింది.

ఒత్తిడిలో ఉన్న ఆస్తుల నిర్వహణపై బ్యాంకు దృష్టి కొనసాగనున్నప్పటికీ. రుణ పుస్తకాన్ని పెంచుకోనున్నాం. అయితే అందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రిటైల్, చిన్న, మధ్య తరహా కంపెనీలకిచ్చిన రుణాల వసూళ్లు బాగున్నాయి. కార్పొరేట్ రుణాలు బాగుంటాయి కానీ.. సంస్థల ఎంపిక విషయంలో జాగ్రత్త పడాలి. చిన్న సంస్థల బృందాలకు రుణాలు ఇవ్వడం ద్వారా బకాయిలను రాబట్టుకోడానికి వీలుండేలా జాగ్రత్త తీసుకుంటున్నాం. దీని వల్ల కార్పొరేట్ పుస్తకం రాణిస్తుంది.

ఇతర బ్యాంకులు మమ్మల్ని అనుసరిస్తున్నాయ్

మంచి క్రెడిట్ స్కోరు ఉండే వినియోగదార్లకు తక్కువ వడ్డీ రేట్లకే రుణాలు ఇవ్వడం మా నుంచే ఇతర బ్యాంకులూ అలవరచుకున్నాయి. 800 క్రెడిట్ స్కోరు ఉండే వారి గృహ రుణాల వాటా 15 శాతం నుంచి 37 శాతానికి పెరిగింది. దాంతో పాటు ఆస్తుల నాణ్యత సైతం రాణించింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు రుణాలిచ్చే సమయంలో జీఎస్‌టీ రిటర్నులను కోరుతున్నాం. తద్వారా రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం వారికి ఎంతుందో మనకు అర్థమవుతుంది. మంచి సంస్థలకు సేవలందించే చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు రుణాలిచ్చే ప్రయత్నాలు చేస్తున్నాం.

గ్రామాలపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ విభాగంలోనూ అందుబాటు ధరలో గృహాల నిర్మాణానికి మా వంతు సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక్కడ ఎగవేతలు అరుదుగా ఉంటాయి. తద్వారా గ్రామీణ, పాక్షిక పట్టణ రుణాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో బంగారం, ఆభరణాలు తాకట్టు పెట్టుకోవడం ద్వారా రుణాలిస్తాం. వీటిపై వసూలు చేసే వడ్డీరేటు, ప్రైవేటు, అనధికారిక రుణ దాతలు వసూలు చేసే వడ్డీలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటాయి. చిన్న, మధ్యస్థాయి కంపెనీలకు సంపద నిర్వహణ, విదేశీ మారక సేవలు అందించాలని అనుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా సేవలను విస్తరించడానికి 150 మంది సుశిక్షితులైన సిబ్బందిని ఏర్పాటు చేశాం.

ఒక రూపాయి ఆదా చేస్తే.. దాన్ని సంపాదించినట్లే

'ఒక రూపాయి ఆదా చేస్తే... ఒక రూపాయిని సంపాదించినట్లే' అని మేం నమ్ముతాం. నాణ్యమైన రుణాలు పెంచుకోవడం, కార్యకలాపాల హేతుబద్ధీకరణ, కేటాయింపుల్లో ఇది మా సిద్ధాంతం. 2016-17 అక్టోబరు-డిసెంబరుతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం అదే మూడు నెలల్లో బ్యాంకు వ్యయాలు, ఆదాయాల (కాస్ట్-టు-ఇన్‌కమ్) నిష్పత్తి 47.14 శాతం నుంచి 39.84 శాతానికి తగ్గింది. ఇండ్-ఏఎస్ అకౌంటింగ్ ప్రమాణాలకు మారడంపై ఇంకా స్పష్టత లేదు. కొత్త వ్యవస్థకు మారడానికి ప్రభుత్వం నుంచి వచ్చే రూ.5375 కోట్ల మూలధనాన్ని ఉపయోగించుకోనున్నాం. ఇలా మారడం వల్ల ట్రెజరీ మార్క్‌డ్-టు-మార్కెట్ వ్యయాలు పెరుగుతాయి. మొండి బకాయిలకు కేటాయింపులను పెంచవచ్చు.

మూలధనం అందుకే

మాకు వృద్ధి కోసం మాత్రమే మూలధనం కావాలి. దాని ద్వారా మరింత ముందుకు వెళ్లడానికి అవకాశాలు ఏర్పడతాయి. మార్చి చివరకు చూసినా మా వృద్ధి అంచనాలు మెరుగ్గానే ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం, ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా బ్యాంకులకు మంచి ఏడాదే అవుతుందని ఆశిస్తున్నా.

రోటామాక్‌ది అప్పుడే మొండిఖాతా

- 2015-16లోనే కేటాయింపులు చేశాం
- ఎక్స్ఛేంజీలకు తెలిపిన బ్యాంక్ ఆఫ్ ఇండియా

దిల్లీ: రోటామాక్ గ్రూపు బాధిత బ్యాంకుల జాబితాల్లో మరో ప్రభుత్వ రంగ బ్యాంకు చేరింది. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులతో పాటు తాము కూడా ఆ సంస్థకు రుణం ఇచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తెలిపింది. రోటామాక్ కూడా బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాన్ని వేరే అవసరాలకు వినియోగించిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీలకు పైవిధంగా బీఓఐ సమాధానం ఇచ్చింది. ఈ రుణం 2015-16లోనే మొండి బకాయిగా (నిరర్థక ఆస్తి) మారిందని పేర్కొంది. దీంతో ఈ ఎన్‌పీఏ ఖాతాకు ఇప్పటికే 100 శాతం కేటాయింపులు చేశామని తెలిపింది. అయితే రోటామాక్ గ్రూపునకు ఎంత మేర రుణం ఇచ్చిందో బ్యాంకు వెల్లడించకపోవడం గమనార్హం. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు కూడా రోటామాక్ గ్రూపునకు తాము ఇచ్చిన రుణాలు, వాటా తాజా పరిస్థితిపై ఇప్పటికే ఎక్స్ఛేంజీలకు వెల్లడించిన సంగతి తెలిసిందే.



రూ.517 కోట్లు ఇచ్చాం: అలహాబాద్ బ్యాంక్

రోటామాక్ గ్రూపునకు రూ.516.79 కోట్లు అప్పుగా ఇచ్చామని అలహాబాద్ బ్యాంక్ వెల్లడించింది. ఇందులో రోటామాక్ ఎగ్జిమ్‌కు సొంతగా రూ.43.09 కోట్లు ఇవ్వగా. . ఇతర బ్యాంకులతో కలిసి రోటామాక్ గ్లోబల్‌కు రూ.314.56 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంకర్‌గా ఏర్పాటైన బ్యాంకుల కన్సార్టియం ద్వారా రోటామాక్ ఎక్స్‌పోర్ట్స్‌కు రూ.159.14 కోట్లు చొప్పున ఇచ్చినట్లు ఎక్స్ఛేంజీలకు అలహాబాద్ బ్యాంక్ తెలియజేసింది. ఈ రుణం మొండి బకాయిగా మారడంతో ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా కేటాయింపులు చేసినట్లు పేర్కొంది. రోటామాక్ గ్లోబల్, రోటామాక్ ఎక్స్‌పోర్ట్స్ రుణ ఖాతాలపై జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద పిటిషన్ దాఖలు చేశామని తెలిపింది. 2017 సెప్టెంబరు 20న ఈ పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ స్వీకరించిందని వివరించింది. రోటామాక్ గ్రూపునకు చెందిన మూడో కంపెనీ రోటామాక్ ఎగ్జిమ్ తీసుకున్న రుణాన్ని సర్ఫేసీ చట్టం కింద వసూలు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది.

డేటా ఆధారంగా రుణాలు

- జీఎస్‌టీ ఇందుకు దోహదం
- నందన్ నీలేకని

దిల్లీ: పూచీకత్తుకు బదులు డేటా ఆధారంగా రుణాలు ఇచ్చే దిశగా దేశ పరిస్థితులు మారుతున్నాయని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఆధార్ రూపకర్త నందన్ నీలేకని పేర్కొన్నారు. ఆస్తుల హామీ స్థానంలో సంబంధిత సంస్థలు/వ్యక్తుల రుణ చరిత్ర, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో నమోదైన వ్యాపార వివరాలు వంటివి ప్రామాణికంగా తీసుకునే పరిస్థితి వస్తుందని వివరించారు. జీఎస్‌టీలో నమోదైన సంస్థ వ్యాపార వివరాల ఆధారంగా రుణం పొందడం తొలిసారి అని తెలిపారు. 'జీఎస్‌టీలో ఇన్‌వాయిస్‌గా రిటర్ను దాఖలు చేస్తున్నారు. తదుపరి మీ వివరాలు ఇవ్వమని జీఎస్‌టీని కోరొచ్చు. ఆ సమాచారాన్నే రుణదాతకు మీరు అందించవచ్చు. నమోదైన కోటి వ్యాపార సంస్థలన్నింటికీ ఈ అవకాశం లభిస్తుంది. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) కూడా ఇందుకు అంగీకరిస్తాయి. ఈ పద్ధతిలో వ్యాపార వివరాలే కీలకం. అందువల్ల వస్తు కొనుగోలుదార్లు, అమ్మకందార్లు కూడా రుణాలు పొందొచ్చు. ఆస్తులు లేని చిన్న వ్యాపారులు కూడా రుణం పొందేందుకు వీలవుతుంది. నిజమైన వ్యాపార సంస్థలకు కావాల్సింది ఇదే. లక్షల మంది చిన్న వ్యాపారులకూ రుణాలు అందితే ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజితం అవుతుంది' అని ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవంలో నీలేకని తెలిపారు. జీఎస్‌టీ రిటర్నులను సులభతరం చేసేందుకు నియమితులైన సంఘంలో నీలేకని కూడా సభ్యులే. జీఎస్‌టీ రిటర్ను అనేది ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా, వ్యాపారంలో భాగంగా మారేలా చూస్తామని వివరించారు. 2018 డిసెంబరు కల్లా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు నెలకు కోటి వరకు జరుగుతాయనే అంచనా ఉందని, నగదు రహిత సమాజం దిశగా దేశం సాగుతుందనేందుకు ఇదే నిదర్శనం అని పేర్కొన్నారు.





ఎయిరిండియాలో ఎంత వాటా అమ్మాలో నిర్ణయించలేదు

మంత్రి అశోక్ గజపతి రాజు

దిల్లీ: ఎయిరిండియాలో ఎంత వాటా విక్రయించాలనే విషయమై ఇప్పటివరకు ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు వెల్లడించారు. రుణభారంతో సతమతమవుతూ, ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న ఎయిరిండియాను ప్రైవేటీకరించేందుకు గతేడాది కేంద్ర మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఎయిరిండియాలో వాటా విక్రయానికి ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలో నిర్ణయించేందుకు మంత్రుల బృందాన్ని ప్రభుత్వం నియమించింది. 'ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదు. చర్చోపచర్చలు, విస్తృత సంప్రదింపులు జరగాలి. ఎయిరిండియాలో ఎందుకు వాటా అమ్ముతున్నారు.. వాటా అమ్మకుండా, మున్ముందు మార్కెట్ విస్తృతమైనప్పుడు అప్పులు చెల్లించుకోవచ్చు కదా అని కొందరు సలహా ఇస్తున్నారు. మీరు కూడా సలహాలు చెప్పొచ్చు. మేం వాటిని స్వీకరించేందుకు సిద్ధమ'ని విలేకర్ల సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. అయితే ఎయిరిండియాలో 51 శాతానికి పైగా వాటాను ప్రైవేట్ రంగానికి అప్పగిస్తామని ఈ నెల మొదట్లో కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా వెల్లడించడం గమనార్హం. ఎయిరిండియాలో కనీసం 51 శాతం వాటాను ఓ ప్రైవేట్ సంస్థకు విక్రయించాలనే విషయంపై పౌరవిమానయాన శాఖలోని ఓ ఉన్నతాధికారి స్పష్టతనిస్తూ 'వాటా కొనుగోలుకు ఆసక్తి వ్యక్తం చేస్తూ దాఖలైన పత్రానికి (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ డాక్యుమెంట్) మంత్రుల బృందం ఆమోదం తెలిపిన తరవాతే ఎంత మేర వాటా విక్రయించాలనే విషయం ఖరారు అవుతుంద'ని తెలిపారు.

కుంగుబాటు.. వద్దు తడబాటు

- సినీనటి దీపికా పదుకొణె

ఈనాడు – హైదరాబాద్

ప్రజల్లో కుంగుబాటు ప్రపంచం ముందు ఓ వ్యాధిలా రానుంది.. ప్రతి ముగ్గురిలో ఒకరు తమ జీవితంలో ఒక సారి ఈ రుగ్మత ఎదుర్కొంటున్నారు.. కుంగుబాటు సమస్య నుంచి రాత్రికిరాత్రి బయటపడటం సాధ్యం కాదు.. మానసిక వైద్యుల చికిత్స, సూచనలు సలహాలతో నెమ్మదిగా సాధారణ జీవితానికి రావచ్చు..2014లో నేను కుంగుబాటుతో బాధపడుతున్నపుడు నా తల్లి పరిస్థితిని గుర్తించి సకాలంలో చికిత్స అందించారు.. గెలుపోటములు మానవ జీవితంలో అంతర్భాగం..అనుభవాలే జీవిత విలువను తెలియజేస్తాయని సినీనటి దీపికా పదుకొణె అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు పిల్లల్లో సమస్యలు గుర్తించాలని, తమతో బాధలు చెప్పుకునే స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. మీరొక్కరే కుంగుబాటు సమస్యలో లేరు. మీరు ఒంటరివారు కాదు అన్న ధైర్యం చెప్పి సహాయం చేయాలన్నారు. జనరల్ ఫిజీషియన్లకు మానసిక వైద్యంపై లోతైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని, కార్పొరేట్ కంపెనీలూ మానసిక వైద్యులను నియమించాలని ఆమె సూచించారు. బుధవారమిక్కడ ప్రపంచ ఐటీసదస్సులో 'మానసిక వైద్యం'పై జరిగిన ప్లీనరీలో దీపిక మాట్లాడారు.

దీపిక మాట్లాడుతుందని తెలియగానే మధ్యాహ్నం మూడు గంటలకే ఐటీ కాంగ్రెస్ జరుగుతున్న హెచ్ఐసీసీ సభా ప్రాంగణం నిండిపోయింది. కొద్దిమంది నిలుచొనే ఆమె మాటలను ఆసక్తిగా విన్నారు. మధ్యాహ్నం



దీపికా పదుకొణెతో మంత్రి కేటీఆర్ కరచాలనం


3.25కు మాట్లాడటం ప్రారంభించిన దీపిక 4.10 ప్రాంతంలో ముగించి వెంటనే సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఒకరిద్దరు ఆమె ప్రసంగం మధ్యలో ప్రశ్నలడిగారు. తన అనుభవాలకు సూచనలు జత చేస్తూ ఆమె ప్రసంగం సాగింది. 'కుంగుబాటుతో బాధపడుతున్నపుడు ఇంటి నుంచి బయటకు రావాలని, ఇతరులను చూడాలని, మాట్లాడాలని అనిపించలేదు. నాలో నేను బాధపడుతుండేదానిని. అమ్మ నా పరిస్థితిని చూసి, నాతో మాట్లాడి సమస్యను గుర్తించి చికిత్స ఇప్పించారు. వైద్యుల సూచన మేరకు జీవనశైలి మార్చుకున్నా. ఎక్కువగా నిద్రపోవడం, సరైన సమయంలో ఆహారం, మందులు తీసుకొని వేదన నుంచి బయటపడ్డాను. మా అమ్మతో నాకున్న చనువు కారణంగా సమస్య నుంచి బయటపడి ఇప్పుడిలా మీ ముందు ఉన్నాను.

ఒకరి ప్రాణాన్ని అయినా కాపాడాలని...

ఈ రుగ్మత నుంచి బయటపడినందున కనీసం ఒక్కరి జీవితాన్నయినా రక్షించాలన్న ఉద్దేశంతో 'ది లివ్ లవ్ లాఫ్' ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కల్పిస్తున్నాం. కర్ణాటకలోని దావనగిరిలో నిర్వహించిన కార్యక్రమాలు ఎంతో సంతృప్తి ఇచ్చాయి. కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల్లో 42.5శాతం మంది కుంగుబాటుతో బాధపడుతున్నారు. వచ్చే ఏడాదికి ఈ సంఖ్య తగ్గాలి. చాలా మంది తమలోని సమస్యను విభాగాధిపతులకు చెప్పరు. చికిత్సకు సమయం కావాలని కోరితే ఎక్కడ ఉద్యోగం నుంచి తీసివేస్తారోనని ఆందోళనతో సమస్యను జటిలం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ సంస్థల యజమానులు, నిర్వాహకులు తమ సంస్థల్లో మానసిక వైద్యులను నియమించి ఉద్యోగులకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని తప్పనిసరి చేయాలి.'

మోసం నేటి నైజం.. ఆదర్శం నాటి నిజం!

- రూ.వేల కోట్లు ఎగవేసిన నీరవ్ మోదీ
- ఆఖరిపైసా సహా రుణం చెల్లించిన లాల్‌బహదూర్ శాస్త్రి కుటుంబం
- ఇద్దరూ ఒకే బ్యాంకు ఖాతాదారులు



దిల్లీ: బ్యాంకులను మోసగిస్తూ రూ. వేల కోట్లు ఎగవేస్తున్న నీరవ్ మోదీ లాంటి ప్రబుద్ధులది నేటి కథ..

కానీ ప్రధాని పదవిలో ఉండికూడా కారు కొనుక్కోవడానికి డబ్బుల్లేక.. లాల్‌బహదూర్ శాస్త్రి బ్యాంకులో రుణం తీసుకోగా, ఆఖరి నయాపైసాతో సహా ఆ కుటుంబం తిరిగి చెల్లించడం నాటి ఆదర్శ చరిత్ర..

విశేషమేమిటంటే నీరవ్ మోదీ మోసగించిన అదే పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కు మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వంటి నిజాయతీపరులైన ఖాతాదారులుండటం.. రూ. 11,400 కోట్ల బ్యాంకు మోసం దేశాన్ని కుదిపేస్తున్న నేపథ్యంలో పీఎన్‌బీకి సంబంధించిన ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిరాడంబరతకు నిలువుటద్దంలా జీవించి.. ప్రధాని పదవికే వన్నెతెచ్చిన లాల్‌బహదూర్ శాస్త్రి, అప్పట్లో అదే బ్యాంకు నుంచి రూ. 5 వేల రుణం తీసుకుని కొద్ది కాలానికే చనిపోగా.. ఆయన సతీమణి తన పెన్షన్ నుంచి ఆ మొత్తం తిరిగి చెల్లించారు. అప్పు తీసుకుంటే ఎంత భద్రంగా తిరిగి చెల్లించాలో.. అలాంటి మహనీయులను చూసి నేర్చుకోవాల్సిందే. నాటి జ్ఞాపకాలను, అప్పటి పరిస్థితులను లాల్‌బహదూర్ శాస్త్రి కుమారుడు, సీనియర్ కాంగ్రెస్ నేత అనిల్ శాస్త్రి వివరించారు.

“అది 1964 నాటి మాట.. మేము సెయింట్ కొలంబియా స్కూలుకు ప్రతి రోజూ గుర్రపుబండి (టాంగా)లో వెళ్లేవాళ్లం. ఎప్పుడైనా అధికారిక వాహనం(ఆఫీస్ కారు)లో వెళతామంటే నాన్న ఒప్పుకొనేవారు కాదు. వ్యక్తిగత పనులకు ప్రభుత్వ వాహనం వాడరాదన్నది ఆయన నిబద్ధత. దీంతో ఇంట్లో మేమంతా కారు కొందామని పట్టుబట్టగా నాన్న అంగీకరించారు. నాటి ప్రధాని ప్రత్యేక సహాయకుడు వి.ఎస్.వెంకట్రామన్ వాకబు చేసి.. కొత్త ఫియట్ కారు దాదాపు రూ. 12 వేలు ఉంటుందని చెప్పారు. అయితే అప్పటికి మా బ్యాంకు ఖాతాలో రూ. 7 వేలు మాత్రమే ఉన్నాయి. దీంతో మిగతా మొత్తానికి నాన్న బ్యాంకు రుణానికి దరఖాస్తు చేయగా.. అదేరోజు మంజూరైంది. అయితే కొద్ది కాలంలోనే విషాదం.. తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసేందుకు వెళ్లిన నాన్న 1966 జనవరిలో కన్నుమూశారు. అనంతరం మా అమ్మ తనకు వచ్చిన పెన్షన్‌తో బ్యాంకు రుణాన్ని పూర్తిగా చెల్లించారు. ”

అలా నాటి ప్రధాని అప్పుచేసి కొనుక్కున్న లేత పసుపు రంగు(క్రీమ్ కలర్) ఫియట్ కారు (డీఎల్ఈ 6) ప్రస్తుతం దిల్లీలోని 1, మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి మెమోరియల్‌లో ఉంది. కాగా తాజాగా వార్తల్లోకెక్కిన పంజాబ్ నేషనల్ బ్యాంకుకు ఘనమైన చరిత్రే ఉంది. బ్రిటిష్ హయాంలో స్వదేశీ బ్యాంకును స్థాపించాలన్న ఉద్దేశంతో 1894లో పీఎన్‌బీని ఏర్పాటు చేశారు. అంతేకాదు.. దీని పూర్వ బోర్డ్ డైరెక్టర్లలో ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతి రాయ్ కూడా ఒకరు. అంతటి ఖ్యాతి గాంచిన బ్యాంకుకు మాయనిమచ్చ మిగిలింది.

క్రమశిక్షణ పాటించకపోతే వ్యవస్థకి నష్టమే: సుప్రీంకోర్టు

దిల్లీ: న్యాయపరమైన క్రమశిక్షణ, రుజువర్తనలను కొనసాగించకపోతే వ్యవస్థకి తీరని నష్టం తప్పదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిర్ణీత అయిదేళ్ల వ్యవధిలోగా నష్టపరిహారాన్ని పొందకపోవడమనేది భూసేకరణను రద్దు చేయడానికి ప్రాతిపదిక కాదంటూ ఫిబ్రవరి 8వ తేదీన త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్య చేసింది. ఆ తీర్పు అమలును దాదాపు నిలుపుదల చేసింది. 'నష్టపరిహారం చెల్లించకపోవడమనే కారణంతో భూసేకరణను రద్దు చేయవచ్చని 2014లో ఒక తీర్పు వెలువడింది. ఆ నేపథ్యంలో ఆ అంశంపై భిన్నమైన అభిప్రాయం ఉంటే దానిని విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సింది' అని అభిప్రాయపడింది. న్యాయస్థానమంతా ఒకటేనని చెప్పడానికి క్రమశిక్షణ అవసరమని పేర్కొంది. విస్తృత ధర్మాసనమే ఈ అంశంపై విచారణ జరపాలా అనేది తేలేవరకు భూసేకరణ కేసుల్ని వాయిదా వేయాలని అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ లేవనెత్తిన అంశాన్ని ప్రస్తావిస్తూ- ఫిబ్రవరి 8వ తేదీ తీర్పును ప్రాతిపదికగా చేసుకుని హైకోర్టులేవీ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 7వ తేదీకి వాయిదా వేసింది.

నీరవ్ మోదీ డొల్ల కంపెనీల్లో ఈడీ సోదాలు

- మరో రూ.10 కోట్ల ఆస్తులు జప్తు
- అదుపులో పీఎన్‌బీ జీఎం స్థాయి అధికారి
- 2 నగరాల్లో రోటామాక్ ఆస్తుల్ని జప్తు చేసిన ఐ.టి.

ముంబయి/దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వరసగా ఏడోరోజైన బుధవారం 17 చోట్ల సోదాలు నిర్వహించి, రూ.10 కోట్ల ఆస్తుల్ని స్తంభింపజేసింది. ప్రధాన నిందితుడు నీరవ్ మోదీకి ముంబయిలో ఉన్న నాలుగు డొల్ల కంపెనీల్లో సోదాలు జరిగాయి. నీరవ్, అతని మేనమామ మెహుల్ ఛోక్సీలు వీటి ద్వారా జరిపిన లావాదేవీలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆలీబాగ్ ఏరియాలో నీరవ్‌కు ఉన్న విలాసవంతమైన ఫాంహౌస్‌కు సీబీఐ అధికారులు సీల్ వేశారు.ముంబయికి 100 కి.మీ. దూరంలో రాయ్‌గడ్ జిల్లాలో అరేబియా సముద్రానికి అభిముఖంగా 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవంతిని 2004లో రూ.32 కోట్లకు కొనుగోలు చేశారు. వజ్రాభరణాలను ప్రత్యేక ఖాతాదారులకు చూపించడం కోసం



భువనేశ్వర్‌లో ఓ నగల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఈడీ అధికారులు

ఇక్కడ విందు వినోదాలను ఏర్పాటు చేసేవారు. దాదాపు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అయిదు పడక గదుల బంగ్లా, భారీ ఈత కొలను, ఒక థియేటర్, సువిశాల గ్రంథాలయం వంటివి దీనిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీరవ్‌కు రెండు పాస్‌పోర్టులు అక్రమంగా ఉన్నాయన్న వార్తలపై తమకు సమాచారం లేదని సీబీఐ వర్గాలు తెలిపాయి.కుంభకోణంలో ప్రమేయం ఉన్నందుకు అరెస్టు చేసిన విపుల్ అంబానీ, కవితా మన్‌కికర్ సహా ఆరుగురిని బుధవారం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరికి మార్చి 5 వరకు రిమాండ్ విధించారు. నీరవ్ డొల్ల కంపెనీలపై ఆదాయపు పన్ను శాఖ కూడా వివరాలు సేకరిస్తోంది. 141 బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉన్న రూ.145.74 కోట్లు జప్తు చేసుకున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. తాజా పరిణామాలతో మొత్తం జప్తుల విలువ రూ.5736 కోట్లకు చేరింది. ఛోక్సీ రుణాలపై 2013లోనే తాను ఫిర్యాదు చేశానన్న ప్రజావేగు నుంచీ సమాచారాన్ని రాబట్టారు. పీఎన్‌బీ కుంభకోణంలో కీలక కేంద్రమైన ముంబయిలోని బ్రాడీహౌస్ శాఖకు 2009-11 మధ్య అధిపతిగా వ్యవహరించి, ప్రస్తుతం ప్రధాన కార్యాలయంలో ఉన్న జీఎం స్థాయి అధికారి రాజేష్ జిందాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. తగిన అనుమతులు లేకుండా నీరవ్ గ్రూపు సంస్థలకు ఎల్‌వోయూలు జారీ కావడం ఆయన హయాంలోనే మొదలైందని భావిస్తున్నారు.

విక్రమ్ కొఠారీని ప్రశ్నించిన సీబీఐ: మరోపక్క- రోటామాక్ కలాల తయారీ సంస్థ యజమాని విక్రమ్ కొఠారీని సీబీఐ దిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించింది. ఏడు జాతీయ బ్యాంకుల సహ వ్యవస్థకు రూ.3695 కోట్ల మేర రుణాలను ఎగవేయడంపై వివరాలు ఆరా తీసింది. రోటామాక్ ప్రధాన కార్యాలయం ఉన్న కాన్పూర్‌లో ఇప్పటికే ఒకసారి సీబీఐ అతన్ని ప్రశ్నించింది. రూ.85 కోట్ల పన్ను ఎగవేత కేసులో కాన్పూర్, అహ్మదాబాద్‌లలో రోటామాక్‌కు చెందిన నాలుగు ఆస్తుల్ని ఆదాయపు పన్ను శాఖ జప్తు చేసింది.

బ్యాంకర్లతో ఆర్థిక మంత్రిత్వశాఖ భేటీ!

పీఎన్‌బీ చెల్లింపుల సమస్యకు పరిష్కార యత్నం

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో జరిగిన భారీ కుంభకోణంతో తలెత్తిన చెల్లింపుల సమస్యను సాధ్యమైనంత త్వరగా, సామరస్యంగా పరిష్కరించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ భావిస్తోంది. రూ.11,400 కోట్లకు పైబడిన ఈ వ్యవహారంలో పీఎన్‌బీ, సంబంధిత ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉన్నతాధికారులతో త్వరలో సమావేశం నిర్వహించనుందని తెలిసింది. దీనిలో భాగంగానే ఆర్థిక సేవల విభాగం ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులను భేటీకి ఆహ్వానించనుందని విశ్వసనీయంగా తెలియవచ్చింది.

నీరవ్‌మోదీ-పీఎన్‌బీ కేసు దర్యాప్తులో ప్రభుత్వానికి స్వేచ్ఛ ఉండాలి

సిట్ దర్యాప్తునకు సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: నీరవ్‌మోదీ-పీఎన్‌బీ కుంభకోణం కేసు దర్యాప్తులో ప్రభుత్వానికి స్వేచ్ఛ ఉండాలని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థలు సరిగా దర్యాప్తు చేయడంలో విఫలమయితేనే తాము జోక్యం చేసుకుంటామని చెప్పింది. నీరవ్‌మోదీ-పీఎన్‌బీ కుంభకోణం కేసులో సిట్‌తో స్వతంత్ర దర్యాప్తు చేయించాలని న్యాయవాది వినీత్ దండా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఇప్పటికే ఎఫ్ఐఆర్ దాఖలయిందని, సీబీఐ దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ వ్యవహరించాల్సిన రీతిలో ప్రభుత్వం వ్యవహరించకపోతే అప్పుడు తమ వద్దకు రావాలని పిటిషనర్‌కు సూచించింది. విజయ్‌మాల్యా కేసులో ప్రభుత్వం ఏమీ చేయని సంగతిని దేశమంతా గమనిస్తోందని పిటిషనర్ అనగా ధర్మాసనం స్పందిస్తూ ప్రసంగాలతో కోర్టు ప్రభావితం కాదని, తాము న్యాయపరమైన అంశాలనే పరిశీలిస్తాం తప్పించి భావోద్వేగాలను కాదని స్పష్టం చేసింది. అటార్నీ జనరల్ కేంద్రం వైఖరిని తెలియజేస్తున్న సమయంలో పిటిషనర్ జోక్యం చేసుకోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. అటార్నీ జనరల్‌ను నిలువరించడం ఎక్కడా లేదంది. ఇవన్నీ ప్రచారం కోసం వేసే వ్యాజ్యాలు అని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. కేసులో నిందితులైన నీరవ్ మోదీ, ఇతరులను విదేశాల నుంచి వెనక్కు రప్పించే ప్రక్రియ మొదలు పెట్టాలని కూడా పిటిషనర్ కోరారు.

'అతి' లెక్కలు.. అన్నీ మాయలు

- నీరవ్ మోదీ కేసులో వెలుగుచూస్తున్న సిత్రాలు
- ఎగుమతి, దిగుమతుల్లోనూ గోల్‌మాల్

ఈనాడు – హైదరాబాద్

పైసా కట్టకుండానే లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయూ) తీసుకొచ్చి రూ.వేల కోట్ల రుణం పొందిన నీరవ్ మోదీ తన హైదరాబాద్ సామ్రాజ్యంలోనూ అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. ఆస్తుల విలువ పెంచి చూపించడంతోపాటు ఎగుమతి దిగుమతుల్లో గోల్‌మాల్ చేయడం, విదేశాల నుంచి నల్లధనం దేశంలోకి రప్పించుకోవడం, నకిలీ వజ్రాలతో వ్యాపారం చేయడం వంటి ఎత్తులెన్నో వేసినట్లు తెలుస్తోంది. డబ్బు పిండుకోవడానికి ఉన్న ఏ ఒక్క అవకాశాన్నీ నీరవ్ మోదీ వదులుకోలేదు. వివిధ దర్యాప్తు సంస్థలు నిర్వహిస్తున్న దాడుల్లో ఇలాంటి మోసాలెన్నో బయటపడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం..

- హైదరాబాద్‌లోని తన ఆభరణాల తయారీ యూనిట్ కోసం విదేశాల్లో వజ్రాలు కొని దిగుమతి చేసుకునేవాడు. వాటిని ఆభరణాలుగా మార్చి ఎగుమతి చేసేవాడు. ఎగుమతి, దిగుమతుల్లోనూ వాటి విలువ ఎక్కువ చూపించేవాడు. దాని మాటున నల్లధనం రప్పించేవాడు. ఉదాహరణకు విదేశాల్లో రూ.10 కోట్ల వజ్రాలు కొని వాటి విలువను రూ.100 కోట్లుగా చూపించేవాడు. 100 కోట్లకు విదేశీ బ్యాంకుల నుంచి విదేశీ మారక ద్రవ్యం పొందేవాడు. రూ.పది కోట్లు కొనుగోలుకు చెల్లించి మిగతా రూ.90 కోట్లు తన ఖాతాలో వేసుకునేవాడు. ఇదంతా నల్లధనమే. ఇలా దిగుమతి చేసుకున్న సరకుతో ఆభరణాలు తయారు చేయించి మళ్లీ విదేశాలకు ఎగుమతి చేసేవాడు. ఇప్పుడు కూడా వాస్తవ విలువ రూ.పది కోట్లుంటే రూ.వంద కోట్లు చూపించేవాడు. దిగుమతి చేసుకున్నప్పుడు తప్పుడు పత్రాలు చూపించి విదేశాల్లో దాచిన రూ.90 కోట్లను, ఎగుమతి చేసిన ఆభరణాలకు చెల్లింపులు కింద చూపించి దేశంలోకి రప్పించేవాడని అధికారులు గుర్తించినట్లు సమాచారం. విదేశాల్లోనూ మోదీకి వ్యాపార సంస్థలు ఉండడంతో ఇలాంటి లావాదేవీలు సులువయ్యేదని భావిస్తున్నారు.
- హైదరాబాద్ సంస్థలో ఉన్న వజ్రాల నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాసిరకం వజ్రాలు దిగుమతి చేసుకొని విలువ పెంచేందుకు వాటినే ఖరీదైనవిగా చూపించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.
- హైదరాబాద్‌లోని వివిధ మాల్స్‌లో నీరవ్ మోదీకి చెందిన ఆభరణాల దుకాణాల్లో స్వాధీనం చేసుకున్న సరకు విలువ రూ.10 కోట్లలోపే ఉన్నట్లు, రికార్డుల్లో అంతకు పది రెట్లు చూపించినట్లు తెలుస్తోంది.
- విలువ ఎక్కువ చూపడం వల్ల వ్యాపారం భారీగా జరిగినట్లు రికార్డుల్లో నమోదవుతుంది. ఇవి చూపించి బ్యాంకుల నుంచి ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.
- మోసం బయటపడకుండా ఉండేందుకు రికార్డుల్లో చూపించిన వ్యాపారానికి తగ్గట్టుగానే ఎప్పటికప్పుడు ఆదాయపన్ను చెల్లించాడని ఆదాయపన్ను అధికారుల తనిఖీల్లో వెల్లడైనట్లు సమాచారం.
- చివరకు హైదరాబాద్‌లో తనకు కేటాయించిన భూములను కూడా తాకట్టు పెట్టి జీవిత బీమా సంస్థ నుంచి రూ.120 కోట్ల రుణం తీసుకున్నాడు.



వినియోగదారులకు బ్యాంకింగ్‌కు సంబంధించి ప్రాథమిక ప్రశ్నలపై సమాధానాలు ఇచ్చేందుకు ఆర్‌బీఎస్ బ్యాంకు ఏర్పాటు చేసిన డిజిటల్ మానవ రూపం 'కోరా'. ఈ చిత్రాన్ని బుధవారం విడుదల చేశారు

రైల్వే పరీక్ష రాస్తే రుసుము వాపస్

దిల్లీ: ఇటీవల ప్రకటించిన రైల్వే ఉద్యోగాలకు పరీక్ష రుసుము పెంపును రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమర్థించుకున్నారు. పరీక్షలను ఆషామాషీగా తీసుకునే వారి సంఖ్యను తగ్గించేందుకు రుసుమును పెంచామన్నారు. దరఖాస్తుదారుల సంఖ్య అధికంగా ఉండటంతో పరీక్షల నిర్వహణకు చాలా వ్యయమవుతోందని అన్నారు. దీని దృష్ట్యా ఇదివరకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేని వర్గాలకు రూ.250; రూ.100 చెల్లించాల్సిన వర్గాలకు రూ.500లుగా రుసుమును నిర్ణయించామన్నారు. ఈ రుసుముల భారాన్ని తగ్గించుకొనే మార్గాన్నీ మంత్రి వెల్లడించారు. రూ.250 రుసుముతో పరీక్షకు హాజరైన వారికి పూర్తి మొత్తాన్ని, రూ.500 చెల్లించి పరీక్ష రాసిన వారికి రూ.400 తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. దీంతో పరీక్ష రుసుము పెంచినట్లు కాదని, పాత రుసుములనే అమలు చేసినట్లు అవుతుందని గోయల్ వివరించారు. రైల్వేల్లోని 90వేల పోస్టుల భర్తీకి ఇటీవల ప్రకటన జారీ అయిన విషయం తెలిసిందే.

వంటింట్లో కుక్కర్‌కూ సైబర్ ముప్పు

- భారత్‌లో ఇలాంటి ప్రమాదాలు మరింత ఎక్కువ
- అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గలేదు
- 'ఈనాడు-ఈటీవీ'తో అమెరికా సైబర్ నేర ఇంజినీరింగ్ విభాగంలో కీలకాధికారి ప్రకాశ్‌రావుశర్మ

ఈనాడు, హైదరాబాద్: సైబర్ ముప్పు కేవలం కంప్యూటరు, ల్యాప్‌ట్యాప్‌లకే పరిమితం కాదు.. మన వంటింట్లోని ఫ్రిజ్, కుక్కర్ లాంటి ఎన్నో వస్తువులకు కూడా పొంచి ఉందా? అవునంటున్నారు అమెరికా రక్షణ శాఖ కేంద్ర కార్యాలయంలో సైబర్ నేర ఇంజినీరింగ్ విభాగంలో కీలకాధికారిగా పనిచేస్తున్న కొల్లారపు ప్రకాశ్ రావుశర్మ. భారత్‌లో ఇలాంటి ముప్పు మరింత ఎక్కువని హెచ్చరిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ప్రకాశరావు ఓయూలో 1997లో బీఈ (ఈసీఈ) పూర్తి చేశారు. అనంతరం అమెరికాలో ఎంఎస్ చేశారు. కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. ఓ ఐటీ పరిశ్రమను కూడా నడిపారు. 2006 నుంచి రక్షణ శాఖ సైబర్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగులో పద్యాలు రాయటంలోనూ దిట్ట. సామాజిక మాధ్యమంలో తెలుగు ఛందస్సును బోధిస్తున్నారు. హైదరాబాద్ వచ్చిన ఆయన బుధవారం 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు.



సైబర్ ముప్పు భారత్‌లో ఎక్కువే: సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. మన ఇళ్లలో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాలు, కుక్కర్లు, ఫ్రిజులకు కూడా సైబర్ ముప్పు ఉంది. ఉదాహరణకు నేరగాళ్లు ఎక్కడో ఉండి కుక్కర్‌ను ఆన్ చేయవచ్చు. దీనివల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. భారత్‌లో ఇలాంటి వస్తువులు ఎక్కువ కాబట్టి ముప్పు కూడా అధికంగానే ఉంటుంది.

వర్చువల్ డెస్క్‌టాప్‌లతో భద్రత: అందుకే ప్రతి డేటా ఎన్‌క్రిప్ట్ చేయటం తప్పనిసరి. ప్రస్తుతం అమెరికా లాంటి దేశాల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు లేకుండా వర్చువల్ డెస్క్‌టాప్‌లు వస్తున్నాయి. అంటే అక్కడ వస్తువు ఉండదు. దానివల్ల హ్యాకర్లు వాటిల్లోకి ప్రవేశించలేరు. సమీప భవిష్యత్తులో ఇవి భారత్‌కూ వస్తాయి.

ప్రత్యేక నైపుణ్యం ఉంటే డిమాండ్: అమెరికాలో భారతీయులకు ఉద్యోగావకాశాలు తగ్గిపోతాయన్నది అపోహ మాత్రమే. గత మూడేళ్ల నుంచి కూడా ఏమీ తగ్గలేదు. ప్రత్యేక నైపుణ్యంతో కూడిన (స్పెషలైజ్డ్ ఏరియాల్లో) ఉద్యోగాల్లో భారీ డిమాండ్ ఉంది. భారత్‌లో ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంచడంపై దృష్టి కేంద్రీకరించాలి. భవిష్యత్తులో రాబోయే సాంకేతికతలను పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతీయులు ప్రతిభావంతులు అనడంలో సందేహమే లేదు. అయితే అమెరికాలో ఐటీ రంగంలో మనవాళ్లు అధికంగా ఉన్నా మెజారిటీ సంఖ్యలో మాత్రం లేరు.

దేశభక్తి పెరిగితేనే అవినీతికి అడ్డుకట్ట: భారత్‌లో అవినీతి తగ్గాలంటే అది మూలాల నుంచి రావాలి. ప్రజల్లో దేశభక్తి మరింత పెరగాలి. మనది.. మన దేశం అని అందరూ అనుకోవాలి. లంచం అడిగితే నిలదీయాలి. మీడియా దృష్టికి తీసుకురావాలి.

రామోజీరావు విశేష కృషి

మాతృభాషను పరిరక్షించుకోవడం అత్యంత అవసరం. అందుకు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగు సబ్జెక్టును చదవడం తప్పనిసరి చేయాలి. పాలనా వ్యవహారాలు కూడా తెలుగులోనే కొనసాగాలి. అప్పుడే తెలుగు వెలుగుతుంది. ప్రజలకూ సౌకర్యంగా ఉంటుంది. తెలుగు భాషా వికాసానికి రామోజీ గ్రూపు సంస్థల అధిపతి రామోజీరావు విశేష కృషి చేస్తున్నారు.

చెడు చేతుల్లోకి సాంకేతికత వద్దు

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ చాలా శక్తివంతమైనవని, దీన్ని మరింత అద్భుతంగా ఉపయోగించడం ప్రజల చేతుల్లో ఉందని సైబర్ క్రైమ్ నిపుణుడు, సాంస్కృతిక శాస్త్రవేత్త జర్నలిస్టు బెర్న్ హమ్మెర్‌స్లే తెలిపారు. సాంకేతిక వ్యవస్థ రూపొందించేటప్పుడే దాన్ని ఏవిధంగా నియంత్రించాలన్న విషయాన్ని చూడాలని సూచించారు. మాల్‌వేర్‌లతో దేశాల మధ్య సైబర్‌వార్ జరుగుతోందని, కొన్నింటిని ప్రభుత్వ సంస్థలే సిద్ధం చేస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధస్సును సరైన వ్యక్తులు, మంచి పనుల కోసం ఉపయోగించాలని సూచించారు. ప్రపంచ ఐటీ సదస్సులో '2020 నేరాలు - తదుపరి అతిపెద్ద చెడు' అంశంపై జరిగిన ప్లీనరీలో ఆయన మాట్లాడారు. 'సైబర్ నేరాలు కొత్త రూపాల్లోకి వెళ్తోన్నాయి. సోషల్‌మీడియా, స్పామ్ ఇతరత్రా చిన్న సమాచారం తెలిసినా విదేశాల్లోని హ్యాకర్లు ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పుడు బ్లాక్‌చైన్ పెద్ద పదమైంది. దీని గురించి మాట్లాడేవారు దాన్ని ఉపయోగించుకునే వారికన్నా ఎక్కువగా డబ్బు సంపాదిస్తారు. కృత్రిమ మేధస్సు సమస్యలను పరిష్కరించలేదు. కానీ వేగంగా సేవలు అందించగలదు. మంచి టెక్నాలజీ, చెడు టెక్నాలజీ రెండూ ఉంటాయి. ప్రజల మంచి కోసం విలువలతో దీన్ని ఉపయోగించడం ద్వారా మెరుగైన సమాజాన్ని సిద్ధం చేసుకోవచ్చు.'

అట్రాసిటీ కేసులపై నెల రోజుల్లో నివేదిక

జాతీయ ఎస్సీ కమిషన్ అధ్యక్షుడు రామ్‌శంకర్ కఠారియా

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులు సగం కూడా ఖర్చు కాకపోవడంపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిధులు ఖర్చు చేయనప్పుడు ప్రత్యేక చట్టం ఉండి లాభం ఏమిటని ప్రశ్నించింది. ప్రత్యేక అభివృద్ధి నిధి ఏర్పాటు చేసినా ఎస్సీల జీవన పరిస్థితిలో మార్పులేదని పేర్కొంది. నేరెళ్ల ఘటనపై ఆరా తీసింది. పోలీసులపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణపై నెల రోజుల్లోగా కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని పోలీసు శాఖకు సూచించింది. బుధవారమిక్కడ జాతీయ ఎస్సీ కమిషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రామ్‌శంకర్ కఠారియా ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు ఎల్.మురుగన్, సభ్యులు కె.రాములు, యోగేంద్ర పాసవాన్, సంయుక్త కార్యదర్శి స్మితాచౌదరిలు.. ఎస్సీ సంక్షేమ శాఖ, ప్రత్యేక అభివృద్ధి నిధి, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. మూడేళ్లుగా ఉపప్రణాళికలో, ప్రస్తుత ప్రత్యేక అభివృద్ధి నిధిలో పూర్తిస్థాయి నిధులు ఖర్చు కాలేదని తెలిపింది. దళితులపై దాడులు పెరుగుతున్నాయని, సకాలంలో కేసులు నమోదు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. 2017-18లో రూ.14,375 కోట్ల నిధులు కేటాయించగా.. ఇప్పటికి కేవలం రూ.7 వేల కోట్లు కూడా ఖర్చు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు చేయకపోవడంతో ప్రభుత్వ అధికారులను తప్పుబట్టారు. ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధులను వేగంగా ఖర్చు చేయాలని సూచించారు. విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, పరిశ్రమలు, స్వయం ఉపాధి రుణాల కింద చేసిన కేటాయింపుల్ని ఖర్చు చేయడంలో ఆయా విభాగాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో దళితులపై హత్యలు, మానభంగాలు పెరుగుతున్నాయనీ, బాధితుల విషయంలో పోలీసుల తీరుతో మరింత నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. దళితులపై దాడులు జరిగిన వెంటనే కేసులు నమోదు చేయకపోవడంతో దర్యాప్తులో జాప్యం జరుగుతోందని చెప్పారు. వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదైతే బాధితులకు పరిహారం వస్తుందనీ, కానీ కేసులు పెట్టకపోవడంతో పరిహారమూ ఆలస్యమవుతోందని విలేకరులకు తెలిపారు. కొన్ని సందర్భాల్లో కేసుల నమోదుకు న్యాయస్థానాల్ని ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కేసుల నమోదులో జాతీయ సగటుకన్నా తక్కువగా ఉందని వివరించారు. దళిత మహిళల్లో నిరక్షరాస్యత పెరగడానికి కారణాలను అన్వేషించాలని ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల పనితీరు, కల్యాణలక్ష్మి పథకం అమలు మెరుగ్గా ఉందని వెల్లడించారు.

కుల్‌దీప్ క్షమాపణలు చెప్పాడు.. ఎందుకంటే!

ముంబయి: భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ బుధవారం చాలా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నాడు. అతడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఎవరో హ్యాక్ చేసి ఓ అసభ్యకరమైన చిత్రాన్ని పెట్టారు. గుర్తించిన తర్వాత కుల్‌దీప్ ఆ చిత్రాన్ని తొలగించాడు. జరిగినదానికి తాను బాధ్యుణ్ని కాదని వివరణ ఇస్తూ.. తనను అనుసరిస్తున్న వారికి క్షమాపణలు కూడా చెప్పాడు. "కొన్ని నిమిషాల కింద నా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ అవాంఛనీయ చిత్రం కనిపించినందుకు క్షమాపణలు చెబుతున్నా. ఎవరో నా ఖాతాను హ్యాక్ చేశారు. ఇకపై నా పాస్‌వర్డ్ మరింత భద్రంగా ఉంచుకునేందుకు చర్యలు తీసుకుంటా. అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు" అని కుల్‌దీప్ ట్వీట్ చేశాడు.

ఛాంపియన్స్


వరుణ్ రాహుల్

రాగాలకు సాయం అందింది

'ఈనాడు' కథనానికి స్పందన

బాపట్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తున్న యువ వెయిట్‌లిఫ్టర్లు రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్‌లకు రూ. 25లక్షల ఆర్థిక సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది. గుంటూరు జిల్లా బాపట్ల మండలం స్టూవర్టుపురానికి చెందిన ఈ సోదరులిద్దరూ గత సెప్టెంబరులో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణాలు సాధించి సత్తా చాటారు. రాహుల్ ఉత్తమ వెయిట్‌లిఫ్టర్‌గానూ నిలిచాడు. వీరిని అదే నెలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సత్కరించడంతో పాటు రూ. 25 లక్షల నజరానా ప్రకటించారు. ఐతే ఆ సాయం ఇప్పటిదాకా అందకపోవడంపై 'ఈనాడు' బుధవారం ప్రధాన సంచికలో 'ప్రకటనతో సరి.. నజరానాలేవీ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు వెంటనే స్పందించి రూ. 25 లక్షల ఆర్థిక సాయాన్ని రాహుల్, వరుణ్‌ల బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమ చేశారని వారి తండ్రి రాగాల మధు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కామన్వెల్త్ పోటీలకు సిద్ధమవుతున్న కీలక తరుణంలో ఆర్థిక సాయాన్ని అందచేసినందుకు ముఖ్యమంత్రికి రాహుల్ కృతజ్ఞతలు తెలిపాడు. మరింత మెరుగ్గా కఠోర సాధన చేసి ఈ క్రీడల్లో పతకం గెలిచి దేశ, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచుతానని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు.

సెంచూరియన్‌లో భారత్‌కు భంగపాటు. ధోని, మనీష్ పాండేల విధ్వంసం సరిపోలేదు. టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా బలంగా పుంజుకుంది. వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ క్లాసన్, కెప్టెన్ డుమిని వీరవిహారం చేసిన వేళ.. రెండో మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో టీమ్ ఇండియాపై విజయం సాధించింది. సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.

క్లాసన్ దంచెన్..

దక్షిణాఫ్రికా గెలిచెన్


డుమిని (64 నాటౌట్)

- రెండో టీ20లో భారత్ పరాజయం
- పాండే, ధోని మెరుపులు వృథా


మనీష్ పాండే (79 నాటౌట్)

ధోని (52 నాటౌట్)

సెంచూరియన్

టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా పుంజుకుంది. క్లాసన్ (69; 30 బంతుల్లో 3×4, 7×6) చెలరేగడంతో బుధవారం జరిగిన రెండో టీ20లో ఆరు వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. మనీష్ పాండే (79 నాటౌట్; 48 బంతుల్లో 6×4, 3×6), ధోని (52 నాటౌట్; 28 బంతుల్లో 4×4, 3×6) మెరవడంతో మొదట భారత్ 4 వికెట్లకు 188 పరుగులు సాధించింది. క్లాసన్‌తో పాటు డుమిని (64 నాటౌట్; 40 బంతుల్లో 4×4, 3×6) విరుచుకుపడడంతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. చివరిదైన మూడో టీ20 శనివారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

పాండే, ధోని దూకుడు: తక్కువ స్కోరుకే మూడు కీలక వికెట్లు కోల్పోయినా భారత్ భారీ స్కోరు చేసిందంటే ప్రధాన కారణం మనీష్ పాండే, ధోనీల మెరుపులే. విధ్వంసక బ్యాటింగ్‌తో ఐదో వికెట్‌కు 98 పరుగుల అభేద్య భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జంట దక్షిణాఫ్రికాకు మంచి లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు భారత్ ఇన్నింగ్స్ పేలవంగా ఆరంభమైంది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ రోహిత్.. ఖాతా అయినా తెరవకుండానే నిష్క్రమించాడు. రెండో ఓవర్లో డాలాకు వికెట్లకు ముందు దొరికిపోయాడు. జట్టు స్కోరు అప్పటికి ఒక్కటే. కానీ ఒక్కసారిగా విరుచుకుపడ్డ ధావన్.. మోరిస్ వేసిన మూడో ఓవర్లో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. ప్యాటర్సన్ ఓవర్లో రైనా కూడా మూడు ఫోర్లు బాదడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కానీ ధావన్ (24; 14 బంతుల్లో 3×4, 2×6), కోహ్లి వరుస ఓవర్లలో ఔట్ కావడంతో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ధావన్.. డుమిని బౌలింగ్‌లో ఫుల్‌టాస్ బంతిని మిడాన్‌లో ఆడే ప్రయత్నంలో బెహార్డీన్‌కు చిక్కాడు. ఇక కోహ్లి (1) డాలా బౌలింగ్‌లో వికెట్ కీపర్ క్లాసన్ చేతికి చిక్కాడు. ఆరో ఓవర్లో కోహ్లి ఔటయ్యేటప్పటికి స్కోరు 45. ఆ తర్వాత కాసేపు పరుగుల వేగం తగ్గింది. ఐతే నెమ్మదిగా ఇన్నింగ్స్ ఆరంభించిన పాండే క్రమంగా మోత మొదలెట్టాడు. 9వ ఓవర్లో తన తొలి బౌండరీ సాధించిన పాండేకు ఆ తర్వాత అడ్డమే లేకుండా పోయింది. అందమైన షాట్లతో విరుచుకుపడ్డ అతడు.. శంసి ఓవర్లో స్లాగ్ స్వీప్‌లతో మిడ్‌వికెట్లో రెండు కళ్లు చెదిరే సిక్స్‌లు కొట్టాడు. నాలుగో వికెట్ 45 పరుగులు జోడించాక రైనా (31; 24 బంతుల్లో 5×4) ఔటైనా దక్షిణాఫ్రికాకు పెద్దగా ఊరటేమీ దక్కలేదు. డాలా బౌలింగ్‌లో వరుసగా రెండు బంతులను బౌండరీ దాటించిన పాండే.. ఫెలుక్వాయో బౌలింగ్‌లో సింగిల్‌తో అర్ధశతకం (33 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు క్రీజులోకి వచ్చిన ధోని కూడా, కొన్ని బంతులు ఆడాక జోరందుకున్నాడు. పాండేతో బాదుడులో పోటీపడ్డాడు. చివర్లో మరింత నిర్దాక్షిణ్యంగా దాడి చేశాడు. మోరిస్ వేసిన 19వ ఓవర్లో సిక్స్, ఫోర్ బాదిన అతడు.. ఆఖరి ఓవర్లో (ప్యాటర్సన్) వరుసగా 6,4,4 దంచేశాడు. ఆ క్రమంలో ధోని 27 బంతుల్లో అర్ధసెంచరీ కొట్టాడు. టీ20 క్రికెట్లో అతడికిది రెండో అర్ధశతకం మాత్రమే. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 64 పరుగులు పిండుకుంది. డాలా 28 పరుగులిచ్చి2 వికెట్లు తీశాడు.

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) బెహార్డీన్ (బి) డుమిని 24; రోహిత్ ఎల్బీ (బి) డాలా 0; రైనా ఎల్బీ (బి) ఫెలుక్వాయో 31; కోహ్లి (సి) క్లాసన్ (బి) డాలా 1; మనీష్ పాండే నాటౌట్ 79; ధోని నాటౌట్ 52; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **188; వికెట్ల పతనం:** 1-0, 2-44, 3-45, 4-90; **బౌలింగ్:** మోరిస్ 4-1-42-0; డాలా 4-1-28-2; ప్యాటర్సన్ 4-0-51-0; డుమిని 2-0-13-1; శంసి 2-0-24-0; ఫెలుక్వాయో 2-0-15-1; స్మట్స్ 2-0-15-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెండ్రిక్స్ (సి) పాండ్య (బి) శార్దూల్ 26; స్మట్స్ (సి) రైనా (బి) ఉనద్కత్ 2; డుమిని 64 నాటౌట్; క్లాసన్ (సి) ధోని (బి) ఉనద్కత్ 69; మిల్లర్ (సి) శార్దూల్ (బి) పాండ్య 5; బెహార్డీన్ 16 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 189;; **వికెట్ల పతనం:** 1-24, 2-38, 3-131, 4-141; **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-19-0; శార్దూల్ ఠాకూర్ 4-0-31-1; ఉనద్కత్ 3.4-0-42-2; హార్దిక్ పాండ్య 4-0-31-1; చాహల్ 4-0-64-0

భారత్ × దక్షిణాఫ్రికా మహిళల నాలుగో టీ20 రద్దు

సెంచూరియన్: భారత్, దక్షిణాఫ్రికా మహిళల జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా వర్షంతో ఆట నిలిచిపోయే సమయానికి 15.3 ఓవర్లలో 3 వికెట్లకు 130 పరుగులు చేసింది. లీ (58 నాటౌట్), వాన్‌నీకెర్క్ (55) రాణించారు. ఆట తిరిగి సాధ్యం కాలేదు. ఈ ఫలితంతో ఈ సిరీస్‌ను గెలవగలిగే ఒకే జట్టుగా భారత్ నిలిచింది. సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. 24న జరిగే చివరిదైన ఐదో టీ20లో దక్షిణాఫ్రికా గెలిచినా సిరీస్‌ను సమం చేయగలుగుతుందంతే. ఇంతకుముందు వన్డే సిరీస్‌ను భారత్ 2-1తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.


ఎలిస్‌ను ఓదారుస్తున్న జీత్ రావల్

తలకు తగిలి సిక్స్‌కు!

వెల్లింగటన్: ఏ వేలికో.. కాలికో పొరపాటున బంతి తగిలితే క్రికెటర్లు బాధతో ఎంత విలవిల్లాడిపోతారో చూస్తూనే ఉంటాం! కానీ న్యూజిలాండ్‌లో జరిగిన ఈ ఘటనను తలచుకుంటేనే భయంతో వణికిపోతాం. ఓ బ్యాట్స్‌మన్ కొట్టిన బంతి బౌలర్ తలకు ఎంత బలంగా తగిలిందంటే.. ఆ తర్వాత కూడా అది సిక్స్‌కు వెళ్లింది. త్రుటిలో పెద్ద అపాయం తప్పింది కానీ.. ఈ ఘటన ఆటగాళ్లను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. కివీస్ దేశవాళీ వన్డే మ్యాచ్‌లో జరిగింది ఘటన. ఆక్లాండ్ బ్యాట్స్‌మన్ జీత్ రావల్ బలంగా షాట్ కొట్టగా.. బంతి బౌలర్ ఆండ్రూ ఎలిస్ తల ముందు భాగంలో తగిలి అమాంతం బౌండరీ ఆవల పడింది. ఆటగాళ్లు కంగారుగా ఎలిస్ వద్దకు పరుగెత్తుకెళ్లారు. కానీ అదృష్టవశాత్తు అతడికి ఏమీ కాలేదు. తలను చేత్తో రుద్దుకున్నాడంతే! కానీ వెంటనే మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత ఎలిస్ తలకు పరీక్షలు నిర్వహించి ఎలాంటి ప్రమాదం లేదని తేల్చారు. మళ్లీ మైదానంలోకి వచ్చిన అతడు మరో ఆరు ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఎప్పటిలాగే ఆరో స్థానంలో బ్యాటింగ్ కూడా చేశాడు. "ఎలిస్‌లో ఎలాంటి అనారోగ్య ఛాయలూ కనపడలేదు" అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. 2014లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ ఫిల్ హ్యూస్ తలకు బంతి తగిలి దుర్మరణం చెందడం క్రికెట్ ప్రపంచాన్ని విషాదంలో ముంచెత్తిన సంగతి తెలిసిందే.



సిరాజ్

హైదరాబాద్ ఇంటికి

రాయుడు సేనపై కర్ణాటక గెలుపు

దిల్లీ: అఖిల భారత విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్‌కు చుక్కెదురైంది. బుధవారం క్వార్టర్‌ఫైనల్లో కర్ణాటక 103 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్లకు 347 పరుగులు సాధించింది. మయాంక్ అగర్వాల్ (140), సమర్థ్ (125) సెంచరీలతో హైదరాబాద్‌కు మ్యాచ్‌ను దూరం చేశారు. పేసర్ మహ్మద్ సిరాజ్ (5/59) రాణించినా ఫలితం లేకపోయింది. అనంతరం హైదరాబాద్ 42.5 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. రవితేజ (53), సందీప్ (42), అంబటి రాయుడు (64)ల పోరాటం వృథా అయింది. గోపాల్ (5/31), బిన్నీ (3/45) విజృంభించి కర్ణాటకకు విజయాన్ని అందించారు.

ఆంధ్రతో మ్యాచ్‌కు గంభీర్ ఫిట్: గ్రూప్ దశలో అపజయమే లేని ఆంధ్ర గురువారం క్వార్టర్ ఫైనల్లో దిల్లీతో తలపడనుంది. కెప్టెన్ విహారి, భరత్, రిక్కీ భుయ్, అశ్విన్ హెబర్, సుమంత్ మంచి ఫామ్‌లో ఉండటం ఆంధ్రకు కలిసొచ్చే అంశం. మరోవైపు చీలమండ గాయం నుంచి కోలుకున్న గంభీర్ బరిలోకి దిగనుండడం దిల్లీకి శుభవార్త. కెప్టెన్ ఇషాంత్‌శర్మ, రిషబ్ పంత్, ఉన్ముక్త్ చంద్, హితెన్, సాంగ్వాన్‌లతో దిల్లీ పటిష్ఠంగా కనిపిస్తుంది.



ఆసీస్‌దే టీ20 ముక్కోణం

ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం

ఆక్లాండ్: ఆస్ట్రేలియా జట్టు టీ20 ముక్కోణపు సిరీస్‌ను గెలుచుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో ఆసీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 19 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ఆ జట్టు టీ20ల్లో నంబర్‌వన్ ర్యాంకునూ చేజిక్కించుకుంది. ఫైనల్లో మొదట న్యూజిలాండ్ 9 వికెట్లకు 150 పరుగులు చేసింది. రాస్ టేలర్ (43 నాటౌట్; 38 బంతుల్లో 2×4, 1×6) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అగర్ (3/27), టై (2/30), రిచర్డ్‌సన్ (2/30) కివీస్‌ను కట్టడి చేశారు. ఛేదనలో వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా 14.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 121 పరుగులు సాధించింది. షార్ట్ (50; 30 బంతుల్లో 6×4, 3×6) చెలరేగిపోయాడు. వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో డకవర్త్ లూయిస్ విధానంలో ఆసీస్‌ను విజేతగా ప్రకటించారు. ఈ విజయంతో ఆసీస్.. పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది. 2011లో ర్యాంకింగ్స్‌ను ప్రవేశపెట్టాక టీ20 నంబర్‌వన్ ర్యాంకును సాధించడం కంగారూలకు ఇదే తొలిసారి. ఇంగ్లాండ్ మూడో జట్టుగా ఉన్న ఈ సిరీస్‌లో ఆసీస్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. అగర్‌కు 'మ్యాన్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మాక్స్‌వెల్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.



నాడు బిచ్చగాడు.. నేడు ఫుట్‌బాలర్

ఒక్క క్షణం చాలు జీవితం మారిపోవడానికి... ఒక్క అవకాశం చాలు వెలుగులోకి రావడానికి.. చిన్న ప్రోత్సాహం చాలు ప్రపంచాన్ని గెలవడానికి! మణికందన్ జీవితంలో ఇవన్నీ జరిగాయి. లేకపోతే ఏడేళ్ల వయసులో సోదరిని వెంటపెట్టుకొని దిక్కూమొక్కు లేకుండా రోడ్ల మీద భిక్షమెత్తుకున్న మణికందన్ ఇప్పుడు స్పెయిన్ వెళ్లడమేంటి? ఉండడానికి చోటు లేని స్థాయి నుంచి ఒక నెలంతా విదేశాల్లో ఉండే అవకాశం రావడమేంటి? జీవితం తనను ఒక ఆట ఆడుకునే స్థాయి నుంచి ఇప్పుడతనే రియల్ మాడ్రిడ్ లాంటి గొప్ప క్లబ్‌లో ఫుట్‌బాల్ శిక్షణ తీసుకోవడానికి వెళ్లడమేంటి? ఇదంతా చిత్రంగా అనిపిస్తోంది కదూ! పదండి ఆ కథేంటో తెలుసుకుందాం!

కొల్లాం (కేరళ): ప్రస్తుతం 14 ఏళ్ల వయసున్న ఆర్. మణికందన్ ఏడేళ్ల వయసున్నపుడు తన సోదరిని వెంటబెట్టుకుని కేరళలోని కొల్లాం ప్రాంతాల్లో భిక్షమెత్తుకుంటూ తిరుగుతుండేవాడు. వాళ్లిద్దరినీ చూసి అనాథ శరణాలయం నడిపే శ్రీకుమార్ చేరదీశాడు. అతడి ఆశ్రమంలో పిల్లలు ఎక్కువ కావడంతో స్థలం లేక.. దగ్గర్లోని ఫాతిమా మాత కళాశాల మైదానం దగ్గర కొంతమందిని ఉంచేవాడు. అదే మైదానంలో కోచ్ అభిలాష్ ఆటగాళ్లకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చేవాడు. సరదాకి ఫుట్‌బాల్ ఆడుతూ ఆ కోచ్ కళ్లల్లో పడ్డాడు మణికందన్. అతడి ప్రతిభను గుర్తించి సీనియర్ ఆటగాళ్లతో ఆడే అవకాశం కల్పించాడు అభిలాష్. అంతే మణికందన్ జీవితం మారిపోయింది. ఫుట్‌బాల్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచి ఇప్పుడు స్పెయిన్ వెళ్లే అవకాశాన్ని దక్కించుకొన్నాడు. స్పెయిన్‌లో ఒక నెల శిక్షణ తర్వాత అతణ్ని అమెరికాకు పంపే అవకాశం కూడా ఉంది. అండర్-16 ఆటగాడిగా చెన్నైలోని ఫుట్‌బాల్ ప్లస్ ప్రొఫెషనల్ సాకర్ అకాడమీకి మణికందన్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అతడి ప్రతిభ గుర్తించి చెన్నై అకాడమీ అధికారులు విదేశీ కోచ్‌లకు చెప్పి, ప్రత్యేక శిక్షణకు సిఫారసు చేశారు. "మణికందన్ బిడియంగా ఉంటాడు. ఫుట్‌బాల్‌లో సాధించిన విజయాలే అతని గురించి మాట్లాడతాయి. మైదానంలో చిరుతలా పరిగెడుతూ ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తాడు" అంటూ తాను చేరదీసిన కుర్రాడి గురించి శ్రీకుమార్ చెప్పాడు. "గత జనవరిలో అతణ్ని చూశా. ఒక్క ఏడాదిలోనే చాలా అభివృద్ధి చెందాడు. అతను కచ్చితంగా భారత్ తరఫున ఆడతాడు" అని మణికందన్ ఫుట్‌బాల్ ప్రతిభను గుర్తించిన అభిలాష్ చెప్పాడు. "ఫుట్‌బాల్ అంటే నాకు పిచ్చి. నేను ఆటగాడిగా మారానంటే ఆ ఘనత శ్రీకుమార్, అభిలాష్‌లకే చెందుతుంది. వాళ్లు నన్ను బాగా ప్రోత్సహించారు. మెస్సి అంటే చాలా ఇష్టం. భారత జెర్సీ వేసుకొని దేశం తరఫున ఫుట్‌బాల్ ఆడాలనేదే నా లక్ష్యం" అని మణికందన్ అంటున్నాడు.

పౌర జాబితాపై పితలాటకం!

- అసోంలో అక్రమ వలసదారుల్ని గుర్తించనున్న ఎన్‌ఆర్‌సీ
- తక్షణం తాజా పరచాలన్న సుప్రీంకోర్టు

అసోంలో అక్రమ వలసదారుల వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. రాష్ట్రంలో భారత పౌరులెవరో నిగ్గుతేలుస్తూ తక్షణం జాబితాను నవీకరించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించటం పెద్ద చర్చనే రేపుతోంది. దీంతో బంగ్లాదేశ్ నుంచి పెద్దఎత్తున వచ్చిన అక్రమ వలసదారుల ఏరివేతకు రంగం సర్వం సిద్ధమవుతోందని భావించొచ్చు. జాతీయ పౌరుల జాబితా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్- ఎన్‌ఆర్‌సీ)ను సవరించే పని ఇప్పటికే వివిధ దశల్లో ఉంది. రాష్ట్రంలో ఉంటున్న 3.29 కోట్ల మందిలో ఇప్పటిదాకా 1.9 కోట్ల మంది పేర్లను ప్రచురించారు. మిగతా వారి పేర్లు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయి. ఈ ఏడాది మే నాటికి రెండోదశ ముసాయిదా ముద్రణ పూర్తికావాల్సి ఉంది.

ఏమిటీ ఎన్‌ఆర్‌సీ?



భారత పౌరులకు సంబంధించిన జాబితా ఇది. అసలైన భారత పౌరుడెవరో, అక్రమ వలసదారుడెవరో స్పష్టంగా గుర్తించడం ఈ రిజిస్టర్ ఉద్దేశం. 1951లో పూర్తిచేసిన జాతీయ జనాభా లెక్కల్లో అసోంలోని ప్రతి గ్రామం, ఒక్కో ఇల్లు, దాని సీరియల్ నెంబరు, అందులో ఉంటున్న వ్యక్తుల పేర్లను స్పష్టంగా గుర్తించారు. ఆ తర్వాత జాతీయ పౌరుల జాబితా(ఎన్‌ఆర్‌సీ)-1951ను తయారుచేశారు.

ఎన్‌ఆర్‌సీని ఎందుకు తాజా పరుస్తున్నారు?

ఎన్‌ఆర్‌సీ-1951ను ఒక్క అసోంలోనే తాజా పరుస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు అసోంకు పోటెత్తడమే దీనికి కారణం. 1971 మార్చి 24 అర్ధరాత్రి వరకు ఉన్న ఓటర్ల జాబితాలో, లేదా అంగీకారయోగ్యమైన పత్రాల్లో పేర్లున్న వ్యక్తులు లేదా వారి వారసుల పేర్లను చేర్చడానికి ఎన్‌ఆర్‌సీలో మార్పులు చేర్పులు చేపట్టారు. ఎన్‌ఆర్‌సీ-1951ను నవీకరించాలంటూ ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్(ఏఏఎస్‌యూ), అస్సాం గణ పరిషత్‌లు మూడు దశాబ్దాల కిందటే ఉద్యమం చేపట్టాయి. వాటి ఉద్యమాల ఫలితంగా దీనిని తాజా పరచడం మొదలైంది.

హేతుబద్ధత ఎంత?

అసోంలోకి వలసలు, పౌరసత్వ వ్యవహారంపై 1950ల నుంచే వివాదం కొనసాగుతోంది. బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన వారు తమ భూమి, ఉద్యోగాల్లో పోటీపడతారని, దీనివల్ల తమ సంస్కృతి నాశనమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల్ని గుర్తించి.. వారి స్వదేశానికి తిప్పిపంపాలంటూ 1970ల చివర్లో ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ పెద్దఎత్తున ఉద్యమాన్ని లేవనెత్తింది. దాదాపు ఆరేళ్ల పాటు రాష్ట్రం అగ్నిగుండమైంది. ఈ ఆందోళనల నేపథ్యంలో- 1985లో ఏఏఎస్‌యూ-ఏఏజీఎస్‌పీకి, భారత ప్రభుత్వానికి మధ్య 'అసోం ఒప్పందం' కుదిరింది. దీని ప్రకారం...

- 1951-1961 మధ్య అసోంలోకి వలసవచ్చిన విదేశీయులకు ఓటుహక్కు సహా పూర్తిస్థాయి పౌరసత్వం ఇవ్వాలి.
- 1961-71 మధ్య వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వొచ్చు కానీ.. ఓటు హక్కు ఇవ్వకూడదు.
- 1971 మార్చి 24 తర్వాత సరైన పత్రాల్లేకుండా వచ్చిన వారిని వెంటనే గుర్తించి వారి దేశానికి తిప్పి పంపాలి.
- అయితే ఒప్పందంలోని నిబంధనలు చాన్నాళ్ల పాటు అమలు కాలేదు. ఒప్పందం అమలు తీరును సమీక్షించడానికి 1999 నవంబరు 17వ తేదీన ఒక సమావేశం జరిగింది. ఎన్‌ఆర్‌సీని తాజాపరచాలని ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం కేంద్రం రూ.20 లక్షలను మంజూరుచేసింది. 2005 మే 5వ తేదీ కల్లా ఎన్‌ఆర్‌సీని తాజాపరచాలని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆ తర్వాత నిర్ణయం తీసుకుంది.



ఎన్‌ఆర్‌సీలో పేరు నమోదుకు క్యూ కట్టిన జనం

ఇందుకోసం ఒక డైరెక్టరేట్‌ను సృష్టించింది. 1971 వరకున్న ఓటర్ల జాబితా, ఎన్‌ఆర్‌సీ-1951ను కంప్యూటరీకరించే పని ప్రారంభమైంది.

సవాళ్లు ఎన్నెన్నో..!

- 1971 తర్వాత అసోంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన బంగ్లాదేశీ హిందువులకు కూడా పౌరసత్వాన్ని కట్టబెడుతూ పౌరసత్వ(సవరణ) బిల్లును ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే ఒకసారి ఎన్‌ఆర్‌సీ కసరత్తు పూర్తయితే- చాలామంది బంగ్లాదేశీ హిందువులకు జాబితాలో చోటు ఉండకపోవచ్చు. వారు అక్రమ వలసదారులవుతారు. అప్పుడు ఇది మరింత గందరగోళానికి దారితీస్తుంది.
- ఎన్‌ఆర్‌సీ ముసాయిదాలో మార్పులు, చేర్పుల ప్రక్రియలో తప్పుల దొర్లొచ్చు. దాని ఫలితంగా చట్టబద్ధ భారత పౌరులు కూడా తమ పౌరసత్వం, ఓటింగ్ హక్కుల్ని కోల్పోయే ప్రమాదం ఉంది.
- అసోంలో ఇప్పటికే హిందూ, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమ పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని ఒక వర్గం వారు ఆందోళన వ్యక్తంచేయొచ్చు. దీనివల్ల మత ఉద్రిక్తతలు పెచ్చుమీరే ప్రమాదం ఉంది.
- 'అక్రమ వలసదారుడు' అని ఎన్‌ఆర్‌సీలో గుర్తించిన తర్వాత- అతన్ని బంగ్లాదేశ్‌కు పంపాల్సి ఉంటుంది. అయితే భారత్‌కు, బంగ్లాదేశ్‌కు మధ్య అప్పగింతల ఒప్పందం లేదు. ఇది మరింత గందరగోళానికి దారితీయొచ్చు.

ఎన్‌ఆర్‌సీని ఎలా తాజా పరుస్తారు?

పౌరసత్వ చట్టం-1955, పౌరసత్వ నిబంధనలు-2003లోని విధి విధానాలతో పాటు, కేంద్ర హోంశాఖ 2010 మార్చిలో విడుదలచేసిన ఉత్తర్వు, ప్రచురించిన గెజెట్ ఆధారంగా ఎన్‌ఆర్‌సీని తాజా పరుస్తారు. పై రెండు చట్టబద్ధ ఉత్తర్వుల ప్రకారం... 1951 ఎన్‌ఆర్‌సీ చట్టం, 1971 వరకున్న ఓటర్ల జాబితా, 1971 మార్చి 24 అర్ధరాత్రి వరకున్న ఆమోదయోగ్యమైన పత్రాల ఆధారంగా పౌరసత్వ అర్హతను నిర్ధారిస్తారు. వాస్తవంగా అసోంలో ఉన్నందువల్లే జాబితాలో పేరును చేర్చినట్లు తాజాపరిచిన ఎన్‌ఆర్‌సీలో స్పష్టంగా పేర్కొంటారు.

-ఈనాడు ప్రత్యేక విభాగం



బుధవారం దిల్లీలో రాజు నరిశెట్టికి ఎన్.ఆర్ చందూర్ జగతి పురస్కారాన్ని అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జస్టిస్ లావు నాగేశ్వరరావు

మీడియాకు స్వీయ నియంత్రణ ఉండాలి

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నరిశెట్టి రాజుకు ఎన్ఆర్ చందూర్ స్మారక పురస్కారం ప్రదానం

ఈనాడు, దిల్లీ: పాత్రికేయులు ప్రమాణాలు, విలువలు పాటించాలని, పరభాష వ్యామోహాన్ని తగ్గించుకోవాలని, మాతృభాషను మర్చిపోకూడదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారమిక్కడ ఉపరాష్ట్రపతి నివాసంలో ఎన్ఆర్ చందూర్ జగతి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకసమితి (చెన్నై), ఎన్.ఆర్.చందూర్ కుటుంబసభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ఈ పురస్కారాన్ని ప్రముఖ పాత్రికేయుడు గిజ్‌మోడో మీడియా గ్రూపు (అమెరికా) సీఈవో నరిశెట్టి రాజుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతం రాజకీయ పార్టీలే పత్రికలు పెడుతున్నాయి. వ్యాపారాలు విస్తరించుకోవడం కోసం కొందరు పత్రికలు నడుపుతున్నారు' అని పేర్కొన్నారు. 'మీడియాకు స్వీయనియంత్రణ ఉండాలి. స్వతంత్రం కావాలని కోరుకున్నవారు ఇతరుల స్వతంత్రాన్ని కూడా గౌరవించాలి' అని అన్నారు. ఒక పత్రికలో ఒకలా మరో పత్రికలో మరోలా వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం ఉన్నప్పుడే పత్రికలపై విశ్వసనీయత పెరుగుతుందన్నారు. నార్ల వెంకటేశ్వరరావు, తుర్లపాటి కుటుంబరావు, రామ్‌నాథ్ గోయెంకా వంటి ఎందరో ఉన్నతప్రమాణాలు పాటించిన పాత్రికేయులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో రామనాథ్ గోయెంకా ధైర్యసాహసాలు, తన జైలు జీవితాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. నరిశెట్టి రాజు తెలుగువారు గర్వపడే స్థాయిలో ఉన్నారని అభినందించారు. వారసత్వానికి తాను వ్యతిరేకమని.. అయితే తల్లిదండ్రుల మంచి గుణాలు పుణికిపుచ్చుకొని మంచితనాన్ని గ్రహించడం నిజమైన వారసత్వమని.. దాన్ని నరిశెట్టి ఇన్నయ్య దంపతులు తన పిల్లలకు అందించారని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజు తల్లిదండ్రులు ఇన్నయ్య, కోమలలతో తన స్మృతులు గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం చాలామంది తల్లిదండ్రులు చిన్నారులను విస్మరిస్తున్నారని బిజీ అంటున్నారని అన్న వెంకయ్యనాయుడు 'బిజీ' అనే అంశంపై వ్యాసం రాయాలని అనుకుంటున్నానన్నారు. జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలో ప్రత్యేకంగా లేదని అన్నారు. అన్ని వృత్తుల్లో ఉన్నట్లే పత్రికలపైనా చాలా విమర్శలు ఉన్నాయని, అందుకే పత్రికలు స్వీయ నియంత్రణ విధించుకోవాలని పేర్కొన్నారు. పురస్కార గ్రహీత నరిశెట్టి రాజు మాట్లాడుతూ.. ఎన్ఆర్ చందూర్ పేరిట ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని అన్నారు. జర్నలిస్టులపై దాడులు, అణచివేత ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గౌరీలంకేశ్ హత్య పట్ల ఆయన విచారం వ్యక్తంచేశారు. ఉప రాష్ట్రపతి సతీమణి ఉష వెంకయ్యనాయుడు, కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు అజంతా శంకర్‌రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో నాలుగు ఐలాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా నాలుగు పారిశ్రామిక పార్కులను పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలు(ఐలా)గా ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని మాదాపూర్, కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నంతో పాటు వరంగల్ పారిశ్రామిక పార్కులకు ఈ హోదా కల్పించింది. దీంతోపాటు నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలీలోని ఐటీపార్కులకు సైతం టౌన్‌షిప్‌ల హోదా కల్పించింది. ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ఈ ప్రాంతాలు నగర పాలక సంస్థల పరిధి నుంచి మినహాయింపు పొందుతాయి. ఐలాలే వాటి పరిపాలనను నిర్వహిస్తాయి. రోడ్లు, మంచినీటి వసతి, మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పిస్తాయి. పన్నులను అవే వసూలు చేస్తాయి. ఇందులో 35శాతాన్ని స్థానిక సంస్థలకు చెల్లించి, మిగిలిన 65శాతంతో అభివృద్ధి పనులు నిర్వహిస్తాయి. మాదాపూర్ ఐలా పరిధిలో నాలెడ్జ్ నగరం, రాయదుర్గం, మియాపూర్‌లు ఉంటాయి. కుత్బుల్లాపూర్ పరిధిలో గాజులరామారం, ఇబ్రహీంపట్నం పరిధిలో కొంగరకలాన్, కంపోజిట్ తయారీ సమూహం ఉంటాయి. వరంగల్ ఐలా పరిధిలో ఐటీపార్కు, మడికొండ జౌళి పార్కు, కాకతీయ జౌళి పార్కులు ఉంటాయి.

జిల్లా రైతు సమితుల్లో కొత్తవారికి చోటు

ఈనాడు, హైదరాబాద్: జిల్లా రైతు సమన్వయ సమితుల్లో కొత్తవారికి సభ్యత్వం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. గతంలో జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం.. మండల రైతు సమితుల్లో సభ్యులైనవారినే జిల్లా రైతు సమన్వయ సమితుల్లో నియమించాలి. దీనివల్ల కొత్తగా మరింత మందికి అవకాశం కల్పించడం కుదరడం లేదని.. గత ఉత్తర్వుల్ని సవరించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ సవరణ ప్రకారం.. మండల సమితుల్లో సభ్యులు కానివారిని సైతం, ఇతరులను ఎవరినైనా జిల్లా రైతు సమన్వయ సమితుల్లో సభ్యులుగా నియమించవచ్చని ప్రభుత్వం వ్యవసాయశాఖకు సూచించింది. పలు జిల్లాల్లో వస్తున్న రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ కొత్త నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఉన్న విధానం ప్రకారం.. ఆయా జిల్లాల కలెక్టర్లు మంత్రుల సూచన మేరకు జిల్లా సమితులకు సభ్యులను ఖరారుచేసి వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. తాజా సవరణ ప్రకారం.. వీటిలో మరిన్ని మార్పులు ఉండే అవకాశాలున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా సమితులకు ఎన్నికైన వారిని ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి సమితుల సమావేశానికి ఆహ్వానిస్తారు.

గాంధీజీకి వీరాభిమానిని

- చంద్రబాబు నా హీరో: కమల్

ఈనాడు డిజిటల్, చెన్నై: ప్రముఖ నటుడు, విలక్షణ కథానాయకుడు కమల్‌హాసన్ తన రాజకీయ ప్రస్థానానికి తమిళనాడులోని రామేశ్వరంలో బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఎనిమిది గంటలకు రామేశ్వరంలోని దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నివాసానికి చేరుకున్నారు. కలాం సోదరుడు మహమ్మద్ ముతు మీర లెబ్బాయ్‌కు చేతి గడియారం కానుకగా ఇచ్చి, ఆయన ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం స్థానిక మత్స్యకారులు, వారి సంఘాల నాయకులతో సమావేశమై వినతులు స్వీకరించారు. అనంతరం వారిని మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నాలుగేళ్లుగా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మత్స్యకార సంఘాల నాయకులు కమల్‌కు వివరించారు. పెద్దసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని కమల్‌హాసన్‌కు ఘనస్వాగతం పలికారు. దారిపొడవునా ఆయనకు కటౌట్లు, బ్యానర్లతో అభిమానులు పెద్దసంఖ్యలో స్వాగతం పలికారు. అనంతరం మూడు గంటలకు పరమకుడిలోని తాను చదువుకున్న పాఠశాలను సందర్శించారు. స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ... 45 సంవత్సరాల తర్వాత ఇక్కడికి వచ్చానన్నారు. ప్రాంతంలో చిన్న మార్పులున్నా, మనుషుల్లో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. ఇకపై సినీతారను కాదని, అసలు సిసలు రాజకీయ నాయకుడినని పేర్కొన్నారు. అందరి ఇళ్లల్లో దీపాన్ని అవుతానని, రక్షణగా నిలిచి వెలుగులు విరజిమ్మేలా చేయాలని అభ్యర్థించారు.

రాష్ట్రవ్యాప్త యాత్ర ప్రారంభం తర్వాత పాత్రికేయుల సమావేశంలో కమల్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం రాత్రి ఫోనులో తనతో మాట్లాడారని చెప్పారు. ఆ సందర్భంగా ప్రజలకు ఏం చేయాలనే విషయాలపై సలహాలు ఇచ్చారని, ఇతర అంశాల గురించి ఆందోళన చెందవద్దని సూచించారని పేర్కొన్నారు. ఆయన తన హీరో అని వ్యాఖ్యానించారు. తాను మహాత్మాగాంధీ వీరాభిమానినని చెప్పారు. విభిన్న రాజకీయాల నుంచి మంచిని మాత్రమే తీసుకుంటానన్నారు. రాజకీయం, సినిమాలకు మధ్య పెద్దగా వ్యత్యాసం ఉండదని చెప్పారు. రాజకీయాల పరంగా బాధ్యత ఎక్కువని అభిప్రాయపడ్డారు.

రియాలిటీ షోతో...

సరిగ్గా ఏడాది క్రితం కమల్‌హాసన్ రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ ఊహించలేదు. అప్పటివరకు ఆయనకు ఎవరన్నా ఆ ప్రశ్న వేసినప్పుడు తనకు రాజకీయాలు ఇష్టం లేవన్నారు. బిగ్‌బాస్ రియాలిటీ షో ద్వారా తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో రాజకీయ రంగం వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. యాత్ర ప్రారంభానికి ముందుకు స్వయంగా రాష్ట్రంలోని డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, డీఎండీకే అధ్యక్షుడు విజయ్‌కాంత్, నామ్‌తమిళర్ కట్చి అధ్యక్షుడు సీమాన్, ఇతర నాయకులతో సమావేశమై అందరినీ ఆశ్చర్యపరిచారు.

రజనీ వైపు చూపు...

కమల్ పార్టీ ప్రకటన పూర్తయిన నేపథ్యంలో అందరి చూపు మరో నటుడైన సూపర్‌స్టార్ రజనీకాంత్‌వైపు మళ్లింది. ఏకకాలంలో వెండితెరపై పోటీపడి నటించిన వీరిద్దరు అటూఇటుగా ఒకే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. సినిమాల తరహాలోనే రాజకీయాల్లోనూ వారి ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నారు.

కమల్ పార్టీ.. మక్కల్ నీది మయ్యమ్

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులోని మదురై జిల్లా వేదికగా విశ్వనటుడు కమల్‌హాసన్ రాజకీయ పార్టీని ప్రారంభించారు. పతాకాన్నీ ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన అశేష జనసందోహం మధ్య ఈ కార్యక్రమం జరిగింది. కమల్‌తోపాటు దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ తమిళనాడు ఇన్‌ఛార్జి సోమనాథ్‌భారతి, రైతుసంఘం నేత పీఆర్ పాండియన్ వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ..."పీపుల్స్ జస్టిస్ పార్టీ ప్రజలది. నేను అధినాయకుడిగా మీ ముందుకు రాలేదు. మీ మధ్య నుంచే పుట్టుకొచ్చిన వ్యక్తిని. దీర్ఘకాలంపాటు మీకు సేవ చేయాలన్న సంకల్పంతో ఈ పార్టీని ప్రారంభించా. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మీకే తెలుసు. ప్రసంగం కన్నా సలహాలు, సూచనలు ఉపయుక్తంగా ఉంటాయని భావిస్తున్నా'నని పేర్కొన్నారు. తనను నేతగా కాక రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడే సాధనంగా చూడాలని ప్రజలను కోరారు. ప్రజా న్యాయ కేంద్రం అనే అర్థం వచ్చేలా 'మక్కల్ నీది మయ్యమ్'గా పార్టీ పేరును ప్రకటించారు. అశేష జనసందోహం మధ్య తెల్ల టీషర్టులు, నల్లటి ప్యాంటులు వేసుకుని వచ్చిన మద్దతుదారులను ఉద్దేశించి 'ఒరు సోరు' తమిళ సామెతను ప్రస్తావించారు. ఒక్క మెతుకును చూస్తే చాలని, అన్నమంతా పట్టుకోవాల్సిన అవసరం లేదన్నట్లు తన పార్టీతో 'ప్రజా పాలన' సాగుతుందని గుర్తుచేశారు. తన పార్టీ సిద్ధాంతాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అలాంటి వారికి ఓ విషయాన్ని చెబుతున్నానని తెలిపారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలని, కుల మతాల పేరిట ఆడుకోవడాన్ని విడనాడాలని కోరారు. విద్యుత్తు సమస్య గురించి చెప్పనవసరం లేదని, అవినీతి తగ్గితే విద్యుత్తు వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు అవినీతిని చోద్యంలా చూశామని, ఇకపై అది చేయకూడదని తెలిపారు. ఓటుకు రూ.6 వేలు ఇస్తారా? అని తనను కోరితే తమ వద్ద డబ్బులు లేవని, ఉన్నా ఇవ్వబోమని తెలిపారు. తమ పార్టీ జెండాలోని ఆరు చేతులు ఆరు రాష్ట్రాలను, మధ్యలోని నక్షత్రం ప్రజలను సూచిస్తాయని తెలిపారు. ప్రజలను, న్యాయాన్ని కేంద్రంగా చేసుకుని ఆవిర్భవించిన పార్టీ తమదని వివరించారు. అభిమానుల ప్రశ్నలపై తనదైన శైలిలో వేదికపై నుంచి కమల్‌హాసన్ సమాధానమిచ్చారు. పాలకులు ప్రజలకు మంచి చేసివుంటే తాను రాజకీయాల్లోకి వచ్చేవాణ్ని కాదన్నారు. ప్రజలకు పాలకులపై నమ్మకముంటే తన పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉండేది కాదని తెలిపారు.





మదురైలో బహిరంగ సభ వేదికపై కమల్‌హాసన్, దిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులు ★ కమల్‌ను ఆశీర్వదిస్తున్న కలాం సోదరుడు

ఆశాకిరణం కమల్...

ముఖ్య అతిథిగా హాజరైన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. కమల్‌హాసన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సినీ ప్రముఖుడిగా ఆయనకు పెద్ద అభిమానినని చెప్పారు. కమల్‌హాసన్ నిజజీవితంలోనూ హీరోయేనని ప్రశంసించారు. ఆయన నిజాయతీపరుడని, రాష్ట్ర ఆశాకిరణమని పేర్కొన్నారు. ఆయన ధైర్యం, పోరాటతత్వం కొంతకాలంగా చూస్తున్నానని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు, కమల్ బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి పార్టీలకు ఓటేయవద్దని, నిజాయతీ పార్టీలకు మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. తనది చిన్నపార్టీ అయినా మూడున్నరేళ్లుగా దిల్లీలో అధికారంలో కొనసాగుతోందని చెప్పారు. అదే స్ఫూర్తితో రాష్ట్రంలో కమల్ హాసన్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తారని ఆశిస్తున్నానని అన్నారు. అభివృద్ధి కోసం ఆయనకు ఓటెయ్యాలని కోరారు.

కమల్‌హాసన్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు

చిత్రసీమలో నాయకన్‌గా జీవించిన ప్రముఖ నటుడు కమల్‌హాసన్ రాజకీయ జీవితంలోనూ నాయకునిగా రాణించాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. కొత్త పార్టీ ఏర్పాటును పురస్కరించుకొని కమల్ కేటీఆర్‌ను మదురైకి ఆహ్వానించారు. అనివార్య కారణాల వల్ల పార్టీ ఆవిర్భావ సభకు హాజరుకాలేకపోతున్నానని కేటీఆర్..కమల్‌కు ట్విట్టర్‌లో సమాధానం ఇచ్చారు. కొత్త పార్టీ ఏర్పాటును ఆయన స్వాగతించారు. దీనికి కమల్ ట్విట్టర్‌లో సమాధానమిచ్చారు. భవిష్యత్తులోనైనా తమ పార్టీ కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. తమ పార్టీ ఏర్పాటుపై శుభాకాంక్షలు తెలిపినందుకు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

చట్టపరంగా ఆధార్ వివరాల సేకరణ లోపరహితం: సుప్రీం

దిల్లీ: "చట్టరహితంగా పౌరుల బయోమెట్రిక్ వివరాలను సేకరించడం లోపమే. ఆధార్ చట్టాన్ని తేవడం ద్వారా ప్రభుత్వం ఈ లోపాన్ని సరిదిద్దినట్టయింది" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆధార్ పథకం ప్రారంభమైనప్పట్నుంచి.. చట్టం వచ్చేంతవరకు (2009-2016) మధ్య జరిగిన ప్రజల ఆధార్ వివరాల సేకరణ మాత్రం ఉల్లంఘన కిందకే రావచ్చంది. ఆధార్ పథకం, చట్టం రాజ్యాంగబద్ధం కావంటూ దాఖలైన కేసులు బుధవారం విచారణకొచ్చాయి. వీటిలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎస్.పుట్టస్వామి వేసిన కేసు కూడా ఉంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వీటిపై విచారణ చేపట్టింది. జస్టిస్ పుట్టస్వామి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ వాదనలు వినిపించారు. పౌరుల ప్రాథమిక హక్కులకూ, వారి వివరాల గోప్యతకూ కలిగే విఘాతాన్ని ఈచట్టం నిలువరించలేదన్నారు.

వరుడి హత్యకు పథకం వేసింది వధువే

- విచారణలో గుర్తించిన పోలీసులు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో ఈ నెల 18న నూతన వరుడు యాకయ్యపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వధువే వరుడిని హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ వెంకటేశ్వరబాబు తెలిపిన ప్రకారం.. రఘునాథపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన ఆరూరి యాదగిరి కుమార్తె అరుణకు ఇదే మండలం కంచనపల్లికి చెందిన గొంగళ్ల సామేలు కుమారుడు యాకయ్యతో ఈ నెల 21న వివాహం చేయాలని ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సోదరుడి వరుసైన ఆరూరి బాలస్వామితో అనైతిక సంబంధం కొనసాగిస్తున్న అరుణకు పెళ్లి ఇష్టం లేక ..యాకయ్యను లేదంటే అతని తండ్రిని చంపించాలనుకుంది. ఇందుకు బాలస్వామితో కలిసి పథకం రచించింది. పథకంలో భాగంగా ఈ నెల 8, 17 తేదీల్లో వరుడి తండ్రి సామేలుపై బాలస్వామి దాడి చేశాడు. ఈ నెల 18న రాత్రి యాకయ్యను చంపాలని వ్యూహం పన్నారు. ఈ మేరకు బాలస్వామి కంచనపల్లికి వెళ్లి యాకయ్య ఇంటి సమీపంలో మాటు వేశాడు. ఈ సమయంలో అరుణ.. యాకయ్య చరవాణికి ఫోన్ చేసి బయటికి వచ్చేలా చేసింది. అక్కడే మాటు వేసిన బాలస్వామి సీసాలోని పెట్రోల్‌ను వరుడిపై పోసి నిప్పంటించాడు. యాకయ్య మంటలతో కేకలు వేయడంతో కుటుంబసభ్యులు మంటలను ఆర్పివేశారు. 60 శాతం గాయాలతో చికిత్స పొందుతున్నాడు. అతన్ని కాపాడబోయిన తల్లి యాదమ్మకు కూడా గాయాలయ్యాయి. పోలీసులు చరవాణుల్లో కాల్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అరుణ, బాలస్వామిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారు. పెళ్లిని అడ్డుకునేందుకు యాకయ్యపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు తెలిపారు.

యుద్ధవిమానాన్ని నడిపిన తొలి భారత మహిళ అవనీ చతుర్వేది

దిల్లీ: యుద్ధ విమానాన్ని నడిపిన తొలి భారతీయ మహిళగా అవనీ చతుర్వేది ప్రత్యేకత సాధించారు. భారత వాయుసేన అధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. మిగ్-21 బైసన్‌ను ఆమె సోమవారం నాడు జామ్‌నగర్ స్థావరం నుంచి నడిపినట్లు తెలిపారు. యుద్ధ విమానాల పైలట్లుగా అవనీచతుర్వేది, భావనా కాంత్, మోహనాసింగ్‌లు ఇప్పటికే కఠినశిక్ష పూర్తి చేసుకున్న విషయం గమనార్హం.

రాత్రి వేళల్లోనూ పృథ్వీ-2 పరీక్ష విజయవంతం

బాలాసోర్: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వీ-2 క్షిపణి రాత్రి సమయాల్లోనూ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక(ఐటీఆర్) నుంచి దీనిని ప్రయోగించినట్లు డీఆర్‌డీవో వర్గాలు వెల్లడించాయి.

పురుషోత్తమ్ రెడ్డి బావమరిది అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: అమీర్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికా విభాగం అధికారి పురుషోత్తమ్ రెడ్డి బినామీ, ఆయన బావమరిది శ్రీనివాసరెడ్డిని అవినీతి నిరోధకశాఖ అధికారులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. పురుషోత్తమ్‌రెడ్డి అక్రమంగా సంపాదించిన ఆస్తులన్నీ శ్రీనివాసరెడ్డి పేరుమీద ఉన్నాయన్న ఆధారాలతో అయనను అరెస్ట్ చేశామని అనిశా డీఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పురుషోత్తమ్ రెడ్డి కోర్టులో లొంగిపోయిన వెంటనే తాను కూడా పోలీసుల సమక్షంలో లొంగిపోతానంటూ శ్రీనివాసరెడ్డి.. తన న్యాయవాదుల ద్వారా అనిశా అధికారులకు తెలిపాడు. సోమ, మంగళవారాల్లో సమాచారం ఇవ్వకపోవడంతో అనిశా అధికారులు ఎస్సార్ నగర్ పోలీస్ ఠాణా పరిధి సుందర్‌నగర్ కాలనీలోని చాముండేశ్వరీ నిలయం 101 ఫ్లాట్‌లో శ్రీనివాసరెడ్డి ఉంటున్నాడని గుర్తించారు. ఇంటిని సోదా చేసేందుకు అనిశా ప్రత్యేక న్యాయమూర్తి ఉత్తర్వులివ్వడంతో ఆయన ఫ్లాట్‌కు నోటీసులు అతికించారు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం వస్తానంటూ శ్రీనివాస రెడ్డి అధికారులకు సమాచారం ఇచ్చాడు. తల్లి సుధేష్ణ, న్యాయవాదితో కలిసి ఆయన 3.30 గంటల ప్రాంతంలో ఆటోలో వచ్చారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ఇంటి తాళం తీశారు.



శ్రీనివాసరెడ్డి

మొత్తం సర్దేశారు..: తాళం తీసి ఇంటిలోకి ప్రవేశించిన అనిశా అధికారులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. మూడు పడకగదులు కలిగిన ఫ్లాట్‌ను మొత్తం సర్దేసి, శుభ్రంగా ఉంచారు. శ్రీనివాసరెడ్డి, ఆయన తల్లిని ప్రశ్నించగా... తమ ఇంట్లో ఇవే వస్తువులు ఉన్నాయంటూ సమాధానం చెప్పారు. సోదాల అనంతరం డీఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంట్లో అంతా శుభ్రంగా సర్దేశారని, తమకు సరైన సాక్ష్యాధారాలు లభించేంత వరకు సోదాలు నిర్వహిస్తామని వివరించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00